భారతి

మాసపత్రిక

*

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

*

జూన్ 1979

సంపుటము : 56 సంచిక : 6

విడిప్రతిక వెల రూపాయిన్నర

ప్రగతికి కీలకం పరిశ్రమలు

ఉత్తర, దక్షిణాల మేలికలయిక 'ఆంధ్రప్రదేశ్'కు ప్రకృతి ఎనలేని వనరులను ప్రసాదించింది. విశ్రమ సంస్కృతికి చిహ్నంగా, ప్రాచీన వైభవానికీ, ఆధునిక పారిశ్రామిక ప్రగతికీ ప్రతీకగా నిలిచిన రాజధానీ నగరాన్ని చరిత్ర మనకు సంక్రమింపజేసింది. నేడు తెలుగు గడ్డ నిజంగా సిరులు పొంగే జీవగడ్డ.

ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు ప్రగతి చక్రాన్ని తిప్పుతున్నాయి. రు.478 కోట్ల భారీ పెట్టుబడితో, 260 భారీ, మధ్యతరహా పరిశ్రమలు నెలకొంటూ పారిశ్రామికంగా మన రాష్ట్రం రూపురేఖలనే మార్చి వేస్తున్నాయి. యంత్రవాద్యాల సందడిలో కొత్త అందాన్ని దిద్దుకుంటున్న ఆంధ్రప్రదేశ్ గత ఐదేండ్లకాలంలో మునుపటికన్నా నాల్గింతలెక్కువగా సంస్థాగత ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నది. 1978 జులై 7 న కాకినాడవద్ద రాష్ట్రపతి శంకుస్థాపన గావించినారు. 232 కోట్లు ఖర్చుకాగల 'ఎరువుల కర్మాగారం' 1981లో ఉత్పత్తిని ప్రారంభించబోతున్నది.

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధిసంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రఆర్థిక సహాయక సంస్థ, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రాతిపదిక సౌకర్యాల కల్పనాసంస్థ, మున్నగు ప్రోత్సాహక సంస్థలు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి చక్కటి దోహదాన్ని కలిగిస్తున్నాయి.

ప్రగతి రంగంలో పరిశ్రమలు నిజంగా కీలకపాత్ర వహిస్తున్నాయి.

సమాచార, పౌరసంబంధశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాదు

47/78-79

విషయానుక్రమణిక

జూన్ 1979

మతిలేని ఒంటరితనం


డా॥ సి. నారాయణరెడ్డి

ఒంటరితనం కురుస్తున్నది నామీద.
అడుగు కదిలితే బురద బురదగా చీకటి.
ఇంతకాలం ఏ గుహలో గుడ్లుపెట్టిందో
ఇప్పుడు నా నెత్తిలో పిల్లల్ని పెడుతున్నది
ఉబుసుపోని ఒంటరితనం
ఒంటిమీద కురిసింది చాలక.

నక్షత్రాలు పాకుతున్నాయి నా నరాలమీద
తప్పతాగిన సంసారి తప్పుడు వేళ్లలా.
ఏంబాముకుందామని ఇలా తెగబడ్డాయి
విచ్చుకున్న కళ్లనోళ్లతో నక్షత్రాలు.
దొరికితే దొరకొచ్చు అరగని కవితల్ని
నెమరేసుకుంటున్న యెముకల దవడలు.
మతిలేదు ఈ ఒంటరితనానికి
నేనొక్కణ్నే దొరికానా దీనికి.

గాలిని ముక్కలుగా కత్తిరించి
చిన్న చిన్న బుడగల్లా ఊదుకుంటూ
ఆకాశాన్ని కళ్లతో పుక్కిలించి
నీలిమల ఎడారుల్ని అలుక్కుంటూ
ఆనందాన్ని ఫోన్‌లో రంగరించి
అప్పుడప్పుడు చెవితో నంజుకుంటూ
కాలం వినిపిస్తున్న 'సింఫనీ'లో
ఈదుకుపోతున్న నామీద పడింది
ఏ దిక్కూమొక్కూలేని ఒంటరితనం.
పైగా దానివెంట పనీపాటాలేని
నాసిరకం నక్షత్రకగణం.

బహిష్కరిస్తున్నాను ఒంటరితనాన్ని
పాతరాతి యుగంలోకి
ధ్యానం మెట్లనుంచి అడపాదడపా జారిపడే
దైవోపాసకుల మనసు పొరల్లోకి
చురుకు దనాన్ని విలువునా పాతేసిన
సోమరిపోతుల చచ్చుబుర్రల్లోకి.



మరికొన్ని స్వీయచరిత్రలు

అసలు ఆధునికమైన ఈ సాహిత్య ప్రక్రియకు ఈ పేరు పెట్టింది గురజాడ శ్రీరామమూర్తిగారు.

ఆయన ఈ సాహిత్య శాఖనీ పేరుతో పిలిచిందాకా, తెలుగు సాహిత్యంలో 'స్వీయచరిత్ర' అనే ప్రస్తావనేలేదు.

తమ కవి జీవితాలకు పీఠిక వ్రాస్తూ సమకాలీనులైన కవులనుగూర్చి తాము ఈ గ్రంథంలో చేర్చడంలేదనీ, ఆ కవులు తమ స్వీయచరిత్రలు రాసుకోవడం బావుంటుందనీ శ్రీరామమూర్తి పంతులు అభిప్రాయపడటం గమనార్హం.

'స్వీయచరిత్రం' అనే ప్రయోగం పాణినీయం ద్వారా అసాధ్యమనీ, అది దుష్టప్రయోగమనీ, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు వీరేశలింగం పైన ధ్వజమెత్తారు. వీరేశలింగానికి పాణినీయం బొత్తిగా తెలీదనిన్నీ ఆక్షేపించారు. ఏమైతేనేం తాను రాసుకున్న తన చరిత్ర అనే అర్థంలో తెలుగులో స్వీయచరిత్రమన్న పేరే రూఢి అయిపోయింది. ఆత్మకథ అనీ, ఆత్మ చరిత్రమనీ, స్వచరిత్రమనీ, స్వ చారిత్రమనీ, అనుభవాలూ – జ్ఞాపకాలు అనీ, జీవితయాత్ర అనీ, ఈ మొదలుగాకూడా స్వీయ చరిత్రకు పర్యాయనామాలుగా వ్యవహారంలోకి వచ్చాయి. అయినా రాశిమీద ఈ సాహిత్య ప్రక్రియ స్వీయచరిత్రగానే సంభావితం.

తనకు సంబంధించిన చరిత్రకానీ, తనకు బాగా దగ్గరవాళ్ళైన బంధుమిత్రులను గురించిగానీ, ఎవరైనా రాసినప్పుడు — ఆ చరిత్రలో తనదైన పాత్ర నిర్వహణంకూడా ఉండాలి — ఆ రచనలుకూడా స్వీయచరిత్రాత్మక రచనలుగా పరిగణించవచ్చు. ఆయారంగాలలో సుప్రసిద్ధులై సమాజ జీవన వికాసంలో తమ పాత్రను అంతో ఇంతో నిర్వహించిన ప్రముఖవ్యక్తుల దినచర్య వృత్తాంతాలను ప్రచురిస్తే అవికూడా స్వీయ చరిత్రాత్మక సాహిత్యం కిందికే వస్తాయి. ఇదేవిధంగా యాత్రాచరితలు ఏకదేశంగా స్వీయచరిత్రలే అవుతాయనవచ్చు. ఇంకా విలాపరచనలు, స్మరణకావ్యాలు, స్మృతి గీతాలూకూడా స్వీయచరిత్రాత్మక సాహిత్యంకిందికే వస్తాయి. వ్యక్తిగతమైన అనుబంధాలకు, సంబంధాలకు, అభియోగ ప్రత్యభియోగాలకు, పారస్పరిక జీవిత సన్నివేశాలకు, సంఘటనలకు ఎక్కువ ప్రాధాన్యాన్నిస్తూ తమదృక్పథాన్ని వ్యక్తీకరించే సాహిత్య సంవాదాలుకూడా స్వీయచరిత్రాత్మక సాహిత్య పరిగణనలోకి రావా? వస్తాయనే అనుకోవాలి. ఉదాహరణకు చెళ్ళపిళ్ళ వారి చెరలాటం అని శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు ముదలకించగా, విక్రమ చెళ్ళపిళ్ళ అని వెంకటశాస్త్రిగారు చంకదుడ్డు శరణార్థి నుడికారాన్ని తలపించచేశారు.

స్వీయచరిత్ర సాహిత్య ప్రక్రియ పరిధిని పనిగట్టుకొని విస్తృతపరచవలసిన ఆవశ్యకత లేకపోయినా, పైన ఉదాహరించిన రచనలవంటివి స్వీయచరిత్రాత్మక రచనల కోవలోకి చేర్చవచ్చునేమో ఆలోచించవలసిందిగా మనవి.

డిసెంబర్ 1978 భారతిలో శ్రీ కోడూరి శ్రీరామమూర్తిగారు గడచిన మూడు దశాబ్దాలలో వెలువడిన తెలుగు సాహిత్యంలోని స్వీయచరిత్రనుగూర్చి చక్కగా సమీక్షించారు. స్వీయచరిత్రకూ, స్వీయచరిత్రాత్మక సాహిత్యానికీగల వ్యత్యాసాలను కూడా చక్కగా విశ్లేషించారు. తెలుగుసాహిత్యంలో వచ్చిన స్వీయచరిత్రలనుగూర్చి నేనుకూడా యథాశక్తి ఆసక్తితోకొంత కృషి చేస్తున్నాను కాబట్టి, నాకు తెలిసిన కొన్ని విషయాలుకూడా రాయడం బాగుంటుందని ఉత్సహిస్తున్నాను. అయితే ఒక్క చిన్న మనవి వేత్తలాలోచించగలరు. కేవలం తెలుగులోనే వెలువడిన స్వీయచరిత్రలు, స్వీయచరిత్రాత్మక సాహిత్యమూ మాత్రమే అధ్యయన పరిశీలనంలోకి తీసుకోవడానికన్నా, తెలుగువారి స్వీయచరిత్రలు అని ఈ పరిశీలన పరిధిని ఇంకొంచెం విస్తృత పరిస్తే, ఆయారంగాలలో లబ్ధ ప్రతిష్ఠులైన, మేధావులైన, అగ్రగణ్యులైన తెలుగు పెద్దల జీవిత విశేషాలను, తెలుగుదేశం ద్వారా వారు పొందిన స్ఫూర్తిని, వారి జీవితకాలపు సాంఘికార్థిక, రాజకీయ, మతనైతిక, సాహిత్యోద్యమ విశేషాలనుకూడా తెలుసుకొనే అవకాశం ఉంటుంది. అఖిలభారతస్థాయిలోనే అగ్రగణ్యులైన రాజనీతిజ్ఞులుగా, పత్రికా సంపాదకులుగా, సాంకేతిక విజ్ఞానవేత్తలుగా, విద్యావేత్తలుగా ప్రసిద్ధులైన తెలుగు వారైన మహనీయులు ఎందరో ఉన్నారు కొందరు తమ స్వీయచరిత్రలుకూడా రాసుకొన్నారు. ఉదాహరణకు వి. వి. గిరి, ఆచార్య రంగా, కోటంరాజు రామారావు, కుందూరి ఈశ్వరదత్, కె. ఎల్. రావు, డి. ఎస్. శర్మ, చాగంటి సూర్యనారాయణ పట్టాభి సీతారామయ్య, జి. వి. సుబ్బారావు మొదలైన వారున్నారు కొంతకాలమైనా తెలుగేతరదేశం రంగస్థలంగా వీరి జీవిత కృషి సాగింది ఆనాటి తెలుగు దేశపు సామాజిక జీవనం, నాటి పరిస్థితులు ఆసక్తికరంగా ప్రస్తావితమయ్యే ఉన్నవి ఈ స్వీయచరిత్రలలో. ఈ స్వీయ చరిత్రలను, స్వీయచరిత్రాత్మక రచనలనుకూడా సమీక్షాపరిధిలోకి చేర్చుకోవడం చాలా ఆసక్తి దాయకంగా ఉంటుంది. కొండా వెంకటప్పయ్య పంతులు గారిని గూర్చి అత్యంతాసక్తికరమైన సంఘటన కోటంరాజు రామా

రావుగారి ఆత్మకథనంలో చోటుచేసుకొన్నది. వెంకటప్పయ్యగారి రాజకీయ జీవిత ఔన్నత్యానికి సంబంధించినదీ పూర్వగాథ. స్వాతంత్ర్యోద్యమ చరిత్రను గ్రథితంచేసిన తెలుగు పెద్దల స్వీయచరిత్రలలో దేనిలోనూ ఈ సంఘటనను గూర్చిన ప్రస్తావన లేదు. జైల్లో వెంకటప్పయ్యపంతులుగారి భోజన సౌకర్యంకోసం ఒక పోలీసు అధికారి రాజద్రోహ నేరంమోపి భేషుగ్గా వంట చేయగల ఒక వంట మనిషిని జైలుకు పంపించడం — ఆ వంటమనిషి ఆనందంగా జైలుకు పోవడం—ఆ సంఘటన ఇటువంటి గడచిన గాథలు .ఇంకా కూడా ఉన్నవి.

శ్రీ శ్రీరామమూర్తిగారు తమ పరిశీలనను స్వాతంత్ర్యానంతరం గడచిన మూడు దశాబ్దాల కాలానికే పరిమితం చేశారు కాబట్టి, స్థూలంగా నా పరిశీలనకూడా ఆ కాలిక వ్యవధికే పరిమితం చేయడానికి ప్రయత్నిస్తాను. స్వీయ జీవిత వృత్తాంతాన్ని పద్యకావ్యాలుగా నిబంధించుకొన్న తుమ్మల సీతారామమూర్తిగారు, జాషువా, నాయని సుబ్బారావు, జ్ఞానానందకవి, పాలా వెంకట సుబ్బయ్య మొదలైనవారి గురించి శ్రీరామమూర్తిగారు ప్రస్తావించలేదు. తిరుపతి వెంకటకవులు, మండపాక పార్వతీశ్వరశాస్త్రి గారి వంటి మహనీయులు పూర్వపు తరాలవారు, పెనుమత్స సత్యనారాయణరాజుగారివంటి ఇప్పటి కవులూ కొందరుకూడ పద్యాలలో తమ స్వీయ జీవిత చరిత్రను వర్ణించుకున్నారు.

ఆధునిక సాహిత్య చరిత్రను అధ్యయనం చేసేటప్పుడు దినచర్య రచించిన వారి ప్రస్తావన కావలి వెంకట బొర్రయ్యగారితోనే మొదలవుతుంది. అత్యంత ప్రతిభావంతుడు బొర్రయ్య. ఈయన దినచర్య మచ్చు పుటలు అచ్చైనాయనికూడా పెద్దలు చెపుతున్నారు. పుస్తకరూపంలోకాదు. 'టెయిలర్స్ కేటలాగ్' ల వంటి పురాపత్ర, గ్రంథ వివరణ సంగ్రథితాలలో. దినచర్య వృత్తాంతాలు, యాత్రా చరిత్రలు, స్మృతులు, జ్ఞాపకాలు, కథలూ — గాథలూ — స్వీయ చరిత్రాత్మకమైనంతవరకు — గ్రహించి లెక్కవేస్తే—తెలుగు వారైయుండి ఇంగ్లీషులో రాసుకున్నప్పటికీ వాటినికూడా లెక్కలోకి తీసుకొంటే—సుమారుగా నాకిప్పటికి నూటపదహారుదాకా లెక్కతేలాయి.

ఈ నూటపదహారు — ఈ సంఖ్య ఇంకాస్త పెరగవచ్చునుకూడా — ఆకరాలను జాగ్రత్తగా అధ్యయన విశ్లేషణంచేస్తే నూరు మాట ఏభై సంవత్సరాల తెలుగుదేశపు సాంఘిక చరిత్ర, సాంస్కృతికోద్యమాలు, స్వాతంత్ర్యోద్యమం, సామాజిక పరిణామాలు, సంగీత సాహిత్య నాట్యనాటక లలితాకళా విలసనం, భాషోద్యమాలు ఒకటేమిటి ఇంకా ఎన్నెన్నో అద్భుతమైన విశేషాలు తెలుసుకొనే ఆస్కారం వుంది. అన్నిటికన్నా కుతూహలం కలిగించే విషయం ఏమంటే యథార్థ జీవిత సంఘర్షణలు, వాటి స్వరూప స్వభావాలు, మానవ జీవితంలోని నాటకీయ సన్నివేశాలు, మానవప్రకృతిలోని, ప్రవృత్తిలోని ఔన్నత్యాలు, బలహీనతలు, విశ్వాసాలు, ఆశాభంగాలు, నిర్వేదాలు, త్యాగాలు, భోగాలు, విలక్షణమైన, విశిష్టమైన, విపరీతమైన మనస్తత్వాలు, ఇవన్నీకూడా తెలుసుకొనే అవకాశం వుంది. కల్పనకన్నా యధార్థమే విభ్రమాస్పదం అనే అర్థంఇచ్చే 'truth is stranger than fiction' అనే సూక్తి అక్షరాలా నిజమని నిరూపితం అవుతుంది ఈ యథార్థ జీవితానుభవాలను గూర్చి తెలుసుకొన్నప్పుడు.

* * *

శ్రీ శ్రీరామమూర్తిగారి పరిశీలనలో చిన్న సవరణలుచేస్తే బాగని మనవి చేస్తున్నాను. అవి పెద్ద దోషాలేమీకావు. చిన్న సవరణలు. తమ ఇష్టానుగుణంగా స్వీకరించవచ్చు. అన్యధాకరించనూ వచ్చు.

ఇవి ఏమంటే—ఒకటి డైరీలనుగూర్చిన ప్రస్తావన. ఒక్క గురజాడ అప్పారావుగారి డైరీలనుగూర్చి మాత్రమే ఉటంకించారు. వీరేశలింగం డైరీలు, లేఖలుకూడా ప్రకటితమైనవి. ద్వితీయ ముద్రణంకూడా పొందాయి ఇటీవలనే. అట్లానే కె. వి. రమణారెడ్డిగారే సంకలితంచేసిన కవికోకిల లేఖలుకూడా ప్రస్తావించి ఉండాల్సింది. ఈ లేఖలతోపాటు డైరీల ప్రస్తావనకూడా ఉందనుకుంటాను కవికోకిల గ్రంథావళి సంపుటాలలో.

రెండోది స్వాతంత్ర్యానంతరం వెలువడిన స్వీయచరిత్రల్లో చెప్పుకోదగిన అయ్యదేవర కాళేశ్వరరావు, పెద్దిభొట్ల వీరయ్యగార్ల స్వీయ చరిత్రల ప్రస్తావన చేస్తూ శ్రీ దిగవల్లి వెంకట శివరావు గారి అభిప్రాయాన్ని ఉటంకించే సందర్భంలో శ్రీ శివరావు గారిని ప్రసిద్ధ జర్నలిస్ట్‌గా మాత్రమే అభివర్ణించడం సముచితంకాదేమోననుకుంటాను. ఆధునికాంధ్రదేశ చరిత్రకు రూపరేఖలు దిద్దినవారు, బహు గ్రంథ నిర్మాతలు, ఉత్తమ పరిశోధకులు, సారస్వత వేత్తలు, స్వాతంత్ర్యోద్యమ నిర్మాణ కార్యకర్తలు శ్రీ శివరావు పంతులుగారు. వారిని ప్రసిద్ధ జర్నలిస్ట్‌గా సంభావించడం, ఆయన కృషిని చక్కగా అంచనా వేయడానికి చాలదు.

ఇక మూడోది బుచ్చిబాబు రాసుకొన్న స్వీయ చరిత్రను గూర్చి ప్రస్తావిస్తున్నప్పుడు దొర్లిన చిన్న పొరపాటు. ఇది అచ్చుతప్పై ఉంటుందనే భావిస్తాను. కాని ఈ పుస్తకం పేరు నాలుగుచోట్ల ప్రస్తావనకు వచ్చినప్పుడల్లా పొరపాటుగానే ప్రస్తావితమైంది. బుచ్చిబాబు స్వీయ చరిత్ర కాదది — స్వీయ చరిత్రాత్మక రచన. దానికాయన పెట్టుకొన్న పేరు <u>అంతరంగ కథనం</u>. మథనం అని నాలుగుసార్లూ ప్రసక్తమైంది. చాలా చిన్న సవరణ అనే దృష్టితో మాత్రమే దీనిని ప్రసక్తం చేస్తున్నాను. "ఈ గ్రంథం—బుచ్చిబాబు అంతరంగ కథనం. ఆత్మకథ అనేది, **Autobiography**, చాలామంది వ్రాయగలరు. అంతరంగ కథనం 'బహు కొద్ది మందే వ్రాయగలరు'' అంటున్న కృష్ణశాస్త్రిగారి మాటల్లో అంతరంగ కథనం విలువ ఎంతో తెలుస్తోంది. తీరా చేస్తే కౌమారానికి వీడ్కోలూ, యౌవన తారుణ్యానికి స్వాగతమూ పలుకుతూ మానసిక దేహళికి అటోకాలూ, ఇటోకాలుగా బుచ్చిబాబు తన అనుభూతుల్ని వెల్లడించిన అపూర్వమైన రచన ఇది. పదేళ్ళ జీవితానుభవాలు, ఆనంతర జీవిత కాలంలో వాటి అనుభూతి ముద్రలు వివ

రించాడు బుచ్చిబాబు. బుచ్చిబాబు ఎంత గొప్ప కథకుడు! అంతటి సౌందర్యతత్వజ్ఞుడైన తెలుగు కథకుడింకోరెవరైనా ఉన్నారా!

*　　　*　　　*

స్వాతంత్ర్యానంతరం మూడు దశాబ్దాలంటే 1977 వ సంవత్సరం వరకూ సమీక్షా కాలపరిధిగా స్వీకరించవచ్చు గదా. కొన్ని స్వీయచరిత్రలను గూర్చి నామమాత్రంగానే ప్రస్తావించారు శ్రీరామమూర్తిగారు. ఆ మాత్రం కూడా ప్రస్తావన లేనివి మరి కొన్ని స్వీయ చరిత్రలు, స్వీయచరిత్రాత్మకాలూ మిగిలేపోయాయి. పోనీ ప్రస్తావించిన వాటి గూర్చి అయినా నాలుగు ముక్కలు చెపితే బాగుండేది.

కొన్నిటి విషయంలో అదీ చేయలేదు. అవవి నేను పెట్టుకోక పోయినా, అసలు పూర్తిగా వదిలేసిన వాటిని గూర్చి కొంత ప్రస్తావిస్తాను. అన్నిటినీ గూర్చి చెప్పాలంటే గ్రంథం చాలా పెరిగి పోవచ్చు. అయినా ఈ ఒక్క విషయం శ్రీరామమూర్తిగారు ప్రస్తావిస్తే ఎంత బావుండేది అనిపించిన ఒకటి రెండు సందర్భాలలో ఆయన ప్రస్తావించిన గ్రంథాన్ని గురించి కూడా చాలా సంక్షేపంగా నేనున్నూ ప్రస్తావిస్తున్నాను. అదుగో అలాటి సన్నివేశం ఒకటి నాకు ఎదురైంది.

బసవరాజు రాజ్యలక్ష్మమ్మగారి 'అప్పారావుగారూ — నేనూ' అనే స్వీయచరిత్రాత్మక రచనలో అద్భుతమైన విషయం వొకటుంది. ఆసక్తిని కలిగించేవీ, మనసుని ఆర్ద్రార్ద్రం చేసేవి చాలా సంఘటనలే ఉన్నాయనుకోండి. వాటితోపాటుగా చాలా ఉత్కంఠ కలిగించే నాటకీయమేమో అనిపించే సంఘటన కూడా వొకటుంది. దాన్ని శ్రీరామమూర్తిగారు వినిపించివుంటే బాగుండేది. అది ఇది.

సాహితీ సమితి తొలినాళ్ళలో చాలా పలుకు విలువ కల కవి కొడవటిగంటి వెంకటసుబ్బయ్య. 'ఆగు మాగుమా తెరువరీ ఆయాస ఖేదముల పనయింపుము, మా గృహాంగణ కుసుమ సముదయ ఫలము లియ్యవిగో' అని 'ఆతిథ్యం' అనే రచన వైతాళికులలో వుంది. వైతాళికుల సంపుటంలో ముద్దుకృష్ణ ఈ కవిని గూర్చి ఇట్లా రాశారు "ఆధ్యాత్మికమైన అన్వేషణకై కుటుంబాన్నీ మిత్రులనూ విడిచి ఏ హిమాలయాలకో వెళ్ళిపోయాడు. కవిత్వంకన్నా ఎక్కువైన దానినీ కుటుంబంకన్నా మిత్రులకన్నా చేరువైనదానినీ దేనిని సాధించాడో, ఈనాటికీ అజ్ఞాతంగానే వున్నాడు." ఈ కొడవటిగంటి వెంకటసుబ్బయ్యగారు గొప్పకవి. ఈయనకు వ్యక్తిగత జీవితంలో ఏదో ఆశాభంగా లెదురైనాయి. ఒకసారి అప్పారావుగారూ, రాజ్యలక్ష్మమ్మగారూ శ్రీశైలం వెళ్ళినప్పుడు అక్కడ సత్రంలో భోజనం చేస్తుండగా ఎమటి పంక్తిలో ఎక్కడ గుర్తిస్తారో అని విపరీతమైన ఆత్రుతతో ఆందోళనతో గబగబా భోంచేసి పాడ కూడా కానరాకుండా పరిగెత్తి మాయమైన వ్యక్తి వెంకటసుబ్బయ్యగారేనని రాస్తున్నారు రాజ్యలక్ష్మమ్మగారు. ఆయన కెదురుగా తామిద్దరూ భోజనానికి కూచోవడంవల్ల వెంకటసుబ్బయ్యగారు చాలా ఆందోళన చెందారని రాజ్యలక్ష్మమ్మగారి భావం. అప్పటికే ఆయన గుర్తుపట్ట లేకుండా మారిపోయినాడట. వెంకటసుబ్బయ్యగారి గురించి మరెక్కడా నాకు ప్రస్తావన కనపళ్ళేదు. ఆయన మంచి కవి అని నవ్యాంధ్ర సాహిత్య వీధుల్లో మాత్రం ప్రసక్తం. జీవించివుంటే ఆయనకిప్పుడు ఎనభై ఏళ్ళు ఉంటాయి. నేటికీ అజ్ఞాతంగానే వున్నాడు

ఇటువంటిదే ఇంకో సన్నివేశం. సర్వదుఃఖ నివారణోపాయమనే బులుసు వెంకటేశ్వర్లుగారి స్వీయచరిత్రలో గాంధీమహాత్ముడి ఆంధ్రదేశ పర్యటనలో తణుకులో ఎర్రమిల్లి రామనాధంగారి మేడలో గాంధీజీ దువ్వూరి సుబ్బమ్మగారు ధరించిన అతి నాజూకు ఖద్దరును గూర్చి పరిహాసమాడటం, సుబ్బమ్మగారు కిరాణాకొట్టు పెట్టుకోవలసిన వాడివి నీకు నాజూకేం తెలుస్తుంది అని తిప్పికొట్టడం, అందుకు ఇల్లెగిరిపోయేలా గాంధీజీ నవ్వడం, పట్టాభి, ప్రకాశం, దండు నారాయణరాజు ప్రభృతులు కూడా ఆ నవ్వులో పాలు పంచుకోవడం, ఎవరికైనా నవ్వు తెప్పించే సన్నివేశం. మహాత్ముడికి ఛలోక్తులాడటం, పరిహాసోక్తులకు గురికావడం, అంత ఇష్టమన్నమాట. మన దువ్వూరి సుబ్బమ్మగారిలాగా అంతమాట ఆయనను ఎవరూ ఎప్పుడూ అని వుండరు. గాంధీమహాత్ముడు అవతార పురుషుడే అవడానికి ఆయన చిదానంద ప్రవృత్తి కూడా తార్కాణమే. బులుసు వెంకటేశ్వర్లుగారి స్వీయచరిత్రలో చాలా ఆసక్తి కలిగించే ఘట్టాలే ఉన్నాయి. ఆనాటి మధ్యతరగతి కుటుంబ జీవనంలోని ఆంక్షలు, కాంక్షలు, కష్టసుఖాలు ఆయన హృదయావర్జకంగా వర్ణించారు.

*　　　*　　　*

అసలు స్వీయచరిత్ర ఎవరైనా ఎందుకు రాసుకుంటారు. ఎలా రాసుకోవాలి. స్వీయచరిత్రాత్మక రచనకూ, అచ్చంగా స్వీయ చరిత్రకూ వుండే తేడాలేమిటి. వస్తుగతంగానూ, శిల్పసంబంధిగానూ స్వీయచరిత్ర, స్వీయచరిత్రాత్మక రచనల్లో చోటు చేసుకోగల లోపా లోపాలేమిటి? ఈ రచనలు చేయాలనే ప్రేరణలేవిటి మొదలైన విషయాలు కూడా పరిశీలించారు శ్రీరామమూర్తిగారు.

"The impulse to justify or to exalt an individual led to the writing of memoirs, autobiographical and biographical" అంటోంది The Oxford Classical Dictionary (1957)

ఇదుగో ఈ నిర్వచనానికి అనుగుణంగా ఉదాహరించదగినది కామరాజు హనుమంతరావుగారు ప్రకటించిన మాతృదేవి లీల. తమ ప్రేమంపు టిల్లాలిని గూర్చి రాసుకున్న రచన. ఇది స్వీయచరిత్రమూ, స్వీయచరిత్రాత్మకమూ కూడా. అప్పారావుగారూ—నేనూ అని శోకమే శ్లోకమైన ప్రేరణగా కనబాసిన గువ్వ ఆర్తితో రాజ్యలక్ష్మమ్మగారు తమ భర్తను గురించి స్మరించుకోగా, శ్రీ హనుమంతరావుగారు

ఇందుమతికోసం అజమహారాజు విలపించినంత మగ్న మనస్కతతో ఈచిన్న పుస్తకం రాశారు. 'అర్థం భార్యా మనుష్యస్య భార్యా శ్రేష్ఠ తమస్సఖా, భార్యా మూలం త్రివర్గస్య, భార్యామూలం తరిష్యతః' అని మహాభారతం ఈ సుభాషితం హనుమంతరావుగారి జీవితానికి సరిగ్గా సమన్వయం అవుతుందనిపిస్తుంది ఈ పుస్తకం చదివితే. 'నాకు ఆమె ఇల్లాలే కాదు, దైవంకూడా. ఆమె మాతృత్వ పరిపూర్ణ సిద్ధిని సాధించింది' అంటారు హనుమంతరావు గారీ గ్రంథంలో. హనుమంతరావుగారి స్వీయ జీవిత సమీక్ష 1973లో వెలువడగా ఈ 'మాతృదేవిలీల' అనే పేరుగల తమ ధర్మపత్ని జీవిత చరిత్రను 1955లోనే వెలువరించారు. స్వీయ జీవితాత్మక రచనల్లో ఈ పుస్తకం తప్పకుండా పేర్కొనదగింది.

ఇలాగే 1968వ సంవత్సరంలో వెలువడిన "సీమకు స్టీమరులో" అనే దండా వెంకట సుబ్బారెడ్డిగారి చిన్న విదేశ యాత్రా వృత్తాంతాన్ని కూడా స్వీయ చరిత్రాత్మక సాహిత్యంలోనే చేర్చవచ్చునుకుంటాను. కుతూహలోద్వేగాన్ని మరింత మరింత పెంచుతూ సాగిపోయే గ్రంథమిది. 1928 ఏప్రిల్‌లో శ్రీ దండా వెంకటసుబ్బారెడ్డిగారు స్వదేశంలో వైద్యవిద్య పూర్తికాగా లండన్‌కు వెళుతూ, తన ప్రయాణానుభవాలను డైరీ రూపంగాను, స్వదేశంలో మిత్రులకు ఉద్దేశించిన లేఖారూపంగాను రాసిపెట్టుకున్న అనుభవాల, అనుభూతుల సంపుటి ఈ గ్రంథం. ఈ గ్రంథంలో శైలి చాలా సొగసుగా వుంది.సముద్ర ప్రయాణాన్ని గూర్చిన స్వీయానుభవ వర్ణనలు తెలుగులో ఎవరైనా రాశారా అసలు ?! 1928, 30 సంవత్సరాల ఇంగ్లండు దేశాన్నిగూర్చి, లండన్‌పుర వర్ణనలతోనూ, ఈ చిన్న పుస్తకం చాలా విలువైనది.

స్వీయ చరిత్రాత్మక సాహిత్యంలోనే గుంటూరు శేషేంద్ర శర్మగారి నా డైరీ–రక్తరేఖ కూడా చేరదా ? ఇందులో ఆయన స్వీయజీవిత వృత్తాంతం ఏమీలేకపోయినా, తన చుట్టూ ప్రవ్యక్తమవుతున్న సాహిత్య సమాజాన్ని గూర్చిన ఆయన స్పందనలు ప్రతిస్పందనలు ఈ గ్రంథంలో ఉన్నాయి. అఫ్‌కోర్స్–సాహిత్య చర్చలు, నిజమైన సాహిత్య విలువ లేవీ ? ఆనేవాటికి ప్రాధాన్యం అయినా తానుగాచూసి, భావించి, స్పందించి, తన స్నేహితుల, అభిమానుల, తనకు అయినవారి, కానివారి, సాహిత్య వ్యాసంగాన్ని కోపంగా, జాలిగా, అసహనంగా వేదనతో బేరీజువేసే ప్రయత్నమూ,స్వీయాభిప్రాయాలు, పూర్వపక్ష ప్రతిపక్ష సిద్ధాంతాలూ, తీర్పులూ ఉన్నాయీగ్రంథంలో. 1974 లో అచ్చైంది ఈ పుస్తకం. ఈ దృష్ట్యా పరిగణిస్తే తిరుపతి వెంకటకవుల కథలూ – గాథలల్లో స్వీయచరిత్రాత్మక వృత్తాంతం చాలా చోటుచేసుకోవడం చూడవచ్చు. ముఖ్యంగా వెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారి కాశీయాత్ర ఆయన స్వీయచరిత్రలో ఏకదేశమే. బహూ సొగసైన పుస్తకం. ఆయన గురుకులవాసం, వివాహం, ఆనాటి సాంఘిక పరిస్థితులు, తొలినాళ్ళలో తాము చేసిన అవధానాలు, ఆ సమస్యలు బహురంజకంగా వివరించారు వెంకట శాస్త్రిగారు. కాశీలో పండితులు చదువుచెప్పే ఏర్పాట్లు, చదువుకొనే విద్యార్థుల భోజన భాజనాదులేవిధంగా సమకూరేదీ ఆ వివరాలు అన్నీ చాలా ఆసక్తి కలిగేలా వర్ణించారు శాస్త్రిగారు.

* * *

ఇక అసలు స్వీయ చరిత్రల గూర్చి ప్రస్తావిస్తాను. ఆచంట జానకిరామ్‌గారి స్మృతిపథంలో, సాగుతున్న యాత్ర – రెండు భాగాలు స్వీయచరిత్ర కిందికే వస్తాయి. జననం, విద్యాభ్యాసం, కుటుంబ స్థితిగతులు మొదలైన విషయాలనుగూర్చి వివరంగా చెప్పకపోయినా, స్వీయజీవితానుభూతులను భావుకతతో వివరించారు. సాంప్రదాయికమైన రచనా పద్ధతిలోకాక నవ్యప్రాయోగిక రీతిని ఆయన అనుసరించారు. ఆచంట జానకిరామ్‌గారి తండ్రిగారైన ఆచంట లక్ష్మీపతిగారి స్వీయచరిత్ర, వీరేశలింగం, చిలకమర్తి, పెద్దిభట్ల వీరయ్యగార్ల స్వీయచరిత్రల మాదిరిగా సంప్రదాయ రీతిలోనే సాగింది. 1973 లో పుస్తక రూపాన అచ్చై వచ్చింది. కిందటి శతాబ్దం చివరి పాదంలో గోదావరి జిల్లాలోని సాంఘిక పరిస్థితులను చక్కగా ప్రతిబింబింప చేస్తున్నది లక్ష్మీపతిగారి స్వీయచరిత్ర. ఆయుర్వేద విజ్ఞానానికి లక్ష్మీపతిగారు చేసిన సేవ, ఆనాటి వైద్యనిదానం, ఆ అనుభవాలు విపులంగా ఉన్నాయి లక్ష్మీపతిగారి స్వీయచరిత్రలో. విజ్ఞానచంద్రికా మండలి వ్యవస్థాపక సభ్యులలో శ్రీ లక్ష్మీపతిగారొకరు. అందువల్ల శాస్త్రీయ విజ్ఞానాన్ని సుగమమైన, సులభమైన తేటతెల్లమైన తెలుగులో చెప్పడానికీ, తెలుగువారి పురాచరిత్ర వైభవాన్నీ, పునరుజ్జీవన సాంస్కృతిక వికాస వైఖరినీ సర్వులకూ తెలియబరచడానికీ, విజ్ఞానచంద్రికా మండలి రూపొందించిన ప్రణాళికలలో పాల్గొన్నారు. అఖిలభారత స్థాయిన ఆయుర్వేద వైద్య విజ్ఞాన ప్రచారానికి జరిగిన కృషిని గురించీ ఆయా ప్రాంతాలలో జరిగిన సదస్సులను గురించీ వివరాలున్నాయి లక్ష్మీపతిగారి స్వీయచరిత్రలో.

సంజీవదేవ్‌గారి అనుభవాలు, జ్ఞాపకాలనుగూర్చి నామమాత్రంగా ప్రస్తావించడం జరిగింది. కాని సంక్షేపంగానైనా అపూర్వమూ అనుపమానమూ అయిన ఈ స్వీయ చరిత్రాత్మకమైన రచనలగూర్చి వివరించకపోవడం శ్రీరామ మూర్తిగారి వ్యాసంలో పెద్ద లోపం. శ్రీ సంజీవదేవ్ గొప్ప భావుకులు. సౌందర్య వేత్తలు. మనస్వి. సౌందర్యారాధన, తత్త్వజిజ్ఞాస, ఉత్తమ కళా తృష్ణ గల ప్రజ్ఞాశీలి. తెగిన జ్ఞాపకాలు, స్మృతిబింబాలు, గతంలోకి అనే మూడు సంపుటాలలో పరమ రమణీయంగా పరిపక్వమైన చిత్తవృత్తితో, తమ జీవితానుభవాలను, అనుభూతులను గ్రథితం చేశారు. పది సంవత్సరాలకు పూర్వమే శ్రీ నార్లవారు సంజీవదేవ్‌ను గూర్చి ఇట్లా రాశారు: "Sanjeev Dev is a poet, an essayist, a photographer, a painter, an art critic and a mystic. A desciple of Nicholas Roerich, a friend of Lama Govind and Asitkumar Haldar, a widely travelled man who in his youthful years wandered all over India including the enchanting

Himalayan valleys, he is simple, learned, unpretentions, charming, and captiviating."

ఈ మాటలు నాలుగో జాతీయ పుస్తకోత్సవ సందర్భంగా నేషనల్ బుక్ ట్రస్ట్‌వాళ్ళే ప్రచురించిన ప్రత్యేక సంచికలో 1969–70 సంవత్సరపు పుస్తక ప్రచురణ కార్యక్రమము–కొన్ని గొప్ప పుస్తకాలు గూర్చి ప్రస్తావిస్తూ నార్ల రాశారు. తెగిన జ్ఞాపకాలు 1970వ సంవత్సరంలో వెలువడింది. అటు తర్వాత స్మృతి బింబాలు, ఈ సంవత్సరమే 'గతంలోకి' వెలువడ్డాయి. 'అడయార్ విశేషాలు, అనిబిసెంట్ సందర్శనం; జిడ్డు కృష్ణమూర్తితో పరిచయం' 'హిందీ రచయిత ప్రేమచంద్‌తో పరిచయం' 'ప్రేమచంద్‌తో గోష్ఠి' 'హిమాలయాలలో వింత అనుభూతులు' 'ప్రసిద్ధ చిత్రకారుడు హల్దార్‌తో పరిచయం' 'రవీంద్ర కవీంద్రుని సందర్శన భాగ్యం' 'కళాతపస్వి రోరిక్‌తో పరిచయం' 'అడవి బాపిరాజుతో పరిచయం' 'రాహుల్‌జీతో నా పరిచయం' మొదలైన జ్ఞాపకాలన్నీ విమల గాంధర్వం వింటున్నప్పటి అనుభూతిని కలిగిస్తాయి పాఠకుడికి.

మహాపండిత రాహుల్ సాంకృత్యాయన్ త్రిపిటకాచార్య వచ్చి తుమ్మపూడిలో సంజీవదేవ్‌గారికి అతిథిగా వారం రోజులు గడపటమూ, ఆ చుట్టుపక్కల గ్రామాల్లో సోవియట్ రష్యా సామాజిక జీవనాన్ని గూర్చి ఆయన ఉపన్యాసాలు చెప్పటమూ, తరవాత నాగార్జున కొండ వెళ్ళి అక్కడ త్రవ్వకాలలో బయటపడ్డ శిధిలావశేషాలు చూడటమూ, రాహుల్‌జీ గుంటూరు రావడమూ మొదలైన ఈ వివరాలన్నీ ఎంతో ఉత్తేజాన్నీ ఆహ్లాదాన్నీ కలిగిస్తాయి పాఠకులకు తెగిన జ్ఞాపకాలు చదువుతున్నప్పుడు. రాహుల్‌జీ తెలుగు చదవగలిగే వారట కాని మాట్లాడలేక పోయే వారట. రాహుల్ సాంకృత్యాయన్ చాలాకాలం బౌద్ధ సన్యాసిగా ఉండిపోయినారు. తన ఏభై ఒకటో ఏట రష్యన్ వనిత నొకామెను వివాహం చేసుకున్నారు. వాళ్ళకో కొడుకు కూడా పుట్టాడు. రాహుల్‌జీ వ్యక్తిత్వంలోని పరస్పర వైరుధ్యాలను, సంచలన వేగ తీవ్రతను చూసి చాలా ఆశ్చర్యపడ్డానని అంటున్నారు సంజీవదేవ్. ముందు సన్యాసాశ్రమం గడిపి తరవాత గృహస్థు కావడం క్రమ పరిణామం అనేది రాహుల్‌జీ సిద్ధాంతమట. రాహుల్‌జీ మాంస భోజన ప్రియత్వం, నిర్విరామ ధూమపాన వ్యగ్రత చాలా ఆశ్చర్యం కలిగించే విషయాలు, వీటిని సరిపెట్టుకోవడం ఎలానో తెలిసిందిగాదు అని సంజీవ్‌దేవ్ తమ జ్ఞాపకాలలో రాశారు. అహింసను పరమ ధర్మంగా పాటించే బౌద్ధులు మాంసాహారంపట్ల మమత్వం చూపడం చాలా వింతైన సంగతి. ఈ విధంగా సంజీవదేవ్ అనుభవాలు — జ్ఞాపకాలలో తెలుసుకోవలసిన విశేషాలెన్నో ఉన్నాయి. ఆయన సృజనాత్మక ప్రతిభాశాలి కూడా కాబట్టి, రచనా విన్యాసం కూడా పరమ రమణీయంగా పర్యవసించింది. స్మృతిబింబాలలో కూడా ఆయా ప్రదేశాలలో తమకు తారసపడ్డ విశిష్టమైన, విలక్షణమైన వ్యక్తులను గురించీ పరిసరాలను గురించీ ఆయన వర్ణించారు. 'గతంలోకి' ఇటీవలే వచ్చింది కాబట్టి ఇంకా నేను చదవటం పడిందికాదు.

శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి శ్రీ కృష్ణ చరిత్రమనే స్వీయ చరిత్రను గూర్చి ప్రస్తావన కూడా చేయలేదు శ్రీరామమూర్తిగారు. ఇది 1959వ సంవత్సరం వెలువడింది. ఈ స్వీయ చరిత్ర కూడా చాలా ఆసక్తిని రేకెత్తించే రచన అనే చెప్పాలి. అఖిలభారతంలోనూ శ్రీ శాస్త్రిగారి వైదుష్యానికి జరిగిన సన్మానాలు, పురస్కారాలు మొదలైన వానితో పాటు, ఆయన గ్రంథ కర్తృత్వ పరిశ్రమ, ఆనాటి సాంఘిక పరిస్థితులు, ఆయన సాగించిన విద్యా వివాదాలు, నడిపిన పత్రికలు, పాటించిన విశ్వాసాలు, చదువుతున్నప్పుడు అద్భుతలోకం అనిపిస్తుంది.

దాసరి లక్ష్మణకవిగారు తమ స్వీయచరిత్రను నా జీవిత యాత్ర అనే పేరుతో రెండు సంపుటాలుగా ప్రకటించారు. రెండో సంపుటం 1962 లో వెలువడింది. ఆంధ్రదేశంలోని కవి పండితులంతా లక్ష్మణ కవిగారినీ, ఆయన జీవితయాత్రనూ శ్లాఘించారు. రవీంద్రకవీంద్రుడు పిఠాపురంవచ్చి కొన్నాళ్ళు రాజాగారికి అతిధిగా వుండడం, తుమురాడ సంగమేశ్వరశాస్త్రిగారితో కలిసి లక్ష్మణకవిగారు రవీంద్రుణ్ణి మూడుసార్లు దర్శించడం, రవీంద్రుడు కవిగారికి తన బాల్య జీవిత విశేషాలు వివరించడం ఈ గ్రంథంలో కుతూహలం కలిగించే విషయం (పుట 142).

వేటూరి ప్రభాకరశాస్త్రిగారి స్వీయచరిత్ర ప్రజ్ఞాప్రభాకరం 1951 లోనే వెలువడింది. ''తమకు గలిగిన యోగానుభూతులను వివరించుచు వేయి పుటల గ్రంధముగా దొలి సంపుటమును, నీ యోగమువలన నుపకారము పడసిన మిత్రులయొక్కయు, శిష్యుల యొక్కయు ననుభవములను, వారే వ్రాసిన వానిని వేయి పుటల గ్రంధముగా రెండవ సంపుటమునుగా ప్రజ్ఞా ప్రభాకరమును వెలయించుట వారి సంకల్పము. అందుకై తొడగి రచనమున కుపక్రమించి కొంతవరకు సాగించిరి. మిత్రులకడనుండియు, వాప్తులకడ నుండియు, శిష్యులకడనుండియు వారి యనుభవములను దెలుపు వృత్తాంతములనుగూడ దెప్పించిరి.'' అని ప్రజ్ఞా ప్రభాకరాన్ని గూర్చి ప్రచురణకర్తలు తెలియచేశారు. భృక్త రహిత తారకా రాజ యోగంగా పరిగణితమై కుంభకోణంస్వామి వారుగా ప్రసిద్ధులైన మాస్టర్ సి. వి. వియోగమార్గంలో ప్రభాకరశాస్త్రిగారు సిద్ధిని సాధించారు. ఈ గ్రంథానికి ముప్పై ఆరు పేజీల పీఠిక వుంది. శ్రీ ప్రభాకరశాస్త్రులవారు, మానవల్లి రామకృష్ణకవిగారికి సంబంధించిన చాలా సన్నిహిత విషయాలుకూడా రాశారు. కొమర్రాజు లక్ష్మణరావుగారితో తమ పరిచయమూ, లక్ష్మణరావుగారితో కలిసి వీరేశలింగంగారిని చూడటానికి వెళ్ళటమూ, కవుల చరిత్రను పునస్సంశోధితంచేసే విషయంలో వీరేశలింగం ప్రభాకరశాస్త్రిగారి సాయాన్ని అభిలషించడం ఇత్యాదిగా ఎన్నో తెలుసుకోవలసిన విషయాలున్నాయి. ''దీని రచనమున నాకు పురుషోత్తముడగు గాంధి స్వ చరిత్ర రచనా విధానము దారిదివ్వె'' అన్నారు శ్రీ శాస్త్రిగారు. శాస్త్రిగారి అభిప్రాయాలు ఎంత నవీనాలో, హేతుయుక్తాలో చూడండి.

''దైవముపేర సంఘమున అలజడి పుట్టించుట సుకరమనీ, అది దిద్దుటంత సుకరముగాదనీ, సంఘము విద్యా విజ్ఞానవంతమై మొత్తముమీద వర్ధిల్లిననేగాని యిట్టి చెట్టలు దొలగింప సాధ్యము కాదనీ విన్నవించుటకే ఈ విషయముల నిక్కడ వ్రాసితిని. మతము వైద్యము, జోస్యము, ధర్మము, ఆచారము ఇత్యాది సంప్రదాయ సంకేతములతో చెడుగులెన్నెన్నో సంఘమున దిద్దగుదరనివై మొద్దు వారి కదలకున్నవి. వ్యాపించుచున్నవి. మూఢ విశ్వాసముతో వాని ననువర్తించు లోకముండుటచే దత్త్వచారకులు వానిని స్వయముగా విశ్వసింపకపోయినను వానివలన లాభముచే లోకమున పలుకుబడి సాగించుకొనుచున్నారు. కొందఱు సగమెఱుకతో నన్నింటిని బాటించుచున్నారు'' (పుట 13–14). దురదృష్టవశాత్తూ నూటయాభై రెండు పుటల దగ్గర అసంపూర్ణంగా ఆగిపోయిందీ స్వీయచరిత్రం. చివర ప్రకరణం నాడీ గ్రంథాలు· ఇందులో చాలా అద్భుతమైన విషయాలున్నవి.

కె. ఎన్. కేసరిగారి నా చిన్ననాటి ముచ్చట్లు అనే స్వీయ చరిత్ర 1953 లో అచ్చైంది. నిప్పచ్చరపు పేద సంసారంనుంచి స్వయం కృషితో చాలా గొప్పవాడైనాడు శ్రీ కేసరి. ఆయన 1875 లో జన్మించారు. 1953 లో పరమపదించారు ఇంచు మించుగా ఆయన జీవించిన మూడు పాతికల మించిన ఈ కాలంలో తెలుగుదేశంలో సాంఘిక జీవనంలో వచ్చిన మార్పులన్నీ ఈ ముచ్చట్లద్వారా చక్కగా తెలుసుకోవచ్చు. కేసరి కుటీరం స్థాపనం, గృహలక్ష్మి పత్రిక నిర్వహణం, మొదలైనవి చాలా ఆసక్తికరమైన వృత్తాంతాలు. మరపురాని మన మహాత్ముడు అనీ, శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు అనీ రెండు అధ్యాయాలు కేసరిగారు స్వీయ చరిత్రలో రాశారు.

''ఇందులో నేను చిన్నతనంలో ఎలా నిరుపేదగా కష్టపడి స్వయంకృషివలన స్వశక్తితో క్రమంగా విశేషంగా ధనమార్జించి నదియు దానిని మొత్తము నా స్వార్థమునకు, విలాసములకు మాత్రము వినియోగించుకోకుండా పరోపకారానికి, సంఘ పురోభివృద్ధికి వినియోగించిన విధము వివరింపబడినది'' (పుట 249) అన్నారు కేసరిగారు.

''ఆనాటి చెన్ననగరము యెట్లుండెనో, అప్పటి విద్యార్థులెట్లు కాలము గడిపిరో, రోడ్లు,కాఫీహోటళ్ళు, భవనములు ఏ రీతిన ఉండెడివో తెలుసుకొనుటకు అనువగు వర్ణనలు కలవు. ఉత్తర దక్షిణదేశ యాత్రలో ఆయా క్షేత్రములు మలబారు పరిస్థితులు, నంబూది బ్రాహ్మణుల వృత్తాంతము, వివిధ నాటక రచనలు, సమాజములు, చిత్రలేఖనము, సంగీతము — ఇది అనేక విధ విషయములను గురించి తెలిసికొనగల హంశము లు కలవు'' అంటున్నారు పత్తిపాటి సత్యనారాయణరావుగారు.

ఆనాటి క్రిస్టియన్ కాలేజి ప్రిన్సిపాల్ మిల్లర్ దొరను గూర్చి కేసరిగారిట్లా అన్నారు :

''ఆయన నేటి వారివంటివారు కారు. పూర్వపు కణ్వ, గౌతమ, కాణాదాది కులపతుల తలపించు కరుణార్ద్రహృదయుడు.''

చెన్న నగరంలో ఆ రోజుల్లో సుప్రసిద్ధమైన వినోద విహార స్థలమైన పార్క్ ఫేర్ ఒక రోజున ఘోరమైన అగ్నిప్రమాదానికి గురిఅయింది. అప్పుడు మిల్లర్ దొర చూపిన సాహసం వర్ణనాతీతం అంటున్నారు కేసరిగారు.

''ఆయన స్వయముగా సాహసించి గుంజలెగబ్రాకి కాలుచున్న పందిళ్ళను దులిపివేసినారు· పొగలోనున్న శిశువులను స్త్రీలను, ఇవతలికితెచ్చి విడిచినారు. ఇంకెన్ని విధములుగానో అచ్చటి బాధితులకు సహాయపడినారు. అంతేకాక కాలేజీకి వెళ్ళి రిజిష్టరు చేతబుచ్చుకొని పొరుగూళ్ళనుండి విద్యాభ్యాసమునకై వచ్చి కోవ కొక్కడు గొందికొక్కడుగానుండిన వారిని పేరు పేరు వరసన తెలుసుకొని వారి యోగక్షేమములను విచారించి వారి తలిదండ్రులకు పోషకులకు తెలియపరచి వారి ఆర్తము బాపిన శిష్యవత్సలుడగు మహాత్ముడు'' (పుట 9)

కొండ వెంకటప్పయ్యపంతులుగారి స్వీయచరిత్రలో కూడా మిల్లర్ దొరను గూర్చిన వివరాలున్నాయి.

లింగం వీరభద్రయ్యచౌదరిగారి 'స్వవిషయం' మూడు సంపుటాల బృహత్పరిమాణంగల స్వీయచరిత్ర. శ్రీ వీరభద్రయ్యచౌదరిగారు ఇన్‌కమ్‌టాక్సు డిపార్ట్‌మెంట్‌లో అత్యున్నతమైన పదవుల నధిరోహించారు. ఇంచుమించు ఉద్యోగ నిర్వహణంలో ఆంధ్రదేశమంతా పర్యటించారు. గంజాం సర్కిల్‌లో కొన్నాళ్ళు పనిచేశారు. హైదరాబాద్ సర్కిల్‌లో కూడా కొన్నాళ్ళు పనిచేశారు. ఈ శతాబ్దపు పూర్వార్ధంలో క్రమంగా సాంఘిక జీవనంలో నెలకొంటున్న మార్పులను చాలా ఆసక్తికరమైనవాటిని ఈ స్వీయచరిత్రద్వారా తెలుసుకోవచ్చు.

సినిమా వినోద సాధనంగా ప్రాబల్యం పొందటానికి ముందు గ్రామ ప్రాంతాలలోనూ, నగరప్రాంతాలలోను కోడిపందాలు, పొటేళ్ళ పందాలు జరుగుతూ ఉండటం, ఆయా విశేషాలు చదువుతుంటే చౌదరిగారి ఈ స్వీయచరిత్ర చాలా ఉత్సుకతను గొలుపుతుంది. ఈ సంపుటాలు మూడున్నూ 1977కు ముందుగానే వెలువడ్డాయి.

హరికథా పితామహుడు, అపర తుంబురుడు, నిరుపమాన సంగీత సాహిత్య ప్రజ్ఞానిధి, అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసుగారి స్వీయచరిత్రం 'నా యెఱుక' 1976వ సంవత్సరంలో పుస్తకరూపాన వచ్చింది. దీనికిసాటి అయిన స్వీయచరిత్రం తెలుగులో ఇంకొకటిలేదు. కిందటి శతాబ్దపు బందరు ఉప్పెన సంవత్సరమైన 1864లో నారాయణదాస మహాకవి జననం 1894వ సంవత్సరం వరకు ఆయన జీవితంలో తారసిల్లిన పరమాద్భుత వృత్తాంతాలన్నిటినీ ఈ స్వీయచరిత్రలో వర్ణించారు ఆనందగజపతి ఆస్థాన వైభవాలు, అక్కడి సంగీత సాహిత్య సరస్వతీ నర్తనాలు, మిన్నుమోసిన సంగీత విద్వాంసులు, సాహిత్య వేత్తలు, భరతనాట్య కళాప్రవీణ్యులైన భోగంగనలు, ఆనాటి సామాజిక స్వరూపాన్ని, అందులోని ఉచ్చనీచాలతో సహా కళ్ళముందు నిలిపారు నారాయణ దాసుగారు. బరంపురంలో న్యాయవాదవృత్తిలో ఉంటూ కలియుగ

కర్ణునిగా (దాతృత్వ ప్రశస్తికి) విఖ్యాతి పొందిన జయంతి కామేశం పంతుల్ని గూర్చి మహాద్భుతమైన విషయాలెన్నో వర్ణించారు నారాయణదాసుగారు పనప్పాకం ఆనందాచార్యులవారి పరిచయమూ, మైసూరు రాజాగారి దర్బారులోని విశేషాలు, కిళాంబి రామానుజాచార్యులవారు, చంద్రశేఖరశాస్త్రిగారు మొదలైన విజయనగరం మహారాజా కళాశాల ప్రధానాధ్యాపకులను గూర్చిన సంగతులు, బహు తమకంతో చదివిస్తాయి.

స్వీయచరిత్ర అని చెప్పటానికి వీలులేకపోయినా స్వీయచరిత్రాత్మక రచనగా తప్పక సంభావింపదగిన రచన శ్రీ నల్లగొండ రామచంద్రరావుగారి 60 సంవత్సరాల అనుభవాలనే యథార్థ దృశ్యాలు. జీవితంలో తారసిల్లిన ముఖ్యమైన సంఘటనలను, అనుభవాలను పద్దెనిమిది ప్రకరణాలుగా రచించారు శ్రీ రామచంద్రరావుగారు. ఈ గ్రంథం కూడా 1976లోనే అచ్చై వచ్చింది. అఖిలభారతదేశంలోనూ యోగాసన ప్రాశస్త్యాన్ని గూర్చి రామచంద్రరావుగారు ఎన్నెన్నో ప్రదర్శన పూర్వకమైన ఉపన్యాసాలు చేశారు. సహస్ర సంఖ్యలో యోగ్యతాపత్రాలు పొందారు. వీరు గొప్ప యోగాసన ప్రవీణులు. డెబ్బైఎనిమిది సంవత్సరాలు నిండినా ఇప్పటికీ అత్యంత దృఢమైన శరీరారోగ్యంతో యోగాసన ప్రదర్శనలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఆంధ్ర వాల్మీకిగా ఆంధ్రదేశమంతటా పేరుప్రఖ్యాతులు పొందిన వాసు దాసుగారైన వావిలికొలను సుబ్బారావు పంతులుగారికి రామచంద్రరావుగారు శిష్యులు. దయ్యాలు, భూతాలు, మంత్రతంత్రాలు, ప్రాణాయామం, దానివల్ల లాభాలు, మొదలైన విషయాలతో రామచంద్రరావుగారి ఈ అరవై సంవత్సరాల అనుభవాలు చాలా కుతూహలాన్ని కలిగిస్తాయి. భగవంతుని అస్తిత్వాన్ని గురించిన విషయంలో ఇటీవలే కాలధర్మం చెందిన సింహళదేశ హేతువాదాగ్రేసరుడైన డా॥కోవూర్ గారిని తాము సవాల్ చేసినట్లుగా వీరు రాస్తున్నారు.

* * *

స్వాతంత్ర్యానంతరకాలంలో వెలువడి ఇంకా పుస్తకరూపం పొందని స్వీయచరిత్రలు కొన్ని ఉన్నాయి. ఇందులో కొన్ని అసంపూర్ణాలు కావచ్చు. ఇటువంటి వాటిలో పుట్టపర్తి నారాయణాచార్యులుగారి జీవితానుభవాలను పేర్కొనవలసి ఉంటుంది. సుమారు పది సంవత్సరాలకు పూర్వం గుంటూరునుంచి వెలువడిన ఒక సాహిత్య మాసపత్రికలో శ్రీమాన్ నారాయణాచార్యుల వారి స్వీయచరిత్రలో కొన్ని భాగాలు వెలువడ్డాయి. ఈ స్వీయచరిత్ర పూర్తిచేసి ప్రచురిస్తే ఆధునిక తెలుగు సాహిత్యానికి ఇది వెలలేని ఆభరణమే కాగలదు. ఆధునిక మహాకావ్యం కాగలదు. నారాయణాచార్యులవారి జీవితమంతా ఉద్వేగపూరితమైన మహాద్భుత సంఘటనలకు ఆలవాలంగానే సాగింది. ఆయన గొప్ప ప్రజ్ఞాశాలి. సంగీత సాహిత్యాలలో గొప్ప ప్రజ్ఞ సాధించినవారు. బహుభాషావేత్త. ఒక సంవత్సరం కిందట వీరిని కలుసుకొన్నప్పుడు స్వీయచరిత్రను పూర్తిచేయవలసిందిగా ఎంతగానో అర్థించాను. అందరూ అట్లానే కోరుతున్నారు అన్నారుకాని, ఆ ప్రయత్నమేమీ వారు చేసినట్లులేదు.

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారి 'మరపురాని ముచ్చట్లు' కూడా ఇటువంటి స్వీయ చరిత్రాత్మకమైన రచనమే ననుకోవాలి. ఆనాటి సాహిత్యోద్యమాలు, ప్రముఖవ్యక్తులు, సభలు సమావేశాలు, గొప్ప కవిపండితులు మొదలైన వివరాలు శ్రీ హనుమచ్ఛాస్త్రిగారి మరపురాని ముచ్చట్లద్వారా తెలుసుకోగల అవకాశంవుంది.

పత్రికారంగంలో మాండలిక పత్రికలకు ఒక సుస్థిరమైన స్థానాన్ని సంపాదించి, ఆటువంటి పత్రికల అవశ్యకతను ఎంతగానో నిరూపించిన కీర్తిశేషులు నెల్లూరు వెంకట్రామానాయుడుగారు నా జీవిత విశేషాలు అనే పేరుతో తమ స్వీయ జీవిత వృత్తాంతాన్ని గ్రథితం చేశారు. వారి జమీన్ రైతు పత్రికలో ఈ విశేషాలు ధారావాహికంగా వెలువడ్డాయి. ఇంకా పుస్తకరూపం ధరించలేదు. 1959 ఫిబ్రవరి 13 వ తేది జమీన్ రైతు సంచికలో ఈ విశేషాలు మొదలైనవి. వెంకట్రామానాయుడుగారు తమ జీవిత విశేషాలు రాసుకోవడానికి నార్లవారు ప్రేరణ కలిగించారని చెప్పుకున్నారు.

“నాకు దినచర్య వ్రాసిపెట్టే అలవాటు లేనందున నాకు జ్ఞాపకమున్నంతవరకు స్థూలంగా వ్రాయవలసివచ్చింది. అందువలన కాల నిర్ణయాలు సరిగ్గా వుంటవనుకోను. కొంత హెచ్చు తగ్గులు వుండవచ్చును” అని 1954 స్వీయ రచన ప్రారంభిస్తూ ఆయన రాశారు.

“1900–1903 సం. లోపల నా తండ్రి చనిపోయి నట్లున్నది. అప్పటికి నాకు 10 యేండ్ల వయస్సు వుంటుంది వూహ బాగా తెలియదు. మాతండ్రిగారు చనిపోయినప్పుడు అందరు యేడుస్తుంటే, నాకు అర్ధణా యివ్వవలసివుండి అది యివ్వకుండా చనిపోయినాడే అని ఏడ్చాను.” అని రాసుకొన్నారు. శ్రీ నెల్లూరు వెంకట్రామానాయుడు జమీన్‌రైతు ఉద్యమంలో ప్రముఖపాత్రను వహించిన నాయకుడు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు.

ఆధునిక రచయిత్రులలో లబ్ధప్రతిష్ఠురాలైన శ్రీమతి లత ఒక వారపత్రికలో ఇటీవల తమ జీవితానుభవాలు ఉన్నదున్నట్లుగా రాస్తామని ప్రకటించారు. కొంతకాలం ఇవి వెలువడ్డాయి.

జీవితంలో అనుభవాలు-ప్రయోగాలు అంటూ శ్రీ పోతుకూచి సాంబశివరావుగారు తమ పత్రిక విశ్వరచనలో, తమ చిన్ననాటి అనుభవాలను, అనుభూతులను రచనా ప్రేరణ కలిగించిన సంఘటనలను కొన్నిటిని రాశారు. ఇంకా పుస్తకరూపం పొందలేదు.

సుప్రసిద్ధ న్యాయవాదులు స్థానిక రాజకీయ దురంధురులు, సాంఘిక సాహిత్య రంగాలలో చెప్పుకోదగిన కృషి చేసినవారు అయిన శ్రీ నడింపల్లి లక్ష్మీనరసింహారావు పంతులుగారు తమ జీవితగాథను గుంటూరునుంచి వెలువడే ఒక వారపత్రికలో వెలువరించారు.

ఇటీవలెనే అసమగ్రంగానే అయినా విశ్వనాథవారి ఆత్మకథ వెలువడింది. విశ్వనాథ స్మారక సాహిత్య పత్రిక 'మేఖల'లో 65 పుటలుగా విన్యసించిన ఈ ఆత్మకథవల్ల ఆయన సాహిత్య వ్యక్తిత్వం స్పష్టాకృతికంగా అధ్యయనం చేయవచ్చు. ఆధునిక సాహిత్యంలో ఆయన అనన్య సామాన్య ప్రతిభావంతుడు. మహోశిఖర సదృశుడు. బందరు కళాశాలలో ఎఫ్. ఎ. లో చేరిందాకా ఈ ఆత్మ కథ సాగింది. 1971–72 సంవత్సరాలలో విశ్వనాథ ఈ ఆత్మ కథ రచించి వుండవచ్చునంటున్నారు సంపాదకులు.

వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంవారు తెలుగుశాఖ తరఫున వెలువరించిన 'విమర్శిని' అనే పేరిటి విశ్వనాథ స్మారక సంచికలో విశ్వనాథ సత్యనారాయణగారి సోదరులు వెంకటేశ్వర్లుగారు తమ కుటుంబాన్ని గూర్చి అన్నగారి ప్రతిభా శేముషిని గూర్చి రాసిన బృహద్రచన ప్రమరితం. ఈ రచనను కూడా స్వీయచరిత్రాత్మక రచనగానే పరిగణించవచ్చు.

యువభారతివారు 1972లో ప్రచురించిన 'మహతి' అని అమూల్య సాహితీ సంపద్విలసితమైన సంపుటిలో విశ్వనాథ, శ్రీశ్రీలు వ్రాసిన 'నేను—నా సాహిత్య రచనలు' అనే బృహద్వ్యాసాలు కూడా స్వీయచరిత్రాత్మక రచనలే స్వీయజీవిత విశేషాలతో బాటు, సాహిత్య పథయాత్ర నా వ్యాసాలలో తమ దృక్పథాలమేరకు వారు విన్యసింపచేశారు.

1947వ సంవత్సరం నవోదయ పత్రికలో శ్రీమతి వేదుల కృష్ణవేణమ్మగారు రాసిన 'మా తండ్రి మల్లయ్యశాస్త్రిగారు' అనే రచన గొప్ప స్వీయచరిత్రాత్మక రచన. ఈశ్వరచంద్ర విద్యాసాగరుడు, దయానంద సరస్వతులతో సరిపోల్చదగిన ఈ మహానుభావుడి శతజయంతి జరిపి సంస్మరించుకోవాలన్న జ్ఞానం సాహిత్య సంస్థలకుగాని, సాంస్కృతిక అధికారిక వ్యవస్థలకు గాని లేకపోవడం చాలా విచారకరం.

శ్రీమతి కృష్ణవేణమ్మగారు తండ్రిగారిని గురించి ఇట్లా రాశారు:

"ఆయన గురువు ప్రసిద్ధ పండితులైన పరవస్తు రంగాచార్లయ్యవారలుంగారు. అందుచేతనే మా తండ్రి తన కొడుకుకి గురువుగారి పేరు పెట్టుకున్నాడు. ఆయన గురుభక్తి ఎటువంటిదో మరి వేరే చెప్పడమెందుకు? శాస్త్రాలలోను పురాణాలలోను పాండిత్యమే కాదు. అన్ని విద్యలలోనూ ఆయన ప్రవీణ్యుడు అనడం అసత్యము కాదు. ఆయన చక్కని సంగీతము పాడేవాడు పంచాంగములు గుణించి రాసేవాడు. పర్లాకిమిడి రాజావారు స్థాపించిన నాటక సమాజములో సంస్కృతాంధ్ర నాటకములలో రాజు వేషము వేసేవారు. కుస్తీపట్టేవారు. మద్దెల వాయించేవాడు. వంట అద్భుతంగా చేసేవారు. కవిత్వం చెప్పేవారు. మంత్ర శాస్త్రములో ఆయనకు తెలియని విషయము లేదు. పురాణం అద్భుతంగా చెప్పేవారు''. ఇలా సాగింది ఈ సంస్మరణ రచన. ఇలాటి రచనలు ఈ శతాబ్ది ఉత్తరార్ధంలో కొన్ని వెలువడి వుండవచ్చు. వీటిని గూర్చి తెలుసుకొనే ప్రయత్నం చెయ్యాలి.

1972 లోనే శివశ్రీ బండారు తమ్మయ్యగారి స్వీయ చరిత్ర పుస్తకరూపంలో వెలువడింది. ఈ గ్రంథంలో రెండు భాగాలున్నాయి. మొదటి భాగం మూడు ప్రకరణాలు స్వవిషయం. రెండో భాగం మత సారస్వత సేవలు . పదమూడు ప్రకరణాలు. ఈ గ్రంథం ఇంకా నేను చూడటం తటస్థించలేదు.

ఇటీవలెనే దువ్వూరి వెంకటరమణశాస్త్రిగారి స్వీయచరిత్రం వెలువడింది. ఇంకా ఇదిన్నీ చదివే భాగ్యం నాకు కలగలేదు.

ఈ మధ్యనే 'ఏభై సంవత్సరాల హైదరాబాదు' అనే పేరుతో సుప్రసిద్ధ రాజకీయవేత్తలు, నిర్మాణ కార్యకర్తలు శ్రీ మందుముల నరసింగరావుగారి స్వీయ చరిత్రం వెలువడింది.

శ్రీ కోదాటి నారాయణరావుగారి అనుభవాలూ జ్ఞాపకాలూకూడా ఒక మాసపత్రికలో కొన్ని భాగాలు వెలువడినాయి. పుస్తకరూపంలో రాలేదు.

ఎమ్. ఎస్. రాజలింగంగారు ఇంగ్లీషులో రాయగా కోదాటి నారాయణరావుగారు తెలుగుచేసిన 'కాంగ్రెసు టిక్కెట్టుకై ఇదంతా' అనే గ్రంథాన్ని కూడా స్వీయచరిత్రాత్మక సాహిత్యంలో చేర్చవచ్చు. స్వర్గీయ సంజీవయ్యగారు ముఖ్యమంత్రిగా వున్నప్పటి రాజకీయ వ్యవస్థాత్మకమైన స్థితిగతులు, తమ స్వీయజీవితంలో ఏ విధమైన ప్రభావాన్ని చూపాయో వివరించారు రాజలింగంగారు. రాజకీయ వ్యక్తుల స్వీయచరిత్రాత్మక సాహిత్యంలో ఇటువంటి రచనలకు ప్రముఖమైన స్థానం వుంటుంది.

1969 వ సంవత్సరంలో వెలువడిన భాగవతుల రామారావుగారి స్వీయచరిత్ర, 1974 లో వెలువడిన చిట్టా రామకృష్ణారావుగారి స్వీయచరిత్రలు ఇంకా నేను చూడటం తటస్థించిందిగాదు. ఇదే విధంగా 1952 లోనే ప్రచురితమైన శ్రీ రమణ కవి స్వీయ కథ కూడా నేను చూడటం తటస్థించలేదు.

1965 వ సంవత్సరంలో ఆచంట సాంఖ్యాయన శర్మగారి శతజయంత్యుత్సవ సంఘం వారు ప్రచురించిన ప్రత్యేక సంచికలో మహోపాధ్యాయ శ్రీ ఆచంట సాంఖ్యాయన శర్మగారి సంగ్రహ స్వీయ చరిత్ర వుంది. ఈ స్వీయచరిత్రద్వారా అత్యంత ప్రతిభా సంపూర్ణులైన శ్రీ సాంఖ్యాయనశర్మగారి జీవిత విశేషాలను తెలుసుకోవచ్చు.

* * *

అదృష్టవశాత్తూ ఎక్కడా అచ్చుకాకపోయినా రాత ప్రతుల లోనే కొన్ని స్వీయ చరిత్రలు చూడటమూ కొన్ని చదవడమున్నూ చేశాను. ఇటువంటివాటిలో ముఖ్యంగా పేర్కొనవలసింది కవుకొండల వెంకటసత్యనారాయణమూర్తిగారి ఆత్మకథ. 1942వ సంవత్సరంలో ప్రారంభించి 1977 వ సంవత్సరం వరకూ ఈ ఆత్మకథ రాస్తూ వచ్చారు శ్రీ సత్యనారాయణమూర్తిగారు. వీరి వయస్సిప్పుడు తొంభై సంవత్సరాలదాకా వుండవచ్చు. విశాఖ జిల్లాలో చాలాచోట్ల తెలుగు పండితుడి ఉద్యోగం చేశారు. కాంగ్రెస్ ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ శతాబ్ది పూర్వార్ధంలో విశాఖ

మండలంలోని సామాజిక పరిణామాలన్నీ తెలుసుకొనేందుకు ఈ ఆత్మకథ చాలా ఉపయోగపడుతుంది. ఈ ఆత్మకథ ఉనికినిగూర్చి చెప్పి దీన్ని తీసుకొనివచ్చి నాచేత చదివింపజేసినవారు శ్రీ పురిపండా అప్పలస్వామిగారు. వారిపట్ల నేను చాలా కృతజ్ఞుణ్ణి. 1909 వ సం. ఆగస్టు 8 వ తేది విజయనగరంలో రిపన్ హిందూ థియలాజికల్ హైస్కూలులో తెలుగు పండితుడిగా ప్రవేశించారు. తర్వాత వఝ్ఝల చిన సీతారామశాస్త్రిగారు కూడా అదే స్కూల్లో తెలుగు పండితులుగా ప్రవేశించారు. టేకుమళ్ళ రాజగోపాలరావు గారా స్కూల్లో అప్పుడు ఉపాధ్యాయులుగా ఉండేవారు.

"ఆ దినములలోనే బర్మాలో పనిచేయుచున్న అవటపల్లి నారాయణరావుగారు ఆంధ్రప్రకాశికలో ప్రచురింపబడిన నావ్యాసములను ప్రశంసించుచు నా పేర ఉత్తరము వ్రాయుటేకాక, ఒక పర్యాయము విజయనగరము వచ్చినప్పుడు మా యింటికి వచ్చి నన్ను చూచిరి. మరికొంత కాలమునకు బొంబాయిలో కాశీనాధుని నాగేశ్వరరావుగారు 'ఆంధ్రపత్రిక'ను స్థాపించిరి వారి యేజంటు విజయనగరము వచ్చినప్పుడు మా యింటికి వచ్చి ఆంధ్రపత్రికకు వ్యాసములు వ్రాయుమని నన్ను కోరిరి. నాటినుండి కొంత కాలము ఆంధ్రపత్రికకు కూడ వ్యాసములు వ్రాయుచుంటిని" (పుట 105 – రాతప్రతి).

"1911 సం॥ అక్టోబర్ 22 వ తేదీని కందుకూరి వీరేశలింగము పంతులుగారు విజయనగరము దయచేసిరి. బుర్రాశేషగిరిరావు పంతులుగారి మేడమైని వారి బస. ఆ సందర్భమున భాషా విషయికమగు కొన్ని సభలను ఉపన్యాసములును విజయనగరమున జరిగెను. మరి కొలది దినములలో కొక్కొండ వెంకటరత్నము పంతులుగారు విచ్చేసిరి. వారు ప్రావిన్షియల్ లోవర్ సెకండరీ స్కూలులో సభలుచేసి ఉపన్యాసములు గావించిరి." అని ఈ విధమైన విశేషాలు ఈ ఆత్మకథలో వర్ణించారు సత్యనారాయణమూర్తిగారు. భాగవతుల విశ్వనాథ్‌గారు సత్యనారాయణమూర్తిగారికి హైస్కూలు తరగతులలో సహపాఠి. విశ్వనాథ్‌గారు విజయనగరంలో భారతమాత పత్రికను స్థాపించడం, అందులో సత్యనారాయణమూర్తిగారు వ్యాసాలు రాయడం మొదలైన విశేషాలున్నాయి. భగవంతుని అస్తిత్వాన్ని గూర్చి మహాత్మాగాంధీకి సత్యనారాయణమూర్తిగారు తమ సంశయాలు నివారించవలసిందంటూ లేఖ రాయగా మహాత్ముడు సమాధానం రాశారు. ఆ లేఖ ఈ ఆత్మకథలో ఉదాహృతం. వేపా భీమశంకరంగారనే సంఘ సేవాతత్పరుని జీవిత చరిత్రను సత్యనారాయణమూర్తిగారు ప్రకటించారు. ఈ పుస్తకం వీరు సి. వై. చింతామణిగారికి పంపగా ఆయన అలహాబాదు నుంచి వీరిని ప్రశంసిస్తూ జాబు రాశారు. సి. వై. చింతామణి ఉత్తరం ఈ ఆత్మకథలో మనం చూడవచ్చు.

26, Hamilton Road,
Allahabad
June 23, 1940

Dear Sir,

Allow me to thank you for the copy of your biography of my friend Mr. Vepa Bhimasankaram. I have read it with deep interest and as the result I admire my friend still more than before.

Yours truly,

C. Y. Chintamani.

కపుకొండల వెంకట సత్యనారాయణమూర్తిగారి ఈ ఆత్మకథలో మొదటి ప్రపంచయుద్ధం, రెండో ప్రపంచయుద్ధం, ఆనాటి పత్రికల వార్తలు, తెలుగు దేశంలోని యుద్ధకాల పరిస్థితులు చాలా విపులంగా వర్ణించారు. ఈ గ్రంథం అచ్చువుతే బావుండును. కాని గ్రంథకర్త వయోవృద్ధులు. ఎవరినీ ఆశ్రయించలేరు. ప్రభుత్వానికి కాని, అకాడమీల వంటి సంస్థలకు కాని ఇటువంటి వారిని గూర్చి ఆలోచనచేసే తీరికా, వోపికా కూడా లేవు.

ఇటీవల రాతప్రతిలో నేను చదివిన ఇంకొక స్వీయచరిత్ర శ్రీమతి ఆడవికొలను పార్వతిగారి 'ఒక్క క్షణం కాలాన్ని వెనక్కు తిప్పితే' సుప్రసిద్ధ దేశభక్తులు, స్వాతంత్ర్యోద్యమ వీరులు, నిర్మాణ కార్యకర్తలు, శ్రీ రెబ్బాప్రగడ మందేశ్వరశర్మగారి పుత్రిక శ్రీమతి పార్వతి. నవల, కథ, వ్యాసం, కవిత, విమర్శ పుస్తకరూపాన ప్రకటించి అభిజ్ఞుల మెప్పులందుకున్న ప్రతిభావంతురాలైన రచయిత్రి ఈమె. మోడరన్ రెవ్యూ సంపాదకులైన ఆచార్య నళినీ కాంత భద్రో శ్రీ మందేశ్వరశర్మగారికి స్నేహితులు. వీరికోసం కొవ్వూరు వస్తూ వుండేవారని శ్రీమతి పార్వతిరాశారు. శంకరుల, మార్క్స్, గాంధీజీ సిద్ధాంతాల సమన్వయ రూపమైన శ్రామిక ధర్మరాజ్య సిద్ధాంతాన్ని శ్రీ మందేశ్వరశర్మగారు తమ జీవితకాలంలో ప్రచారం చేశారు. ఆయా విశేషాలన్నీ శ్రీమతి పార్వతిగారు తమ ఆత్మకథలో ప్రస్తావించారు. ఈ ఆత్మకథకు విపులమైన పీఠిక రాయడం నా అదృష్టంగా నేను భావిస్తున్నాను ఈ పుస్తకం అచ్చవుతున్నది. త్వరలోనే వెలువడవచ్చు.

ఇటువంటిదే రాతప్రతిలో చదివిన యింకొక స్వీయచరిత్ర శ్రీ దిగవల్లి వెంకట శివరావు పంతులుగారి 'విన్నంత కన్నంత తెలిసినంత'. శ్రీ శివరావుగారు తమ జీవితానుభవాలూ జ్ఞాపకాలూ అక్షరబద్ధం చేయడానికి సంకల్పించి కొంత భాగమే రాశారు. ఇది అసంపూర్ణంగానే వుండిపోయింది. వారి కుటుంబ చరిత్ర, రాజమహేంద్రవరంలో వీరేశలింగాస్తికోన్నత పాఠశాలలోచేరి మెట్రిక్యులేషన్ దాకా చదవడం వరకే శ్రీ శివరావుగారు తమ జ్ఞాపకాలు రాసి వుంచారు. శ్రీ శివరావుగారు తమ స్వీయచరిత్రను పూర్తిగా రచించి ప్రకటిస్తే పెద్దభట్ల వీరయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు

గార్ల స్వీయచరిత్రలవలె, ఆనాటి కృష్ణామండల సామాజిక రాజకీయ చరిత్రను తెలుసుకోవడానికి ఎంతగానో తోడ్పడగలదు.

శ్రీ దిగవల్లి వెంకట శివరావు గారింట్లోనే ఆయనగారు చదవడానికని ఇచ్చిన శ్రీ వాసిరెడ్డి దుర్గా సదాశివేశ్వర ప్రసాద్‌గారి స్వీయచరిత్రను చూశాను. అవాళ ఎందుకో సదాశివేశ్వరప్రసాద్ గారు కూడా అక్కడే ఉన్నారు. 1899వ సంవత్సరం తెలుగు ఉగాది పర్వదినాన జన్మించారు వీరు. 1922వ సంవత్సరంలో కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు, ప్రకాశం పంతులుగారు జయంతిపురం వెళ్లారు. అప్పుడు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి ద్వారా నాగేశ్వరరావు పంతులు గారికీ, ప్రకాశం పంతులు గారికీ జయంతిపురం రాజావారితో పరిచయం అయింది. తర్వాత దుర్గా సదాశివేశ్వర ప్రసాద్‌గారు ఖాదీ ఉద్యమంలోనూ, కాంగ్రెసు కార్యకలాపాలలోనూ పాల్గొన్నారు. వీరి స్వీయచరిత్ర రాతప్రతి బృహత్పరిమాణంగల సంపుటాలలో శ్రీ శివరావుగారింట నేను చూడటం జరిగింది. వంశ చరిత్రం ఉపోద్ఘాతంలాగా మొదటి సంపుటంలో చేర్చారు. నా రాజకీయ జీవితం — అనే భాగాన్నైనా ప్రచురించాలని వారికి చాలా అభిలాషగా వుంది. బహుశా శ్రీ దుర్గా సదాశివేశ్వర ప్రసాద్‌గారి స్వీయచరిత్రం అచ్చవుతే ఏడెనిమిది వందల పుటల బృహత్పరిమాణం పొందవచ్చు. విశ్వవిద్యాలయాల పరిశోధక శాఖలుకాని, అకాడమీలు కాని ఇటువంటి గ్రంథాలు అచ్చుకావడానికి తోడ్పడటం అత్యంత వాంఛనీయం.

అతి పవిత్ర జీవనులు అత్యంత ప్రతిభాపూర్ణులు కవిగారుగా తెలుగు నాట విఖ్యాతులూ అయిన శ్రీ మారేపల్లి రామచంద్ర శాస్త్రిగారు స్వీయచరిత్ర రాయడానికి సంకల్పించారు కాని హరి ఓం అంటూ ఉండగానే అది ఆగిపోవడం తెలుగుదేశపు దురదృష్టమనే చెప్పాలి. ఆయన స్వయంగా రాసుకున్న ఆ ఒక్కపుట రాతప్రతిని చూసి రాసుకోడానికి నాకిచ్చిన శ్రీ పురిపండా అప్పలస్వామిగారి పట్ల నేను మిక్కిలి కృతజ్ఞుణ్ణి. శ్రీ రామచంద్రశాస్త్రిగారి స్వీయచరిత్రం ఇలా మొదలైంది.

''నా జీవితచరిత్ర (విద్యావిషయికము) 31–1–20 భీష్మైకాదశి.

నేను కృష్ణాజిల్లాలోని కనకవల్లి అను అగ్రహారములో భావ సం॥రమున ఆశ్వయుజ బ ౧౦ మంగళవారమునాడు పుట్టితిని. (౧౮౭౪ సం॥ నవంబరు 3వ తేదీని). వెలనాటి వైదికుడను; మాది కౌండిన్యగోత్రము. అప్పుడు తెలుగు బడులలో చెప్పుచుండిన చదువుకొంటిని. అది ముగిసిన తరువాత కాకినాడలో 'నేటివ్ హైస్కూలు' 'డిసౌజాస్ మెమోరియల్ హైస్కూలు' — అను పేర్లతో ఉండిన ఇంగ్లీషు పాఠశాలలలో 1885 సం॥ మొదలుకొని 1891వ సం॥వాకా చదివి మెట్రిక్యులేషన్ పరీక్షకు వెళ్ళితిగాని, వేపపువ్వు వేసి తగినంత కృషిచేయని కారణముచేత లెక్కలలో తప్పి పోతిని. 1892 సం॥న పాఠశాలలో చదువకుండ పరీక్షకు వెళ్ళదలచి కీర్తిశేషులగు కొచ్చర్లకోట రామచంద్ర వెంకటకృష్ణారావు గారప్పుడు తెలుగు గ్రంథము లచ్చువేయింపనెంచి తాటాకు ప్రతుల నుండి కాగితముమీద వ్రాయించుచు తమకటు చేయగల విద్యార్థి కావలెనని కోరిన మీదట కీర్తిశేషులగు పాడి వెంకటస్వామిగారు నేను ౫వ తరగతిలోను, మెట్రిక్యులేషను తరగతిలోను చదువునపుడు తెలుగు పండితులుగా ఉన్నవారగుటచేత నన్ను తీసికొని వెళ్ళి అప్పగింపగా కొన్ని నెలలు కొన్ని గ్రంథములు వ్రాయుచుంటిని. పరీక్షకు కొంచెము నేర్చుకొంటిని గాన పద్యము లల్లుటకు అలవాటుపడి కొన్ని తెలుగు నాటకములు చదివి, ఆడగా చూచి చిన్న వేషములు ౧, ౨ సారులు వేసి నాటకములమీద ఆసక్తి పుట్టుటచేత తోడి విద్యార్థులు నాటక మాడదలచి, ఏదో నాటకము వ్రాయుమని కోరగా చిన్నతనపు తెగువతో నల నాటకము 1892 సం॥న వ్రాసితిని గాని వారు చెప్పినట్లు చేయుటకు వీలుగాకపోవుటచేత ఎందుకని అది చించివేసితిని. కొంతసాపు వ్రాసిన ప్రతి చించివేయునపుడు దగ్గరనున్న తోడి విద్యార్థి ఒక్కడు రెండు ముక్కలుగా చించిన ఆ పుస్తకము తాను తీసికొనిపోయి తన దగ్గర ఉంచుకొనెను గాని పాపమత డకాల మృత్యువు వాతబడుటచేత తరువాత చూడబుద్ధి పుట్టినను నా కది లభింపలేదు. ఆ యేటనే విఘ్నేశ శతకమును— 'పెరడైజ్ అండ్ పెరి' అనెడి యింగ్లీషు గద్యకావ్యము ననుసరించి పశ్చాత్తాప మహాత్మ్యమును వ్రాసితిని''. ఇక్కడ ఆగిపోయింది శాస్త్రిగారి స్వీయచరిత్ర.

తాపీ ధర్మారావుగారి స్వీయచరిత్ర రాళ్ళు-రప్పలు అసంపూర్ణం—అచ్చు కావల్సిఉంది. త్వరలోనే కావచ్చు.

ఇప్పుడు రాత ప్రతిలో చదువుతున్న ఆత్మచరిత్రం ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్యాగారిది. వెంకటరంగయ్యాగారి జీవితానుభవం ఎంత విస్తృతమైనదో, ఆయన ఆదర్శోపాధ్యాయునిగా, విద్యావేత్తగా, రాజనీతివేత్తగా, ఆయా రంగాలలో ఎంతటి కృషి చేశారో తెలుగు దేశానికి వివరంగా చెప్పవలసిన పనిలేదు. ఆచార్య వెంకటరంగయ్యాగారు తమ స్వీయచరిత్రం రాయడం పూర్తిచేశారు.

వారికి నాపట్లగల దయవల్ల నేను దీనిని ముందుగా చదువుతున్నాను.

ఆచార్య వెంకటరంగయ్యాగారికిప్పుడు తొంభయ్యో సంవత్సరం నడుస్తున్నది. సహస్ర మాసజీవి సాక్షాత్తు దైవసముడని చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు కథలు—గాథల్లో రాశారు. వెంకటరంగయ్యాగారి జీవితంలో ఎంతో వైవిధ్యం వుంది. ఆయన నెల్లూరు, భీమవరం కళాశాలలకు ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం, బొంబాయి విశ్వవిద్యాలయాలలో రాజనీతి శాఖాచార్యులుగా పనిచేశారు. గడచిన తొంభై సంవత్సరాల కాలాన్ని ఆయన నిర్మమంగా సంయమన దృష్టితో సమీక్షా పూర్వకంగా గుర్తుచేసుకోవడం వారి స్వీయచరిత్ర ప్రత్యేకత. డా॥ రాధాకృష్ణ, డా॥ సి. ఆర్. రెడ్డి మొదలైన ప్రఖ్యాతులైన ఉపాధ్యక్షులకాలంలో వెంకటరంగయ్యగారు ఆంధ్రవిశ్వవిద్యాలయంలో రాజనీతి శాఖలో అధ్యాపకత్వం నెరపారు. విజయనగరం సంస్థానానికి దివానుగా పని చేశారు. రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు కాకినాడలో కాలేజీలో ప్రిన్సిపాల్‌గా ఉండగా వెంకటరంగయ్యాగారు చరిత్ర శాఖాధ్యాపకులుగా

అక్కడ కొంతకాలం పనిచేశారు. తమ దగ్గర కళాశాలల్లో చదువు కున్న విద్యార్థులు ఏ యే రంగాలలో ఏ విధమైన ఉన్నతస్థితిని పొందారో వెంకటరంగయ్యగారు తను స్వీయచరిత్రలో స్మరించారు. కృష్ణశాస్త్రిగారు, గరిమెళ్ళ సత్యనారాయణ, మునిమాణిక్యం, గుమ్మిడిదల సుబ్బారావు, దుర్గాబాయి, కళా వెంకట్రావు మొదలైన వారంతా వెంకటరంగయ్యగారు అధ్యాపకులుగా ఉన్నప్పుడు ఆయా కళాశాలల్లో చదువు కొన్నవారే. లక్కరాజు సుబ్బారావు, విస్సా అప్పారావు, సర్ సి. వి. రామన్, సూరిభగవంతం, ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ మొదలైనవారంతా సమకాలికులుగా సహోద్యోగులుగా వుండేవారు వివిధ దశలలో. డా॥వి.కె.ఆర్.వి.రావుగారుకూడా వెంకటరంగయ్యగారితో ఆయన శాఖలోనే అధ్యాపకులుగాపనిచేశారు.

మానవ జీవితంలోని అత్యంత విలక్షణమైన మనః ప్రవృత్తులు, ఈర్ష్యాసూయలు, బలహీనతలు, ఎంతటి విద్యావంతుల లోను, ఉన్నతోన్నతాధికారాలు వహించిన వారిలోనూ ఏవిధంగా విడంబిస్తూ వుంటాయో వెల్లడి అవుతూ వెంకటరంగయ్యగారి స్వీయ చరిత్ర చదువుతుంటే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. సి. ఆర్ రెడ్డి వంటి సమర్థుడైన విద్యావేత్త, కార్యదక్షుడు, విజ్ఞాని కూడా అధికార నిర్వహణలో ఆశ్రిత పక్షపాతానికి, అక్రమాభిమానాలకు ఏవిధంగా లోనవుతూ వచ్చారో, ఆయనలోని స్వోత్కర్ష(?), కపట స్వభావం, కక్షసాధింపు మొదలైనవి అధికార బాధ్యత నిర్వహణలో కూడా ఏవిధంగా తమవంతు పాత్రను నిర్వహించేవో తెలుసుకొంటే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. ఆయన కూడా మానవ మాత్రుడే కదా అంటారేమో. కావచ్చు. కాని ఆస్థాయి వ్యక్తికే ఈ దోషాలు తప్పనప్పుడు తక్కువస్థాయి కుహనా విద్వాంసుల, కపట పండితుల, చపల చిత్తులైన దురధికారుల ప్రవర్తనలు, స్వభావాలు గురించి చెప్పాలా. వెంకటరంగయ్యగారి స్వీయచరిత్రను గురించి మరొకసారి ఎప్పుడైనా వివరంగా రాస్తాను.

తెలుగు సాహిత్యంలో ఆధునిక ప్రక్రియయైన స్వీయచరిత్రను అధ్యయనంచేస్తే మరెన్నో విషయాలు సామాజిక పరిణామ హేతువులు బోధపరచుకోగల అవకాశంవుంది.

ఇటు చూడకు

శ్రీ బండి నాగరాజు

ఓరే కవీ, ఎక్కడరా వెతుకుతున్నావు,
కవితను ?
దేవుణ్ని వెతికినట్టు ఎక్కడ వెతుకు తున్నావు ?
పండితుల మందువాలలోనా —
విమర్శకుల విశ్వాసాలలోనా —
అభ్యుదయ కవుల ఆవేశాలలోనా —
విప్లవ కవివీరుల పడక కుర్చీ పరోపదేశాలలోనా —
గౌరవ పదవు లలంకరించివున్న ప్రముఖుల సుముఖాలలోనా—
మంత్రివర్యుల కంకితాలైన సంకలనాలలోనా —
అగాధమీ ఆస్థాన విద్యాధికార శకార వికారాలలోనా —
విశ్వవిద్యాలయాల పాఠ్యాల అట్టలపైనా —
ప్రొఫెసర్ల సిఫారసులు పొందిన పుస్తకాల పొరలలోనా —
ఎక్కడ ? ఎక్కడని వెతుకుతున్నావు, కవితను ?
ఆవిడ యెప్పుడో యీ మర్మాలను గ్రహించి
బంగరు సంకెళ్ళు విడిపించుకొని
కవితాలత నిరాలంబనంగానైనా మనగలదని
వచ్చేసి చాన్నాళ్లయి పోయింది
నచ్చినచోట నాలుగు పూటలుండి
ఎవరి గౌరవాదరాలకూ, బంగారు పతకాలకూ, పట్టాలకూ
ప్రాకులాడకుండా ప్రాధేయపడకుండా బతుకుతున్నది,చూడు-
పత్రికలనుంచి, రేడియోస్టేషన్లనుంచి తిరిగివస్తున్న
వేలాది వచన కవితలలో —
పండిత విమర్శకుల విప్లవ కవీశ్వరుల యీసడింపులకు
గురైన ఖరీదులేని పిచ్చిరాగితాలలో —
ఇట్లా రాయటం తప్పని వేలెట్టి చూపబడుతున్న
లక్షలాది అక్షర గుచ్ఛాలలో —
కన్నీళ్లు దిగమింగుకొన్న మూగజీవుల ఆవేదనలలో —
పదవులకూ, పతకాలకూ, పట్టాలకూ భయపడుతూ
కాయితంమీదకే ఎక్కలేని లెక్కలేని
విడివిడి తడిపొడి మాటలలో —
సాదాజీవులు మా దాపనలో కవి కట్టిన యాదాలాపాలలో —
చూడు, నీకు కనిపిస్తుందేమో !
కనపడ్డంలేదా ?
ఐతే నువ్వేదో — ఎవరికి అందని —
చాలా గొప్పవాడివై ఉంటావు !
నీకు ఆమెతో పనిలేదు -
నీకు ఇంకా 'గొప్ప-ఆమె' దొరకవచ్చు, అటు వెళ్ళు —
ఇటు చూడకు ! ఆమె యిక్కడ లేదు.

శ్రీ కోడూరి శ్రీరామమూర్తి

గ్రామీణ పరపతి - సమైక్య గ్రామీణాభివృద్ధి

భారతదేశపు ఆర్థికాభివృద్ధి గ్రామాల పురోగతిపైననే ఆధారపడి వుంటుందనే విషయం అందరూ అంగీకరించేదే. దేశం మొత్తంమీదవున్న వర్కింగు పాప్యులేషన్‌లో 72% గ్రామాలలో వున్నది. భారతదేశపు ఆర్థిక సమస్యలన్నింటికీ ప్రధానమైన పరిష్కారమార్గం మనదేశంలోని లక్షలాది గ్రామాలలోనే లభించవలసి వుంది. అది దారిద్ర్య సమస్య అయినా, నిరుద్యోగ సమస్య అయినా వాటి పరిష్కారం గ్రామాలనుండే ప్రారంభం కావలసి వుంది. ఈ దృక్పథంతోనే యిటీవలి కాలంలో 'సమైక్య గ్రామీణాభివృద్ధి' అనే మాట తరుచుగా వినబడుతోంది. ఆరవ ప్రణాళిక ప్రధాన లక్ష్యాలలో సమైక్య గ్రామీణాభివృద్ధిని సాధించడం ఒకటి.

'సమైక్య గ్రామీణాభివృద్ధి' అంటే గ్రామాలు సర్వతోముఖంగా అభివృద్ధిని సాధించడం అని స్థూలంగా అర్థం చెప్పుకోవచ్చు. వ్యవసాయం, విద్య, వైద్యం, మార్కెటింగు, పరిశ్రమలు, మొదలయిన విషయాలన్నింటిలోనూ గ్రామసీమల్లో అభివృద్ధి జరిగినప్పుడు మాత్రమే సమైక్య గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుంది. గ్రామసీమల్లో నిరుద్యోగ సమస్యను తొలగించడం, గ్రామస్థుల కనీసావసరాలు తీరేలా చూడడం, దారిద్ర్యరేఖ దిగువన వున్నవారి శాతాన్ని తగ్గించడం, వారి నిజ ఆదాయాన్ని ఎక్కువచేయడం, మొదలయినవి ఈ విషయంలో సాధించిన అభివృద్ధికి సంకేతాలు అవుతాయి. అయితే—యిదంతా సాధించబడాలంటే గ్రామాల్లోని శ్రామికుల్లో 84.8% మందికి జీవనాధారాన్ని కల్పిస్తున్న వ్యవసాయ రంగాన్ని, గ్రామ ఆర్థిక వ్యవస్థలో ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించే గ్రామీణ, కుటీర పరిశ్రమలను అభివృద్ధి పరుపవలసి వుంది. అయితే—ఈ రంగాల అభివృద్ధి సక్రమమైన రీతిలో లభ్యమయ్యే పరపతిపైననే ఆధారపడి వుంటుందనే విషయాన్ని ప్రత్యేకించి చెప్పనవసరంలేదు. ఈ వ్యాసంలో వ్యవసాయ పరపతికి, గ్రామీణాభివృద్ధికి మధ్యనవున్న సంబంధాన్ని ప్రధానంగా చర్చిస్తాను.

వ్యవసాయరంగంలో ఆధునికీకరణ పెరుగుతున్నకొద్దీ హెక్టేరు ఒక్కంటికి పెట్టుబడి పెరుగుతున్నది. పరపతి ఆవశ్యకత పెరుగుతున్నది. 1955వ సంవత్సరంతో పోల్చి చూచినట్టయితే 1971 నాటికి ఎరువుల వాడకం సగటున హెక్టేరు ఒక్కంటికి 1/2 కిలోనుండి 17 కిలోల వరకూ పెరిగింది. 1951–'66 మధ్యనగల 15 సంవత్సరాల కాలంలో వ్యవసాయరంగంలో అదనంగా జతచేయబడిన ట్రాక్టర్ల సంఖ్య 45,372 వుంటే–1966–'70 మధ్యనగల ఆరు సంవత్సరాలకన్నా తక్కువకాలంలో అదనంగా 92,952 ట్రాక్టర్లు జతచేరాయి. మనదేశంలో వ్యవసాయరంగంలో పెరుగుతున్న పెట్టుబడికి యివి కొన్ని ఉదాహరణలు మాత్రమే. యిలా, వ్యవసాయరంగం ఆధునికీకరణ పొందితే దాని ప్రభావం గ్రామీణఉద్యోగితపై ఏవిధంగా వుంటుంది అనే విషయాన్ని చర్చించడం ఈ వ్యాసం లక్ష్యం కాదుగాని, దీనివలన ఎట్లాంటినష్టమూ సమకూరదనిమాత్రం స్పష్టం చెయ్యదలుచుకున్నాను. యిందుకు జపాన్‌దేశమే తార్కాణం. మనదేశంతో పోల్చి చూస్తే జపాన్‌లో హెక్టేరు ఒక్కంటికి రైతుపెట్టే పెట్టుబడి చాలాఎక్కువ. అయితే—జపాన్‌లో హెక్టేరు ఒక్కంటికి శ్రామికుల వినియోగం మన దేశంలోకన్నా రెండింతలు ఎక్కువగా వుంటుంది. వ్యవసాయాన్ని ఆధునికీరణ చెయ్యడంద్వారా ఉత్పత్తిని పెంచడానికి మాత్రమే గాక, ఉద్యోగితను అధికం చెయ్యడానికి కూడా అవకాశం వుంది. ఈ విషయం అలా వుంచి, కనీసం సంప్రదాయ ధోరణిలో వ్యవసాయం చెయ్యాలన్నా రైతుకు పెట్టుబడి పెట్టడానికి కావలసిన పరపతి సదుపాయాలు అవసరం.

మనదేశంలో సంస్థాపరమైన గ్రామీణ పరపతి—సహకార సంఘాల నుండి, వాణిజ్య బ్యాంకుల నుండి, ప్రభుత్వం నుండి, లభ్యమవుతుంది. గ్రామీణులకు పరపతి సదుపాయాలను అధికం చెయ్యడానికి స్వాతంత్ర్యం లభించినప్పటి నుంచీ ఉధృతమైన ప్రయత్నం జరుగుతూంది. అయినప్పటికీ, యిప్పటికీ గ్రామీణులకు లభిస్తున్న సంస్థా పరమైన పరపతి అధిక శాతంలో లేదు. గ్రామీణుల పరపతి అవసరాలను తీర్చడంలో ఈనాటికీ వడ్డీ వ్యాపారి ప్రధానమైన పాత్రను నిర్వహిస్తున్నారు. మొత్తం గ్రామీణుల్లో 29.2% మంది మాత్రమే సంస్థాపరమైన పరపతి సదుపాయాలను పొందుతున్నారు. మిగతా 70.8% మంది ఆర్థిక అవసరాలను తీర్చేవారు అధిక వడ్డీలను గుంజే వడ్డీ వ్యాపారులే!—యిక, ఈ విధమైన పరపతి సదుపాయాలను పొందుతున్న 29.2% గ్రామీణుల్లో కూడా చిన్న రైతుల సంఖ్య స్వల్పం. 1971–72 సంవత్సరాలలో అఖిలభారత స్థాయిలో చేయబడిన సర్వే పకారం విస్తతరహా రైతులను నాలుగు వర్గాలుగా విభజించడం

జరిగింది. 500 రూ॥ వరకూ వార్షిక ఆదాయం గల వారిని మొదటి వర్గంగానూ, వెయ్యి రూపాయలలోపు, రెండువేల అయిదు వందల రూపాయలలోపు, అయిదువేల రూపాయలలోపు ఆదాయాలు గల వారిని రెండు, మూడు, నాలుగు, వర్గాలుగానూ యిందులో పేర్కొనడం జరిగింది. ఈ పరిశీలన ప్రకారం మొదటి వర్గం వారు 6·2% పరపతిని—రెండు, మూడు, నాలుగు, వర్గాల వారు వరుసగా 6.3%, 10.4%, 14.5%, పరపతిని మాత్రమే సంస్థాత్మక పరంగా పొందగలుగుతున్నారు. 94% నుండి 85.6% వరకూ వీరి పరపతి అవసరాలు వడ్డీ వ్యాపారస్తుల నుండి, ఇతర సంస్థేతరమైన మార్గాల నుండి తీరుతున్నాయి. మనదేశంలోని రైతుల్లో 70% మంది చిన్నతరహా వ్యవసాయ దారులున్నారు· వీరిలో 50.6% మారిజనల్ ఫార్మర్లు కాగా, 19% స్మాల్ ఫార్మర్లుగా వున్నారు. (ఒక హెక్టేరుకి తక్కువ భూమి గలవారిని 'మారిజనల్ ఫార్మర్లు'గానూ, ఒకటి నుండి రెండు హెక్టేర్ల భూమిగల వారిని 'స్మాల్ ఫార్మర్ల' గానూ, వ్యవహరించడం జరుగుతున్నది.)—కాబట్టి వీరికి అందని ఏ తరహా అభివృద్ధి కార్యక్రమమైనా విఫలం అయినట్టుగానే చెప్పుకోవాలి. 'నేషనల్ కమిషన్ ఆఫ్ ఎగ్రికల్చర్' నియమించిన వ్యవసాయ ఋణాలకు సంబంధించిన 'స్టడీటీమ్' అభివర్ణించినట్టుగా వీరు "Neglected partners of Agricultural growth" గా వున్నారు. ఈ పరిస్థితి మారినప్పుడు గాని సమైక్య గ్రామీణాభివృద్ధి సాధించబడదు.

మనదేశంలో లభ్యమవుతున్న సంస్థాపరమైన పరపతి సదుపాయాలను గురించి చెప్పేటప్పుడు—ముందుగా సహకార రంగం గురించి ప్రస్తావించాలి. మనదేశంలో సహకార రంగానికి ఏడు దశాబ్దాల చరిత్ర వుంది· 1977 నాటికి మనదేశంలో 26 స్టేట్ కోపరేటివ్ 'ఎపెక్సు' బ్యాంకులు 253 బ్రాంచీలతో పని చేస్తున్నాయి. సహకార పరపతి రంగానికి ఆయువు పట్టు అయినవి 'ప్రయిమరీ ఎగ్రికల్చరల్ సొసైటీ'లు 1976 నాటికి ఇవి మన దేశంలో 1, 31, 385కు పైగా వున్నాయి. (1974–75, 75–76, 76–77 సంవత్సరాల మధ్య చూచినట్టయితే, వీటి సంఖ్య 153000, 135000, 124000గా తగ్గిపోయింది. అయితే సభ్యుల సంఖ్య మాత్రం అదే సంవత్సరాల 3, 64, 42 నుండి 4.46,44కు పెరిగింది) మనదేశంలో పి. ఎ. సి. లు (ప్రయిమరీ ఎగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీలు) దాదాపుగా 95% గ్రామాలలో తమ 'సేవ' లను అందిస్తున్నాయి. అయితే — వాటి సగటు సభ్యత్వం 253 కు మించిలేదు. యింకా చెప్పాలంటే, ఈ సభ్యుల్లో ఋణాలు పుచ్చుకున్న వారి సంఖ్య 40%కు మించి లేదు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 1977 నాటికి పి. ఎ. సి ల వలన లభించిన (వ్యవసాయ) ఋణాల సదుపాయం హెక్టేరుకు సగటున 62 రూ॥ మించి లేదు. యిది యిట్లావుండగా — ఈ పి. ఎ. సి. ల వలన అధికంగా ఆర్థిక సదుపాయాన్ని పొందినవారు పెద్ద రైతులే అనే సత్యం మరింత నిరాశను కలిగించేదిగా వుంటుంది. 75 – 76 సంవత్సరాలలో ప్రయిమరీ ఎగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీలు యిచ్చిన మొత్తం 1023 కోట్ల రూ॥ ఋణాలలో ఒక హెక్టేరుకు లోపు భూమిగల రైతులు 12% మాత్రమే ఋణాలు పొందగా, ఒకటి నుండి రెండు హెక్టేర్లు భూమిగల రైతులు 18%ఋణసదుపాయాన్ని పొందారు. వ్యవసాయ కూలీలు, భూమిలేని రైతులు పొందిన ఋణాలు 3.9%—ఇక మిగిలిన 66.3% ఋణాలు పెద్ద రైతులే పొందారు. మరొక ముఖ్యమైన విషయం ఏమిటంటే—1973–76 సంవత్సరాల మధ్య ప్రయిమరీ ఎగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీలు యిచ్చిన ఋణాల మొత్తం 32% పెరిగింది. కాని, వీటి వలన ఋణాలు పొందిన సభ్యుల సంఖ్య 16% మాత్రమే పెరిగింది. దంతావాలా కమిటీ నివేదిక ప్రకారంచూస్తే మరికొన్ని ఆసక్తిదాయకమైన విషయాలు కూడా తెలుస్తాయి. మధ్యప్రదేశ్, ఒరిస్సా, మొదలయిన రాష్ట్రాలలో పి. ఎ. సి. ల నుండి ఋణాలు పుచ్చుకున్న సభ్యుల సంఖ్య తగ్గిపోయింది. అదే సంవత్సరాలలో ఉత్తరప్రదేశ్, హర్యానా వంటి రాష్ట్రాలలో పి. ఎ. సి. లు ఇచ్చిన ఋణాల మొత్తం 66% దాకా పెరుగగా ఋణాలు పుచ్చుకున్నవారి సంఖ్యదాదాపుగా నిలకడగా వుండిపోయింది. దీనినిబట్టి చూస్తే, సహకారోద్యమ ఫలితాలు విస్తృత పరిధిలో అందుబాటులోనికి రావడంలేదనీ — కొందరు మోతుబరి రైతులు మాత్రమే దీని వలన ఫలితాలను మరింతగా పొందుతున్నారనీ అర్థం అవుతుంది. పి. ఎ. సి. లలో సభ్యుల సంఖ్య పెరిగి, క్రొత్తగా ఋణాలు పుచ్చుకున్న వారి సంఖ్య పెరిగి, అందులో సన్నకారు రైతుల సంఖ్య అధికం అయినప్పుడు మాత్రమే పి. ఎ. సి. లు తమ బాధ్యతను సక్రమంగా నెరవేర్చినట్టు చెప్పడం జరుగుతుంది. ఈ కృషిలో పి. ఎ. సి లు విఫలం అయితే— సహకారోద్యమంవల్ల మనకు మిగిలేది నిరాశ మాత్రమే! ఈ నిరాశను కొంతవరకూ తగ్గించాలనే అభిప్రాయంతో 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎగ్రికల్చర్' వారి సలహాను అనుసరించి 'ఫార్మర్స్ సర్వీస్ సొసైటీస్ ఎఫ్. ఎస్. ఎస్. లు స్థాపించబడినాయి. 1973 – 74 సం॥నుండి యివి పని చేస్తున్నాయి. సన్నకారు రైతులకు పరపతి సదుపాయాలను అందివ్వడంతో బాటుగా వారికి వ్యవసాయోత్పత్తిని పెంచడానికి తగిన సలహాలను యివ్వడం వంటి బాధ్యతలను కూడా ఈ సంస్థకు అప్పజెప్పడం జరిగింది. పరపతి సదుపాయాలు చిన్న రైతులకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ సంస్థ నిర్వాహక మండలిలో మూడింట రెండు వంతులు బలహీన వర్గాలవారు ఉండాలని నిర్దేశించడం జరిగింది. 1977 నాటికి మన దేశంలో 346 దాకా ఎఫ్.ఎస్.ఎస్.లు అవతరించాయి (ఆంధ్రప్రదేశ్‌లో ఆనాటికి 21 ఎఫ్. ఎస్. ఎస్. లు వున్నాయి) వీటిలో కొన్నింటికి వాణిజ్య బ్యాంకులు, మరికొన్నింటికి కోపరేటివ్‌లు ఆధ్వర్యం వహించాయి. (1980 నాటికి 2520 ఎఫ్.ఎస్.ఎస్. లు దేశమంతటా స్థాపించాలనీ, ఆ తర్వాత ఏడాదికి 1000 చొప్పున క్రొత్త సంఘాలు అవతరించాలనీ ఎన్. సి. ఎ. వాంఛించింది) - అయితే, ఇవి పనిచేస్తున్న తీరుకూడా అంతగా సంతృప్తికరంగా లేదు. 1977 సం॥లో రిజర్వు బ్యాంకుయొక్క

ఎగ్రికల్చరల్ క్రెడిట్ డిపార్ట్‌మెంటువారు 166 ఎఫ్.ఎస్.ఎస్.లను వివరంగా పరిశీలించి వెల్లడించిన అభిప్రాయాలను పరిశీలిస్తే పి ఎ సి లకు ఎఫ్. ఎస్. ఎస్. లకు పెద్ద తేడా వున్నట్టు కన బడదు. ఎఫ్. ఎస్. ఎస్. లను ఏర్పాటు చేయడంలో ప్రధానమైన ఉద్దేశం సన్నకారు రైతులకు పరపతి అందివ్వడంతోబాటుగా వారికి వ్యవసాయోత్పత్తి విషయంలో అనేక విధాలుగా సహకారం అందివ్వాలని — అయితే, రిజర్వు బ్యాంకు పరిశీలించిన 166 ఎఫ్.ఎస్.ఎస్. లలో సగానికిపైగా సంఘాలు సాంకేతిక నిపుణులయిన ఉద్యోగస్తులు లేకుండా పనిచేస్తున్నాయని వెల్లడయింది. ఇక, పరపతిని సరఫరా చెయ్యడంలోకూడా యివి తమ బాధ్యతలను సంతృప్తికరంగా నిర్వర్తిస్తున్నాయనడానికి అంతగా దాఖలాలు లేవు. పరిశీలన చేయబడిన 166సంఘాలలో 75 సంఘాలు వ్యవసాయ కార్యక్రమాల నిమిత్తం మధ్యకాలిక ఋణాలు మంజూరు చెయ్యలేదు. ఇక — దీర్ఘకాలిక ఋణాల విషయం తీసుకుంటే కేవలం 3 సంఘాలు మాత్రమే వాటిని మంజూరు చేశాయి. యిది యిట్లావుండగా, ఎఫ్.ఎస్.ఎస్.ల వలన సన్నకారు రైతులకు అంతగా ప్రయోజనం సమకూరలేదు. ఎఫ్. ఎస్. ఎస్.లు యిచ్చిన ఋణాలలో సన్నకారు రైతులకు లభించింది 38.8% మాత్రమే. ఇక, పి. ఎ. సి.ల మాదిరిగానే వీటిలో కూడా వసూలుకాకుండా మిగిలిపోయిన ఋణాలు పెద్ద మొత్తంలో వున్నాయి. ఎఫ్. ఎస్. ఎస్.లలో 46% సంఘాలు వ్యవసాయక పరమైన ఇన్‌పుట్‌లను సరఫరా చెయ్యడంలేదనీ—80% సంఘాలు వ్యవసాయ మార్కెటింగు కార్యక్రమాలు చేపట్టనే లేదనీ ఈ పరిశీలన వలన తేలింది. ఈ దృష్ట్యా చూస్తే— ఎఫ్. ఎస్. ఎస్ లు గ్రామీణాభివద్ధికై పి. ఎ. సి.ల కన్నా అధిక బాధ్యతలను నిర్వర్తించలేకపోవడం మాత్రమేగాక—పి. ఎ. సి.లలో వున్న లోపాలను కూడా అధిగమించలేకపోయాయని స్పష్టం అవుతుంది.

ఇక—డిస్ట్రిక్ట్ కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకుల పరిస్థితి కూడా అలాగే వుంది. రిజర్వు బ్యాంకు నివేదిక ప్రకారం 1976 జూన్ నాటికి దేశం మొత్తంమీదవున్న డి. సి. బి.లలో 53%కు పైగా బలహీనమైన స్థితిలో వున్నాయని తేలింది. విడివిడిగా రాష్ట్రాలలో డి. సి. బి.ల పరిస్థితిని చూచినట్లయితే,—రాజస్థాన్‌లో 76%, పంజాబ్‌లో 82%, పశ్చిమ బెంగాల్‌లో 100% డిస్ట్రిక్ట్ కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకులు బలహీన స్థితిలో వున్నాయి.

యిలా — దేశంమొత్తంమీద చూచుకుంటే, గ్రామీణులకు పరపతి సదుపాయాలను అందించడంలో సహకారరంగం చాల కీలకమైన పాత్రను నిర్వహించవలసి వున్నప్పటికీ, ఈ బాధ్యతను అందులో ముఖ్యంగ సన్నకారురైతుల అభ్యుదయానికి సంబంధించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించలేకపోయిందనిపిస్తుంది. అయితే, మొత్తంమీద వ్యవసాయ ఋణాల విషయం తీసుకుంటే, అందులో పి. ఎ. సి.లు యిచ్చిన ఋణాల భాగం తక్కువదేమీకాదు. 1976—77 సంవత్సరాలమధ్య చూచినట్టయితే, వ్యవసాయానికి గాను సంస్థాత్మకంగా లభించిన మొత్తం 1497 కోట్ల రూపాయల పరపతిలో 1055 కోట్ల రూ॥ పి. ఎ. సి.లనుండే లభ్యమయింది. ఎన్. సి ఎ. వారి 1978—79 సంవత్సరాల అంచనా ప్రకారం అప్పటికి దేశంలో లభ్యంకాగల రూ॥ 3550 కోట్ల వ్యవసాయ ఋణాలలో 2100 కోట్ల రూ॥ పి. ఎ. సి.ల నుండే లభించనున్నది. అయితే మనం ప్రత్యేకించి పరిశీలించవలసింది యిందులో సన్నకారు రైతుల భాగం ఎంత అని మాత్రమే.

సన్నకారు రైతులకు తగిన పరపతి అందేలా చూడడంకోసం, వారి అభ్యుదయానికి కావలసిన యితర కార్యక్రమాలు చేపట్టడం కోసం, ఈరోజున స్మాల్ ఫార్మర్స్ డెవలప్‌మెంట్ ఏజన్సీ (ఎస్. ఎఫ్. డి. ఎ.),తో బాటుగ ఎమ్. ఎఫ్. ఎ. ఎల్., పి పి. ఆర్. డి., డి. పి. ఎ. పి. మొదలయిన వాటి కార్యక్రమాలు కూడా అమలులో వున్నాయి. అయినా—బక్కచిక్కిన సన్నకారు రైతులో బలిమి కనిపించడంలేదు.

సన్నకారు రైతుకు సాయం చేయడంకోసం యిటీవలి కాలంలో బ్యాంకులు కూడా 'నడుం' కట్టాయి. అయితే—వ్యవసాయ పరపతిని అందివ్వడంలో బ్యాంకుల పాత్ర చెప్పుకోదగ్గంతగా ఏర్పడింది 1969 తర్వాత మాత్రమే. (1969లో దేశంలోని 14 పెద్ద బ్యాంకులు జాతీయం చేయబడిన విషయాన్ని ఈ సందర్భంలో గుర్తుకు తెచ్చుకోవాలి)

ఆలిండియా రూరల్ క్రెడిట్ సర్వే కమిటీ వారి నివేదిక ప్రకారం 1951—'52 సంవత్సరాల మధ్యకాలంలో వ్యవసాయదారులు చేసిన ఋణాలలో 9% మాత్రమే బ్యాంకుల నుండి లభించింది. ఇక, 1961—62 సంవత్సరాల మధ్యకాలంలో పరిస్థితిని పరిశీలించిన 'ఆల్ ఇండియా రూరల్ క్రెడిట్ అండ్ యిన్వెస్ట్‌మెంట్' వారి సర్వే ప్రకారం వ్యవసాయదారులు చేసిన ఋణాలలో బ్యాంకులు యిచ్చింది 6% మాత్రమే అని తెలియవచ్చింది. దీనిని బట్టి మనకు స్వాతంత్ర్యం వచ్చిన ఒకటిన్నర శతాబ్దాల తర్వాత బ్యాంకింగు రంగంలో వున్నపరిస్థితి అర్థం అవుతుంది. ఈ విషయాలను దృష్టిలో వుంచుకుని వాణిజ్య బ్యాంకుల పరపతి విధానంలో అనేకమైన మార్పులు తీసుకుని రాబడినాయి. ఆలిండియా రూరల్ క్రెడిట్ రివ్యూ కమిటి (1969) అభిప్రాయంప్రకారం—''మొదటి పంచవర్ష ప్రణాళిక ప్రారంభం అయినప్పటినుంచి సంస్థాత్మక వ్యవసాయపరపతి లభ్యతను ఎక్కువ చెయ్యడానికి ఎంతగా ప్రయత్నాలు జరిగినప్పటికీ, వ్యవసాయదారులకు లభిస్తున్న పరపతి చాలా తక్కువగా వుంది. అభివృద్ధి చెందని ప్రాంతాలలో ఈ సమస్య మరింతగా వుంది—'' ఈ కారణంచేతనే 1969 లో బ్యాంకుల జాతీయకరణ చేయబడిన తర్వాత, వ్యవసాయ పరపతికి అత్యధిక ప్రాధాన్యతను యివ్వడం జరిగింది. 1969నాటికి, ఆ తర్వాత బ్యాంకులు ఇచ్చిన వ్యవసాయ, గ్రామీణ, ఋణాలను పరిశీలిస్తే జాతీయకరణ జరిగిన తర్వాత వాణిజ్య బ్యాంకుల పరపతి విధానంలో వచ్చినమార్పు మనకు అవగతం అవుతుంది.

1969 జూన్ నెల నాటికి వాణిజ్య బ్యాంకులు వ్యవసాయదారులకు యిచ్చిన ప్రత్యక్ష, పరోక్ష, ఋణాలమొత్తం 162.29

నియమించింది. నెల్లాళ్ళ అతిస్వల్పకాలంలో ఆ సంఘం సమర్పించిన నివేదిక ప్రకారం అదే సంవత్సరం అక్టోబరు నెలలో గాంధీజయంతి నాడు ఆర్. ఆర్. బి.లు ప్రారంభం అయ్యాయి మొదటి దఫాగా అయిదు 'రీజియనల్ రూరల్‌బ్యాంకు'లు ప్రారంభం అయినప్పటికీ, ఈనాడు వీటి సంఖ్య అర్ధశతానికి చేరుకుంటున్నది.

గ్రామీణ బ్యాంకులలో వున్న సదుపాయం ఏమిటంటే—వీటికి పెద్ద బ్యాంకులకు వున్నంత 'ఎస్టాబ్లిష్‌మెంట్' వుండదు. తక్కువ నిర్వహణావ్యయంతో పనిచేస్తాయి. గ్రామ ప్రాంత సమస్యలపట్ల అభిరుచి వున్నవారిని మాత్రమే యిందులో ఉద్యోగాలలోనికి తీసు కొనడం జరుగుతుంది. అందుచేత, ఈ బ్యాంకులు రైతులకు కావలసిన వ్యావసాయిక పరపతిని అందివ్వడం మాత్రమేగాక, వారికి కావలసిన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, మొద లయినవి అందివ్వడానికి—స్టోరేజి, మార్కెటింగు, మొదలయిన విషయాలలో సహాయపడడానికి కూడా అవకాశం వుంది. ఈ బ్యాంకు లకు కావలసిన పెట్టుబడిని కేంద్రప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, ఏదో ఒక పబ్లిక్ సెక్టార్ బ్యాంకు సమకూరుస్తాయి. సన్నకారు రైతులకు, బలహీనవర్గాలకు, ఆర్థిక సహాయం చెయ్యడం లక్ష్యంగా పెట్టుకొని ఈ బ్యాంకులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా లకు, దేశం మొత్తంమీద బ్యాంకింగు వ్యవస్థకు, సమన్వయ కేంద్రాలుగా వుంటాయి.

ప్రస్తుతం మన దేశంలో 48 రీజియనల్ రూరల్ బ్యాంకులు పనిచేస్తున్నాయి. వీటి బ్రాంచీలు 1,405 వున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మూడు రీజియనల్ రూరల్ బ్యాంకులు 184 బ్రాంచీలు కలిగి పనిచేస్తున్నాయి. అయితే, వీటివలన కూడా సన్న కారు రైతుకు ఎక్కువ ప్రయోజనం కలగడంలేదు. జనతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్. ఆర్. బి.లు పని చేస్తున్న తీరుగురించి పరిశీలించవలసిందిగా దంతావాలా కమిటీని నియమించింది. ఆ కమిటీ నివేదికవలన కొన్ని ఆసక్తిదాయకమైన విషయాలు వెల్లడైనాయి. ఈ కమిటీ లోతుగా పరిశీలించిన 12 ఆర్. ఆర్. బి. లలో జారీచేయబడిన మొత్తం ఋణాలలో స్మాల్, మార్జినల్ ఫార్మర్లకు లభించిన పరపతి శాతం ఎందు లోనూ 12% కు మించలేదు. (ఆ 12% కూడా ఒక్క జైపూర్ ఆర్. ఆర్. బి. లో మాత్రమే వుంది)—కొన్ని ఆర్. ఆర్. బి. లలో యిది 1% కూడా వుంది. యిక — వ్యవసాయ కూలీలకు లభించిన పరపతి విషయం తీసుకుంటే ఈ శాతం మరీ నిరాశా జనకంగా వుంది. ఏబ్యాంకులోనూ యిది 7 8%కు మించలేదు. దంతావాలా కమిటీచేత ప్రశంసలందుకున్న జైపూర్ ఆర్. ఆర్. బి. లో కూడా యిది 6 4% మాత్రమే వుంది. ఇక — ఆర్. ఆర్. బి.లు వసూలు చేసే వడ్డీ రేటు కూడా ఎక్కువగా వుంది. ఇది యిట్లా వుండగా, వాణిజ్య బ్యాంకుల మాదిరిగానే ఈ ఆర్. ఆర్. బి. లు కూడా దేశ మంతటా ఒకే విధంగా విస్తరించబడి లేవు. ఉత్తర ప్రదేశ్‌లో 10 ఆర్. ఆర్. బి. లు 173 బ్రాంచీలలో పనిచేస్తూంటే — పంజాబ్, గుజరాత్, మణిపూర్, మేఘాలయ వంటి రాష్ట్రాలలో ఒక్క ఆర్. ఆర్. బి. కూడా లేదు.

ఈ విధమైన లోపాలు కొన్ని వున్నప్పటికీ 'మొత్తం మీద' మన దేశంలోని ఆర్ ఆర్. బి. లు ప్రగతి పథంలోనే వున్నట్లు దంతావాలా కమిటీ భావించింది. ఈ నివేదికలో దంతావాలా కమిటీ 12 బ్యాంకులను వివరంగా పరిశీలించి-'మంచి స్థాయి', 'సాధారణ స్థాయి', 'తక్కువ స్థాయి' అంటూ వాటిని మూడు భాగాలుగా విభజించింది. — 'మంచి స్థాయి'కి చెందిన విభాగంలో అయిదు బ్యాంకులను, 'సాధారణ' విభాగంలో ఆరు బ్యాంకులను, 'తక్కువ స్థాయి' విభాగంలో ఒక బ్యాంకును ఈ నివేదికలో పేర్కొనడం జరిగింది. (ఆంధ్రప్రదేశ్‌లో ఈ కమిటీవారు ఎంపిక చేసిన ఖమ్మం ఆర్. ఆర్. బి 'గుడ్' విభాగంలోనే వుంది.) — ఇక, ఈ సంద ర్భంలో పేర్కొన వలసిన మరొక విషయం ఏమిటంటే, ఆర్.ఆర్. బి. ల సగటు 'క్రెడిట్ డిపాజిట్ రేషియో' 125% వుండగా వాణిజ్య బ్యాంకుల సగటు 'క్రెడిట్ డిపాజిట్ రేషియో' 52% మాత్రమేవుంది. 1977 నాటికి దేశంలోవున్న గ్రామీణబ్యాంకుల్లో సగం వాటిల్లో ఈ నిష్పత్తి 100 దాటింది. దీనినిబట్టి ఈ బ్యాంకులు తాము గ్రామీణ ప్రాంతాలలో వసూలుచేసిన మొత్తాల కన్నా అధిక భాగాన్ని అక్కడి ప్రజలకు ఋణాలుగా అందజేస్తున్నా యని తెలుస్తుంది. అంతేగాక — ఈ బ్యాంకులు తమ బ్రాంచీలను క్రెడిట్ గావ్ 70% దాకా వున్న ప్రాంతాలలోనే తెరవడాన్ని కూడా గమనించవలసి వుంది. ఇవి అన్నీ హర్షదాయకమైన విషయాలే. అయితే, గ్రామీణ బ్యాంకులు యిస్తున్న ఋణ సదుపాయాల వలన సన్నకారు రైతు అభివృద్ధి చెందినప్పుడు మాత్రమే యివి విజయ వంతం అయినట్టుగా లెక్క.

ఇలా చూచుకుంటూ పోతే, యివాళ గ్రామీణ పరపతిని అందించేందుకు కృషి చేస్తున్న సంస్థలు ఎన్నో వున్నాయి. అయినా సన్నకారు రైతు పరపతి అవసరాలు అంతగా తీరడం లేదు. **"water, water, every where but not a drop to drink"** అన్నట్లుగా వుంది పరిస్థితి. గ్రామీణ పరపతికి సంబంధించిన సమస్య పూర్తిగా పరిష్కరించబడాలంటే సహకార రంగం ఆరోగ్య వంతంగా వృద్ధి చెందినప్పుడు మాత్రమే అది సాధ్యమవుతుంది. ప్రభుత్వం గ్రామీణ పరపతి నిమిత్తమై ఎన్ని సంస్థలను స్థాపించినా వాటికి ఏదో విధంగా సహకార రంగంతో సంబంధాన్ని కల్పిస్తున్నది. ఈ సందర్భంలో వాణిజ్య బ్యాంకులకు సహకార రంగానికి మధ్యగల సమన్వయం గురించి కొంచెం ప్రస్తావిస్తాను. పి ఎ. సి. లను వాణిజ్య బ్యాంకులతో కలిపే ప్రయత్నం 1970లో జరిగింది. ఈ పథకాన్ని రిజర్వు బ్యాంకు ఆంధ్రప్రదేశ్, హర్యానా మొదలయిన 11 రాష్ట్రాలలో ప్రవేశపెట్టింది. ఈపథకం ప్రకారం ఆర్థికంగా బలహీనంగా వున్న పి. ఎ సి. లకు వాణిజ్య బ్యాంకులు ఆర్థిక సహాయాన్ని అందిస్తాయి. 1976 నాటికి ఈ పథకం ప్రకారం 3453 పి ఎ సి లకు 11 రాష్ట్రాలలోవున్న 24 వాణిజ్య బ్యాంకులు ఆర్థికంగా సహాయాన్ని అందజేశాయి సహకార రంగం వృద్ధిచెందేటందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది.

అయితే — సహకార సంస్థలు, ప్రభుత్వ సంస్థలు, వాణిజ్య బ్యాంకులు, కలిసికట్టుగా పనిచేసినప్పుడు మాత్రమే గ్రామీణ **పరపతి** అవసరాలు తీరడం జరుగుతుంది. ఇది మంచి విషయమే గాని, వంటవాళ్ళు ఎక్కువ అయినందున వంటకం పాడవకుండా చూడవలసివుంది. వివిధ పరపతి సంస్థలమధ్య సమన్వయానికి తగిన **వ్యూహా**న్ని రూపొందించవలసి వుంది అంతేకాదు—సంస్థాత్మక పరపతి దేశంలోని అన్ని ప్రాంతాలకు సక్రమంగా అందేటట్లు చూడవలసివుంది. దేశంలోని వివిధ ప్రాంతాలలో పరపతి లభ్యత లలో వున్న తీవ్ర అసమానతలకు కారణాలు విచారించి వాటిని సరి చేయవలసివుంది. దేశం మొత్తంమీద సన్నకారురైతు పరిస్థితి మెరుగుపరచవలసివుంది — యిదంతా జరగాలంటే సక్రమమైన మైక్రో లెవెల్ క్రెడిట్ ప్లానింగ్ అవసరం ప్రభుత్వం యిప్పుడు ప్రణాళికా రచనలో ఏరియాప్లానింగుకు అధికప్రాధాన్యతను యిస్తున్నది. ప్రణాళికా రచనలో యిదివరకువున్న సెక్టోరల్ ప్లానింగుకు బదులుగా ''మైక్రో లెవెల్ ప్లానింగ్''కు ప్రాధాన్యత లభించింది. కాబట్టి దీనిని అనుసరించి మైక్రో లెవెల్ క్రెడిట్ ప్లానింగ్ రూపొందించవలసిన అవసరం వున్నది.

ఏరియా ప్లానింగ్ విధానం ప్రకారం ఒక ప్రత్యేకమైన జిల్లాను, బ్లాకును, గ్రామాన్ని, తీసుకుని ఆ ప్రాంతంలోగల ఆర్థిక వనరులను, ఆ ప్రాంతపు ఆర్థిక అవసరాలను గమనించి ప్రత్యేక ప్రణాళికను ఆ ప్రాంతానికి రూపొందించి అమలుచేయడం జరుగు తుంది. ఈ విధమైన ప్రణాళికలు జాతీయ, రాష్ట్ర, ప్రణాళిక లకు అనువుగా రూపొందించబడతాయి. వీటిని అమలు చేయడం ద్వారా ప్రాంతీయ అసమానతలను తొలగించడానికి మాత్రమేకాక, ఆయా ప్రాంతాలు అత్యధికంగా అభివృద్ధి చెందేటట్లు చూడడానికి కూడా అవకాశం వుంది.

'ఏరియా ప్లానింగ్'లో అత్యధిక ప్రాధాన్యతగల 'డిస్ట్రిక్ట్ ప్లాన్' సక్రమంగా అమలు జరగాలంటే 'డిస్ట్రిక్ట్ క్రెడిట్ ప్లాన్' ఆవశ్యకం — వివిధ రాష్ట్రాలలోని జిల్లాలలో అమలు పరిచేందు కయి ప్లానింగ్ కమిషన్ 'డిస్ట్రిక్ట్ ప్లాన్'లయొక్క నమూనాలను ఏవిధంగా రూపొందిస్తుందో, అదేవిధంగా రిజర్వుబ్యాంకు షెడ్యూలు బ్యాంకులకు 'డిస్ట్రిక్ట్ క్రెడిట్ ప్లాన్' నమూనాలను తయారుచేసి యిస్తుంది. ఈ నమూనాలను తయారుచేసే విషయంలో రిజర్వు బ్యాంకుయొక్క 'క్రెడిట్ ప్లానింగ్ సెల్' కోపరేటివ్ బ్యాంకులను, లీడ్ డెవలప్‌మెంట్ బ్యాంకులను, ఎగ్రికల్చరల్ రిఫైనాన్స్ కార్పొ రేషన్, ఖాదీగ్రామీణ పరిశ్రమల సంఘం, మొదలయినవారిని సల హాలు అడుగుతుంది. ఈవిధంగా సమగ్ర గ్రామీణాభివృద్ధికి ఉపక రించేరీతిలో పరపతిని రూపొందించడం జరుగుతుంది.

ఇలా, సిద్ధాంతరీత్యా చెప్పాలంటే — గ్రామీణ పరపతి సమకూరేందుకు ఈ రోజున అనేక అవకాశాలు వున్నాయి. ప్రస్తుతం అమలులోవున్న 'రోలింగుప్లాను' విధానం గ్రామాభ్యుదయానికి ఎంతగానో దోహదకారిగా వున్నది. అయితే, వీటి ఫలితాలు సామా న్యుడిని ఎంతవరకూ చేరుకుంటాయి అనే విషయంలోనే సందేహాలు కలుగుతున్నాయి. ఏది ఏమైనా, ''గ్రామీణాభివృద్ధి'' అనే మాటను ఒక ఎన్నికల నినాదంలాకాక, ఒక మహత్తరమైన యజ్ఞంగా భావించవలసిన సమయం ఆసన్నమైంది. యిన్నాళ్లూ కన్నీళ్లు తుడిచే ధోరణిలో నడిచిన ఈ కార్యక్రమంపట్ల ఈనాడు ప్రత్యేక మైన శ్రద్ధ కనబడుతున్నది. దీనిని ఒక సవాలుగా—తీసుకోవలసిన బాధ్యత ప్రతీ పౌరుడిపైనా వున్నది. ఆనాడే గాంధీజీ ఆశించిన ''సురాజ్యం'' మనకు లభిస్తుంది.

మిణుగురు

శ్రీ అమ్మంగి వేణుగోపాల్

శాస్త్రజ్ఞుని పరిశోధనాగారంనుండి
సగంలోనే బయటపడ్డ టెస్ట్‌ట్యూబ్‌మూన్
జలపాతంలోని విద్యుత్తు సోకీ సోకగానే
గాలితీగపై వెలిగే సీరియల్ బల్బ్
గాలి రాపిడికి చీకటి చెకుముకికి పుట్టిన రవ్వ
భూగర్భంలోని గనుల్లో నిదిస్తున్న రత్నాలకల
యుగయుగాల కాంతి సంగీత స్రవంతిలో స్పందించే లయ
మెరుపు తీగెనుండి రాలిన పువ్వు
భూలోకపు చీకటి మర్మాలను —
తెలుసుకోవటానికి వచ్చిన చుక్కల గూఢచారి
అమాసనాడు కూడా పడకటింట్లో వెలిగి
పార్వతి కోపానికి గురైన శప్తశశికళ
చీకటి గరళాన్ని మింగుతూ
అమృతం పంచుతున్న శివమోహిని
ఫణి చెరను తప్పించుకొని
ఎగిరిపోతున్న రెక్కలమణి
రాలిన తారల కోసం
చంద్రుడు కార్చిన కన్నీటిని దాచుకున్న శుక్తి !

కోట్ల రూపాయలు వుండగా, 1975 నాటికి అది 842. 02 కోట్ల రూపాయలు వుంది. అంటే ఆరు సంవత్సరాల కాలంలో వాణిజ్య బ్యాంకుల ద్వారా మంజూరు చేయబడిన వ్యవసాయ ఋణాల మొత్తం 418.8 శాతం పెరిగింది. బ్యాంకులను జాతీయం చేసిన మొదటి సంవత్సరంలోనే అవి జారీ చేసిన వ్యవసాయ ఋణాల మొత్తం 5.8% పెరిగింది. 1969లో వాణిజ్య బ్యాంకులు ఇచ్చిన వ్యవసాయిక ఋణాలు అవి యిచ్చిన మొత్తం ఋణంలో 5. 5% వుంటే – 1970 జూన్‌కు అది 8% వుంది. 1974 కు అది 10%, '75కు 11%గాను పెరిగింది. అంతేకాదు – గ్రామీణ ప్రాంతాలలో వాణిజ్య బ్యాంకులు తెరిచిన బ్రాంచీల సంఖ్య కూడా పెరిగింది. 1969 నాటితో పోల్చిచూస్తే 10వేల కన్నా తక్కువ జనాభా గల ప్రాంతాలలో తెరచిన బ్రాంచీల సంఖ్య 1832నుండి, 1977 సం॥నాటికి 9536కు పెరిగింది. 76 – 77 సంవత్సరంలో క్రొత్తగా తెరచిన బ్రాంచీలలో 51.6% గ్రామీణ ప్రాంతాలలోనే తెరవడం జరిగింది ఇక, 1977 – 78 సంవత్సరంలో వాణిజ్య బ్యాంకులు క్రొత్తగా తెరిచిన బ్రాంచీలలో 70. 5 % గ్రామ ప్రాంతాలలోనే తెరవడం జరిగింది. ఈ విధంగా చూచి నట్లయితే గ్రామీణ పరపతి విషయంలో వాణిజ్య బ్యాంకులు జాతీయ కరణ తర్వాత ముఖ్యమైన పాత్రనే నిర్వహిస్తున్నట్లు అవగతం అవుతుంది.

అయితే, యిక్కడ మరికొన్ని ముఖ్యమైన విషయాలను కూడా ప్రస్తావించవలసి వుంది. బ్యాంకుల వలన గ్రామ ప్రాంతాలకు లభించిన ఋణ సదుపాయం దేశంలోని అన్ని ప్రాంతాలకూ ఒకే విధంగా లభించలేదు. కొన్ని ప్రాంతాలు వాణిజ్య బ్యాంకుల గ్రామీణ పరపతి విధానం వలన అధిక ప్రయోజనాన్ని పొందితే, మరికొన్ని ప్రాంతాలు అతిస్వల్ప ప్రయోజనాన్ని మాత్రమే పొందాయి. ఆదే విధంగా వాణిజ్య బ్యాంకులు యిచ్చిన పరపతి కూడా సన్నకారు రైతులకు అంతగా అందలేదు. 1975 వరకూ వాణిజ్యబ్యాంకులు యిచ్చిన వ్యవసాయ ఋణాల్లో అధిక భాగం 'సదరన్ రీజియన్' కే వచ్చింది. మొత్తం వ్యవసాయ పరపతిలో 55.93 శాతాన్ని ఈ ప్రాంతంపొందింది. అయితే–'నార్త్ ఈస్టరన్ రీజియన్'కు చెందిన భాగం మొత్తం ఋణాల్లో 1. 43% మాత్రమే పొందింది. (ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మొదలయిన ప్రాంతాలు 'సదరన్ రీజియన్' కు చెందితే – మణిపూర్, మేఘాలయ, నాగాలాండ్, మొదలయిన రాష్ట్రాలు 'నార్త్ ఈస్టరన్ రీజియన్'కు చెందినవి) – ఈ ప్రాంతంలో వాణిజ్య బ్యాంకులు యిస్తున్న వ్యవసాయ ఋణాలు ఇప్పటికీ అంత ప్రోత్సాహకరంగాలేదు. వాణిజ్యబ్యాంకులు అందిస్తున్న వ్యవసాయ పరపతి దేశంలోని అన్ని ప్రాంతాలకు సమానంగా అందేటట్లు చూడవలసి వున్నది. 1976వరకూ మొత్తం స్వల్పకాలిక ఋణాల విషయంతీసుకున్నా అది దక్షిణ ప్రాంతంలో

69.4% వుంటే,–పశ్చిమ ప్రాంతంలో 15%,తూర్పు ప్రాంతంలో 6.5% వున్నది.

ఇక, వాణిజ్య బ్యాంకులు అందజేస్తున్న పరపతి వలన కూడా మోతుబరి రైతులే అధిక ప్రయోజనాన్ని పొందుతున్నారు. సెప్టెంబరు 1976 నాటికి వాణిజ్య బ్యాంకులు యిచ్చిన మధ్య కాలిక ఋణాలలో 61.8% పది ఎకరాల కన్నా ఎక్కువ భూమిగల రైతులకే లభించింది. స్వల్పకాలిక ఋణాలలో కూడా 2.5 ఎకరాలకన్నా రైతులకు 32.4% మాత్రమే లభించింది. యిట్లాంటి గణాంకాలు సన్నకారు రైతుల పరపతి అవసరాలు తీరడానికి యింకా ఎంత కృషి జరుగవలసి వున్నదో తెలుపుతాయి.

ఏది ఏమైనా–బ్యాంకుల జాతీయకరణ తర్వాత గ్రామీణ పరపతి విషయంలో కొన్ని ముఖ్యమైన మార్పులు జరిగాయి అనేది మాత్రం సత్యం. వీటిల్లో ఒకటి–బ్యాంకింగు విధానంలో "ఏరియా ఎప్రోచ్"కి ప్రముఖ స్థానం లభించడం. గాడ్గిల్ స్టడీ గ్రూపు వారు, నారీమన్ కమిటీ వారు చేసిన ప్రతిపాదనల ప్రకారం1969 ఆఖర్లో లీడ్ బ్యాంక్ పథకం అమలులోనికి వచ్చింది. ఈ పథకం ప్రకారం ప్రతీ జాతీయ బ్యాంకుకు, కొన్ని ప్రయివేటు బ్యాంకులకు కొన్ని జిల్లాలను అప్పగించడం జరిగింది. ఆయా బ్యాంకులు ఆయా జిల్లాలలోని పరపతి సదుపాయాలను, "పరపతిలోటు" **(Credit gap)** ను పరిశీలిస్తాయి. అంతేకాదు–ఆయా జిల్లాలలో జిల్లా, రాష్ట్ర, అధికారుల మధ్య సమన్వయ కర్తలుగా పనిచేస్తూ రైతుల ఆర్థిక అవసరాలు తీర్చడం కోసం కృషి చేస్తాయి. ఈ పథకం ప్రకారం బ్యాంకులు కొన్ని గ్రామాలను 'దత్తు' తీసుకొని వాటి సమగ్రాభివృద్ధికై కృషి చేయడం జరుగుతుంది.

'లీడ్ బ్యాంక్' పథకం ప్రారంభించిన తర్వాత మొదటి రెండు సంవత్సరాలూ 'లీడ్ జిల్లాల'లో పరపతి అవసరాలకు సంబంధించిన సర్వేలు చెయ్యడంలోనూ, 'క్రెడిట్ గేప్'లను నిర్ణయించడంలోనూ సరిపోయింది. 1976 నాటికి దేశం మొత్తంమీద వున్న లీడ్ బ్యాంకులు 330 జిల్లాలకు 'గ్రోత్ సెంటర్స్'ను నిర్దేశించుకున్నాయి. రిజర్వుబ్యాంకు 1977–78 వార్షిక నివేదిక ప్రకారం 377 జిల్లాలకు "జిల్లా పరపతి ప్రణాళిక"లను రూపొందించడం జరిగింది

వాణిజ్య బ్యాంకులు దత్తు తీసుకున్న గ్రామాలసంఖ్య పెరుగుతోంది. యిండియన్ ఓవర్సీస్ బ్యాంకువారి వార్షిక నివేదిక ప్రకారం 1976లో ఆ ఒక్క బ్యాంకు 324 గ్రామాలను దత్తత తీసుకోగా 1977లో 375 గ్రామాలను దత్తత తీసుకోవడం జరిగింది. యిది హర్షదాయకమైన విషయమే. అయితే-యిక్కడ ఒక విషయాన్ని గమనించాలి. గ్రామాన్ని "దత్తత" తీసుకోవడం అంటే, అక్కడ బ్యాంకు బ్రాంచీ ఒకదాన్ని స్థాపించడం మాత్రమే కాదు ఆ గ్రామంలోని ప్రజల సమగ్ర వికాసానికి బ్యాంకులు కృషి చేయగలిగినప్పుడు మాత్రమే అది "దత్తత" తీసుకొనడం అనిపించుకొంటుంది. ఈ దృష్ట్యా చూస్తే వాణిజ్య బ్యాంకుల "దత్తత కార్యక్రమం" చాలా నిరాశాజనకంగా కనబడుతుంది.

గ్రామీణ ప్రాంతాలలోని బ్యాంకుల బ్రాంచీలు "డిపాజిట్లు తీసుకునే కేంద్రాలు"గ మాత్రమే పనిచేస్తున్నాయి. అంతేకాదు–గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకులు ఋణాలుగా యిచ్చిన **మొత్తం** సేకరించిన డిపాజిట్లకన్నా కూడా తక్కువగా వుంది. ఆ లెక్కన చూస్తే గ్రామప్రాంతాలలోని వాణిజ్య బ్యాంకులు పల్లె ప్రాంతాలలోని పొదుపులను పట్టణ ప్రాంతాలకు తరలించడానికి మాత్రమే పనికి వస్తున్నాయనిపిస్తుంది! యిది ఎంతటి విచారకరమైన విషయం! నిజానికి, వాణిజ్య బ్యాంకులు గ్రామీణబ్రాంచీలనుండి సేకరించిన డిపాజిట్ల మొత్తాలుకూడా తక్కువే–(1974 సంవత్సరపు వార్షిక నివేదిక ప్రకారం చూచినట్లయితే మొత్తం బ్యాంకు డిపాజిట్లలో 7.8% మాత్రమే (వాణిజ్య బ్యాంకుల) గ్రామీణ బ్రాంచీలనుండి వచ్చింది. అయితే ఆ ఏడు బ్యాంకులు యిచ్చిన ఋణాలలో 5.3% మాత్రమే ఈ బ్రాంచీలవలన యివ్వడం జరిగిందనే విషయాన్ని కూడా ఈ సందర్భంలో గమనించాలి.)

అయితే–గ్రామాలను బ్యాంకులు దత్తత తీసుకోవడంవలన సత్ఫలితాలు లభించిన సందర్భాలు కూడా లేకపోలేదు. 'కెనరా బ్యాంకు' జనరల్ మానేజర్ శ్రీ యస్. ఆర్. ప్రభు ఒక అర్థశాస్త్ర పత్రికలో వ్యాసం రాస్తూ గ్రామాలను దత్తత తీసుకోవడం విషయంలో వారి బ్యాంకు చేస్తున్న కృషిని గురించి వివరంగా రాశారు. ఈ బ్యాంకు బ్రాంచీలలో ఒకటి కర్నాటక రాష్ట్రంలోని ఒక గ్రామాన్ని దత్తత తీసుకుందట. ఆ గ్రామంలో బ్యాంకువారు అందజేసిన ఋణసదుపాయాల ఫలితంగా ఆ గ్రామంలోని పశువుల సంఖ్య 20 నుండి 200 వరకూ పెరిగిందట. వ్యవసాయానికి ఎరువుల లభ్యత పెరిగిందట. ఇదివరకు ఉదయం 8 గం॥ వరకూ నిద్రలేవడం ఎరుగని గ్రామస్తులు క్రొత్తగా ఏర్పడిన బాధ్యతవలన 6 గం॥కే నిద్రలేవడం ప్రారంభించారట. వారి ఆదాయాలు, తద్వారా బ్యాంకు పొదుపు మొత్తాలూ, పెరిగాయట. యిదేవిధంగా మరో గ్రామంలో బ్యాంకు ఉద్యోగస్తులు చేసిన కృషిఫలితంగా గ్రామస్తులు త్రాగుడు మానేసి డబ్బును పొదుపుచేయడం ప్రారంభించారట. బ్యాంకు ఋణసదుపాయంతో ఒక ప్రయివేటు డాక్టరు గ్రామంలో ఒక ఆసుపత్రి తెరిచాడట. గ్రామీణ పరపతికీ, సమైక్య గ్రామీణాభివృద్ధికీ, మధ్యవున్న సంబంధాన్ని చర్చించేటప్పుడు యిట్లాంటి ఉదాహరణలు ఆశాజనకమైన కాంతిరేఖలా కనబడతాయి.

గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో వాణిజ్య బ్యాంకులు ఆశించినంత ప్రగతిని సాధించలేకపోవడానికి గల కారణాలలో వాటికి "ఎస్టాబ్లిష్‌మెంట్ ఛార్జీలు" ఎక్కువగా వుండడం ఒకటి. చిన్న గ్రామాలలో వాణిజ్య బ్యాంకుల బ్రాంచీలు తెరవడం వ్యాపారరీత్యా మంచిది కాదనే భావమూ, బ్యాంకు ఉద్యోగులందరికీ గ్రామ ప్రజల సమస్యలపట్ల అవగాహన వుండేందుకు అవకాశం లేనే సమస్యా, చిరకాలంగా ఉన్నవి. వీటి నన్నింటినీ దృష్టిలో వుంచుకుని కేంద్ర ప్రభుత్వం 1975 జూలై ఒకటవ తేదీన (అత్యయిక పరిస్థితి ప్రకటించిన వారం రోజుల తర్వాత) 'నరసింహమ్ స్టడీ గ్రూప్'ను

భారతీయ సాహిత్యంలో ఒక మైలురాయి - నజ్రుల్ 'బిద్రోహి'

భారతీయ సాహిత్యం అనంతం. భాషలు వేరైనప్పటికీ సాహితీ పరిణామ దృష్ట్యా భారత సాహిత్య దర్శనం చేస్తే మనకు గోచరించేది ఏకత్వమే. ఆధునిక సాహిత్య రంగంలో ఆసేతు హిమాచల పర్యంతం కవితా విప్లవాన్ని సాధించిన ప్రక్రియ అభ్యుదయ కవిత్వము. ఈ అభ్యుదయ కవిత్వానికి పునాది వంటిదే కాజీ నజ్రుల్ ఇస్లాం 'బిద్రోహి' అనే గేయం. వీరి కవితా ప్రభావం ఇన్ని భాషలపై ప్రసరించటానికి కారణం నిర్జీవమైన సంప్రదాయ విచ్ఛేదానికి సజీవమైన కవితా లక్షణాలనే జంఝూమారుతం ద్వారా సాధించటమే. శ్రీనివాస అయ్యంగారన్నట్లు "Literature is a living and growing thing - it changes, sheds waste matter, grows wings, takes off and lands again only to start on its flight once more - responding to the breezes of change while also preserving its sense of direction often trafficking with innovation, sometimes plunging into revolt yet never breaking loose from the moorings of the living tradition.

ఏక కేంద్ర వృత్తంలాంటి రచనలతో విసుగెత్తిన పాఠకులకు భావకవిత్వం ఊరట కలిగించింది. అయితే భావకవిత్వమూ ఎక్కువ కాలం నిలవలేకపోయింది. భావకవుల సొంత గోడు పాఠకులను చిర్రాకెత్తించింది. అందుకే లోక బాధను తమ బాధగా చేసుకొన్న అభ్యుదయ కవిత్వం ప్రజల నాకర్షించింది. ఈ పరిస్థితి తెలుగు సాహిత్యంతోపాటు భారతీయ సాహిత్యమంతటా ఒకటే. సాహిత్యం ఎన్ని పరివర్తనలు చెందినప్పటికీ మౌలికమైన సాహితీ విలువల విషయంలో కవి నిర్లక్ష్యంచేస్తే ఆ కవిత్వం మఘలో పుట్టి పుబ్బలో క్షీణించక తప్పదు. ఎంతో విప్లవాన్ని ప్రక్రియాపరంగా సాధించిన నజ్రుల్ 'బిద్రోహి' సాహిత్య విలువల విషయంలో చాలా జాగరూకత వహించినందువలననే ఆయన సాహితీ నిర్మాణం చెక్కు చెదరకుండా నిలవటమేగాక భారతీయ సాహిత్యంలో పేరు ప్రతిష్ఠల నార్జించిన యువకవులందరూ ఆయన గేయాలను చదివి తన్మయత్వము చెంది తమ కవితలకు నజ్రుల్ సాహిత్యాన్ని ఆదర్శ ప్రాయంగా చేసుకొన్నారు.

క్రీ. శ. 1899 లో జన్మించిన నజ్రుల్ 21 సంవత్సర మన్నా నిండకుండానే 'బంధన్ హారా' (దాస్యవిముక్తి) అనే నవలను ప్రకటించి వంగదేశంలో పేరు ప్రతిష్ఠల నార్జించారు. ఆ తర్వాత పుంఖాను పుంఖాలుగా వ్యాసాలు, గేయాలు ప్రకటించారు. దేశభక్తి కవిగా కూడా వీరికి మంచి కీర్తి ప్రతిష్ఠలున్నవి. వీరి

చల్ చల్ చల్
ఊర్ధ్వగగనె బాజె మాదల్
నిమ్నె ఉతలా ధరణితల్
అరుణ్ ప్రతేర్ తరుణ్ దల్
చలే చలే చల్ (సంధ్య 1929)
(పదండి ముందుకు పదండి ముందుకు
గగనతలంలో ఆకాశం వినదించింది
భూతలమంతా కుతూహలంతో కనిపించింది
అరుణారుణ యువసైనికులారా
పదండి ముందుకు పదండి ముందుకు)

అనే గేయం వంగప్రజల్లో నినదించింది. ఇవిగాక గజల్ అనువాదము, బిరహ బిధుర, మర్మి మొదలైన ప్రశస్తమైన రచనలు చేసినప్పటికీ వీరి 'అగ్నివీణ' (కవితా సంకలనం) చెప్పుకోదగింది. ఇందులో 'బిద్రోహి', 'షాత్ ఇల్ అరాబ్', 'ప్రళయోల్లాస్', మొదలగు గేయాలు కూర్చబడ్డవి. ఇందులోని 'బిద్రోహి' గేయం భారత దేశంలోని యువకవులందర్నీ ఆకర్షించి ఉద్రూత లూగించింది. ఈ గేయాన్ని పాఠకులకు తొలిసారి పరిచయం చేయటమనే గౌరవం 'బిజలి' అనే బెంగాలి వార పత్రిక (6, జనవరి 1922) కు దక్కింది. ఈ గేయం ప్రకటించిన తర్వాత నజ్రుల్ ఇస్లాం వంగదేశంలో 'బిద్రోహి కవి' (Rebel poet) గా ప్రసిద్ధి చెందాడు.

విశ్వనీలాకాశం పొడ చుకొని
ఉజ్వల గ్రహాణాలపై విజృంభిస్తా
హద్దుమీరి భూతలానికి, ఉపరితలానికి
పరిహద్దులు చీల్చేస్తా
ఈశ్వరుణ్ణైనా, సర్వేశ్వరుణ్ణైనా
అడ్డుపడను! అధిగమిస్తా!
అచంచలంగా ఆరోహిస్తా
అందరికంటే అనంతంగా నిలుస్తా
(బిజలి 22 పౌష్య 1328 బ.శ.)

అని ప్రారంభింపబడిన ఈ గేయానికి విశ్వకవి రవీంద్రునిఆశీర్వాదం లభించింది. ఈ భావ విప్లవ శంఖారావం మొదట వంగదేశంలోనే మారుమ్రోగినా అచిరకాలంలోనే ఇంగ్లీషులోకి అనువదింపబడటం వలన భారతీయ సాహితీ వేత్తల్లో సంచలనాన్ని కలిగించింది. కావ్యత్వం పేరుతో అనుకరణ సహజమైన పరిధులు దాటడానికి మీనమేషాలు లెక్కిస్తున్న తరుణంలో వీరి 'విద్రోహి' సాహితీ లోకానికి నవచైతన్యాన్ని ప్రసాదించింది.

''మండుటెండ లావిర్భావానికి మొదటి వాణ్ణి
జటాజూటార్భాట నటరాజును''

నవ్యకవితా వ్యామోహం, నూతన ప్రయోగావేశం మాత్రమే కలిగిన యువ కవులు తెలుసుకోవాల్సిన విశేషాలు పై రెండు పాదాల్లో చాలా వున్నై. ఏదో విధంగా నూతన ప్రక్రియా వైవిధ్యాన్ని ప్రదర్శించడమే నూతనత్వం అనుకోగూడదు. పాతను విసర్జించి నప్పటికీ కొత్త సృష్టియందు ఉజ్వలత. కాలానుగుణమైన చైతన్యము, కావ్యత్వము పుష్కలంగా వుండాలి. లేకుంటేనూ తన సృష్టికి అర్థం లేదు. చాలా మంది నవ్య కవుల్లో ఈ దృక్పథం లేనందున్నే దేశంలో సృష్టింపబడ్డ సాహిత్యంలో ఏదో వంతైనా బతికి బట్టగట్టలేక పోతుంది. ఈ దురవస్థ దేశానికి తప్పాలంటే నూతన పథగామియైన నజ్రుల్ వంటి సాహితీ స్రష్టల భావాల్ని చక్కగా అర్థంచేసుకోవలసి వుంటుంది. కాలదోషం పట్టిన లాక్షణిక అను శాసనాల్ని ఎందుకు విధ్వంసం చేయాలి ? అనే ప్రశ్నకు పై ఉదాహృత పాదాలు చక్కని సమాధానాన్నిస్తవి. శివతాండవం లోక వినాశానికే. కాని నశించిన తదుపరి వినూత్న సృష్టి జరుగుతుంది. అంతే అంతవరకూ వున్న సృష్టిపై ద్వేషంతో కాదు. సృష్టి ప్రయోజనం దెబ్బతిన్నప్పుడు, నూతన సృష్టి తప్పనిసరి అయినప్పుడు మాత్రమే నటరాజు ఈ పనికి ఉద్యమిస్తాడు. ఇదే విధంగా 'శివతాండవం' అనే ప్రతీక ద్వారా కవి నిర్జీవమైన సంప్రదాయాల్ని నాశనం చేసి ఉత్తేజకరమైన నూతన సంప్రదాయాల్ని నెలకొల్పుతానని స్పష్టంగా ప్రకటించాడు. ఈ విషయాన్నే శ్రీశ్రీ మాటల్లో చెబుతే చక్కగా అర్థమౌతుందేమో.

''సంప్రదాయాలను ధ్వంసం చేయడం కళాశాలికొక క్రీడ కాదు. ఎంతో అవసరం కలిగి, వీటి నాశనం వల్లనే లోకాన్ని ముందుకు తీసుకవెళ్ళవలసి ఉంటుందన్నపుడే అతడిందుకు ఉద్యమిస్తాడు. తన ప్రజ్ఞాతిశయం వల్ల నూతన సంప్రదాయాలను విధిస్తాడు.''

అందుకే సంప్రదాయ విధ్వంసకుడనే దృష్టితో ఈ వంగ కవిని చూడకూడదు. నూతన సాహిత్యానికి సృష్టికర్తగా, ఆత్మాశ్రయమనే కీకారణ్యం నుంచి కవిత్వాన్ని కాపాడిన జాతీయ సాహిత్య యుగకర్తగా మనం స్మరించాలి. అప్పుడే నజ్రుల్ ప్రబోధించిన తిరుగుబాటు తత్వంలోని విశిష్టత మనకు అర్థమౌతుంది. ఈ క్రింది పాదాలకు అర్థం కూడా పై విధంగా తత్వ దర్శనం చేసినప్పుడే మనకు స్ఫురిస్తుంది.

తిరుగుబాటును
విశ్వదేవత విప్లవాగ్ని సుతుణ్ణి !

తననూ తన కవితాధారద్వారా నూతన సాంఘిక వ్యవస్థను ప్రబోధించటమే కవి ధ్యేయం. ఆత్మ విశ్వాసంతో, ఆశా వాదంతో తన కృషిని కొనసాగిస్తానని కవి ఈ గేయం ద్వారా ప్రతిన పట్టాడు. ఆనాటి సమాజ పరిస్థితులకు అవసరమైన కవిత వాణిని తీర్చి దిద్దటంలో సిద్ధహస్తుడుగా మనకు కన్పిస్తాడు. అగ్ని యమదగ్ని మొదలగు ప్రతీకలతో తన నూతన సృష్టి పవిత్రతను, ప్రత్యేకతను స్పష్టీకరించాడు. తాను పరశురాముడై లోకంలోని అవినీతిని తన పరశువుతో నిర్దాక్షిణ్యంగా నిర్మూలిస్తానని ప్రతిన పట్టాడు. ఈ సృజనాత్మక నిర్మాణానికే దేశంలోని సహృదయ సాహితీవేత్తలు స్పందించి పొయ్యారు.

అణచబడినవారి ఆక్రందనలు
గాలినీ గగనాన్నీ పగలగొట్టనినాడు
కన్నీటి కళేబరాల కత్తికటారు
దారుణ మారణ హోమాగ్నిలో ద్రవించనినాడు
విశ్రమిస్తా ... ...

ఇది 'విద్రోహి' గేయానికి ఆయువుపట్టు. అభ్యుదయ కవితా సిద్ధాంతానికి పట్టుకొమ్మవంటి పాదాలు ప్రజా కవిత్వము, ప్రగతిశీలక కవిత్వము, విప్లవకవిత్వము అని పలు ప్రాంతాల్లో పలు విధాలుగా పిలిచినప్పటికి కవితా ధ్యేయము మాత్రము సాహిత్యము ద్వారా సమ సమాజ నిర్మాణమే. 1936 ఏప్రియల్ 10వ తేదీన మున్షీ ప్రేమచంద్ అధ్యక్షతన జరిగిన అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘప్రథమ సమావేశంకూడా ఇంచుమించు ఈ భావాల్నే ప్రకటించింది. జవహర్‌లాల్ నెహ్రూ, విశ్వకవి రవీంద్రులు ఈ సంఘాన్ని ఆశీర్వదించారు. రెండవసారి జరిగిన సమావేశానికి రవీంద్రనాథటాగూర్ అధ్యక్షత వహించారు. తెలుగుదేశమునందలి అభ్యుదయ రచయితల సంఘము,[2] మహారాష్ట్రలోని 'రవికిరణ మండల్', హిందీరాష్ట్రాలలోని ప్రగతివాద రచయితలసంఘము, ఒరిస్సాలోని పజాకవిత్వసంఘము, మలయాళభాషలోని పురోగమన వాద రచయితల సంఘము, తమిళనాడులోని విప్లవ రచయితల సంఘము[3] మొదలగు వారందరూ దాదాపు నజ్రుల్ ఇస్లాం 'విద్రోహి'[4] గేయ ప్రభావానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో లోనైనవారే. అందుకే 'విద్రోహి' భారతీయ సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించడమేగాక ఒక జాతీయ కవితా ఉద్యమానికి పునాదిగ నిలిచింది.

అభ్యుదయ రచయితలపై మార్క్సిస్టు ప్రభావం అపరిమితంగావున్నందున 'నజ్రుల్' విద్రోహి ద్వారా సూచించిన విప్లవం మార్క్సు సిద్ధాంతం ఒకటేనా? అని ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉంది. నజ్రుల్ కవితా జీవితంపై కమ్యూనిష్టు ఉద్యమ ప్రభావం ఉన్నప్పటికీ, విధ్వంసం ద్వారా నూతన సృష్టి అనేదే తన ప్రబోధానికి మూలసూత్రమైనప్పటికీ పరస్పర విరోధశక్తుల సంఘర్షణ, విరోధ వైరుధ్య సూత్రములు మొదలగునవి ఇందులో మనకు

కల్పించవు. అవినీతిపరులను ద్వేషించుట, విమర్శించుట తొలినాటి గేయాల్లో మనకు కన్పించదు.

విధాతను — విధ్వంసాన్ని
వరప్రాప్త శీలాన్ని — అహితశపదహనాన్ని
విశ్రాంతి నిర్మూలనకు నిమిత్తున్ని !

అని చెప్పటంవలన మార్క్సు సిద్ధాంత స్వరూపాన్ని ద్వేషరహితంగా జుగుప్సా రహితంగా ప్రతిపాదించ్చాడని చెప్పవచ్చు. ఆయితే ఆతర్వాత క్రమ పరిణామం చెంది మార్క్సు సిద్ధాంతానికీ, దీనికీ తేడా లేకుండా పోయింది. దీనికి అనేక కారణాలతోపాటు నజ్రుల్ జీవితంకూడా ఒక కారణమని చెప్పొచ్చు.

తన భావాలను ప్రచారంచేయుటానికి 1922లో 'ధూమకేతు' అనే పత్రికను ఈ మహాకవి స్వయంగా స్థాపించాడు. ''ప్రజలను జాగృతం చేయడానికి, జీవిత సత్యాలనుంచి చమత్కారంగా తప్పుకోవడానికి, చమత్కారంగా ప్రయత్నించేవారికి నిర్దాక్షిణ్యమైన మేలుకొల్పుద్వారా చలనం కలిగించటం'' దీని స్థాపనోద్దేశంగా ప్రకటింపబడింది. విశ్వకవి రవీంద్రుడు

''జాగియ డిరి చమక్ మేరి
ఆచ్ఛజారా అర్ధచేతన్''

(ఇంకా నగర నిద్రలో సతమతమౌతున్న వారిని తన ఆకస్మిక కాంతి కిరణాలతో జాగృతం చేస్తుంది)

అని ఆశీర్వదించారు. ఈ పత్రికద్వారా ఈ కవి ఉద్వేగపూరితమైన హృదయం చైతన్యవంతమైన అక్షరరూపం ధరించి దిక్ దిగంతాలలో నవ్యసాహిత్య శంఖారావాన్ని వినిపించింది. అయితే కవిగా జీవితాన్నారంభించిన నజ్రుల్‌పై రాజకీయపార్టీముద్ర పడటంవలన పరిస్థితులలో మార్పు వచ్చింది. 1925 డిశంబరు 25న కమ్యూనిస్టు భావాలు కలిగిన రాజకీయ నాయకులు లేబర్ స్వరాజ్ పార్టీని స్థాపించి తమ భావాలను ప్రచారం చేయడానికి 'లాంగల్' అనే పత్రికను స్థాపించి నజ్రుల్‌ను సంపాదకునిగా నియమించారు. ఈ పత్రికద్వారా సామాన్య ప్రజల సమస్యలను వస్తువుగా స్వీకరించి అనేక గేయాలను ప్రకటించారు. ఆతర్వాత (25 సెప్టెంబరు 1926) ఈ పత్రికపేరును 'గణవాణి'గా మార్చడంతో ఇది సంపూర్ణంగా మార్క్సిస్టు ప్రచార పత్రిక అయింది. కవిగా పేరొందిన నజ్రుల్‌పై రాజకీయ వ్యక్తిత్వపు ముద్రపడింది. ఆరోజుల్లోనే ప్రకటింపబడిన 'International' అనే గేయం ('ప్రపంచ కార్మికుల్లారా లేవండి' అనే నినాదంతో) మార్క్సు సిద్ధాంత ప్రభావానికి సంబంధించిందే. దీనికితోడు అంతర్జాతీయ రాజకీయ, సాహిత్య కారణాలనేకం. అక్టోబరు విప్లవ (1917) ప్రభావంకూడా అభ్యుదయ కవులపై గాఢంగాఉంది. 'అంతర్జాతీయ పురోగామి రచయితల సంఘం' 'ఆఫ్రో ఆస్యన్ రచయితల సమాఖ్య మొదలగు అంతర్జాతీయ సాహితీ సమాఖ్యలతో సంబంధాలుకూడా మార్క్సు ప్రభావిత కవిత్వంపైకి తీసుకరావటానికి తోడ్పడ్డయ్. సాహిత్యరంగంలో ప్రఖ్యాతి వహించిన హిందీరచయిత యశ్‌పాల్, బెంగాల్ కవి మనోరంజన్‌వంటి ప్రముఖులు కమ్యూనిస్టుపార్టీ సభ్యులుగా కావటం, అప్పటి అభ్యుదయ కవుల్లో అనేకమంది టాల్‌స్టాయ్ సాహిత్యాన్ని అనుసరించటం జరిగింది. కవితా సిద్ధాంతాలు ఎన్ని ప్రభావాలకు లోనైనా ఇబ్బందిలేదుగాని ప్రచార సాధనంగా మారితే మాత్రం నిర్జీవమైపోక తప్పదు. ఈ విధంగా ఆలోచించినప్పటికీ బిద్రోహి కవిత్వానికీ, తదనంతర ప్రభావాల ద్వారావచ్చిన మార్పుకూ ఎంతో అంతరముంది. అందుకే అభ్యుదయ కవితా ప్రస్థానంలో 'బిద్రోహి' పొయెట్రీ ఒక మలుపు వంటిది. ఈ మలుపులో ప్రవేశించకుండా 'అభ్యుదయాన్ని' దర్శించడమంటే నేల విడిచి సాముచేయటమే అవుతుంది. ఎందుకంటే 'బిద్రోహి' కేవలం కవిత్వంకాదు. ఇది ఒక నూతనోత్తేజం — యుగాంతపునాటి శివుని ప్రళయతాండవం—అవినీతికి సింహగర్జనం—నవ సమాజానికి నాందీవాచకం—నవ్య కవితోద్యమానికి ఉషః కిరణాలు—ఆకాశంలో విహరించే కవిత్వాన్ని అందుబాటులోకి తీసుకరావటానికి ప్రయత్నించిన తిరుగుబాటు.

అధోజ్ఞాపికలు

1 ఇందు ఉదహరించిన గేయాలు నజ్రుల్ 'అగ్నివీణ'(1922) లోని 'బిద్రోహి' పొయెట్రీకి అనువాదమే అయినప్పటికీ భావక్లిష్టత ఏర్పడిన కొద్ది సందర్భాల్లో శ్రీ బసుధా చక్రవర్తిగారి ఇంగ్లీషు అనువాదాన్ని అనుసరించడమైనది.

2 తెలుగు సాహిత్యంలో అభ్యుదయ రచయితలలో అగ్రగామిగా నిర్ణయింపబడిన శ్రీ శ్రీ 'మరో ప్రపంచం' 'మహాప్రస్థానం' మొదలగు రచనల్లో నజ్రుల్ 'బిద్రోహి' ప్రభావాన్ని శ్రీ సి. నారాయణరెడ్డిగారు సోపపత్తికంగా నిరూపించారు. (చూ. పేజీలు 546, 582, 583) ప్రథమ ముద్రణ 1967.

3 'దక్షిణ ప్రాంతమున తమిళములో తప్ప మిగిలిన అన్ని భాషలలో అభ్యుదయ కవిత్వము ఉద్యమ రూపమున ప్రవహించినది' అని శ్రీ సి. నారాయణరెడ్డిగారు పేర్కొన్నారు. (చూ. ఆధునికాంధ్ర కవిత్వము — సంప్రదాయములు ప్రయోగములు, పేజి 588)

కాని ఇటీవలి కాలంలో తమిళనాడు విప్లవ రచయితలపై (మీరా మొ॥ కవులు) నజ్రుల్ 'బిద్రోహి' ప్రభావం కలదు.

4 . బిద్రోహి : The Rebel.

సంప్రదించిన గ్రంథములు

1 The Rebel and other poems (1974) Sahitya Akademy; New Delhi.

2 Kazi Nazrul Islam (1973) Sahitya Akademy, New Delhi.

3 October Revolution - Impact on Indian literature (1978) Sterling Publishers (P) Ltd.

4 Indian literature Since Independence (1973) Sahitya Akademy; New Delhi.

5 ఆధునికాంధ్ర కవిత్వము — సంప్రదాయములు — ప్రయోగములు (1967) డా॥ సి. నారాయణరెడ్డి.

6 సమకాలీన భారతీయ సాహిత్యము (1965) సాహిత్య అకాడమి; న్యూఢిల్లీ.

7 రచన (1970) యువభారతి; హైదరాబాదు.

8 వ్యాసక్రీడలు (1973) శ్రీ శ్రీ.

తుఫానులో ఏకాంతం

శ్రీ శైలకుమార్

ఇంకా ఎందుకు పిండుతారీ గుండెను
 ఆఖరికన్నీటి చుక్కకూడా ఆవిరై
అనంతానికి హారతి పట్టిందే !
యింకా ఏమిటి మీ ఆశ.
రాకండి లోనికి
బూజుపట్టి, శిథిలమైపోయి
చిహ్నంగా నిలబడి వున్నదీగది.
రాకండి లోనికి
జ్ఞాపకాల మరకల్ని భరించలేరు,
కంటకాల నాగజెముడు చెట్టుకి విరిసిన
వివర్ణ కన్నీటి పుష్పాల్ని ధరించలేరు,
పరిశీలించకండి దీన్ని,
పలకరించకండి ఈ ఏకాంతాన్ని,
నీతిసూత్ర బద్ధమని చెప్పకునే
మీ మెదళ్ళలోని 'సబ్ కాన్షియస్' భావాలకు
చిత్రికలుపట్టి చిత్రాలుగా గీశారిక్కడ,
మీరు బాహ్యంగా ఒప్పకోలేని
నిజాన్ని రక్తంతో రాశారిక్కడ,
రాకండి రాకండి లోనికి
వృథాగా చూడటం దేనికి ?
పగలంతా నిద్రపోయి
రాత్రి మేలుకొంటుందిది,
ఆందోళనను చాపగా పరచి
ఆశల గూటిలో,
వెన్నెలను ప్రమిదగాచేసి
చుక్కల వత్తిపై చంద్రుడ్ని వెలిగిస్తారు.
సాహితీసారా సేవనం సాగిస్తారు.
ఫ్రాయిడ్ అధ్యక్షతన,
ఉమర్‌ఖయ్యాం ఉపన్యసిస్తూ పడిపోతాడు —
గాలిబ్ గేయం చదివి గాయం గీరుకుంటాడు —
పిచ్చిగా పాడుకుంటున్న బుచ్చిబాబుకు
గురజాడ అడుగుజాడ చూపిస్తాడు —
చదరంగం ఆడుకుంటున్న బెర్నార్డ్ షా
సమాజానికి 'షా' చెబుతాడు —
వర్డ్స్‌వర్త్ పువ్వు లాక్కుపోతున్న షెల్లీని
కీట్సు పట్టుకొని రవీంద్రునిముందు పడేస్తాడు —
విషాదంగా నవ్వుతున్న గోర్కీని చూసి
విశ్వనాథ ఏడుస్తాడు —
రాకండి రాకండి లోనికి
వృథాగా ఆవేశం దేనికి ?
ఆలోచనల్లేని వాళ్ళు చూస్తే ...
మస్తిష్కాలు మూషికాలవుతాయని శాపం —
రాకండి రాకండి లోనికి.
యింకా ఎందుకు పిండుతారీ గుండెను ?
వెళ్ళండి ...
పలకరించ కండీ మదిని
పగులగొట్టకండీ గదిని !

/ అహంకారానికి /

నిన్నుగన్న నేలతల్లే
నన్నూ కన్నది.
నన్ను కౌగిలించుకున్న నాలుగు దిక్కులే
నిన్నూ కౌగిలించుకున్నాయి.
ఈ నేలపైన నడిచి
ఈ గాలి పీల్చి
ఈ నీళ్ళు తాగి
ఈ నేల కడుపులో నిద్రపోనున్న మనం
మనుష్యులం,
ఒక్క మూసలోని బొమ్మలం !
అయితే,
నీది ఎడమొగం, నాది పెడమొగం !
నీదో కులం, నాదో కులం !
ముద్ద తినిపించి
మనల్ని ముద్దులాడుతున్న వాళ్ళంతా
మనలో ఒకరికి అయిన వాళ్ళూ,
మరొకరికి కానివాళ్ళూనా ?

మేడపైన బాల్కనీలో కూర్చున్న నీకూ,
మేడ నీడకు వెలిగా గుడిసె ముందర నిలబడ్డ నాకూ
ఆకాశంలో కనిపిస్తున్నది
ఆ చంద్రుడే !
తిరిపి వెన్నెలవేళ
తెల్లని చల్లని ఆ అందాలబంతిని
నేనూ ప్రేమిస్తున్నాను,
నీవూ ప్రేమిస్తున్నావు.
నేను పిలిచిన వరసతోనే
నీవూ పిలుస్తున్నావు,
నీదోకులం, నాదోకులం !
అయితే,
ఆ చందమామది ఏకులం ?

ఆర్తిలోనుంచి చిల్చుకొచ్చేవి
'అమ్మా', 'నాయనా' అన్న కేకలు !
ఆర్తిలోనుంచి పుట్టేదే
ప్రార్థన !
ఎక్కడ పడితే అక్కడ ప్రతిష్ఠించుకున్నాం మనం
ముక్కోటి దేవతల్ని !
ఆపదలు ముంచుకొచ్చినప్పుడు
అన్ని తీర్థాలూ అవుతాయి మనకు పుట్టిళ్ళు !
నీదో కులం, నాదో కులం !
నీకూ నాకూ అమ్మానాన్నలు
పద్మావతీ శ్రీనివాసులూ
భ్రమరాంబికా మల్లికార్జునులూ
విశాలాక్షీ విశ్వేశ్వరులూ
నీ కులం వాళ్ళా, నా కులం వాళ్ళా ?

రంగూ వాసనా వేరైనా
రమణీయమైన పువ్వులు ఎన్నెన్నో !
అన్నిటినీ స్నేహపూర్వకంగా స్పృశిస్తావు,
సున్నితంగా తుంచి వాసన చూస్తావు,
దండగా కూర్చి
వాటికి సమానతను ఆపాదిస్తావు !
నీవూ నేనూ
పువ్వుల్లాంటి వాళ్ళమే సుమా !
పువ్వుల్లో ప్రేమించిన వర్ణాలను
పువ్వుల్లా నవ్వగలిగే మనుష్యుల్లో
ద్వేషిస్తావెందుకూ ?
నానా వర్ణ కుసుమాల్లా
మనం ఒక్క సూత్రంలో ఇమడలేమా ?

లోపం చెట్టుదీకాదు,
చెట్టుకు జన్మనిచ్చిన విత్తుదీకాదు;
విత్తనం రాలిన చోటుది !
చవిటి నేలలో పూచిన పువ్వుల
నవ్వులు పేలవంగానే వుంటాయి,
నీరూ సారం రక్షణా యివ్వగలిగితే
పరిమళాలు గుబాళిస్తాయి !

దారిద్ర్యం మెరకవేసిన తావుల్లో
తరతరాలుగా పెత్తనం చెలాయిస్తున్న
ముళ్ళ చెట్లను వేళ్ళతో పెకలించి,
నవ్వటం మరిచిపోయిన పూలపాదులకు
నీరూ సారం రక్షణా అందించే బాధ్యతను
నీవూ నేనూ సమాజమూ స్వీకరించి

నెరవేర్చిన నాడు
ప్రతి మనిషి కంటికీ సాటిమనిషి
బృందావన చందమామే !
నందనవన పారిజాతమే !

అప్పుడు నీవు నన్ను
నీ మేడ నీడకు వెలిగా వుండనివ్వవు !
నానా వర్ణ భారతీయ సుమహారంలో
నీ పక్కనే నాకు చోటిస్తావు !

వెలిగించు !

చిరు దివ్వెల సెగల తాకిడికే
  కరిగిపోతుందా,
ఈ చిక్కని చీకటి ?
ఊడలు పాతుకుంటూ
వేళ్ళు తన్నుకుంటూ
నేల నాలుగు దిక్కులా కొమ్మలు చాపుకుంటున్న
ఈ చీకటి దయ్యం
దీపాన్ని చప్పరించేస్తుంది అవలీలగా
భూతవైద్యుడు హారతికర్పూరాన్ని మింగినట్లు !
అందుకే —
ఈ దీపాల్ని నమ్ముకోవద్దు,
ఇవి పనికిరావు !
ఇప్పుడు మండి, ఇంకాసేపటికే
గుప్పున ఆరిపోతాయి !
ఈపూట గుమ్మం బయట నిలబడ్డ చీకటి
రేపు మళ్ళీవొచ్చి కౌగిలించుకుంటుంది !

నిన్నా, మొన్నా, వేడూ, రేపూ ...
ఎన్నాళ్ళు తుడుచుకుంటూ కూర్చుంటావు,
ఓటి దీపాన్ని ?
దీపాలతో, దీపావళులతో
తిమిరాలను పొగొట్టలేవు;
నరకాసురులను, నరమాంసభక్షకులను
సుర సురొత్తులతో, చిచ్చుబుడ్డీలతో
వధించగలవా, వెర్రితమ్ముడూ ?
ఈ దీపాలకు దమ్ములు చాలవు –
దీపం అంటే నశించేది;
దీపాలను నమ్ముకోవద్దు !
చీకటి వొద్దనుకుంటే
సూర్యుణ్ణి వెలిగించు !
దీపాలను ఊదేసి
ఇంటింటా
సూర్యగోళాల బారులు వెలయించు !

శ్రీ కలువకొలను సదానంద

శ్రీ తిరుమల రామచంద్ర

మాఘుని జ్యోతిశ్శాస్త్ర పాండితి

"మాఘే మేఘే గతం వయః"—అని మల్లినాథసూరి అన్నట్టు చెబుతారు పండితులు. మాఘంలోని—అనగా, శిశుపాల వధ కావ్యంలోని శాస్త్ర విషయాలు తెలుపడం, మేఘదూతలోని వ్యంగార్థాలు—అనగా ధ్వనులు తెలుపడం కష్టమని తాత్పర్యం.

"ఉపమా కాళిదాసస్య భారవేరర్థ గౌరవమ్,!
దండినః పదలాలిత్యమ్, మాఘేసంతి త్రయోగుణాః"

అని ఎవరో అజ్ఞాత విమర్శకుడు ఇచ్చిన బిరుదం; కాళిదాసు రచనలలోని ఉపమాలంకారం, భారవి కిరాతార్జునీయంలోని అర్థ గౌరవం, దండి దశకుమార చరిత, అవంతి సుందరీ కథలలోని పద లాలిత్యమూ ఈ మూడూ మాఘుని శిశుపాల వధలో వున్నవని ఈ విమర్శకుని యోగ్యతాపత్రం. శిశుపాల వధ చదివినవారికి మాఘుని పాండిత్య ప్రకర్ష స్పష్టమవుతుంది. వివిధ కవితా ప్రయోగాలూ అతడు చేయడంతోపాటు పెక్కు శాస్త్రాల రహస్యాలు సందర్భానుసారంగా జోడించాడు. జ్యోతిశ్శాస్త్ర పరిచయం కూడ అతనికి బాగా వున్నదని అతని కావ్యంవల్ల స్పష్టమవుతున్నది. దానికి కొన్ని ఉదాహరణాలు ఉట్టంకిస్తాను.

శిశుపాలుని దుండగాలు మితిమీరాయి. వానిని శిక్షించడం అవసరం. ధర్మరాజు రాజసూయయాగం చేయదలచి పార్థునితో సందేశం పంపాడు. రెండు పనులూ ముఖ్యం. కనుక ఉద్ధవ బలరాములతో ఆలోచిస్తాడు కృష్ణుడు; ఈ ఆలోచనకోసం ఆలోచన మందిరానికి వాళ్ళవెంట వెళ్లుతాడు. ఈ కార్యం సఫలమవుతుందని సూచించడం కవి ఉద్దేశం. కనుక గురు శుక్రులతో కలిసిన చంద్రుడిలాగ ఉన్నాడు కృష్ణుడని వర్ణిస్తాడు.

సార్థ ముద్ధవ సీరిభ్యా మథాసా వాసదత్ సదః,
గురు కావ్యానుగాం బిభ్రత్ చాంద్రీ మభినభః శ్రియమ్ (2–2)

ఆకాశం చంద్రుడు, గురు శుక్రులతో కలిసినప్పటి శోభ కలిగింది కృష్ణుడు ఉద్ధవ బలరాములతో సదస్సులో వున్నప్పుడు. జ్యోతిశ్శాస్త్రం ప్రకారం ఏ భావంలోనన్నా ఒక్క శుభగ్రహం వున్నా మంచి ఫలమిస్తుంది; మూడు శుభగ్రహాలు చేరితే చెప్పనక్కరలేదు. మూడు శుభగ్రహాల యోగాన్ని జ్యోతిర్వేత్తలు ఎంతనో వర్ణించారు.

"భాగ్య భాగ్యవతి మానవస్సదా
చారు కీర్తి మతివృత్తి సంయుతః,
భార్గవేందు సురరాజ పూజితాః
సంయుతా యది భవంతి సంభవే."

-అని ఢుంఢిరాజు జాతకాభరణం (35–25)లో ఈ శుభగ్రహ త్రయయోగాన్ని వివరించాడు. జన్మసమయంలో శుక్ర చంద్ర గురులు ఏకరాశి స్థితులయితే మానవుడు భాగ్యవంతుడు, కీర్తిమంతుడు, మతిమంతుడు, సద్వృత్తి గలవాడు అవుతాడు అని ఈ యోగం ఫలం.

కృష్ణుడు ఇంద్రప్రస్థానికి వెళ్ళుతాడు రాజసూయ యాగం కోసం. అర్జునుడు సవినయంగా దారి చూపగా, భీముడు వెంట నడువగా కృష్ణుడు ఇంద్రప్రస్థం చేరినప్పుడు రెండు గ్రహాల మధ్య ఉన్న చంద్రుడిలాగ దురుధరాయోగం కలిగించాడట.

"పవనాత్మజేంద్ర సుత మధ్యవర్తినా
నితరా మరోచి రుచిరేణ చక్రిణా,
దధతేవ యోగ ముభయ గ్రహాంతర
స్థితి కారితం దురధరాఖ్య మిందునా." (12–22)

చంద్రునికి పన్నెండవ ఇంట్లో సూర్యుడు తప్ప ఏ గ్రహమున్నా సునఫాయోగమని, రెండవ ఇంట్లో వుంటే అనఫాయోగమని, చంద్రునికి ఇరువైపుల—పన్నెండవ ఇంట్లోను, రెండవ ఇంట్లోను గ్రహాలుంటే దురుధరాయోగమని జ్యోతిశ్శాస్త్ర పరిభాష. కృష్ణునికి ముందు వెనుక అర్జున భీములు వుండడం ఈ యోగంతో పోల్చాడు కవి. చంద్రునికి ముందు వెనక సూర్యుడు తప్ప ఏ గ్రహమున్నా శుభం. రెండువైపులా వుంటే మరీ మంచిది. రెండు వైపులా ఏ గ్రహమూ లేకపోతే కేమద్రుమ మనే యోగం పరమదరిద్రమైనది. కల్యాణవర్మ సారావళిలో ఈ యోగాలను ఇలా చెప్పాడు:

రవి వర్జం ద్వాదశగై రనఫా
చంద్రాద్ద్వితీయగైశ్సునఫా,
ఉభయస్థితైర్దురుధరా
కేమద్రుమ సంజ్ఞకోతోన్య :"

రాహుకేతువులకు జ్యోతిశ్శాస్త్రంలో విశేషప్రాధాన్యముంది. ఈ రెండు గ్రహాలు ఎవరి స్థానంలో వుంటాయో, ఆ గ్రహాల

ఫలాలు ఇస్తాయి. భూమిచ్ఛాయగనుక ఛాయాగ్రహాలనీ ఈ రెండు గ్రహాలను అన్నారు. రాహువు ఆకారం కేవలం శిరస్సు; దేహం లేదు; కేతువుకు తలలేదు; కేవలం మొండెమే వుంటుంది. మాఘుడు శిశుపాలుని శిరశ్ఛేద ఘట్టాన్ని వర్ణిస్తూ, రాహువుతో పోల్చాడు శిశుపాలుని శిరస్సును. రాహువుకు శరీరం లేదు. కనుక అతని ప్రేయసీమణుల శరీరపు వొంపుసొంపుల ఆలింగన భాగ్యం లేనందున వ్యర్థమయింది. రాహువు అంతఃపుర స్త్రీల స్తన కార్కశ్యాన్ని వ్యర్థం చేసిన శ్రీకృష్ణుని చక్రం శిశుపాలుని తల నరికి వేసింది. అలనాడు అమృతమథన సమయంలో రాహువు తల నరికి వేసినట్టే, ఈనాడు శిశుపాలుని తలను తెగవేసింది.

రాహుస్త్రీ స్తనయోరకారి సహసా
యే నశ్లథాలింగన
వ్యాపారైక వినోద దుర్లలితయోః
కార్కశ్య లక్ష్మీః వృథా,
తేనాక్రోశత ఏవ తస్య మురజి
త్తత్కాల లోలానల
జ్వాలా పల్లవితేన మూర్ధవికలం
చక్రేణచక్రే వపుః

మాఘుడు తన కావ్యంలో సూర్యచంద్ర గ్రహణాలను గురించి చాలచోట్ల ప్రస్తావించాడు. కృష్ణ శిశుపాలుల యుద్ధ ఘట్టం.

సవిషశ్వ సనోద్ధతోరు ధూమ
వ్యవధి మ్లాన మరీచి పన్నగానామ్,
ఉపరాగవతేవ తిగ్మభాసా
వపురౌదుంబర మండలాభమూహే. (20–45)

శిశుపాలుడు ప్రయోగించిన నాగాస్త్రంవల్ల జనించిన పాముల బుత్కారధూమానికి సూర్యబింబం కాంతి మందగించి మేడిపండ్ల గుత్తిలాగ వుందట—అంటే రాహుగ్రస్త గ్రహణంలాగ.

మరొకచోట చంద్రగ్రహణం వర్ణించాడు మాఘుడు. శత్రువు ఒక్కడు ప్రాణాలతో ఉన్నా సుఖముండదు. రాహువు దేవతలందరి ఎదుటే చంద్రుణ్ణి బాధపెడుతాడు గదా!—అని బలరాముడు సలహా యిస్తాడు కృష్ణునికి.

ధ్రియతేయావదే కోపి రిపుస్తావత్కు తస్సుఖమ్,
పురః క్లిశ్నాతి సోమంహి సైంహికేయో సురద్విషామ్.
(2-35)

తోకచుక్కలను కూడ మాఘుడు తెలిపాడు. తోకచుక్కలు అశుభమని చాల దేశాలు భావిస్తాయి. బృహత్సంహిత ఎన్నో తోక చుక్కలను తెలిపింది పదకొండవ అధ్యాయం పూర్తిగా ధూమ కేతువులదే. వీటిలో కొన్ని శుభకరమైనవి కూడ వున్నవి.

శిశుపాలుని దుండగాలను నారదుడు కృష్ణునికి పూసగుచ్చి నట్టు చెప్పాడు; గగన మార్గంలో చంద్రునిలాగ వెళ్ళిపోయాడు. కృష్ణునిముఖం బొమముడితో గంటుపడింది. ఆ బొమముడి ఎలా వుందంటే, ఆకాశంలో కనిపించిన తోకచుక్కలాగవుంది ఈ తోక చుక్క వినాశకరమే.

ఓమిత్యుక్తవతో ధశారేజ్ఞిణ ఇతివ్యాహృత్య వాచం నభః
తస్మిన్నుత్పతితే పురస్సురముూనా విందోశ్రియం బిభ్రతి,
శత్రూణామనిశం వినాశపిశునః క్రుద్ధస్య చైత్యం ప్రతి
వ్యోమ్నీవభ్రుకుటిచ్ఛలేన వదనే కేతుశ్చకారాస్పదమ్.
(1-75)

జ్యోతిశ్శాస్త్రంలోని ముహూర్తభాగంలో ప్రయాణానుకూల ప్రతికూల ముహూర్తాలు ఉన్నాయి. కాని, చంద్రుడు పుష్యమీ నక్షత్రంలో వున్నప్పుడు స్వస్థానమయిన కటకంలో వుండడంవల్ల ఏ దిక్కుకు యాత్రచేసినా శుభం. అలాగే అనూరాధా, హస్త, అశ్వినీ నక్షత్రాలలోను యాత్ర ఏ దిక్కుకు చేసినా శుభమేనని ముహూర్త చింతామణి అంటున్నది.

"మైత్రార్క పుష్యాశ్వినభైర్నిరుక్తా
యాత్రాశుభా సర్వదిశాసుతజ్జ్ఞైః" (11–38)

కృష్ణుడు నారదుని మాటలు విన్నతర్వాత బలరామోద్ధవు లతో మంతనాలాడి రథమెక్కి ఇంద్రప్రస్థానికి బయలుదేరుతాడు. అతడెక్కిన రథం పేరు క్షిపమన్ఱేకీడారథం—పుష్యరథం. దానికి ఏ దిక్కునా అడ్డులేదు. కృష్ణుడు ఎలా వున్నాడంటే, పుష్య నక్షత్రయుక్తుడైన చంద్రునిలాగ ఉన్నాడు. కవి కృష్ణుని యాత్ర సఫలమవుతుందని సూచించాడు.

"రరాజ సంపాదకమిష్టసిద్ధేః
సర్వాసు దిక్ష్వ ప్రతిషిద్ధ మార్గమ్,
మహారథః పుష్యరథం రథాంగీ
క్షిప్రం క్షపానాథ ఇవాధిరూఢః" (3–22)

ఈవిధంగా మాఘకవి జ్యోతిశ్శాస్త్ర ప్రతిభకు ఎన్నైనా ఉదాహరణలు చూపవచ్చు. మచ్చుకు కొన్ని చూపినాను. పంజాబ్ విశ్వవిద్యాలయాచార్యులు శశిధరశర్మ వాచస్పతి జ్యోతిష్మతి పత్రికలో మాఘుని కొన్ని జ్యోతిశ్శాస్త్ర విషయాలను తెలిపారు. వాటిని కూడ ఈ వ్యాసంలో గ్రహించాను.

శరణం ప్రపద్యే

వనమాలి

నా ముత్యం చిప్పల్లాంటి కళ్ళలో
   కన్నీళ్ళు లేక పూర్వం
సాయంత్రాలు ఆటల్లో
రాత్రులు కలల్లో గడిచేరోజుల్లో
నేను ఆకాశాన్ని చూసినా పూలని చూసినా
దేవుడే గుర్తొచ్చేవాడు.

ప్రతి ఆశ్చర్యంలో విషాదంలో దేవుణ్ణి వెతికే వాణ్ణి
కిరాతుడు అడవుల్లో మృగాల్ని వెతికినట్లు.
వికసించిన ప్రతి జవాబు చుట్టూ
ప్రశ్నలు తుమ్మెదల్లా మూగేవి ...

జవాబులు నా ప్రశ్నల దాహం తీర్చేవికాదు.
నా వంటరి జీవితంలో ఇప్పుడు ప్రశ్నలు లేవు
జవాబులు లేవు.
ఈరోజు నేను దేవుణ్ణి నమ్మతాను
తత్వశాస్త్ర సారంగాల్లోంచి
సుదూరంగా ప్రయాణం చేశాక కనిపించే

నిష్క్రియాలోలుడైన, స్వచ్ఛమైన దేవుణ్ణికాదు
కిరీటాలు, చక్రాలు, గదలూ ధరించి
రెక్కల రథాల్లో ప్రయాణించే దేవుణ్ణి.

మానవ సమాజ యెడారుల్లో
గుళ్ళు నా కళ్ళకు ఒయాసీస్సుల్లా కనిపిస్తాయి
కప్పులకి వేలాడే గంటలు భక్తితో మ్రోగినప్పుడు
నాకు శబ్ద తరంగాల కొలనులు వినిపిస్తాయి.

నేను మాట్లాడే భాషలో
ఎవరూ నన్ను పలకరించరు
నేను ఆస్తికుణ్ణికాను;
నాస్తికుణ్ణి కాను.

జనసమూహాలు నన్ను చుట్టుముట్టి
ప్రతిసారి వంటరి తనంలోకి బహిష్కరించినప్పుడు
దేవుడొక్కడే నాకు
ఆంతరంగికుడవుతాడు.

ఆధిక్యత

శ్రీ పెంద్యాల వెంకట రమణమూర్తి

అక్కడ ...
    గాలి వీచిన చప్పుడు
    గుండె శబ్దాన్ని మింగేస్తోంది.
    చిగురాకుల చిరు శబ్దాలు
    శరీరాన్ని చలిలో కప్పేసాయి.

    నవ్వుతున్న పువ్వు
    నిద్రముఖాన్ని పలకరిస్తోంది.
    నడుస్తున్న యేరు
    నాట్యమాడుతూ నన్ను దాటిపోతోంది.

ఇక్కడ ...
    గులకరాళ్ళు ఏరుకుంటున్న
    ఓ పసిపాప
    నా సర్వస్వాన్ని స్వాధీనం చేసుకొంటోంది.

శ్రీమతి ఆర్. వసుంధరాదేవి

గడియారం

సాయంత్రం హాస్పిటల్ డ్యూటీ అయాక యింటికి చేరుకునే సరికి మహామోహినికి శరీరమూ మనసూ కూడా అలసటతో వాలిపోతున్నవి. వేడిగా ఒక కప్పు కాఫీ త్రాగి వచ్చి లాన్‌లో కూర్చున్నది. ఇంటికి అవతల ప్రక్కన పిల్లలు ఆడుకుంటున్న గోల వినిపిస్తున్నది. ప్రక్కింటి వేపాగారి పిల్లలు కూడా వచ్చి నట్లున్నది. వాళ్లకి తెలుగు బాగా తెలును.

'మనం...మనం ... బరం ... పురం' అంటూ సరదాగా అరుస్తున్నారు.

మనసులోని ఏ లోతుల్లోనో ఒక స్మృతి – తియ్యని తెనుగు స్మృతి కదిలింది.

కాని కేకలుపెడుతూ అరుస్తున్న ఆ పిల్లల్లో ఏ స్మృతీ కదలదు !

'మనం' 'మనం' 'బరం' 'పురం'

అర్థంలేని మాటల కూర్పు.

అర్థంతో పనిలేకుండా ఒకర్నొకరు చూసుకుంటూ విరగబడి నవ్వుకునే పిల్లల్నిగా, ఏమి ఆట ? ఎంత బుద్ధిలేని నవ్వు ! అనుకుని నవ్వుకుంది. పిల్లల కేకలు, ఉత్సాహం మనసులోకి ఇంకుతున్నకొద్దీ అలసటపోయి మనసు తేట పడింది. ప్రశాంతత వచ్చింది.

ఎదురుగా తీగెలో పూర్తిగా వికసించి చల్లని గాలిలో మెల్లగా వూగుతున్న పువ్వు.

ఒక పరిస్థితి నుంచీ ఒక తరం పుడుతుంది. ఒకే తరానికి చెందినా అందులోని ప్రతిమనిషీ ఒక వ్యక్తి. వారి జీవితంలోని వికాసం వారు సాధించుకోవలసిన ప్రత్యేకత. వారి జీవిత లక్ష్యం.

ప్రపంచం ఒక నందన వనం. అందులో ఎన్నోరకాల చెట్లు. ఎన్నో రకాల పూలు.

అన్నీ ఒక మట్టిలోంచే పుట్టివుండవచ్చు. కాలం తీరి నప్పుడు, వాడిపోయి నేలకు రాలిపోయినప్పుడు అదే మట్టిలో కలిసి పోవచ్చు. కాని అది సాధించుకున్న 'పువ్వుదనం', దాని వ్యక్తిత్వం మట్టిలో కలవదు! ఆ మట్టి ఎలా అనాదో, యీ జీవితం కూడా అలా అనాది !

ఇంతవరకూ అనుకోగానే మహామోహినికి ధర్మ అక్కయ్య జ్ఞాపకం వచ్చింది. చిత్రంగా ధర్మకూడా యిలాగే అంటుంది. కాని జీవితం అంటే ఆవిడకి హృదయ సంబంధి. అందులో అనుభూతి వుండొచ్చుగాని ప్రగతి లేదు. మహామోహినికి జీవితం మనస్సంబంధి. మేధా సంబంధి. 'నేను ఆలోచించగలను. కనుక నేను ఉన్నాను' అన్న డెకార్టే ఆమె ప్రపంచానికి ఆద్యుడు. అతనితో ప్రగతి ప్రారంభమైంది. న్యూటన్, డార్విన్, మార్క్స్ మొదలుగా శాస్త్రజ్ఞులు ప్రపంచ స్వరూపాన్ని, దాన్ని నియమిస్తున్న సూత్రాల్ని కనిపెట్టటం ప్రారంభించాక మనిషీ, ప్రపంచమూ కూడా మారి పోయారు. ఈ రహస్య ఛేదనతో మనిషికి లభించిన మహత్తర శక్తికి చిహ్నం యిప్పటి సాంకేతిక ప్రగతి. ఇది హేతుయుగం, శాస్త్రయుగం. ఇప్పుడు మనిషి తనను గురించి తాను తెలుసు కోవాలంటే తగిన శాస్త్రగ్రంథం వెతుక్కుని చదువుకుంటే తెలిసి పోతుంది. తోచటం, అనిపించటం, హృదయం చెప్పటం – ఇది చీకటిని ఆరాధించే అశాస్త్రీయ, అవాంఛనీయ, తిరోగమనశీల పద్ధతి. నిజమే, ఒకప్పుడు హృదయం రాజ్యం చేసింది – అనేక యుగాల మానవ అనుభూతికి ప్రతినిధినంటూ, జీవితంలోని మహత్తర సత్యానికి, సౌందర్య రహస్యానికి మార్గాన్నంటూ. కాని ఆ సత్యమేదో ప్రకృతిలో నియమ రూపంగా వుంది. అంతే. వెనుక బడ్డ ప్రాచ్యదేశాలూ, ధర్మలాంటివాళ్ళూ యింత విస్తృతమైన సత్యం కోసం ఒక చిన్న గుండెలోని చీకట్లో వెతుక్కోబోతారు ! ఇన్ని యుగాల మానవ యత్నానికి ఫలితం యీ మేధస్సు – యీ విజ్ఞానం.

ఎదురుగా టీపాయ్‌మీద తనకారోజు పోస్టులో వచ్చిన ఉత్తరం తెచ్చిపెట్టారు పిల్లలు. అది ఇండియా నుంచి, ధర్మ దగ్గర నుంచీ వచ్చింది. ఏమి వ్రాసిందో చదవాలన్న ఆతృత, ఉత్సాహం లేవు మహాకి—తమ యిద్దరి మధ్య సంబంధం ఏనాడో తప్పిపోయింది.

అమెరికా వచ్చిన మొదట్లో మహా ఒక చోటినుండి పీకి మరోచోట నాటిన మొక్కలా బాధపడింది. తన మూలం ఎక్కడో ఇండియాలో వున్నట్లు భావన. ఎప్పుడో ఒకనాడు తిరిగి ఇండియాకు వెళ్లి, అక్కడ తనవారి మధ్యన గొప్పగా మంచి హోదాలో వుంటూ నన్న ఊహలో ఊరట పొందేది. తరచుగా అక్కకీ, అమ్మకీ ఉత్తరాలు వ్రాసేది. రెండేళ్లకోమాటు వెళ్లి చూచి వచ్చేది. కాని క్రమంగా ఆ బాధ చల్లారిపోయింది. పిల్లలు యిక్కడే పెరిగి పెద్దవాళ్ళవుతున్నారు. వాళ్లకి తెలుగు భాషతో కొంత పరిచయం వుంది. కాని తెనుగు దేశంతో లేదు. అమ్మ చనిపోయింది. ఇండియాకు వెళ్లి ఐదేళ్లయిపోయింది ఇప్పుడు వెళ్లాలంటే

నీరసం 'ఎప్పుడో వెళ్దాంలే, ఒకసారి' అనిపిస్తుంది. ప్రయాణం బరువుగా తోస్తుంది.

ఎన్నడో ఒకసారి బాల్యస్మృతులు అప్రయత్నంగా, స్మృతుల కుండే తియ్యదనంతో వెలికివస్తాయి. కాని ఆమె మనసు వాటిని విసుగ్గా తిరస్కరిస్తుంది.

అక్కడ కాలంలో కదలిక లేదు. మానవ ప్రయత్నానికి విలువలేదు. అది మనిషి శక్తిని కబళించివేస్తుంది. ధర్మ ఫిజిక్స్ బి. ఏ. చదువుకుంది. అది చదువుకాదు — పెళ్ళయ్యేదాకా కాలం గడపటం మామయ్యని పెళ్ళిచేసుకుని, పల్లెటూళ్ళో యింట్లో కూర్చుని, అమ్మమ్మ గడిపిన జీవితాన్ని పూజలు నోముల దగ్గర్నుంచీ తూచా తప్పించకుండా గడిపేస్తోంది! తాను కాలగర్భంలో, ప్రగతితో పనిలేని నిశ్చలతత్వంలో వున్నాననుకుంటూ నిశ్చింతగా కాలం గడిపేస్తోంది.

ఇండియాలో వుండేదల్లా అసమర్థత, పేదరికం, మురికి, వంచన. ఎన్ని తరాలు గడిచినా ఆ జీవితం అలానే సాగుతూ వుంటుంది—ముఖ్యంగా గ్రామాల్లో. అక్కడ మార్పు అనేది కాన రాకుండా బహునెమ్మదిగా, బహుదొంగగా ప్రవేశించాల్సిందే. అక్కడి 'బుడ్డాడు' 'ఎంకిగాడు' కావచ్చు. క్రమంగా 'ఎంకడు' కావచ్చు. పేరు ఏదైనా వాడు ఉదయమే పాలు పిండాక గొడ్ల చావడి వూడ్చి చద్దన్నంతిని బలిసిన బర్రెమీద తాపీగా సవారీచేస్తూ గొడ్లు తోలుకు పోతాడు. తాటికాయల కాలంలో గొడ్లని ఎక్కడో ఒదిలేసి దొరికి నన్ని తాటిగెలలు కొట్టుకుని ముంజెలుతిని కడుపునొప్పని మూలుగుతూవచ్చి పనికి నాగాపెడతాడు. గృహిణులు బియ్యం, పప్పుల్లో వర్తకులు కలిపిన రాళ్ళను చెత్తను ఏరుకుంటూ గంటలు గడుపుతారు. ఎండిన తాటాకుల్ని, తాటిమట్టల్ని సద్వినియోగం చెయ్యటానికి వెనకదొడ్లో ఆరుబయట పొయ్యిపెట్టుకుని స్నానాలకు వేడినీళ్ళు, వంటలు అన్నీ ఆ మంటమీదే కానిస్తారు వానజల్లులు దిగుతాయేమోనని ఆదుర్దాగా ఆకాశం దిక్కుకు చూసుకుంటూ వుంటారు. ఇంటికప్పులమీద కూర్చున్న 'ఇనప ముక్కు' కాకులు పొయ్యిమీద గిన్నెలో కుతకుత ఉడుకుతున్న అన్నాన్ని ఎవరూ లేనప్పుడు నోటినిండా చిక్కించుకుని, మింగిపారేస్తుంటే 'హూత్, హూత్' అంటూ సైరన్లా అరుస్తుంటారు. దొడ్లో ఒక మూలన ఎడ్లకోసం ప్రొద్దుట్నుండీ సాయంత్రంవరకూ ఉలవలు తెంపట్లో తాపీగా వుడుకుతూ వుంటాయి. నేలబావిలోంచీ జీతగాడు వందకడవల నీళ్ళు తోడి తొట్లు నింపుతాడు. తెల్లవారకముందే రైతుల యిళ్ళల్లోంచీ అరగంటసేపు కవ్వంతో మజ్జిగ చిలుకుతున్న శబ్దం వినవస్తుంది—ఇది అక్కడి ఇరవయ్యో శతాబ్దం. ఇంతకు ముందు లేనిది, యీ పదేళ్ళలో వచ్చిన గొప్పమార్పు — వారానికో రోజు ఒక కాంపౌండరు మందులు తీసుకొచ్చి కోరినవాళ్ళకు ఇంజె క్షన్లు యిచ్చి పోతూవుండటం. ఇంకో పాతికేళ్ళకి ఆ వూళ్ళోకి ఒక నిజం డాక్టరు రావచ్చు. మరో యాభై ఏళ్ళకి ఒక సినిమా హాలు రావచ్చు. కాని ఇప్పుడప్పుడే కాదు ... నెమ్మదిమీద... భవిష్యత్తులో ఎప్పుడో ఒకనాడు...

ఈ చచ్చుదనం మనోకి ఊపిరాడనివ్వదు. 'నేను' ఏమిటో చెయ్యాలి, చేస్తాను! చదువుకుంది. డాక్టరైంది. అమెరికా వెళ్ళింది. డబ్బు, వస్తువులు, సుఖం సంపాదించింది.

మనోకి చిన్నమ్మమ్మ కొడుకు రాము మామయ్య. వాళ్ళు పట్నంలో వుండేవాళ్ళు. ధర్మ, మనో చిన్నప్పుడు తరచు వారింటికి వెళ్ళేవారు. రాము మామయ్యంత వ్యర్థజీవి మరెవరూ వుండరు. ప్రయత్నం అనేది అతని డిక్షనరీలోలేదు. జీవితాన్ని మహా తేలిగ్గా తీసుకుని బ్రతికాడు. చిన్నప్పుడు బడికి పంపిస్తే రోజూ బడి కెళ్ళాడు గాని చదువుకోలేదు. పెద్దయ్యాక ఇంట్లో ఎవరే పని చెప్పినా తాపీగా చేసుకుంటూ పోయేవాడు. చిన్నపిల్లల్తో ఆడు కుంటూ వాళ్ళకి కాగితాల రాకెట్లు, పడవలు, లాగులు, గిర్రున తిరిగే చక్రాలు, గాలిపటాలు చేసిపెట్టేవాడు. అతని భార్య ఏడ్చు కుంటూ, పోట్లాడుతూ యింట్లో వంటపనీ, పైపనీ చేసేది. మనోకి యీ పిచ్చి మామయ్యని చూసినా, నిత్యం అతని మొహంలో కనిపించే నవ్వు చూసినా ఎగతాళి, చిరాకు, కోపం వచ్చేవి. చిన్న మ్మమ్మ దుడ్డుకర్ర తీసుకుని మామయ్య నెత్తిమీద ఒక్కటెయ్యా లనిపించేది. ఒక్కోసారి వెనకనుంచీ తోసేది, కొట్టేది కూడా. ఆ మామయ్య జీవితంలో చెప్పుకోదగ్గ ఘనకార్యం ఒక్కటేచేశాడు. ఒకనాడు పిల్లలందరినీ చుట్టూ కూర్చోపెట్టుకుని 'పిల్లలూ, నేను ఒచ్చే దశమినాడు మధ్యాహ్నం ఒంటిగంటకు దేవుడిదగ్గరకు పోతాను' అన్నాడు. పిల్లలకి ఉత్సాహం వచ్చింది. 'నిజం?' అన్నారు. 'నిజం' అన్నాడు మామయ్య గంభీరంగా ఇంకొంచెంసేపు రెట్టించి పిల్లలు ఆ మాట పూర్తిగా మరచిపోయారు. వారం రోజుల తర్వాత ఆ రోజు దశమి — మధ్యాహ్నం ఒంటిగంటకు అలాగే గోడ కానుకుని కూర్చుని పిల్లల ఆటలు చూస్తూ కళ్ళుమూసు కుని ప్రక్కకి ఒరిగిపోయాడు. దాంతో పిచ్చి మామయ్య వ్యర్థ జీవితం ఆఖరైపోయింది. ఆ మామయ్యని తల్చుకుంటే యిప్పటికీ జాలి, విసుగు,—కోపం కలుగుతాయి మనోకి.

ధర్మలో మహా చీకాకు కల్గించే మరోగుణం — భూమిమీద నివసిస్తూ ఎప్పుడూ ఆకాశాన్ని చూస్తూవుండటం. అతీంద్రియత గురించీ, అద్వైతం గురించీ మాట్లాడుతూ వస్తువుల కోసం వెంపర్లాడటం. కేవలం తుచ్ఛమైన డబ్బుకోసం, కోరికల కోసం పరదేశానికి అమ్ముడుపోయినట్లు తనని చిన్న చూపుచూసిన ధర్మకి ఆ పరదేశపు వస్తువులమీద ఎంత వ్యామోహం! ఇక్కడి బట్టలు, మిక్సర్, టేప్‌రికార్డర్, పెన్నులు, పిన్నులు, హోల్డాలు, డిన్నర్ సెట్లు — అన్నీ కావాలి!

వాళ్ళ జీవితానికీ, మాట్లాడే మాటలకీ ఎక్కడా పొంతన వుండదు. ఆ వేదాంతం వాళ్ళ జీవితంలోని అప్రయోజకత్వానికి భాష్యం చెప్పుకునే ప్రయత్నంగా కూడా వుంటుంది. అసలు ఈ వేదాంతం గురించి చాకలి సుబ్బడికి తెలిసినంత మరెవరికీ తెలియదు! అని నవ్వుకుంటుంది మనో. ఎవరైనా ఏదైనా విషయాన్ని వూరికే సాగలాగినా, విసుగు పుట్టించేట్లు నసుగుతున్నా 'ఆమెరంతా అదొక అద్వైతం' అని విసుక్కుంటాడు సుబ్బడు.

ధర్మ ఉత్తరం చదవకుండానే అందులో ఏముందో మనోకి తెలుసు. ఒకటే, అరా కోరికలూ చాల అద్వైతమూ వుంటాయి. అటువంటి అద్వైతం మనోకి గిట్టదు.

ఒకసారి ధర్మ గ్రైండర్ కావాలని అడిగింది. అది కొంటూంటే భర్త వినోద్ అడిగాడు: 'ఇండియాలో ఏ. సీ. కరెంటు కదా. డీ. సీ. గ్రైండర్ కొంటున్నావేం ?' అని. 'ఇప్పుడు దానికోసం ఎక్కడ వెదుకుదాం ? టైంలేదు. కావాలంటే ట్రాన్స్‌ఫార్మర్ కొనుక్కుంటుంది' అని కొనేసింది. దానికి ట్రాన్స్‌ఫార్మర్ ధర్మకి ఒక పట్టాన దొరకలేదు. ఆఖరికి ఒక పంజాబీవాడు వంద రూపాయిలకి ఒకటిచ్చాడు. ఇంటికెళ్ళి దాన్ని వుపయోగించగానే గ్రైండర్ మోటార్ కాలిపోయింది. అప్పణ్ణుంచీ ధర్మ అద్దాల అల్మారాలో ఒక గ్రైండరూ, ఒక ట్రాన్స్‌ఫార్మరూ అలంకారాలుగా నిలిచాయి. వాటిని చూసినప్పుడల్లా నవ్వుతుంది మనో. 'నీవు చేసిన ఘనకార్యమే' అంటుంది ధర్మనిష్ఠూరంగా. మనో మరింతగా నవ్వుతుంది.

తమ కిద్దరికీ సంబంధం ఎక్కడుంది?

టీపాయ్‌మీదున్న ఉత్తరం అందుకుని తాపీగా చదవటం ప్రారంభించింది.

''మనో,

ఈ మధ్యన కొంతకాలంగా నాకు ఒంట్లో బాగుండటం లేదు. చాల బలహీనమైపోయాను. మొన్ననే హైదరాబాద్‌లో డాక్టర్లు లుకేమియా అని తేల్చారు. అందుకని నేను దుఃఖపడి పోవటంలేదు...కాని...ఎంత ఆకస్మాత్తుగా వచ్చిందో!...శరీరధారులు ఎప్పుడో ఒకనాడు శరీరం వదిలిపెట్టాల్సిందేననుకో...అయినా... ఏమిటోగా వుంది.

వింత ఏమంటే యిప్పుడు నాకు మామయ్యని గురించి గాని పిల్లల్ని గురించి గాని చెల్లెళ్ళని గురించి గాని ఆలోచనలేదు.

ఇక్కడ యీసారి ఎండాకాలం ఎంత మాడ్చేసిందనుకున్నావ్! ఈ వేడీ తాపమూ ఒకరోజున అంతమైపోతాయన్న ఆశపోయింది. ఈ మంటల్లో భూమి నిలవదనిపించింది. ఇంత నరకంలోనే నాల్గు రోజుల క్రిందట బంగాళాఖాతంలో వాయుగుండం పుట్టింది. ఇవాళ అంతటా చల్లదనం, ప్రశాంతత, తడిసిన నేల, వానలో నానిన పెంకుటిళ్లు, వర్షధారల్లోంచీ జీవశక్తిని పుంజుకుని నిగారింపు తెచ్చుకున్న కొబ్బరాకులు, తనిసిన ప్రకృతి ఏదో హాయిలోకి ఒరిగిపోతున్నట్లు స్తబ్దత, ఇదంతా ఒదిలిపోవాలని దిగులు. పిచ్చి అనిపిస్తోందా?

మరో విషయమేమంటే నాన్నగారిది పాతవి బంగారుపూత పూసిన వెస్టెండ్ జేబు గడియారం నా దగ్గర వున్నది. ఇప్పుడా బంగారుపూత పోయింది. కాని నాన్నగారి దగ్గరున్నప్పల్లాగే బాగా తిరుగుతున్నది. దాన్ని నీకు పంపిస్తున్నాను. కావాలంటే డయల్ తీసి బంగారుపూత వేయించుకో.

సరే, యిహ వుంటానేం. నాకు మనసు ఒకరకంగా వుండటం లేదు ఏమిటో యిక్కడ నేను చెయ్యాల్సిన పనులు మిగిలిపోతున్నట్లు ఏమిటో మరచిపోతున్నట్లు కొంచెం గాబరాగా వుంది. ఉంటా మరి. నీవు బాగున్నావా?

ఆశీస్సులతో
ధర్మ''

ఉత్తరం మడిచి టీపాయ్‌మీద పెట్టేసి కళ్లు మూసుకుంది మనో. కళ్లల్లోంచీ నిశ్శబ్దంగా నీళ్లు ధార కట్టాయి.

ధర్మకి వయస్సు నలభై దాటింది, అంతే. ఇలాంటి జబ్బులు అక్కడ త్వరగా కనుక్కోరు. ఆంపిసెల్లిన్‌లూ, క్లోరోమైసిటిన్‌లూ అయ్యాక తిరిగ్గా కనుక్కుంటారు...ఇహ నెలో...రెణ్ణెల్లో...

ఈ హఠాత్సంఘటనతో ఆమె మనసు మూగపోయింది. ఏవో అంతరాల్లోకాల్లోకి విరుచుకుపడిపోయింది. తన జీవితం తనది కానట్లు తన చదువు, వుద్యోగం, దేశాంతరవాసం సంసారం అంతా మిథ్య అయినట్లు అనిపించింది. అక్కడి మారనిలోకం, కదలనికాలం, పంటచేలు, తాటిచెట్లు, పెంకుటిళ్లు, తన వాళ్లందరూ కాలి మసైపోయిన స్మశానం అన్నీ కళ్లముందు మెదిలాయి. జీవితంలోని సత్యం యింతేనా? యింతేనా? అంటూ మనసు మూల్గింది.

తెల్లని గుండ్రని ముఖంమీద తీర్చైన నల్లని అంకెలు. చుట్టూ మెరిసే బంగారురంగు. చాల శుభ్రంగా, చాల అందంగా, చాల హుందాగా నాన్నగారిలా కన్పించేది ఆ వాచీ. నాన్నగారు పోయినప్పుడు జ్ఞాపకచిహ్నంగా దాన్ని తీసుకుందామనుకుంది మనో. ధర్మ తీసేసుకుంటుందేమోనని అనుమానం. నేరుగావెళ్ళి బీరువా తెరిచి వాచీ మామూలుగా వుండేచోట చూసింది. అది అక్కడలేదు. ధర్మ ముందే తీసేసుకుంది! .. ఆ క్షణంలో ధర్మమీద ఎంత అసహ్యం, పగ పుట్టాయో! అప్పటినుండి యిప్పటివరకూ అక్క అన్న ఆప్యాయత కలగలేదు...ఇప్పుడా వాచ్‌ని యిచ్చేస్తానంటోంది ధర్మ!

ఎప్పటి వాచ్!

అది నాన్నగారున్నప్పటిలాగే వున్నట్లు, అలాగే తిరుగుతున్నట్లు ధర్మకి కనిపిస్తోంది.

కాని అది ఎంత కాలాన్ని మింగేసింది!

ధర్మ యిహ తనకు కనబడదు.

అంత సన్నిహితులమధ్య చివరి వీడ్కోలు యింత నిశ్శబ్దంగా వుంటుందని నమ్మకం కలగటంలేదు మనోకి.

ఎదురుగా వున్న తీగెలో పూర్తిగా వికసించి వంగి వేళ్లాడుతున్న పువ్వు చూస్తుండగానే మరింత వాలి తీగనుంచీ విడివడి గాలిలో తేలుకుంటూ క్రమంగా క్రిందికి దిగి మట్టిని తాకి స్వస్థత పొందింది. ఆ పువ్వు పరిణతి, దాని సౌందర్యం, దాని సత్యం ఆ మట్టిలోనే ముడిపడి వున్నాయా? జీవితానికి సార్థకత జీవించడమేనా? ఏమీ సాధించాల్సిన అవసరంలేదా? అనంతమూ, సంకీర్ణమూ, అభేద్యమూ అయిన జీవితంముందు మానవ ప్రయత్నం అల్పమేనా?

వినోద్ కారు లోపలికి వచ్చింది.

ఛీ, ఛీ. ఏమిటీ బేలతనం? అనుకుని కళ్ళు తుడుచుకుంది మనో.

వినోద్ వచ్చి ప్రక్కన కూర్చున్నాడు.

''ఏమిటలా వున్నావ్, మనో?'' అన్నాడు.

లెటర్ తీసి అతని కిచ్చింది.

అంతా చదివి నిండైన సానుభూతితో అన్నాడు: 'మనం ఏమైనా సహాయం చెయ్యగలమా, మనో?'

అతనివేపు కృతజ్ఞతతో చూసి తల అడ్డంగా ఆడించింది. అవును...చెయ్యటం...ఇప్పుడు తాము చెయ్యగల్గిందేమీలేదు!

'వాచ్ ఏమిటి?' అడిగాడు వినోద్.

'ఆ, పాతవాచ్, ఒక పాత పాకెట్ వాచ్' అన్నది మనో. ఆ వాచ్ చుట్టూ అల్లబడ్డ అనవసరపు భావబంధాలూ, ఘర్షణలూ అకస్మాత్తుగా ఛేదించుకుపోయాయి.

ఆమె మనసులో అప్పుడే ధర్మ చచ్చిపోయింది. స్మశాన వైరాగ్యం కూడా అనుభవించేసింది. అంతా ఒక స్మృతిగా, అంద రాని చోట నిలిచిన చిన్న బరువుగా ఆఖరైపోయింది.

తన రాగద్వేషాన్ని తిరిగ్గా నెమరువేసుకుంటూ తనకి తానే కితకితలు పెట్టుకునే సోమరిబుద్ధి లేదు మనోకి.

సైకియాట్రీ పుస్తకాల్లో ఆరోగ్యవంతమైన మనస్సు గొప్ప దుఃఖంనుంచీ ఎంత సమయంలోపుగా కోలుకోవాలో వ్రాసి వుంటుంది.

దుఃఖపడి ఏమి సాధించగలం?

ఇంట్లోకి పోయి దైనందిన కార్యక్రమం ప్రారంభించింది మనో...

మ న స్సు

శ్రీ మేకా సుధాకరరావు

సాగర గర్భాంతరాంత రాళకు దూసుకు పోగలవీ
అంతరిక్షాన్ని చీల్చుకు పోగలవీ
నా లోచనాలు కనలేనివింకా ఎన్నెన్నో
చూడగలిగే సులోచనాలున్నాయి, నా మనస్సుకు !

నా చెవులు వినలేని
ఏ విశ్వగోళాంతర రేఖల విరిసిన
శబ్దాలనైనా వినగలిగే చెవులున్నాయి !
లేళ్ళలా, సెలయేళ్ళలా
పరుగులెత్తే కాళ్ళున్నాయి !
జెట్ విమానాన్ని మించి పోగల
రెక్కలున్నాయి !

స్వేచ్ఛ దాని ఊపిరి —
అందుకే
ఏ పంజరంలోనూ
బందీకృత కావడం సహించలేదు.

నా మనస్సు వెన్నెల
మల్లెల వనం
చల్లనిది — తెల్లనిది.
దానికో మంచి మనస్సుకూడాఉంది !

ఎవరు ఏ బాధానిదాఘాల ఊసరిలి మూర్ఛినా
ఊరి పారలే కన్నీటి చెలమలున్నాయి
నా మనస్సులో.
ఇంకా
గాలిలో ఈదాలనీ
సముద్రంలో ఎగరాలనీ...
ఏవేవో రంగు రంగుల ఊహల మేఘాలు —
బాధలూ భయాలూ, కష్టాలూ నష్టాలూ
ఎవ్వరికీ మిగలకూడదనీ;
సుఖజీవనం అందరిసొత్తూ కావాలనీ ...
అంతులేని ఆశయాల రాశులు !
ఎన్నెన్నో ఆశల మోసులు !
భాషకందని భావాల ప్రవాహాలు !
అది సుషుప్తిలో
కవితల స్వప్నాలు కంటుంది
శూన్యంలో సృష్టి సౌందర్యాన్ని చూస్తుంది !
మంచి దాని మతం
మానవత్వం దాని నైజం
ప్రేమ దాని ప్రాణం
కాంతి దాని అన్వేషణ
శాంతి దాని ఆవాసం.

కన్నడమూలం · డా. శివరామ కారంత్

శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

[జ్ఞానపీఠ బహుమతి గ్రహీత డా. శివరామ కారంత్ గారు రాళ్ళపల్లి, కన్నడకవి జి. పి. రాజరత్నం గార్ల గురించి వ్రాసిన (ఉదయవాణి 22-3-79) వ్యాసంలో రాళ్ళపల్లి వారికి సంబంధించినంత వరకు అనువదించబడినది].

ఈ మార్చి 11వ తేదీన నేను బెంగుళూరులో వుంటిని. మరుసటి ఉదయం పత్రికలో నిన్న సాయంకాలం రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు స్వర్గస్థులయ్యారన్న వార్త పడింది. ఆ సాయం కాలమే తిరుపతి దేవాలయాధికారులు శర్మగారిని బెంగుళూరులోని వారి స్వంత యింట్లోనే సన్మానించారు కూడా. ఆ గౌరవం జరిగిన కొన్ని గంటల్లోనే శర్మగారు పరమపదించారన్న వార్త విని నేనెంతో బాధపడ్డాను. శర్మగారి వయస్సు 87 ఏండ్లు. నా పరిచితులలో చాలా గణనీయమైన వ్యక్తి మరణించడం నా బాధకు కారణం. 12వ తేదీ సాయంకాలం బెంగుళూరులోనే ఒక సమావేశానికి బయలుదేరుతుండగా జి పి. రాజరత్నం (ప్రసిద్ధ కన్నడ కవి, పండితుడు) మరణించారన్న సంగతి ఆకాశవాణిలో విన్నట్లు మిత్రులొకరు నాకు తెలిపారు. ఈ వార్త దెబ్బతిన్న మనస్సుపై మరొక పోటు పొడిచింది. శ్రీ శర్మగారిని నేను చివరిసారిగా చూచి సుమారు సంవత్సరమైంది; రాజరత్నం గారిని చివరిసారిగ చూసింది రెండురోజుల క్రిందటే. మొన్న దర్మస్థలంలో జరిగిన కన్నడ సాహిత్య సమ్మేళనంలో వారిని కడసారిగా చూశాను. ఇద్దరూ నా మనస్సుపై చాలాకాలంగా చెరగని ముద్రవేసిన మహనీయులు. తమ పాండిత్యము, ప్రవర్తన, పవిత్ర జీవితముల ద్వారా నేనెన్నటికీ మరచిపోలేని జ్ఞాపకాలను వదలిపోయిన మహానుభావులు వారు. వారిద్దరి గురించి ఒకే వ్యాసంలో వ్రాయాలని నా మనస్సు నన్ను పోరుతున్నది.



శ్రీ రాళ్ళపల్లి

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు కొంతకాలం క్రిందట మైసూరు మహారాజా కాలేజిలో తెలుగు పండితులుగా పని చేశారు. వారు తెలుగు, సంస్కృతాలలో గొప్ప పండితులు. వారు సంగీతంలో కూడ పేరెన్నికగన్న విద్వాంసులు. వారు బిడారం కృష్ణప్పగారి శిష్యరికం చేశారని విన్నాను. 1926-29 మధ్య కన్నడదేశ సంచారం చేసే సమయంలో శర్మగారి అనుజులైన శ్రీ కె.ఎస్. ఆచార్లుగారు నాకు దావణగెరెలో పరిచయమైనారు. అప్పుడు ఆచార్లుగారు ఉపాధ్యాయ వృత్తిలో వుండేవారు. ఆ రంగంలో ఉత్తమ అధ్యాపకులుగానే కాక, విద్యావిధానంలో క్రొత్త ప్రయోగాల గురించి ఆలోచించేవారు కూడ. విద్యారంగంలో క్రొత్త ప్రయోగాల గురించి నాకు ఆసక్తి కలగడానికి కారణం వారే. వారితో పాటు మైసూరికి వెళ్ళిన నాకు శ్రీనివాసాచార్లుగారి అన్న అయిన రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారి పరిచయమైంది. అనంతకృష్ణశర్మగారు అనంతపురం జిల్లాలోని మారుమూలలోని రాళ్ళపల్లికి చెందినవారు. శర్మగారి తమ్ముని ద్వారా వారి పరిచయం పొందిన నేను మైసూరికి పోయినప్పుడల్లా వారి

యింట్లోనే బస చేసేవాడిని. వారెంతో పవిత్ర జీవితం గడిపేవారు. ప్రతి దినము నిష్ఠతో ధార్మిక కృత్యాలను నెరవేర్చేవారు. ఆలోచనా ధోరణిలోను, మాటల్లోను, చేతల్లోను నిష్పక్షపాతంగా వ్యవహరించేవారు. మైసూరులో వారి యింట్లో బస చేసినప్పుడు ప్రతిరాత్రి వారు ఫిడేలు వాయిస్తూ వుండగా వినేవాడిని. శర్మగారు వయొలిన్ వాయించటంలో గొప్ప సిద్ధిపొంది పేరుమోసిన విద్వాంసులు. అంతేకాక, సంగీత శాస్త్ర వైదుష్యంలో కూడ వారి సాధన గొప్పది. ఒకటి, రెండుసార్లు కర్ణాటక సంగీత సమ్మేళనాలకు అధ్యక్షులుగా వారు ఎన్నికైనారు. ఆ సందర్భాల్లో వారు చేసిన అధ్యక్షోపన్యాసాలు పుస్తక రూపంలో నేటికీ లభిస్తున్నాయి. సంగీతం గురించి శర్మగారికున్న శ్రద్ధ ఇంతింతనరానిది.

మహారాజా కాలేజికి వారు అలంకార ప్రాయులైన తెలుగు పండితులుగా ఉండేవారు. సహోద్యోగుల ద్వారా కూడ వారు గొప్ప గౌరవం పొందేవారు. సాయంకాల సమయంలో అప్పుడప్పుడు నేను, వి. సీతారామయ్య, శర్మగారు వాహ్యాళికి వెళ్ళినప్పుడు ఎన్నో విషయాల గురించి చర్చించుకొనే వాళ్ళము. సంస్కృతం, ధర్మశాస్త్రాల గురించి మట్టసంగా, నిష్పక్షపాతంగా మాట్లాడగలిగే ప్రతిభ వారి సొత్తు. ఒకమారు ఎందుకో అశ్లీలత గురించి ఒక ప్రసంగం వచ్చింది. అప్పుడు రాళ్లపల్లి వారు సంస్కృతంలో అశ్లీలత ఎంతగా నిండుకొన్నదో ఉదాహరణ సహితంగా వివరించినప్పుడు నాకు ఆశ్చర్యం కలిగింది. మన పండిత ప్రకాండులు తమ వాక్ చమత్కారాన్ని ప్రదర్శించేందుకై, సామాన్య ప్రజలు నిత్య జీవితంలో వాడేందుకు కూడ సంకోచించే కొన్ని నిషిద్ధ పదాలను లీలాజాలంగా ప్రయోగించి "బురదను శ్రీగంధంగా" ప్రదర్శించిన ఉదాహరణలను శర్మగారు వినిపించగా నేను నివ్వెరపోయాను.

మరోమారు 'మైదున' అనే పదం ఎలా పుట్టింది అని చర్చిస్తూ వుండగా 'మైధున' అనే పదం నుండి జన్మించిందని వారు చెప్పారు. ఆ శబ్ద వ్యాప్తి విచిత్ర సాంఘిక సంబంధాన్ని వ్యక్తీకరిస్తుంది.

నేను రెండుసార్లు శర్మగారిని దసరా ఉత్సవానికై పుత్తూరి (దక్షిణ కన్నడ)కి ఆహ్వానించి వుంటిని. ఆ సమయంలో వారి సంగీతోపన్యాసము, ఫిడేలు వాదన విన్నాను. తర్వాత వారెందుకో ఆ వాద్యం పట్ల ఎక్కువ దృష్టిని సారించలేదు. వారి శిష్యులైన ఏ. వి. కృష్ణమాచార్యులు ఐదవ దశకము నుండి నేటి వరకు నా కార్యక్రమములకు తోడ్పడుచున్నారు. తమ గురువు వద్ద నేర్చుకొన్న విద్యకు, వారు తమ స్వంత కృషి ద్వారా మెరుగులు పెట్టుకొని ఖ్యాతి పొందారు.

పాండిత్యం గురించి చెప్పేటప్పుడు కర్ణాటక సంగీత ప్రియులు జ్ఞప్తియందుంచుకొనవలసిన అంశమొకటి ఉన్నది. తిరుపతి దేవస్థానములో అన్నమాచార్యుల కీర్తనలు ఎన్నో రాగి రేకులపై వ్రాయబడి వున్నవి. ఆ దేవాలయ అధికారులు రాళ్ళపల్లి వారిని తిరుపతికి ఆహ్వానించి ఆకృతులకు స్వరప్రస్తారములను శర్మగారిచే వేయించి, వాటిని వెలుగులోనికి తెచ్చారు. కర్ణాటక సంగీతానికి శర్మగారి అవిశ్రాంతశ్రమ ఫలంగా లభించిన అపూర్వమైన కానుక ఆ కృషి. అంతవరకు త్యాగయ్య, క్షేత్రయ్య, అథవా దీక్షితుల పేర్లనే మనము వినియున్నాము. అన్నమాచార్యుల సంకీర్తనలను ఆ కోటికి చేర్చిన కీర్తి రాళ్లపల్లి వారికి దక్కుతుంది.

రాళ్ళపల్లివారి జీవితము, విద్వత్తు కంటె నాకు గొప్పగా తోచినది—శుచియైన, ప్రామాణికమైన, నిష్ఠావంతమైన వారి జీవితము. వారి నోటి నుంచి ఒక్క చెడ్డమాట కూడ రావటం నేను వినలేదు. అంతేకాక దాపరికమన్నది వారు ఎరుగరు. వారు చాలా గొప్ప వ్యక్తి. తమ దేహాన్ని త్యజించేందుకు కొన్ని గంటల ముందు తిరుపతి వేంకటేశ్వరుల నుండి అంతిమ సన్మానం లభించుట, అంత్యకాలంలో వారికెంతో శాంతిని, జీవనసార్థక్యాన్ని చేకూర్చిందనుకొంటాను. ఒక్కమాటలో చెప్పాలంటే రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి జీవితం ఉన్నతమైనది అని అనవచ్చును.

తెలుగు : శ్రీ ఘట్టమరాజు అశ్వత్థనారాయణ



కన్నీటి బిందువు!

దిలావర్

ఎంత తపస్సు చేసి పొందిన వరమో
ఈ కన్నీటి బిందువు !
అంతరాంతర సీమల్లోంచి పొంగే
మానవతా సింధువు !

ఏకాంతంలో సేదదీర్చే ప్రియ కాంతలా
చెక్కిలిపై అనురాగ స్పర్శ !
ఏ కష్టాల కాంతారంలోనైనా తోడునిలిచే
ఏకైక హృదయ స్పర్శి పరామర్శ !

ఎద ఎదనూ కలిపి పల్లవించే
ముగ్ధ మౌనగీతం !

స్నేహమనే వసంతాన్ని స్వాగతించే
మోహన పిక సంగీతం !

హృదయ సాగర మథనంలో ఉద్భవించే
అమూల్య కరుణామృతం !
పగిలిన గుండెల బీటలపై వర్షించే
అపూర్వ ప్రావృణ్ణీరదం !

హృదయమున్న కన్నుదోయిలోనే
మొలుస్తుంది ఆ నందనం !
కన్నులున్న తీపి గుండెలోనే
ఆ జీవ స్పందనం !

విషాదచిత్రం

శ్రీ బి. మురళీధర్

నేనొక విషాద చిత్రాన్ని !
మాడిపోయి మసిగా మిగిలిన గతాన్ని !
అయినా చావలేదింకా ఆశ !
చల్లారలేదింకా నాలోని జిగీష !
ఒకప్రక్క—నిమ్నోన్నత హిమాలయాల ఔన్నత్యం.
మరొకప్రక్క—అగాధాల్లో అసంపూర్తిగా వదలివేసిన గాథలు
సంస్కృతీ, సాంప్రదాయాలు—తాతలు తాగిన నేతిమూతులు!
పచ్చనిచేలూ—పైరగాలులూ—కోరస్ లలితగీతాలు !
రాతలూ—కోతలూ—కాగితాలకు అంకితాలు !
వ్యవస్థ 'పిచ్చితీగె' పై అడుగువేసింది.
సంఘం తనకు తానే విడాకులిచ్చుకొంది.
ప్రజాధనం—ప్రభంజనంల వావిలేని రాసలీలలు !
ఎలుకలకు పిల్లులు ఆనవాయితీగా సాక్ష్యమిస్తున్నాయి !
సింహాలు—లేళ్ళను పెట్టుబడిగా వ్యాపారం పెట్టాయి !
సూర్యుడు !...పని ఎగ్గొట్టి పారిపోతున్నాడు !
దివిటీలు పట్టుకొని...జాతినంతా వెనకేసుకొని...
వెతకడానికి...ఎవరో !... పిచ్చివాడిలాగున్నాడు !
ఆకాశంలోని అరుణాన్ని అరువడిగి లేదనిపించుకున్నాను.
పోనీలే !...విషాద చిత్రంగానే మిగిలిపోతాను.
కాని—పోయేముందు—నాలోని సందేశాన్నద్దటానికి —
ఒక్కటంటే ఒక్కటి!...'నిష్కల్మష స్ఫటికశిల' కరువైంది.

శ్రీ జి. జవహరలాలు

జగదేకమల్లుని సైదాపురం జిన శాసనము

ఈ శాసనమును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పురావస్తు పరిశోధన శాఖ వారు[1] కనుగొని కాపీ చేసి యున్నారు. ఇది సైదాపురం గ్రామానికి దాపున గల వరి పొలాలలో నున్నది. ఈ సైదాపురం భువనగిరి తాలూకా, నల్గొండ జిల్లాలో నున్నది. ఇది జిన శాసనము (Jina's Commandment) గా మూల శాసనములోనే లిఖింపబడియున్నది. ఎనుబది ఒక్క పంక్తులు కల్గి శిలా శాస్త్ర విజ్ఞులకు (Epigraphists) కంఠక ప్రాయము గాక (శాసన మూడవ ముఖము మినహా) చక్కటి వివరణతో యున్నది. ఇది చాళుక్య ప్రభువైన రెండవ జయసింహునిచే నొసంగబడిన దాన శాసనం. ఇతనికి జగదేకమల్లుడని బిరుదము గూడా కలదు. ఇతడు చాళుక్య సామ్రాజ్యాన్ని క్రీ. శ. 1015 నుండి క్రీ.శ. 1042 వరకు పరిపాలించెను. రెండవ జయసింహుడు జైనమతాభిమాని యని మనకు సారస్వత మూలముల (literary sources) నుండి మాత్రమే యిప్పటి వరకు తెలియుచున్నది. మన రాష్ట్రములో యీ చాళుక్య ప్రభువు యొక్క జిన శాసవము లభ్యమగుట యిదియే ప్రథమము. మరియొక విచిత్రము ఏమంటే యీ సైదాపురంలోనే ఇదే జయసింహునిచే వేయించిన మరియొక జిన శాసన ముండుట. రెండునూ ఇంచుక భేదము లేక ఒకే వివరణ కల్గి ఒకే సంవత్సరములో ఒకే తిథిలో యిచ్చిన శాసనములు. మొదట శాసనములో ఏ ప్రక్క నంస్కృతము వాడలేదు. ప్రస్తుత శాసనము యొక్క రెండవ ముఖము ఐదు సంస్కృత శ్లోకములు కల్గి యున్నది. ఈ భేదము మినహా రెండు శాసనాలు ఒకే వివరణ కల్గి వున్నవి. ఇది నిజముగా అపురూపమే !! ఒకే వివరణ కల్గిన రెండు శాసనాలు ఒకేరాజు ఒకే వూరిలో యిచ్చుటకు గల ఔచిత్యము మనకు తెలియకున్నది.

ఈ శాసనము 10,11వ శతాబ్దమునకు చెందిన తెలుగు–కన్నడ లిపి కల్గి రాతిపై మూడువైపుల చెక్కబడియున్నది. కొన్ని అక్షరాలు మినహా అన్నియును పెద్దవిగా గుండ్రముగా వ్రాయబడి యున్నవి శాసనము యొక్క మొదటి ప్రక్క, ఆఖరి ప్రక్క కన్నడ భాష, రెండవ వైపు మాత్రము సంస్కృత భాష వాడ బడినది. ఈ రెండవ వైపు వాడిన సంస్కృత శ్లోకాలు శార్దూల విక్రీడితము, వసంత తిలకను ఉపజాతి (అనగా ఇంద్రవజ్రము మరియు ఉపేంద్రవజ్రము) మాత్రా ఛందస్సు (Metres) గల్గి ఉన్నవి. కన్నడ భాషలో గాని, సంస్కృత భాషలో గాని చెప్పుకో దగ్గ వర్ణ పరిచ్ఛేద (Orthography) లక్షణాలు వాడినట్లు కానరాదు. ఈ శాసనములోని ఔచిత్యము ఏమనగా శాసన గ్రహీత అయిన అగ్గలయ్య గొప్ప ఆయుర్వేద వైద్య శాస్త్రజ్ఞుడు. వైద్య రత్నాకరుడను బిరుదు గల్గిన జిన మతాభిమాని. అతనికి వైద్య వృత్తిలో గల ప్రావీణతను మనకు తెల్పుటకు శాసనకర్త ఈ ఐదు సంస్కృత శ్లోకాలు ఎన్నుకొని చక్కగా ఇట్లు వివరించినాడు.

[శాసనము యొక్క రెండవ ముఖము : పంక్తులు 25–51]

1) నిర్దేహా (శా)య సతాం హితాయ విదుషాం...।
తాత్మానం = ఆరోగ్యాయ నృణాం సుఖాయ సుహృదాం–
తుష్ట్యై గురుణాం సదా।
రక్షాయై–జిన శాసనస్య భిషజాం శాస్త్రక్రియా
సమసయ=ఆది=ఉచ్ఛేదాయ–చ–పద్మ భూ స్సహజః–
శ్రీ వైద్యరత్నాకర (రః)॥

2) ఆయుర్వేద విదం సదాపటుధియాం–యే–శాస్త్రకర్మక్రమే।
ప్రౌఢాః – శ్రీ జగత్=ఏకమల్ల నృపతేర్=య్యే శాస్త్ర పారంగ తాః।
తేషా (ం) సంసది శస్త–శాస్త్ర కు (సలః) శ్రీ–
వైద్యరత్నాకరః।
జేతా వా (ది) (బలా) ర్గల (ః) బుధ నిధి శస్త్రేణ శాస్త్రేణవా॥

3) యద్యత్ర శాస్త్ర = ఆదిషు కర్మ కరోతి లోకః తంతు పరవే (త్సి) నరవైద్యకం అగ్గలార్యః ద్రవం (వ్యం) తథా పదిద త (తాపి)
(తి) సుఖం విధాతుం సింహస్య తస్య చ త థ్యామహి (మా) గ (గు) ణస్య।

4) అశక్య బ్యా (బా) దేపి – పరైః– భిషగ్భిర్ వ్యాధిప్ర (కోపే) తదు పక్రమేచ।
తం అగ్గలార్యం పుసరూ (హ) దక్షం – నిరూహ దక్షం కరయుంన్తి దితు॥

5) (వుమా (జ)శ్యం=ఆద్యం @)సంగ్రహ పరిచ్ఛేద –క్రియా కౌసః=ఉద్దామ

ప్రథిత శస్త్ర — శాస్త్ర విషయ ప్రాగ్గ (ణ్య) మనోర్జిత
ప్ర (దం) (కమ్మిగ?) చక్రవర్తి జయసింగం మే.
... ...
... ...

(చివరి రెండు పంక్తులు పరిశోధనకు చేరువలో లేవు)

సర్వసామాన్యముగా జిన శాసనాలన్నియు జిన స్తుతితో ప్రారంభ బడుతాయి. ఇప్పటికి నేను దాదాపుగా మూడు జిన శాసనాలు కనుగొని పరిశోధించి యుంటిని. ప్రతి జిన శాసనం యీ జిన స్తుతితో ప్రారంభమగుట కద్దు :—

శ్రీమత్ పరమ గంభీర స్యాద్వాదామోఘ లాంచ్ఛనం జియాత్

త్రైలోక్య నాథస్య శాసనం జిన శాసనం॥

జిన శాసనమని చెప్పచూ జినస్తుతిలేని శాసనాలు బహు కొద్దిగా లభ్యమయినాయి. ఆ బహుకొద్ది శాసనాల జాబితాలో చేరిందే యీ జినశాసనం. జిన శాసనాలకు భిన్నముగా ఇది చాళుక్య ప్రశస్తితో ప్రారంభమయినది. ఈ శాసనము శకవర్షము 956, భావ సంవత్సరమున, జ్యేష్ఠము, బృహస్పతి వారము, పున్నమి సోమగ్రహణమున నొసగబడినది. ఇది క్రీస్తుశకము 1034 జూన్ నెల 4 వ తేది, మంగళవారమునకు సరిగా సరిపోవు చున్నది. చాళుక్య రాజగు జగదేకమల్లుడు పొట్లకెరె (ఇప్పటి పఠానీ చెఱువు) యందు బస (Camp) చేసినప్పుడు వైద్యరత్నా కరుడు, ప్రాణాచార్యుడు అగు అగ్గలయ్య ప్రార్థన మేరకు ముచ్చన పల్లి యందున్న బుధసేన జినాలయమునకు యీ దాన శాసనము నొసంగ బడినట్లు యీ శాసనం తెలుపుచున్నది. పై రెండు జినాలయములు ఆలేరు — 40 మరియు కొల్లిపాక—7000లలో నున్నట్లు గూడ శాసనము తెల్పుచున్నది. శాసనము రెండవముఖము అగ్గలయ్యకు ఆయుర్వేద వైద్యము నందు గల ప్రతిభా విశేషము లను విపులీకరించుచున్నది. ఇతర వైద్యులచే మొండిరోగములుగా (Incurable diseases) నిర్ధారించినవి గూడ యీ రాజవైద్యుడు అతి సునాయాసముగా ఆయుర్వేద వైద్యముతో మాయముచేసే వైద్యశిఖామణియట. ఈ శాసనం ఆఖరి ముఖం దాన మొసంగిన ప్రదేశాల సరిహద్దులకు కేటాయించబడినది.

ఈ శాసనములో తెల్పిన జగదేకమల్లుడు శాసనకాలాన్నిబట్టి చాళుక్య చక్రవర్తియగు రెండవ జయసింహుడుగా గుర్తింపనగును. పైని చెప్పిన ప్రకారము చాళుక్య చక్రవర్తియగు రెండవ జయ సింహుడు జినమతాభిమానిగా తెల్పే శాసనం మన రాష్ట్రంలో లభ్యమగుట యిదియే ప్రథమం. కాని హైదరాబాదులోనున్న ఖజానా బిల్డింగు మ్యూజియం (గోల్కొండ దగ్గర)లో ఈ జగదేకమల్లుని జినశాసనము పదిలపర్చ బడియున్నది. ఇది ప్రస్తుత కర్నాటకలో నున్న 'మస్కి' గ్రామంనుండి తరలించినట్లు చెప్పబడుచున్నది ఈ రెండు శాసనాలు మినహా మన రాష్ట్రంలో యింతవరకు రెండవ జయసింహుని జినశాసనాలు లభ్యంకాలేదు కన్నడ బసవ పురాణం ప్రకారము 'పొట్లకెరె' చాళుక్య రాజు జయసింహునకు రాజధానిగా నున్నట్లు తెలియుచున్నది ఈ శాసనం 'పొట్లకెరె' జయసింహుని తాత్కాలిక మజిలీగా పేర్కొనుచున్నది. ప్రస్తుత నా ఉద్దేశ్యం చాళుక్య రాజ్యపాలనా విపులీకరణపై కాదు గాబట్టి యీ సమస్యపై చర్చ యిచ్చుట అప్రస్తుతం. 'పొట్లకెరె' జయ సింహుని ఆధీనములో నున్నదని, జినాలయములకు నాతడు దానము లొసంగి ఉద్ధరించెనని చెప్పుట చరిత్ర కందిన సత్యము.

ఈ శాసనము వలన మనకు తెలిసిన మరియొక ముఖ్య విష యము—క్రీ. శ. పది—పదకొండు శతాబ్దంలో ఆయుర్వేదవైద్యము బాగుగా అభివృద్ధిచెంది శస్త్రచికిత్సలు గూడ ఆయుర్వేద వైద్యు లచే నిరపాయంగా చేయబడెడివని తెల్పుట. ఆయుర్వేద వైద్యము నకు గల ఉచ్ఛస్థితి గురించి తెల్పు శిలాశాసనాలు మనకు లేవనే చెప్పాలి. అన్ని శాస్త్రాల ప్రగతి గురించి తెల్పే శాసనాలు మనకు లభ్యమయినవి. వైద్యశాస్త్రం, ముఖ్యంగా ఆయుర్వేదము గురించి తెల్పే శిలా శాసనాలు మన రాష్ట్రంలో యింతవరకు లభ్యంకాలేదు. క్రీ. శ. 1024వ సంవత్సరమునకు చెందిన శిలాశాసనం[2] లో జినాచార్యుడు, అనంతవీర్యమునికి వివిధ శాస్త్రములలో గల పాండి త్యమును గూర్చి తెల్పబడియున్నది. అట్లే 11వ శతాబ్దానికి చెందిన శిలాశాసనం[3] లో శైవాచార్యుని ప్రతిభా విశేషాలు పొందు పరుచబడి వున్నవి. మరియొక శాసనము[4] న ఇద్దరు జిన శాబ్దికు (Grammarians) ల గురించి, వారి గొప్ప పాండిత్య ప్రతిభల గురించి తెల్పుచున్నది. కాని వైద్యశాస్త్ర ప్రావీణ్యులను ఏ శిలా శాసనం మనకు అందించలేదు ఈ శాసనం మూలంగా ప్రప్రథ మంగా ఆయుర్వేద వైద్యశిఖామణి, చాళుక్య రెండవ జయసింహుని రాజవైద్యుడు అగు అగ్గలయ్య వెలుగులోనికి తేబడినాడు. దుర దృష్టవశాత్తు యీ అగ్గలయ్య గురించి వైద్యశాస్త్ర పరిజ్ఞానం మినహా, ఏ విషయములు మనకు యీ శాసనం తెల్పలేదు. ఈ వైద్య రత్నాకరుడు, ప్రాణాచార్యుడు, ఎచ్చటివాడు? తల్లి దండ్రులు ఎవరు? మొదలగు విషయములు మనకు తెలియవు. భవి ష్యత్తులో మనకు తెలియరాగలవు ! !

ఈ శాసనములో తెల్పిన ప్రదేశములలో మొదటిది 'పొట్ల కెరె'. ఇది ప్రస్తుత పఠాను చెఱువు. హైదరాబాదుకు పడమర దిశగా 26 కిలోమీటర్ల దూరంలో నున్నది. ఇచ్చట త్రవ్వకాలలో లభ్యమయిన జినతీర్థంకరుల విగ్రహాలు మొదలైన జినావశేషము లను రాష్ట్ర పురాతత్వ శాఖవారు ఖజానా బిల్డింగ్ మ్యూజియంలో పదిలపర్చినారు. తదుపరి కొల్లిపాక—7000. ఇది నల్గొండ జిల్లాలోని యిప్పటి 'కుల్పాక'. ఇది ప్రఖ్యాత జినక్షేత్రము. ఇప్పటికినీ జినతీర్థముగా పేరెన్నిక గాంచియున్నది. తర్వాత ఆలేరు—40. ఇది వరంగల్లుజిల్లా జనగాం తాలూకాలోని యిప్పటి ఆలేర్. మిగిలినవి ఇక్కుర్కి, ముచ్చనపల్లి. వీటి ఉనికి లభ్యం కావ టములేదు. కాని యివి 'కుల్పాక' పరిసర ప్రాంతములో నుండ వచ్చును.

ఆఖరుగా యీ జినశాసనములో మరియొక విశేషమున్నది. ప్రతి జినశాసనము జినమతాభిమానిని తెల్పుటకు పూర్వము అతడు ఏ సంఘమునకు, ఏ గణమునకు, ఏ గచ్ఛకు చెందియుండునో తెల్పును. దానికి విరుద్ధముగా యీ శాసనము నేరుగా అగ్గలయ్యను తెల్పి యాతని సంఘారామ సంబంధము (**Monastic affiliations**) లను తెల్పలేదు. ఇది మిగుల శోచనీయము. ఇన్ని లోపములున్ననూ, ఆయుర్వేద వైద్యశాస్త్ర ప్రావీణుని వెలుగులోనికి తీసుకొచ్చిన ఘనత దీనికే దక్కినది.

శా స న పా ఠ ము

మొదటి ముఖము :

1 స్వస్తి సమస్త భువనాశ్రయ శ్రీ పృ–
2 థ్వీ వల్లభ మహారాజాధి రాజ–
3 పరమేశ్వర పరమభట్టారకం
4 సత్యాశ్రయ కుల తిలకం చా–
5 ళుక్యాభరణం శ్రీమత్ జగదే–
6 కమల్లదేవర్ శకవర్షే 956
7 నెయ భావ సంవత్సరద జ్యేష్ఠ–
8 ద పున్నమె బృహస్పతి–
9 వారదంన్దు పొట్టలకెఱె–
10 య నెలవీడి నోళ్ సోమగ్రహణ మ–
11 హా పర్వ్వ–నిమిత్తదిం వైద్య రత్నాక(ర) ప్రా–
12 ణ=ఆచార్య్యన్=అగ్గలయ్య బిన్నపదోళ్
13 కొల్లిపాకె–7000 దోళ్ గణ ఆలే–
14 రు–40 అ బళియ ము(చ్చు)న పల్లి యోళ్–
15 (అ)గ్గలెయ్యన్ మాడిసిద బుద్ధసేన జినా–
16 లయక్కం ఇక్కూరికి–ముకె–మాడిసిద వైద్యర–
17 త్నాకర జినాలయక్కం ముచ్చున(ప్ప)ల్లియ గావు–
18 న్డం నర వైద్యన్=అగ్గలయన మాడిద మయ్యా–
19 దె యెళాయేరడు బసదియ భోగక్కం ఖ–
20 న్డ స్ఫుటిత నవ సుధాకరం=అది గళం జా
21 కచ్చెయర కబ్బెయ బసదియ ప్రతి బద్ధ
22 (క) జ్కా స్థాన మాగె దేవ భోగం తత్–ప్ర –
23 తి బద్ధం బుద్ధిపాకె వాలిగ స–
24 (బె) టం చిట్ట ముచ్చునపల్లియోళ్ మలల్లెవ (ం)

రెండవ ముఖము :

25–51 పైని పూర్తిగా పేర్కొనబడినది.

మూడవ ముఖము :

[ఎక్కువగా అరుగుటచే పూర్తిగా అనువద యోగ్యం కాలేదు]

52 ప్రది యెళం సంగె (పన్డరాగర కుప వ) జయ
53 సింగం (దా)న ద్యాన......బసది–రక్కె బా–
54 (డరక) పొన్డు రాటాణ యెరడు కరయ నేల
55 –కి సుకాదు మాగె మట్టమ్నార్ ఱు పూ–
56 దొంట సున్డ నివేసనం పట్టు (ఘర) ద్రమ్మ
57 మెన్డ గావున్డన మాన్యద పాఱ గా –
58 గె ఱకిద మామి యోళ్ పన్నెరడు ఱ కొల
59 గావున్డన......ట్టర–డు కొ–
60 న్డదొ–యపిరియ కెయ్య యెమ్డ
61 మ్మడియ బిట్టద–టెంకన–మడ్డిన
62 ధు వియ్యొం బాక బె యోళ్ పూ–కాల్గ
63 లొళ్గెల్ల......ణా ముఱుపూనం
64 ... . ల్లళ ప్రతి బద్ధం గిలళా
65 ... గెయ్దె ద్రమ్మం ఘరద్రమ్మ మెందు –
66 వణ–కాను పోయారమి యిదెందు తాళా–బన–మెందు పా–
67 వెత్పం–తొఱయ(ద)డ యెద్వార పడువణ
68 ...ణున యుగా–నెమెం యాగె పడువలు మూడ
69 లు సందస వన మెన్యేయు తొణ్డంక్కం మత్తార్ న్నాల్వ–
70 త్త...మూడణ గ(ద్దె)యె బెట్టెణద సామామాన్య –
71 దకెయ–చోళియ్యదె...పిదగణ బెట్ట ద
72 ...కెంమ్మట్టమ్మా-నూఱువ్వత్తు ఆయుగా –
73 ర సీ మెడిశాగ దోళ – బియ కందుకూర కతన క–
74 ఱెయ దశన–ప–కా–నందు...

75 మూ అ౹ వల్లె అజ్నేయ దోళ్ దనన కుండెయన
76 మావ రిష్ణ గంధ ద కల్లుందులుం—గెయ—లాం—
77 నడ కల్లొందు టెంకల్వ—యెందు...వీరె యోళె
78 ...కల్లదిందు—న...తె యెళ్వలంగ కు(ల్గె) యో
79 న్ను పడువణ దె......యె......న్ను వాయ
80 వ్యదోళ్ అవి కున్తెయ మాకె—ప్పను సె-
81 యకం ... ...

ఈ వ్యాస రచనకు పరిశీలించిన గ్రంథములు

1 శ్రీ జి. చంద్రయ్య, శాసన లిపి పరిశోధకుడు, పురావస్తు శాఖ, హైదరాబాదు, చే కాపీ చేయబడినది.

2 , మరోళ్ శాసనము. S 11, XI (i), 61, పంక్తులు 21–26. ఇందు అనంత వీర్యముని బహుశాస్త్ర కోవిదుడని, వ్యాకరణ, నిఘంటు, గణిత, వాత్స్యాయణ, జ్యోతిష, శకున, ఛ్ఛందస్సు, మను, గంధర్వ, అలంకార, మహా కావ్య నాటక, ఆధ్యాత్మిక, అర్ధశాస్త్ర, సిద్ధాన్త మరియు ప్రమాణ శాస్త్రములను ఇమిడ్చుకొన్న ప్రజ్ఞాశాలిగా తెల్పబడినది.

3 సుది శిలాశాసనం : E 1, XV, 88–89, శ్లోకాలు 10–11. శైవాచార్యుడగు సోమేశ్వర పండితుడు సత్ప్రవర్తనము, తపస్సులోనే గాక వైశేషికం, న్యాయ, సాంఖ్య, శబ్ద జ్ఞాన, మీమాంస యందును ప్రవీణత (Mastery) గలవాడుగా పేర్కొనబడినది

4 ములు గుండు శాసనము : E 1, XVI 55, పంక్తులు 24–28. ఇందు నరేంద్రసేనుడు అతని శిష్యుడు నయసేనుడు గొప్ప జిన వైయ్యాకరుణులుగా కీర్తింపబడెన. వీరు చంద్ర, కాతంత్ర, జైనేంద్ర, శబ్దామ శాసన పద్ధతుల (Systems) లో పాండిత్యమును సంపాదించిన విద్వాంసులుగా కీర్తింపబడెను.

ఆత్మబోధ

శ్రీ మధునాపంతుల సత్యనారాయణమూర్తి

నిన్న రాలిపోయిన
  గడ్డిపువ్వుకేసి
నేడెందుకు హేళనగా చూస్తావు ?

నిన్న తాను నేటి నీకన్నా
ఎక్కువగా తుమ్మెదవడిలో
పరవసించిన నిజం ...
నీకు తెలిస్తే నువ్వేమౌతావు ?

నువ్వొక మహావృక్షానివనా !
ఆ వెదురు పొదలకేసి చూసి నవ్వుతావు ?

తానొకప్పుడు జగత్ప్రభువు అధరానికి
వేణువుగా అంకితమైన 'మురళి' కి
వారసురాలని తెలుసుకొంటే ...
నీ బ్రతుకెంత ? నీ ఘనతెంత ?



పనికి ఆహారం పథకం

నిరుద్యోగులకు, చేతినిండా పనిలేని వారికి లాభసాటి అయిన ఉపాధి కల్పించి, సామాజిక ఆస్తులను పెంపొందించే లక్ష్యంతో పనికి ప్రతిఫలంగా ఆహారం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఈ పథకాన్ని ముమ్మరంగా అమలు జరుపుతున్నారు. దీనికింద రు. **14·55** కోట్లు విలువచేసే కార్య క్రమాలను రాష్ట్రప్రభుత్వం చేపట్టింది.

ఈ కార్యక్రమం క్రింద ఇంతవరకూ **1056** కి.మి. పొడవున కొత్తరోడ్లు **3170** కి. మి. పొడవున మెటల్, కంకరరోడ్ల మరమ్మత్తులు, **170** పాఠశాల భవనాల నిర్మాణం, **134** నీటిపారుదల వనరుల నిర్మాణం వంటి కార్యక్రమాలను చేపట్టి పూర్తిచేశారు.

వీటివలన **49,392** లక్షల శ్రామిక దినాల మేరకు ఉపాది కల్పించగలిగారు.

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాద్.

48/78–79

శ్రీ కప్పగంతుల మల్లికార్జునరావు


రాజమహేంద్ర పురప్రశస్తి-యిటీవల లభ్యమైన చారిత్రకాంశములు

రాజమహేంద్రపురము వేంగీ చాళుక్య రాజుల ముఖ్య పట్టణమైన తదాది తెలుగు దేశ చరిత్రలో వివిధ కాలాలలో అత్యంత ప్రధాన పాత్ర వహించినది. తెలుగు వారి జీవన విధానాన్ని, రాజకీయ ఆర్థిక, సాంఘిక సంస్కృతీ రంగాలలో అత్యంతప్రభావితం చేసినది. అయినప్పటికీ వేంగీ చాళుక్యులకు పూర్వపు ఈ నగర చరిత్ర ఇంతవరకు పరిశీలించబడలేదు. అనేక చారిత్రకాంశాలు యిప్పటికీ అవరేష్కృతంగానే వున్నాయి.

ఇటీవల ఈ నగరమందు కొన్ని ముఖ్యమైన పురావస్తు అవశేషాలు బయలుపడ్డాయి. ఒకటి – నందీశ్వర విగ్రహం. రెండు – ఈ విగ్రహం లభ్యమైన చోట జరిగిన త్రవ్వకాలలో బయటపడ్డ చారిత్రక అవశేషాలు. మూడు – నమూనా విమానము.

స్థలపు ఉనికి: (చిత్రము - 1)

గోదావరికి తూర్పు వొడ్డున, ఆంధ్రకేసరీ సెంటనరీ జూనియర్ కాలేజీకి సమీపంలో వొక సినిమా హాలు నిర్మాణార్థం పునా



చిత్రము – 1

దులు త్రవ్వుచుండగా ఈ నందీశ్వర విగ్రహం బయలు పడింది. ఈ స్థల విస్తీర్ణం 71 మీటర్లు. ఈ స్థలమందు సినిమాహాలు నిమిత్తం యజమానిచే ప్రతి దిక్కునా పునాదిగా పది పరిఖలు Trenches) త్రవ్వబడ్డాయి. దక్షిణము వైపునగల పశ్చిమ - తూర్పు వరుసలలోని పది పరిఖలలో, మూడవ పరిఖలో షుమారు ఒక మీటరు లోతులో నందీశ్వర విగ్రహం బయటపడింది.

నందీశ్వర విగ్రహం

తల ఎత్తి, మోకాళ్లు మడిచి విశ్రాంతి తీసుకొంటున్న భంగిమలో గోదావరి నదివైపు పశ్చిమ ముఖంగా కూర్చొనివున్న ఈ నందీశ్వర విగ్రహం, 146 × 60 × 90 సెంటీమీటర్ల పరిమాణంలో ధవళవర్ణ సమన్వితమైన కరిన శిలపై చెక్కబడింది. (చిత్రము-2)

మువ్వల హారం, గండు మువ్వలతో కూడిన పుష్పహారం, జాలరులు గల ముఖ పట్టెడ, ఉదర పట్టెడ, గజ్జెల గొలుసు యిత్యాది అలంకారాలతో విలసితమైన ఈ విగ్రహం అత్యంత సహజంగా, కళాత్మకంగా వున్నది. శృంగభాగం, కనుల నుంచి, గిట్టల తోకవరకు అత్యంత సహజ సిద్ధంగా, జీవకళ వుట్టిపడునట్లు శిల్పి విగ్రహాన్ని మలచినాడు. శిల్పకళా దృష్ట్యా ఈ విగ్రహమొక కళా ఖండము. నందీశ్వరుని కర్ణ భాగములు పగిలిపోయియున్నవి.

నందీశ్వరుని పీఠ భాగమున ఈ క్రింది శాసనము గలదు. (చిత్రము—3)

"మృకండు లింగ నకు మారెళ బీమన సమర్పించ్చిననంది"

శాసన రచనకు వాడిన కొన్ని అక్షర రూపాలనుబట్టి ఈ విగ్రహం పదమూడు, పదునాలుగవ శతాబ్దుల నాటిదని చెప్పుటకు అవకాశమున్నది.

నందీశ్వర విగ్రహం లభ్యమైనచోట త్రవ్వకాలు - వివరాలు

నందీశ్వరుని విగ్రహం బయల్పడినదని తెల్పిన తర్వాత ఆశేష పుర ప్రజలతో పాటు నేనును వెళ్లి ఆ స్థలమును చూచితిని. నందీశ్వరునితోపాటు అదే పరిఖలో మరికొన్ని శిల్ప శకలములు కూడా కనుగొనబడినవి. అవియన్నియు దేవాలయ భాగములే. యిపట్లుండ ఉభయ గోదావరి జిల్లాలకు పురావస్తు శాఖ క్యూరెటర్ పత్రికా గోష్ఠి సల్పి, అందు నందీశ్వరునియొక్క చారిత్రకాంశాలను వివరించిరి. ఆ తర్వాత నంది విగ్రహం లభ్యమైన పరిఖను వదిలి స్థల యజమానులు మిగిలిన ప్రాంతములలో త్రవ్వకం పని కొనసాగించు చుండిరి అడ్డం వచ్చిన పెద్ద శిలలను పగులగొట్టి గుట్టలుగా పోయుచుండిరి శిల్ప భరితులు కానప్పటికీ ఈ శిలలన్నియు మెరుగు పెట్టబడి నటువంటివి. (Polished stones) తూర్పు చాళుక్య రాజులు ఆలయ నిర్మాణములలో అధిక భాగం యిటువంటి శిలలనే



చిత్రము 2 నందీశ్వరుడు

ఉపయోగించిరి. అంచేత తెల్సియో తెలియకో జరుగుతున్న ఈ విధ్వంసనాన్ని చూచి భరించలేక, ఈ స్థలము చారిత్రక ప్రాధాన్యత కలదనీ, దీనిని పరిశీలించాల్సిన అవసరాన్ని వివరిస్తూ స్థానికపత్రికలో నేనొక ప్రకటన చేసితిని.[1] ఈలోగ క్యూరేటర్ గారు నా యొద్దకు వచ్చి తమ స్థలములో ఉత్ఖాతనము (Excavation) జరుపనున్నట్లు తెల్పి, సన్నాకార్యములో పాల్గొనమని కోరిరి. అలా ఆ ఉత్ఖాతనము లలో పాల్గొను అవకాశం లభింపచేసిన క్యూరేటర్ గారికి కృతజ్ఞతలు.

స్థల యజమానులచే త్రవ్వబడిన పరిఖలలో నవుతేనేమి, మాచే త్రవ్వబడిన రెండు పరిఖలలో నవుతేనేమి, మొత్తం మీద త్రవ్వినంత మేరకు ఆరుస్తరములు (layers or Stratas) గలవు.

మొదటి స్తరము :

విశేషము లేమీ లభ్యం కాని యీస్తరము ఎర్రబంక మట్టితో కూడివున్నది. యుగిపోయినది.

రెండవ స్తరము :

యీస్తరమునందు, గోదావరి వొడ్డున యిప్పటికినీ గల ఏతము నుంచి నీటి పారుదల కోసం కట్టబడిన యిటుక కాలువ బయల్పడినది. దీని నిర్మాణార్థం వుపయోగించిన యిటుక పరిమాణం 26 × 13 × 5 సెంటీమీటర్లు. నాలుగు వరుసల్లో కట్టబడిన యీ కాలువ నిర్మాణంలో సున్నము వుపయోగించబడింది. మధ్య మధ్య మట్టితో చేసిన గొట్టములు వాడబడినవి. ఏతాము, యీ కాలువ, పంధొమ్మిదవ శతాబ్దపు పిఠాపురం రాజుల నిర్మాణములు కావచ్చును.

మూడవ స్తరము :

నందీశ్వర విగ్రహము లభ్యమైన స్తరము యిది. కొన్ని పరిఖలలో ఈ స్తరమందు బొగ్గు ముక్కలు విస్తారముగా కానవచ్చినవి. మత సంబంధమైన అగ్ని కార్యములో, లేక శత్రువులచే దహనకాండయో జరిగియుండెడిదనుటకు ఈ బొగ్గు ముక్కలు నిదర్శనము! అంతేకాక ఈ స్తరములో స్థలమంతటా మెరుగు పెట్టబడిన శిలలు, ఎఱ్ఱయిసుక శిలలు అతి విస్తారంగా కానవచ్చాయి నందివున్న దేవాలయానికి చెందిన శిలలు యివి. నంది లభ్యమైన పరిఖ చుట్టూ వున్న పరిఖలలో ఏకఖండిక శిల కానవచ్చినది. బహుశా యిది నందిపీఠము యొక్క నేల భాగమై యుండవచ్చును. అష్టదళ పద్మయుత శిథిల స్తంభ శీర్షము. (చిత్రము–4) 14 గుంటలు గల రాయి (వామన గుంటలా) కోడిగుడ్డు ఆకారంలో గల రాతి చిప్ప (కల్వమా), స్తంభమున కుపయోగించిన మరి రెండు శిలలు (చిత్రము–5) కూడా లభ్యమయినవి. యిదే స్తరములో మరికొన్ని పరిఖలలో, చేతిపిడి గోడ (Baluster) గుండ్రని రెండు తూనికరాళ్ళు, మట్టిహుక్కా తదితరములు లభ్యమయినవి. ఈ వస్తువులు, చెల్లాచెదురుగ పడివున్న దేవాలయకట్టడానికి వుపయోగించిన శిలలు, నందీశ్వరుని కర్ణభాగం పగిలిపోవడం యివన్నీ ఆ స్తరకాలంలో విధ్వంసనకాండ జరిగెనన్న దానికి ప్రమాణములు.

నాలుగవ స్తరము :

ఈ స్తరమందు విశేషములేమీ గోచరించలేదు.


అయిదవ స్తరము :

అత్యంత ప్రాముఖ్యతగల స్తరము యిది. ఏలనన ఈ స్తరమందు వొక ఇటుక నిర్మాణము కన్పించినది. బహుశా ఈ నిర్మాణము గోడదై యుండవలెను. ఇటుకయొక్క పరిమాణం 30.5 × 20.5 × 7.5 సెంటీమీటర్లు. (చిత్రము–6) తొమ్మిది ఇటుక వరుసలుగల గోడ యిది. ఈ గోడ వెడల్పు ఒక మీటరు వుండటం అపురూపమైన అంశం. త్రవ్వినంతవరకు ఈ గోడ 10 మీటర్ల పొడుగున లభ్యమైనది. గోదావరివైపు పక్క స్థలములోనికికూడా ఈ గోడ కట్టడం విస్తరించియున్నది. ఈ స్తరమందే వొక పరిఖలో మట్టి వలయాలతో కట్టబడిన బావి (Ring well) లభ్యమైనది. రెండు మీటర్ల లోతుగాగల ఈ బావి స్థలమునకు ఈశాన్య దిక్కున వుండుట గమనార్హము.


ఉత్ఖాతనం జరుపబడ్డ రెండు పరిఖలలో వొక పరిఖయందు అయిదు ఆరవస్తరములమధ్య ఖనన మృణ్మయపాత్ర లభ్యమైనది (Secondary Pot Burial) త్రవ్వకంలో కొంత శిథిలమైన ఈ పాత్రయందు రకరకాల పరిమాణాలలో ఎముకలు, బొగ్గుముక్కలు, మూడు నాలుగు పోగులు మాత్రమేగల వొకగుడ్డ ముక్కగలవు. ఎముకలపై పింగళిపారసైతం కొన్నింటిమీద వూడిపోయివుంది. కర్బన రసాయన పద్ధతిద్వారా (carbon 14 method) పరిశీలిస్తేనేగాని పైన వివరించిన వస్తువుల కాలాన్ని ఇదమిద్ధంగా నిర్ణయించే వీలులేదు. కానీ ఈ కుండ మత సంబంధమైన కార్యకలాపానికి సంబంధించినదైనటువంటిదనే దానికిమాత్రం సందేహం లేదు.

ఆరవ స్తరము :

ఈ స్తరమందు బహువిస్తారముగా మట్టి మూకుడులు కానవచ్చినవి. పేర్చినట్లున్న ఈ మూకుడులు, పైన ఏదో వొత్తిడిరాగా చితికినట్లున్నవి. ఈ మూకుడులు పూర్వచరిత్ర యుగానికి (Early Historic perion) సంబంధించినవి. యిటువంటివి అనేక చారిత్రాత్మక స్థలములందు లభ్యమైనవి. దాదాపు స్థలమందంతటా వొకే స్తరమందు ఈ మూకుడులు లభ్యం కావటాన్నిబట్టి, ఆకాలమందు ఈ స్థలములో యిటువంటి మూకుడులు తయారుచేయుబట్టీ యొకటి యుండవలెనన్న భ్రమ కలుగును. కానీ పరిశీలించగా, తయారుచేసిన మూకుడులను భద్రపరచిన స్థలముగా కానవచ్చుచున్నది.



చిత్రము–3–1 మృకండు లింగా



చిత్రము - 3–2 నకు మారళ

పెట్టాకోట శకలము :

ఈ సందర్భమందు యాదృచ్ఛికముగా లభ్యమైన పెట్టాకోట ముక్కను గురించి ప్రస్తావించటం అవసరం. పునాదులు తీయు సందర్భంలో, మట్టి ఎత్తిపోయుచుండగా వో కూలీవాని మట్టి తట్టయందు దీనిని కనుగొనుట తటస్థించెను. దీనిపై వొక బొమ్మ యున్నది. ఈ బొమ్మ పగిలిపోయిన 'పూర్ణకుంభ' మను కొనుటకు వీలున్నది.

ఈ దశలో ఉత్ఖాతనము అకస్మాత్తుగా ఆపివేయబడినది. స్థల యజమానులకు సినిమాహాలు నిర్మాణ కార్యక్రమం కొనసాగించటానికి పురావస్తు శాఖవారిచే అనుమతి యియ్యబడింది. అనేక చారిత్రకాంశములు బయటబడుతున్న స్థలములో సహజ సిద్ధమైన (Natural Soil) మట్టి పొర వచ్చువరకు ఉత్ఖాతనములు విస్తృత స్థాయిలో కొనసాగించుటకు బదులు, సినిమాహాలు నిర్మాణానికి తోడ్పడటానికి గల కారణములేమిటో ఆ యా అధికారులకే తెలియవలెను. ఏమైనా ప్రస్తుతం ఈ స్థలమందు సినిమాహాలు నిర్మితమై యున్నది.

సమస్యలు - సమాధానములు :

1) ఈ స్థలమందు దేవాలయముండెడిదా? వున్నదశలో అది ఏ దేవాలయము? నిర్మాతలెవరు? కాలమేది? విధ్వంసనమెట్లు జరిగెను.

నందీశ్వర విగ్రహంతోపాటుగా లభ్యమైన శిల్పఖండాలు, మెరుగుపెట్టబడిన శిలాశకలాలు, అవి చెల్లాచెదరుగా పడివున్న రీతి, రెండు కాళ మధ్య చేతిపిడి గోడ పడివున్న పద్ధతి — వన్నీ పరిశీలించినట్లయితే యిక్కడ ఆ స్తరకాలమందు దేవాలయమొకటి యుండి యుండెడిదనుట కెటువంటి సందేహ ముండదు.

అయిన ఈ దేవాలయం ఏ దేముని కుద్దేశ్యించినది? నిర్మాత లెవరు?

నందీశ్వర విగ్రహ పీఠంపైగల వొకే వొక పంక్తి శాసనాన్ని బట్టి ఈ నంది 'మృకండు లింగానకు మారెళ బీమన సమర్పించి'నదిగా స్పష్టమవుతున్నది. యిందు పేర్కొనబడ్డ మృకండు లింగము, మార్కండేయేశ్వరుడు వొకరేనా?

1410–11 సంవత్సరములో కాటయవేముని భార్య మల్లాంబిక రాజమహేంద్రవర(పుర)మున మార్కండేయ శివాలయము గట్టించినట్లును, వృద్ధగౌతమి వొడ్డునగల మల్లవరము అను గ్రామమును అహోబలుని కుమారుడైన నృసింహ (శాస్త్రి) యను నతనికి దానమిచ్చినట్లును తొత్తరమూడి శాసనంద్వారా తెలియుచున్నది.[2] 1423వ, సంవత్సరమందు వీరభద్రారెడ్డి భార్య అనితల్లి, మార్కండేయ శివసన్నిధిని దేవ బ్రాహ్మణ క్షేత్రముల మీది పన్ను తీసివేసినది.[3]

''సురవిప్రక్షాత్రరం మార్కండేయేశ సన్నిధే...''

ప్రస్తుతం గోదావరి వొడ్డునగల మార్కండేయేశ్వరాలయము కాటయవేముని కాలమందు కట్టబడినటువంటిదికాదు. యిటీవలిది. కాగా శ్రీనాథ మహాకవి 'కమలాచలాగ్ర మార్కండేయ శివ శిరశ్శశి చంద్రికా ధౌత సౌధ వీధి'[4] అని, మరెన్నో రీతులుగా[5] అనేక పద్యాలలో మార్కండేశుని గురించి ప్రస్తుతించాడు.

కనుక, ఈనాటికీ పుష్పగిరిగా వ్యవహరించబడే యిప్పటి మ్యునిసిపల్ వాటర్‌వర్క్స్, హైస్కూలు ప్రాంతాలలో ఆనాటి మార్కండేయేశ్వరస్వామి ఆలయముండి వుండవలె. 1933 సంవత్సరములో లభ్యమయిన కుమారస్వామి విగ్రహం యిత్యాది శిల్పాలు ఆ మార్కండేయేశ్వరాలయమునకు చెందినవై యుండును.[6] మరి

ఈ మృకండుడెవరు? మారెళభీమన ఎవరు? ఈ మృకండుడు మార్కండేయేశ్వరుడుకాదు. మృకండేశ్వరుడే.

అదెట్లనిన—

భీమేశ్వరుడు దాక్షారామ సమేతంగా భీమమండలాన్ని పరిపాలిస్తున్న విధానాన్ని వర్ణిస్తూ శ్రీనాథ మహాకవి భీమేశ్వర పురాణంలో వ్రాసిన ఈ పద్యాన్ని చిత్తగించండి.

మ॥ సరిపాపంతుడు శ్రీ కుమార వనికా చాళుక్య భీమేశ్వరే
శ్వర దేవుండు సకంఠ బాంధవుడు శ్రీ సంవేద్యరాడ్భైరవుం
డిరువుం బౌర్యును గొప్పులింగము మృకండేశుండుగా నేలి ని
ద్ధరణీ మండలి భీమనాథుడు నిరాతంక ప్రతాపోద్ధతిన్.[7]

భీమేశ్వరుని యిరుగు పొరుగువారిగా మార్కండేశ్వరునిగాక మృకండేశ్వరుని ఈ పద్యంలో శ్రీనాథుడు పేర్కొనటం గమనార్హం.

అదీగాక పలివెల కొప్పేశ్వర ఆలయమందున్న అనితల్లి శాసనములో — 'గౌతమీ మహానదీ తీరమందును మార్కండేశ్వర మృకండేశ్వరు రుద్రపాదాల సన్నిధిని' అని యున్నది.[8]

రాజమహేంద్రపురమును వర్ణించు సందర్భాలలో శ్రీనాథుడు తరచు 'రుద్రపాదములు' అన్నపదాన్ని వుపయోగించాడు. గోదావరి పొంగినపుడు, తీరమునగల మార్కండేశ్వర, మృకండేశ్వరుల, పాదములవరకు వచ్చుచుండును. అందుచేత దీనిని రుద్రపాదక్షేత్రముగా వర్ణించియుండును. గోదావరికి ఆవలియొడ్డున కొవ్వూరుయొద్ద గల క్షేత్రము 'గోపాద క్షేత్ర'మని, ధవళేశ్వరమువద్ద 'రామపాద క్షేత్ర'మని ప్రసిద్ధినందినవి.

అందుచేత నంది విగ్రహము లభ్యమైన స్థలమునందు మృకండేశ్వరాలయమే యుండియుండవలెనన్నది స్పష్టమగుచున్నది. ఈ ఆలయము రెడ్డి రాజుల కాలమునందున్నను, అప్పుడు అంత ప్రసిద్ధిలో వున్నట్లు కన్పించుటలేదు. మార్కండేయేశ్వరుని పేర్కొన్నంత విరివిగా మృకండేశ్వరుని శ్రీనాథుడు పేర్కొనక పోవుటయే యిందుకు నిదర్శనము.

మృకండేశ్వర ఆలయ నిర్మాణకాలం - నమూనా విమానం : (చిత్రము—7)

ఈ సందర్భంలో గోదావరియొడ్డునే శంకరమఠం రేవునందు లభ్యమైన నమూనా విమానమును గురించి ప్రస్తావించటం అవసరం. ఆలనా పాలనా లేక ఒక చెట్టుక్రింద పడివున్న ఈ విమానం మైసూరుయందలి పురావస్తు శాఖ డిప్యూటీ ఎపిగ్రాఫిస్టు డాక్టర్ సంపత్‌గారి దృష్టిలోపడి వెలుగులోనికొచ్చింది. ఆయనతో కలిసి ఈ విమానమును పరిశీలించే భాగ్యం నాకు లభించింది.

దేవాలయ నిర్మాణ పరిభాషలో విమానమనగా గర్భగృహము పైన శిఖర పర్యంతముగల భాగము. గర్భగృహము, అందుగల దేవతామూర్తి (మూలవిగ్రహం) విమానరూపము, అందున్న శిల్ప సంపదలతో, నమూనాగా, అల్ప ప్రమాణంలో చేసి దేవాలయమందుంచు ఆచారము పూర్వమునందే గలదు.

చతురస్రాకారంలో గల ఈ అల్ప ప్రమాణ విమానంలో అసలు దేవాలయమందు వుండవల్సిన భాగములన్నియు కలవు. శిఖరము చతురస్రాకారముగ నున్నది. మూడు గోడలకు మూడు



చిత్రము–3–3 భీమనస



చిత్రము 3–4 మహిషాసుర ...

ప్రతిమా నికేతనములు లేక దేవ కోష్ఠములు (Nichas) గలవు. వాటి కిరువైపులా గల కుడ్య స్తంభములు అలంకార రహితములు. గోడకు ఎగువ భాగాన ప్రస్తరము — దిగువన, బాగా అరిగిపోయి కనబడీ కనపడనట్లున్న తోరణము, వ్యాళిలతలు గలవు. కపోత భాగమందు కుడు పంజరము లున్నట్లు కన్పించుచున్నవి. వాటికి సింహ లలాట మున్నది. గ్రీవాగ్రమందు వుపవిష్టమైన నందీశ్వర విగ్రహము గలదు. శిఖరాగ్రమందు స్తూపిలేదు. నలుచదరముగా నున్నది.

గర్భ గృహమందు శివలింగమొకటి గలదు.

ఉత్తరభాగపు గోడకు గల ప్రతిమా నికేతనములో గజసంహార మూర్తి శిల్పము చెక్కబడియున్నది. (చిత్రము–8) స్థానక మూర్తి అయిన శివుడు యిందు చతుర్భుజుడు. పై రెండు హస్తములయందు పరశు, మృగి, యున్నవి. క్రింది హస్తములలో దక్షిణ హస్తము అభయముద్రలోవుంది. వామహస్తము సరిగా కన్పించుటలేదు. గజముయొక్క శిరస్సు శివుని పాదముల క్రింద నున్నది. పరమశివుడు గజ చర్మమును ధరించి యున్నాడు.

పశ్చిమ భాగమునగల ప్రతిమా నికేతనమందు లింగోద్భవ మూర్తి శిల్పమున్నది. (చిత్రము–9) శివుడు లింగము నుంచి ఆవిర్భవిస్తున్నాడు. లింగమునకు యిరు పార్శ్వములందు యిద్దరు మూర్తులు కలరు. లింగము అధోభాగమున,భూమిని తన ముట్టెతో త్రవ్వుతున్నట్లున్న వరాహమూర్తి రూపంలో విష్ణుమూర్తి చిత్రించబడ్డాడు. చతుర్భుజుడైన శివుడు నిల్చున్న భంగిమలో నున్నాడు.

దక్షిణ దిక్కున గల ప్రతిమా నికేతన మందలి శిల్పము పోల్చ వీలులేనిస్థితి యందున్నది.

నిర్మాణ రీత్యా, శిల్పరీత్యా యీ విమానమునకు, దాక్షారామ భీమేశ్వర, చాళుక్య భీమవరమందలి భీమేశ్వరాలయము లందుగల విమానములకు పోలికలున్నవి. బిక్కవోలు నందలి కొన్ని ఆలయములకు దీనికి సాదృశ్యత గలదు. దాక్షారామ, చాళుక్య భీమవరము లందలి భీమేశ్వరాలయముల నిర్మాత తూర్పు చాళుక్య రాజైన మొదటి చాళుక్య భీముడు. (క్రీ.శ. 892–922)[9] ఇతని కాలమందు మృకండేశ్వరాలయము నిర్మింపబడి యుండునని వూహించుట అసమంజసము కాదు.

అయితే యిక్కడ వొక చిక్కు వున్నది. నందీశ్వరుడు శిల్ప రీత్యా, శాసన భాషా పరిణామం దృష్ట్యా పదునాలుగవ శతాబ్దము నాటిదై యుండెనని పైన పేర్కొన్నాం గదా ? మరి దేవాలయము పదవశతాబ్దిదై, అందలి అంతర్భాగమైన నందీశ్వరుడు పదునాలుగవ శతాబ్దికి చెందినదగుట ఎటుల సంభవము ? ఆనాటి చరిత్ర నాశ్రయించవలె.

క్రీ.శ.1323వ సంవత్సరములో ఉలూఘ్‌ఖాన్ (మహమ్మద్ బిన్ తుగ్లక్) ఓరుగల్లును జయించి రాజమహేంద్రవరముపై దాడి వెడలివచ్చెను. దుర్గమును స్వాధీనపర్చుకొని హుమయూన్ గుజ్జార్ అను వానిని గవర్నరుగా నియమించెను. ఆ సమయమున రాజమహేంద్రవరములోని పురాతన దేవాలయము లెన్నో విధ్వంసనకు గురి అయినవి. వేణుగోపాలస్వామి ఆలయము పడగొట్టి హుమయూన్ గుజ్జార్ ప్రేరణచేత షరీఫ్‌సాలర్ వుర్ఫియను సేనాపతి, ప్రస్తుతం

పెద్ద మార్కెట్టు చెంతనున్న పెద్ద మసీదును నిర్మించెను. క్రీ.శ. 1325లో యిది నిర్మించబడినట్లు మసీదు ద్వారముపై పారసీక భాషలో గల శాసనము ద్వారా తెలియుచున్నది.[10] ఆనాటి ఆంధ్రదేశ స్థితిని అలెగ్జాండర్ రీయా చక్కగా వర్ణించి యున్నాడు.[11]

ఆ సందర్భములోనే మృకండేశ్వరాలయమును కూడా ధ్వంసము చేయుటకు ప్రయత్నముజరిగి యుండవలె. ఆ ప్రయత్నము పూర్తిగా సఫలము కాకున్నను, నందీశ్వర విగ్రహము మాత్రము నష్టమై యుండవలె. క్రీ.శ. 1327వ సంవత్సరములో రాజమహేంద్రవరము రెడ్డిరాజుల స్వాధీనమయ్యెను అయినా పదిహేనవ శతాబ్ద మధ్యకాలం వరకు ఆ పురము పూర్వపు వైభవాన్ని పొందలేదు. యీ నడుమ కాలమందు, మ్లేచ్ఛులచే అపవిత్రం కాబడ్డ యీ పురాతన ప్రసిద్ధ దేవాలయానికి సంప్రోక్షణ జరిపి పునరుద్ధరించబడి యుండవలెను. ఆనాటి స్థితి గతులలో యిది అసాధారణమైన విషయమేంకాదు. యీ సందర్భంలోనే మారెళ్ళ భీమన మృకండేశునకు నందిని సమర్పించి యుండవలె. అయితే వొకసారి మ్లేచ్ఛులచే అపవిత్రం చేయబడ్డ ఆ ఆలయము, పూర్వపు పవిత్రతను, శోభను పొంది యుండక పోవచ్చును. అందుచేతనే 1410వ సంవత్సరములో మల్లాంబిక మార్కండేయేశ్వరాలయము కట్టించి యుండును. రాజపోషణ గలిగిన మార్కండేశ్వరుడు ప్రసిద్ధి చెందుటలో ఆశ్చర్యమేమున్నది ? శ్రీనాథుడు మార్కండేయేశ్వరుని పలుమార్లు ప్రస్తుతించి, మృకండేశుని వొకేసారి మాత్రమే ప్రస్తావించుటకు యిదే కారణము.

మృకండేశ్వరాలయ విధ్వంసనము :


యీ విధ్వంసన పదహారవ శతాబ్దపు రెండవ అర్ధ భాగంలో జరిగి యుండవలెను. యీలోగా రాజమహేంద్రవర పాలన అనేక చేతులు మారెను. ప్రతాపరుద్ర గజపతిని నిర్మూలించి ఉత్కళ దేశాన్ని 1561లో హరిచందనదేవుడు పాలించసాగెను. అప్పుడు ఉత్కళ రాజ్యాంతర్భాగమైన రాజమహేంద్రవర దుర్గమునకు వేద్రాద్రి(గోవింద విద్యాధరుడు)యను వొక మహావీరుడు అధిపతియై యుండెను.

క్రీ.శ. 1565లో విజయనగర సామ్రాజ్య సేనలకు,ముస్లిం కూటమికి మధ్య రాకాసి తంగడి యుద్ధము జరిగినది .యీయుద్ధ సమయమందు గోల్కొండ సుల్తాను, నిడదవోలు నందు గల తన సైన్యమును పిలిపించుకొనెను. ఆ తరుణంలో వేద్రాద్రితో సహా అనేకులు స్వతంత్రులయిరి. రాకాసి తంగడి విజయానంతరం రఫత్‌ఖాన్ లాహారీయను గోలుకొండ సైన్యాధిపతి దండెత్తి వచ్చి రాజమహేంద్రపుర దుర్గమును స్వాధీన పర్చుకొనెను. యీ సమయమందు అతను అనేక శ్రమల నెదుర్కొనవలసి వచ్చెను .

రఫత్‌ఖాన్- వేద్రాద్రిల మధ్య జరిగిన ఘర్షణలలో మృకండేశ్వరాలయము పూర్తిగా ధ్వంసమయి వుండవలెను. కోటకు దగ్గరగా, గోదావరి యొడ్డునే యీ దేవాలయం వుండటం యిందుకు కారణాలు. మార్కండేశ్వర దేవాలయము కూడా యిటులనే నష్టమైయుండవలెను. యిటుల విధ్వంసమైన దేవాలయ భాగములు తర్వాత కాలము వారు కట్టుబడుల కుపయోగించుకొన్నవి, వుపయోగించుకొనగా మిగిలినవి నగరమందలి పలు ప్రాంతములందు యిప్పుడు మనకు కన్పించుచున్నవి.

అయిదవ స్తరములోని ఇటుక కట్టడ వృత్తాంతము :

పై అంశాలనుబట్టి చూడగా మూడవస్తరమందలి మృకండేశ్వరాలయ నిర్మాణకాలము పదవ శతాబ్దిదని తెలుచున్నది. విశేష



చిత్రము-3-5 నంది



చిత్రము–4
అష్టదళ పద్మయుత
శిథిల స్తంభ శీర్షము



చిత్రము–5
స్తంభమునకుపయోగించిన
మరిరెండు శిలలు

లేమిలేని నాలుగవ స్తరముయొక్క కాలము దీర్ఘముకాదు. అయిదవ స్తరములో 30.5×20 5×7.5 సెంటీమీటర్ల పరిమాణంలో గల ఇటుక కట్టడం వొకటి లభ్యమైనదని పైన వివరించాను. ఇటుక పరిమాణాన్నిబట్టియే యీ కట్టడం పూర్వచాళుక్య యుగానికి చెందియుంటుందని చెప్పవచ్చు. స్తరవ్యత్యాసాలనుబట్టి కూడా యీ విషయం రూఢి అవుతున్నది. యీ సందర్భంలో రాజమహేంద్రపుర నిర్మాణ కాలమును గురించి పరిశీలించటం అప్రస్తుతం కాదు.

ఇదమిద్ధం చెప్పటానికి తగు ఆధారాలు లేకపోయినా, రాజమహేంద్రపుర నిర్మాణ కాలాన్ని గూర్చి ఖచ్చితమైన రెండు అభిప్రాయాలు వున్నాయి.

ఒకటి : క్రీ॰ శ. 922 నుంచి 934 వరకు పాలించిన తూర్పు చాళుక్యరాజు మొదటి అమ్మరాజ విష్ణువర్ధనుని కాలములో యీ పట్టణం నిర్మించబడిందని ప్రతిపాదించిన వారిలో ముఖ్యులు శ్రీ చిలుకూరు వీరభద్రరావు,[12] భావరాజు వెంకట కృష్ణారావు,[13] వడ్డాది అప్పారావుగారలు.[14] 'రాజమహేంద్ర' అన్న బిరుదు కలిగిన అమ్మరాజ విష్ణువర్ధనుడు విజయవాటిక (విజయవాడ) లేక వేంగీనుంచియో ముఖ్యపట్టణాన్ని తరలించటానికి గల కారణాలను వివరించటానికి ఆనాటి రాజకీయ స్థితుల మీద ఆధారపడి వూహ చేసేరు వీరు.

రెండు : డాక్టర్ నేలటూరి వేంకటరమణయ్యగారి సిద్ధాంతం ప్రకారం పై యూహ సరిఅయినదికాదు.[15] 'రాజమహేంద్ర' అన్న బిరుదం రాజరాజనరేంద్రునికి కూడా కలదు. ఇతడే తన మామగారైన చోళరాజేంద్రుని గౌరవార్థం రాజమహేంద్రపురాన్ని కట్టించి దానిని తన రాజధానినిగా చేసుకొన్నాడు. నన్నకోట పెద్దనార్యునియొక్క కావ్యాలంకార చూడామణిలోని యీ క్రింది పద్యంమీద వారి సిద్ధాంతం ముఖ్యంగా ఆధారపడింది.

సీ॥ శ్రీకంఠ చూడాగ్ర శృంగార కరణ, మేరాజానకన్య యారంభ గురుడు
చాళుక్య వంశ భూషణము శ్రీవిష్ణు వర్ధనుఁడే మహీశు తాతలకుఁ దాత
భృత కుమారామ భీముండు చాళుక్య భీముఁడే నృపకులాబ్ధికి విధుండు
రాజమహేంద్రపుర స్థాత రాజనరేంద్రుఁ డెక్కువ తాత ఏ విభునకు

తే॥ నంధ్రదళ దానవో పేంద్రుఁడగు నుపేంద్ర
ధరణి వల్లభుఁడే రాజు తండ్రి తండ్రి
ఘనుఁడు పేంద్రాఖ్యుడెవ్వని గన్నతండ్రి
యతఁడు విశ్వేశ్వరుడు లక్కమాంబ సుతుఁడు.[16]

పై యభిప్రాయములు రెండునూ క్రీ॰ శ. 922 తర్వాతనే రాజమహేంద్రపుర నిర్మాణము జరిగినట్లు చెప్పుచున్నవి. పైన పేర్కొన్నట్లు మృకండేశ్వరాలయమే తత్పూర్వము నిర్మించబడింది. కాగా యీ యిటుక కట్టడము తొలిచాళుక్యుల కాలము — అనగా క్రీస్తుశకము ఏడు, ఎనిమిది శతాబ్దములకు చెందినదైయుండ వలెను. రాజధాని మార్పిడి విషయం అలా వుండనిస్తే, క్షేత్ర ప్రాశస్త్యము అనాదిగా కల యీ గోదావరీ తీరప్రాంతము మత ప్రాశస్త్యత కలిగినదై యుండియుండవచ్చును. అయితే యీ కట్టడ స్వరూపమేమిటి? ఉత్ఖతనములు విస్తృతస్థాయిలో జరిపిన గాని యీ విషయం స్పష్టముగా తేలదు. అయితే ఇటుక పరిమాణాన్నిబట్టి, అది లభ్యమైన స్థరసంఖ్యనుబట్టి, యీ కట్టడ కాలం తొలి తూర్పు చాళుక్యుల కాలంనాటిదని మాత్రం నిస్సంశయముగా చెప్పవచ్చును. కనుక పైన వివరించిన రెండు సిద్ధాంతములు సరికావని తేలుచున్నది.



చిత్రము–6
ఇటుకలు



చిత్రము–7
సూక్ష్మాకార విమానము



చిత్రము–8
విమాన వుత్తర భాగపు
ప్రతిమాని కేతనం –
గజ సంహారమూర్తి

చిత్రము–9
లింగోద్భవమూర్తి

ఆరవస్తరమందు లభ్యమయిన మృణ్మయపాత్రల కథ :

అయిదవ స్తరమునకు, యీ మృణ్మయపాత్రలు లభ్యమైన స్తరమునకు మధ్య కాల వ్యత్యాసము దీర్ఘమైనట్లుగా కన్పించదు. అతి విస్తారంగా లభ్యమైన యీ మృణ్మయపాత్రలు, పైన వివరించినట్లు తొలిచరిత్ర యుగానికి సంబంధించినవి. బహుశా ఇక్ష్వాకుల కాలంనాటివో తత్పూర్వమో అయి వుండవలెను.

యీ స్తరమునకు పైన ఖనన పాత్ర లభ్యమగుట ప్రత్యేకించి యీ స్థలమునకు విశేష ప్రాధాన్యతను కలిగించుచున్నది. అదియునుగాక యీ స్థలమందే పెర్రాకోట శకలము కూడా లభ్యమైనదని గుర్తుంచుకొనవలె.

ఉపసంహారం :

రాజమండ్రికి దాదాపు అయిదు కిలోమీటర్ల దూరములోగల బొమ్మూరులో వో గుట్టపైన బౌద్ధయుగానికి చెందిన మూకుళ్ళు, పెంకులు యిత్యాది వస్తువులు యిటీవల లభ్యమయినవి. వరిగో కాల్చనటువంటి పెద్ద పెద్ద ఇటుకలు కూడా కానవచ్చినవి. యిప్పటికీ యీ గుట్టను అక్కడివారు 'సన్యాసిమెట్ట' అని పిలుచుచుందురు. యీ గుట్టక్రింద బౌద్ధస్తూపమొకటి యుండి యుండుటకు అవకాశములు కన్పించుచున్నవి.

యీ దృష్ట్యాకూడా కాస్త పరిశీలించినట్లయితే రాజమహేంద్రపురము భారతదేశంలోని అతి ప్రాచీన పట్టణాల్లో వొకటయ్యే అవకాశాలు మెండుగా కన్పిస్తున్నాయి. మెగస్తనీస్, ప్లినీ, హ్యూయాన్‌త్సాంగ్‌లు పేర్కొన్న ప్రాచీన పట్టణాల్లోని 'మహేంద్రగిరి' కన్నింగ్‌హామ్ చెప్పినట్లు[17] రాజమహేంద్రపురమగునో కాదో మరోసారి మాతినంగా పరిశోధించవల్సిన అవసరం ఏర్పడుతోంది.

చరిత్రకారులు యీ విషయాన్ని పరిశోధించవలె!

అ ధో జ్ఞా పి క లు

1 సమాచారం–తేది 2–4–'78.

2 E I. IV Page 318 and 327.

3 అనితల్లి కలువచేరు శాసనము.

4 భీమేశ్వర పురాణము. ప్ర. 43.

5 "అదె పుండరీకాద్రి యచట మార్కండేయు నిలవేల్పు 'ముక్కంటి వెలసె దొల్లి" భీమేశ్వర పురాణం. పు. 55.

6 Recent Archaeological finds at Rajahmundry by Sri R. Subba Rao, J A. H. R. S. Vol. VII.

7 భీమేశ్వర పురాణం, పం—90.

8 శ్రీనాథ కృతిసమీక్ష – శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి, పేజీ 112.

9 Eastern Chalukyas Dr Nelaturi Venkata Ramanayya, Page 289.

10 E. I. M. 1923–24 'A forgotten chapter of Andhra History by Sri Mallampalli Somasekhara Sarma-Pages 13–14.

11 Southern Circle-Administrative report 1910-11.

12 రాజమహేంద్రపుర చరిత్ర (1915)

13 History of Eastern Chalukyas.

14 Souvenir, All India Telugu writers' conference II, Page 29

15 Eastern Chalukyas, Page 163.

16 కావ్యాలంకార చూడామణి ప్రథమోల్లాసము. పద్యము–47

17 Cunnigham's Ancient Geography of India Edited by Surendranadh Majumdar Sastri, 1924, page 890

శ్రీ కుంటిముక్కల లక్ష్మీనారాయణశర్మ

కనుబొమముడి... కనువిప్పు

దైనందిన జీవితంలో భిన్న కారణాల దృష్ట్యా ఎన్నో కార్యక్రమాలను వాయిదా వేస్తుంటాం. అదే రకంగా రచయితలకు సాహిత్య మీమాంసలను నెట్టిపారవేయడమూ అలవాటయింది. ఇదివరలో వ్యాసానికి [1977(b) : 54 : 7. 52–54] దానిపై జరిగిన విమర్శకు రామశేషయ్య, జీ. [ఇకనుంచీ జి.రా.] [1977; 54: 12 54–56] రచయిత కృతజ్ఞతలర్పించుకున్నా ఫలవంతమైన విశ్లేషణాహేతుక సమాధానం చెప్పాలన్న ప్రబలమైన కోరికే జాప్యం చేయించింది.

'కనుబొమముడి'కి కనువిప్పు కలిగించడానికి ముందు కొన్ని విషయాలు స్పష్టంగా తెలుసుకోవడం అవసరం. సాహిత్యాన్ని ప్రాథమికంగా అంచనా వేసి అధ్యయనం చేసి ఆనందించడానికి రెండు మార్గాలున్నాయి. అవి: భాషా శాస్త్రదృష్టి, సాహిత్యశాస్త్ర దృష్టి. ఈ రెంటిలో ఏది ఎక్కువ దోహదం చేస్తుంది? అనే ప్రశ్న వస్తే రెండవదే అని చెప్పాలి– దీనికి కారణాలు అనేకం ఉన్నా చారిత్రకంగా సాహిత్యశాస్త్రం ఎంత ఉత్పన్నమయి అభివృద్ధి పొందిందో అంతగా భాషాశాస్త్రం కవిత్వాన్ని అర్థం చేసుకునే రీతిలో పురోగమించలేదు. మరోరకంగా చెప్పాలంటే భాషాశాస్త్రం 'వ్యవహారం' ఆధారంగా పెరిగింది. వ్యవహర్తల సంప్రదాయ **(formal)** సృజనాత్మక శక్తి పట్ల ఆశక్తి ప్రదర్శించలేదు. ఇప్పటి ప్రయత్నాలు సాహిత్యాన్ని వస్త్వాశ్రయ మూల్యం **(objective value)** దిక్కుగా సాగుతున్నాయి. సాహిత్య శాస్త్ర విమర్శకులు వేసే బాణాలకు జీవం కోల్పోతున్నట్లనిపించినా ఆ ప్రభావం తాత్కాలికం. ఈ ప్రయత్నాలు ఆగవు.

శైలీశాస్త్రం [కవిత్వాన్ని అధ్యయనం చేసే భాషాశాస్త్ర విభాగం]దృష్ట్యా కవిత్వం [సృజనాత్మకతతో కూడుకొన్న వాక్యాతీత పాఠం]. 'వాక్యాతీతం' అన్నాం కనుక సాధారణ వాక్యాల లక్షణాలు ఇందులో భిన్నంగా ఉంటాయి. భాషా సాధారణ లక్షణాలే వ్యతిరేకంగా బింబప్రతిబింబ భావంతో ప్రతిబింబిస్తాయన్న మాట. కవిత్వానికి సరిగ్గా ఏ లక్షణాలు, సంప్రదాయాలు ఇముడుతాయన్నవి ఇప్పటి స్థితిలో విడివడని ప్రశ్నలు. ఒకవంక తీరని ప్రశ్నల వలలు చుట్టివేస్తుంటే మరోప్రక్క శైలీశాస్త్రం [పేరులో శాస్త్రం ఉన్నా] కళాత్మక లక్షణాన్ని విసర్జించి శాస్త్ర లక్షణాల్ని పుణికిపుచ్చుకొనే ప్రయత్నంలో ఉంది. [వివరాలకు చూడుడు. విడోసన్ [1975], లక్ష్మీనారాయణ శర్మ [1977:67-77] శాస్త్రీయతాదృక్పథం భాషాశాస్త్రం నుంచి వివరణ విధానాల్ని సాహిత్య విమర్శనాశాస్త్రం నుంచి శైలీశాస్త్రం గ్రహిస్తోంది. ఈ తరుణంలో విశ్లేషణా రీతుల్లో అస్పష్టత, శాస్త్రీయతలో అక్రమం తొంగి చూడడమే కాక వీటి మీదట పాతవేమెరుగని అన్పిస్తాయి. ఇదే స్థితి జి. రా. గారికి కలిగింది.

విశ్లేషణలు ప్రాథమికంగా ఉన్నా ఫలితాలు అరకొరంతమాత్రం [దీనికి కారణం ఒక్కొక్కసారి పరిశీలకుని శాస్త్రజ్ఞాన లోపం కావచ్చును.] పైపెచ్చు చదువరికి ఆరంభంలోనే ఏ విశ్లేషణపై మోజుగాని ద్వేషంగానీ ఉండకూడదు. పండితుల్లో భాషా శాస్త్రం సాహిత్యానికి ఏమీ అందించలేదన్న దురభిప్రాయం బలంగా నాటుకొని ఉంది. ఇది జి. రా. గారి పట్ల నిజమేమో [అని నా అనుమానం !].

ఏ రచయితగానీ, కవి ఒక్క విధానంలో రాయాలని అనుకోడు. మరి గద్యం, పద్యం, పద్యంలో వచనం ఇత్యాది విధానాలు ఎందుకున్నాయన్న ప్రశ్నరావచ్చును—ఈ విధానాలన్నీ విమర్శకులు ఏర్పరచుకున్న అనుసరణాలు **(Conventions)** కవికి తన సృష్టి ప్రధానం. విమర్శకుడు తనకు లభించే కొలతల ద్వారా ఆ సాహిత్య సృష్టిని కొలుస్తాడు.

భాషకు ఎన్నో ప్రయోజనాలున్నాయి. అందులో ఒక ప్రత్యేక ప్రయోజనం సాహిత్యం. ఈ ప్రయోజనాలు నెరవేరాలంటే భాషకు కొన్ని విషయాలు అవసరమవుతాయి. అన్నింటిని ఈ క్రిందిరకంగా సూచించవచ్చును.

సందర్భం

వార్త

వక్త ——— శ్రోత

సంబంధం

శబ్దం

ఈ చట్రంలో వక్త శ్రోతకొక వార్తను అందిస్తాడు. వార్తను అర్థం చేసుకోవడానికి సందర్భం అవసరం. వక్త శ్రోతల వార్తాబంధం శబ్దం ద్వారా నెలకొంటుంది. శబ్దమే వీరిద్దరి మధ్య సంబంధం నెలకొల్పుతుంది. ఈ ఆరు విషయాలు భాషకు ప్రయోజనాలుగా అమరుతాయి. సాధారణ భాషా ప్రయోగంలో చూపినట్లుగా సాహిత్య భాష ప్రవర్తించదు. ఇందులో భిన్నతలు తోస్తాయి. పురాణ కవిత్వం ఉత్తమ పురుష ప్రాధాన్యతతో నిర్దేశకతను, గేయం సహజంగా ప్రథమ పురుష ప్రాధాన్యతతో భావుకతను, ద్వితీయపురుషతో కూడుకొన్న కవిత్వం హ్రాస్వతను తెలియజేస్తుంది. దీన్ని క్రింది విధంగా చూపించవచ్చును.

నిర్దేశకత

కవిత

భావుకత —— —— హృద్యంగమత

సామాజికత

అధిభాషికత

ఏమిటీ కవిత్వ భాషకు అధిక ప్రయోజనం ? దీని రహస్యం ఎక్కడ ఇమిడి ఉందన్న ప్రశ్నకు జవాబు చెప్పుకోవాలంటే జాకబ్‌సన్ మాటలో (1960 : 358) రెండు విధాలైన నడవడికలో ఇమిడి ఉంది. అదే ఎన్నిక సంయోజనం. కవిత్వ ప్రయోజనంలో తుల్యతా సూత్రం (Equivalence Principle) ఎన్నిక లెలా సంయోజనంలో ఇముడుతాయో తెల్పుతాయి. దీన్ని తెల్పటానికి ఏ వివరణ పూనుకొని ఫలవంత మవుతుందో దానికే గౌరవం లభిస్తుంది. విమర్శన శాస్త్ర విధానం దీంలో విజయం సాధించినా కొన్ని కోణాలను ఉదాసీనంగా చిన్న చూపు చూసింది. వాటినే భాషాశాస్త్రం ఎన్నుకొని వివరించడంలో పూనుకొంటున్నది.

ఇక వ్యాసంలో జి. రా దురభిప్రాయాలను తొలగించే ప్రయత్నం చేస్తాను.

1. వ్యాస రచయితకున్న సంగీత జ్ఞానం కొద్దీ మొదట గేయాన్ని (గాన సౌలభ్యం కోసం రాసింది కనుక) విభజించాను. (దాన్ని సాహిత్య శాస్త్రం సహించదా?) పోతే ఛందస్సు పేర్కొంటూ 'అసమద్విరద ఖండగతి' అని వివరించాను (19 వ లైను). ఇదే కొద్ది తేడాలో పూర్తి వివరణ జి రా. చేశారు. భాషాశాస్త్రపు వివరాలు ప్రసాదించాలన్నదే రచయిత ఆశయం కనుక మిగిలినవి సంక్షిప్తీకరించబడ్డాయి.

2. పునరుక్తి గురించి ... జి. రా. ఈ విషయాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నట్టులేదు. వివరణలో సగానికి పైగా 'బీజమే — ఇది తెలుగు కవితకు సహజమైన యతి (వడి)వంటిదే' అని ఒప్పుకుంటూ (19 వ లైను) మరొకసారి " 'న్–వ్' అనునవి ... విభిన్న హల్వర్ణములు వీటికి సంబంధించి అసంపూర్ణ పునరుక్తి ఏమిటి ? ఒక హల్లు ఆవృత్తి పొందిన కదా పునరుక్తి యనుట పొసగును !" (23-25 లైనులు) వ్యతిరేకిస్తున్నారు. 'పునరుక్తి'ని అర్థం చేసుకోవాలంటే తన్నిర్వచనమే కాక, ఇది వర్ణ విభాగానికి చెందింది కనుక తద్విభజన తెలుసుకోవాలి. ఏభాషకైనా ఆస్యవివరంలో ఉత్పత్తయే వర్ణాలలో ముందువి ఓష్ఠ్య, దంత్య దంతమూలీయ, మూర్ధన్యాలుగాను, వెనుకవి తాలవ్యకంఠ్య జిహ్వా మూలీయాలుగాను ఉంటాయి. (తెలుగు వర్ణ విభాగ వివరణకు చూడుడు ప్రకాశం : 1975 : 167–172, 1976 : 59–64). ఈ దృష్ట్యా సవర్గ వర్ణం వస్తే (ఉదా : ఓష్ఠ్య, దంత్య, తాలవ్య మొ.) సంపూర్ణ పునరుక్తిగాను, సజాతి వర్ణాలు (ముందుదానితో వెనుకవి) వస్తే అసంపూర్ణ పునరుక్తిగా ఉంటుంది. పునరుక్తిని ఇదివరలో సాహిత్యశాస్త్రం 'సమత' పేరుతో చర్చించింది. దీనికి భాషాశాస్త్రంలో కొద్ది తేడాతో సంగ్రహించడం జరిగింది. పునరుక్తికి బదులుగా 'సమత'ను గ్రహించి విభిన్నతల్ని ప్రకాశం (1978 : 54) చర్చించారు. తెలుగులో మరికొన్ని వివరాలు(ఇదే వ్యాస రచయిత రాసిన) మరో వ్యాసంలో [1977(a): 73], ఆంగ్లంలో లెవిన్ (1962) కనుగొనవచ్చును.

3. అంత్య ప్రాస సహాయంతో గేయాన్ని వివరించడం వలన సౌందర్యవంతంగా వివరించవచ్చునేమో కాని ఫలవంతంగా భాషా ప్రయోజనాన్ని గమనించలేం. అందుకే అజ్వర్ణ హల్వర్ణ పునరుక్తి అంతంలో ఉందని చెప్పడం జరిగింది. అదీగాక భాషకు పొందిక విధానం సరిపోతుందని ఇది తెలియజేస్తుంది.

4. ధ్వని మార్పులు వివరించడం నండూరి విజ్ఞాపనను ఎరుగక కాదు. భాషా నిర్మాణపు భిన్నతలు కావ్యభాషలో ఎలా ప్రతిబింబితమయిందో తెలియజేస్తుంది.

5. వాక్య విభజనను సమర్థిస్తూనే 'భావ సమైక్యత'ను అర్థం చేసుకోవడానికి ఎంతవరకు సహకరిస్తుంది ? అని ప్రశ్నించారు.

ఇప్పటివరకూ శైలీశాస్త్రం, భాషాశాస్త్రం కలిపి జరుపుతున్న కృషి ఒక కావ్యం 'ఎలా' నిర్మిత మయిందో తెల్పుతున్నది తప్ప 'ఎందుకు అలా ఉంటుందన్న' దానికి జవాబివ్వలేదు. దాన్ని చేరుకోవాలన్నదే శాస్త్ర ప్రయత్నమూ ధ్యేయమూ కూడ. అందుకే ఆ వ్యాసంలో "ప్రతి దశలో చూపిన భాషాశాస్త్ర విశ్లేషణ, సాహిత్య శాస్త్రం ఆధారం చేసుకొని – శైలీ శాస్త్రపు సిద్ధాంత ప్రాతిపదికలై సాహిత్యాధ్యయనంలో ఎలా తోడ్పడుతున్నాయో మరొకమారు చర్చిద్దాము" అని విజ్ఞప్తి చేసాను. వ్యాసం చివరకంటా చదవకుండా జి. రా. వేసిన నెపమిది.

6. చివరగా, అర్థసంబంధి విశ్లేషణలో పదం సామాన్యార్థానికి భిన్నమైన లక్షణను, వ్యంజనను సమన్వయం ద్వారా ఎలా బోధిస్తుందో తెల్పాను. జి. రా. వైదాంతిక వివరణలు ఇందులో ఇముడవు.

ఆదిలో అన్నట్టు కొత్త సంప్రదాయాలు, ఆలోచనలు ఏర్పడేముందు అవరోధాలు అనేకం ఎదురవుతుంటాయి. వాటిని ఢీకొని సమస్యల్ని పరిష్కరించుకొని ముందుకుసాగే శాస్త్రజ్ఞుడికి చదువరి మధుర దరహాసం వెయ్యేనుగుల బలాన్ని కలిగిస్తుంది.

References

Jakobson, R. 1960 : "Closing Statement : Linguistics and poetics", in Sebeok (ed) (1960) : 109—31.

Laxminarayana Sarma, K. 1977 (a): "శైలీ శాస్త్రం—యెంకి", తెలుగు, VI/1 : 67—77. హైదరాబాదు.

1977 (b): "కమబొమల్లో..." భారతి 54/7:52-54 విజయవాడ.

Levin, S. R. 1962 : Linguistic Structures in Poetry. The Hague : Mouton & Co.

Prakasam, V. 1975 : "వాదోత్పత్తి", తెలుగు 4/3 : 167–172, హైదరాబాదు. 1976 "అస్య వివరం : తెలుగు వర్ణాల పునర్వ్యవస్థీకరణ", భారతి 53/1.59 – 64, మద్రాసు.

1978 "కావ్యభాష: ప్రాముఖ్యతా సంప్రదాయం", భారతి 55.5. 49–55, విజయవాడ.

Ramaseshaiah, G 1977 : "కమబొమల్లో...భాషాశాస్త్రం– 'బొమముడి', " భారతి 54/12:54–56 - విజయవాడ.

Sebeok, T. A. 1960 : Style in language, New York : MIT & John Wiley & Sons.

Widdow Son, H. G. 1975 : Stylistics and Teaching Literature, London : Longmans.

కాలం

శ్రీ యల్. మాలకొండయ్య

కొలతలేని, కొలత వీలుకాని కాలాన్ని నీవు కొలుస్తావు
నీ నడవడికను, నీ ఆత్మనుకూడ గంటలు, ఋతువుల ప్రకారం సర్దుకొని నడిపిస్తావు
కాలాన్ని నదిగాచేసి, గట్టునకూర్చొని ప్రవాహాన్ని తిలకిస్తావు
అయినా నీలోని "కాలంలేమి" కి జీవితంలోని "కాలంలేవితనం" తెలుసు
నిన్న ఈనాటి జ్ఞాపకమనీ
రేపు ఈనాటి స్వప్నమనీ తెలుసు,
ప్రేమలాగే అవి భాజ్యం, కొలవ వీలుగానిది కాదా కాలం ?
నీ ఆలోచనలో కాలాన్ని ఋతువులుగా, కొలవాలనుకొంటే,
ప్రతి ఋతువు మిగతా ఋతువులను ఆవరించాలి
జ్ఞాపకాలతో భూతకాలాన్ని
కోర్కెలతో భవిష్యత్తును కౌగిలించుకోనీ ఈరోజును.

పుత్ర్రైతో పుట్టింది

డాక్టర్ బొడ్డుపల్లి పురుషోత్తం

"తొలగిపో! తొలగిపో!!
గంగాతరంగ క్షాళిత పూత శరీరుడ్నై!
పస్త్రజ్ఞాన్నీ, తొలగిపో!!
చండాలా! తొలగిపో"
అని గద్దించాడు శంకరుడు
శంకలేని కంఠస్వరంతో.

"సిత్తం సామి, సిత్తం,
ఓ సిన్న సందేహం,
తొలగిపోవలసింది
నానా? నా దేహమా?
సందేహం తీరిస్తే
యెంటనే నే దొలగుతా."
అన్నాడా పంచముడు
విన్నదనంతో వెక్కిరిస్తూ.

శంక చెలరేగింది శంకరయ్యకు.
"ఎవరిని తాను తొలగమన్నట్లు?
కళంకాలన్నీ కళేబరానివి.
అంతరాత్మ కేవీ అంటుకోవు,
అత్యంత పవిత్రమైందది
పరమాత్మతో అభిన్నం.

పంచముడికో అంతరాత్మ
బ్రాహ్మణుడికో అంతరాత్మ
శూద్రుడికో అంతరాత్మ
వేఱువేఱుగా సృష్టించాడా?
ఆ వెఱ్ఱి విధాత.

ఆత్మ శరీరా న్నాశ్రయించింది.
శరీరం తానుగా నే దొలగలేదు
కళంకం కళంకానికి తొలగేదేమిటి?"
అని వితర్కించాడాచార్యుడు.

కనులు తెరిపించాడా పంచముడు,
అఖండ జ్ఞాన సంపన్నుడు.

"పంచముడివే అయినా నాకు సం
కోచంలేదు, నీవు నా గురువ్వి.
ఇన్నాళ్లుగా మథనపడుతున్నాను
అద్వైతానుభవ మందించావు," అని
దురభిమానాన్ని దూరంచేసి
పరమ భక్తితో పాదాలు పట్టాడు.

ఉన్నతాధ్యాత్మిక భావాలతో
సమున్నతి పాత్రమైన ఈ సంఘానికి
అంటుకొన్న గొప్ప అంటువ్యాధి
ఈ అంటరానితనం.

ఒక్క తల్లి కన్న బిడ్డల్లో
నిక్కపొడిచిందీ వైరుధ్యం,
మానవత్వమే మంటగలిస్తే
మతం మాట మాట్లాడాలా?
ఎంతటి సదాచార సంపత్తి
కొంత కాలానికి క్రమంగా
జీవశక్తి కోల్పోతుంది,
చీడపురుగు చేరుతుంది.

బాహ్యాడంబరాలతో
దంభ జీవితాని కలవడి
తమకు తామే పవిత్రులమని
అన్యుల్ని అపవిత్రుల్నిచేస్తూ
అహంకరించటమో ఆర్భాట
మైందీ హైందవ జాతికి.
మనసు స్వాధీనమైన మనిషికి
మడిమంత్ర తంత్రాలెందుకని
సూటిగా ప్రశ్నించాడు త్యాగయ్య
నీటుపోయే మన తాతయ్యల్ని.

న దత్తాహం యదాపిత్రా యాచితేన శుభాత్మనా
దేవాదినా శూలినా తు తదామే పాతితః పితా.
తేనాహ మతి నిర్వేదా దాత్మవ్యాపాదనోద్యతా
నివారితా శంభుపత్న్యా పత్న్యాసత్యప్రవృత్తశవా
మాశుచః సుభ్రువే! భర్తా మహాభాగో భవిష్యతి
స్వరోచిర్నామ..........'' [అధ్యా-59. శ్లో. 6-13]

ఈ మూలాన్ని వేర్వేరు గ్రంథాల్లో విద్యన్మహా కవులు విభిన్న రీతుల చెప్పారు.

ఈ మార్కండేయ పురాణాన్ని ఆంధ్రీకరించిన తిక్కన సోమయాజి శిష్యుడు మారన

ఆ. ''ఎలమిఁ గామభోగములు సల్పి నమఁగాంచి-బహువ్యగ
ప్రచార భయదమైన
యడవి డిగ్గ విడిచి యరిగిరయ్యిరువురు — నరుగుటయును
నేను వంత వనభు!

ఆ. అమృతకరుని కళల నాప్యాయమానాత్మ — నగుచు రాత్రు
లెల్ల నతిశయిల్లి
నమదినంబు చాల నభివృద్ధి నొందితి—నెఱిగి తండ్రిప్రీతి
నేగుదెంచి.

వ. నన్నుం దోడ్కొని చని చంద్రకళావర్ధిత నగుటం గళావతి
యను నామంబు
నా కొనరించె, నంత నొక్కనాడు దేవాదియను
గంధర్వుండు.

క. తనకు నమనీవి యలుకం—గినలుచు, జముదెంచి మత్తకరి
విధమున మ
జ్జనకుని వధియించినవే-మనమున నిర్వేదమొంది మర
ణోద్యమమున్.

ఉ. పూనిన శంభు పత్ని యతిభూరి దయామతి సుప్రసన్నయై
మానిని! యేల యీ తెగువ? మానుము నెవ్వగ దక్కు భర్త తే
జోనిధి యా స్వరోచియగుజుమ్ము ధ్రువంబుగ నీకు...''
[ఆశ్వా. 5-పద్య. 59-63]

అని వ్రాసియున్నాడు. ఇందులో సుభానుగంధర్వుని ప్రమాదారమేలేదు. మొదట అడవిలో దిక్కులేని స్థితిలో పురిటిగుడ్డును విడిచిపెట్టి వెళ్లిపోయిన మహామునియే కొన్ని దినాలు పోయాకవచ్చి కరుణతో ఆ శిశువును తీసుకొనిపోయి పెంచి పెద్దచేసినట్లు మారన చెప్పడం కొంత స్వభావ విరుద్ధంగా కనబడుతుంది బిడ్డపై దయ ఉన్నవాడైతే మొదటే తీసికొని వెళ్లి ఉండవలసిందిగదా! శ్లోకం పద్యంలో ఉన్న సుభాను గంధర్వునితో అన్వయం కుదరక ఆ వృత్తాంతాన్ని విడిచాడా? అని అనిపిస్తుంది.

పెద్దనామాత్యుని మనుచరిత్రలో కూడా పై రీతినే ఉన్నది. అందులోనూ సుభానుని సంగతిలేదు. అది ప్రబంధం కాబట్టి వర్ణనలతో కథాభాగం కొంత విపులీకరించబడింది. 'దేవాది'కి బదులుగా 'దేవాపి' అని కానవస్తుంది. మారనకవి అడుగుజాడల్లోనే కథ నడిచింది. పెద్దనగారు ఈ కథాంశాన్ని తెలిగించినప్పుడు మూలగ్రంథాన్ని శ్రద్ధగా చూడలేదేమో అని అనుకోవలసి వస్తున్నది

మార్కండేయ పురాణం సంస్కృతమూలాన్ని 1876వ సంవత్సరంలో పువ్వాడ వేంకటరావుగారు చెన్నపట్నంలో తమ వర్తమాన తరంగిణీ ముద్రాక్షరశాలలో ముద్రించి ప్రకటించారు. పుస్తకం అధఃసూచికలో పాఠాంతరాలను కూడా చూపారు. మూలంలోని 'గంధర్వేణ సుభామనా' అనేచోట పాఠాంతరం ఏమీ సూచితం కాలేదు. గ్రంథం చివర ''మార్కండేయ పురాణ సారసంగ్రహం' అనే పేరుతో తిమ్మరాజు—లక్ష్మణరావుగారు కూర్చిన తెలుగు కథ సంగ్రహం కూడా చేర్చబడి ఉన్నది. అందులో లక్ష్మణరావుగారి ధోరణి విచిత్రంగా కానవస్తుంది. ఈ సందర్భంలో ఆయన

''అంత నా యిర్వురు నన్విడవాడి వెడలిపోయిన నేనా యడవిలో చంద్రకళల వలన దినదిన ప్రవర్ధమాన నగుచుండ నాతండ్రి మరల నేతెంచి కళావతియను నామంబిడె. కొంతకాలమునకు సుభాముడను గంధర్వుడు నన్నాసంగుమన మాతండ్రి యొసంగడయ్యె.మరియు వా తండ్రి దైవయోగంబున శివునిచే మరణంబు నొందిన, నేను మరణోద్యుక్తయై యుండ పార్వతి యేగుదెంచి నమంగాంచి నీవు దుఃఖింప వలవదు. నీకు స్వరోచి మగడు కాగలడు''
[మార్కండేయ పురాణ సారసంగ్రహము. పుట 55]

అని వ్రాసియున్నారు. ఇందులో 'దేవాది' గంధర్వుని ప్రసక్తిలేదు. సుభానుడే కళావతిని కోరి, ఆమె తండ్రిచే తిరస్కరించబడిన తర్వాత నిరాశ పొందినా ఊరకే ఉన్నాడని అనుకోవలసి వస్తుంది. 'దేవాది నా శూలినా' అనేచోట సారసంగ్రహకారులు 'శూలాన్ని ధరించిన దేవాదిచే' అని అర్థం చేసుకోలేకపోయారు. విశేషణ విశేష్య భావాన్ని వ్యత్యస్తంగా గ్రహించి ''దేవతల కాదియైన — ఆదిదేవుడైన శివునిచేత'' చంపబడినట్లు అర్థం చేసుకున్నారు. తపస్వి అయిన ఒక మహా ముని వి శివుడు చంపుతాడా? ఎందుకు చంపవలసి వచ్చింది? ఆ దైవయోగం ఏమిటి?—అనే ఆలోచనయే ఆయనకు కలగలేదేమో! శివుడు కోపంతో సంహరించి వాని కొమార్తెకు పార్వతీదేవి ప్రత్యక్షమయి ధైర్యం చెప్పి భర్తకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తుందా?

లక్ష్మణరావుగారి వ్రాత మరీ అనుచితంగా ఉన్నట్లు తోస్తున్నది.

ఈవిధంగా వేర్వేరు కవులకు విభిన్నాభిప్రాయాలు కలగడానికి కారణం మూలాన్ని సమన్వయం చేసుకోవడంలో కలిగిన చికాకులే అని తెలుస్తున్నది. మార్కండేయ పురాణంలో తరుచుగా అన్వయ క్లిష్టత ఏర్పడుతూనే ఉంటుంది. కొంత ఆలోచిస్తే సమన్వయం చేసుకొనుటకు అట్టి స్థలాల్లో అవకాశం ఉండకపోదు.

డా. లకంసాని చక్రధరరావు

తెలుగు వ్యుత్పత్తికోశం సమీక్షా పరామర్శ

'భారతి'–జనవరి 1979 సంచికలో శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు రాసిన 'ఆంధ్రవిశ్వకళా పరిషన్ముద్రణం-తెలుగు వ్యుత్పత్తికోశం (అ–ఔ)' అనే సమీక్షా వ్యాసాన్ని పరిశీలించి నా అభిప్రాయాల్ని తెలియజేస్తున్నాను.

తెలుగు వ్యుత్పత్తికోశంలో అర్థవిపరిణామం చెందని సంస్కృత సమ శబ్దాలు తప్ప మిగిలిన అన్నిరకాల పదాల్ని ఇవ్వటం జరిగింది (తెలుగు వ్యుత్పత్తికోశం పీఠిక XIX పుట). ప్రణాళికలోని ముఖ్యమైన ఈ విషయాన్ని గమనించని కారణంగా 'ఆంధ్రభాష, ఆంధ్రీకరించు, ఆకస్మాత్' మొదలైన సంస్కృత సమశబ్దాలు కోశంలో లేవని విమర్శకులు ఆక్షేపించారు.

తెలుగు వ్యుత్పత్తికోశపథకం 1957 నుంచి 1962 మార్చి 31 వరకు కొనసాగిందనీ ఈ దశలో తెలుగు పదాల ప్రధానారోపాలు ఉపారోపాలు రోమన్ లిపిలోను వాటి అర్థాలు ఆంగ్లంలోనూ ఇవ్వబడ్డాయని పీఠిక (పుట–17)లో వివరించబడింది. 1962 నుంచి 1970 వరకు నిధుల కొరతవల్ల కోశ నిర్మాణం ఆపివేయబడిందనీ 1970 నుంచిమాత్రం తెలుగు వ్యుత్పత్తికోశం తెలుగులిపిలో తెలుగు అర్థాలతో కొనసాగుతోందని పేర్కొనబడింది. (పీఠిక పుటలు 17, 18) కోశం ప్రథమ సంపుటం నిర్మాణం 1970–76 మధ్య కాలంలో పూర్తిఅయింది. ఆరు సంవత్సరాల కాలం ప్రస్తుత నిఘంటు నిర్మాణానికి వినియోగించబడింది. 1957–62 కాలాన్ని కలుపుకొన్నా 11 సంవత్సరాలకు మించదు కదా. మరి 21 సంవత్సరాల కాలం అని శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు పేర్కొన్నారు. 10 సంవత్సరాల కాలాన్ని అధికంగా చెప్పటం భావ్యమా? 1984 మార్చి 31కి ఈ కోశాన్ని పూర్తి కావించటం జరుగుతుందని మేము భావించగా, 'అప్పటికి ఈ నిధులు పెన్నిధులు ఉంటాయో లేదో చెప్పలేం' అని శ్రీ వేంకటరావుగారు నిరాశావాదాన్ని వ్యక్తీకరించారు. పెన్నిధివంటి శ్రీ ఎమ్. ఆర్. అప్పారావుగారు ఆంధ్ర విశ్వకళాపరిషదుపాధ్యక్షులుగా ఉండగా నిధులకు కొరతలేదు అని మా భావన.

పూర్వం ఈ కోశాన్ని నిర్మించ తలపెట్టినవారు 35,000 పదాలు ఇందులో ఉంటాయని భావించగా -రమారమి లక్షపదాలు ఉంటాయని ప్రస్తుతం మేము పదబంధ పారిజాతము, మాండలిక వ్యుత్పత్తికోశం (5వ సంపుటం) మొదలైన కోశాల్ని గ్రహించి అంచనా వేశాం. అన్ని సంపుటాలు సమానమైన పరిమాణంలో ఉండాలనే ఉద్దేశంతో మొత్తం కోశాన్ని 8 సంపుటాలుగా వెలువరించటానికి నిర్ణయించాం. 12,219 ఆరోపాలతో ప్రథమ సంపుటం కేంద్ర విద్యాశాఖామాత్యులు డాక్టర్ పి. సి. చందర్ గారిచే 10–7–1978న ఆవిష్కరించబడింది. 'క' నుంచి 'ఘ' వరకు ఉన్న 19,416 ఆరోపాలతో ఉన్న రెండో సంపుటం 16-11-1978న ఆంధ్రాయూనివర్సిటీ ప్రెస్సుకు ఇవ్వగా ప్రస్తుతం ముద్రించబడుతోంది. 'చ' నుండి 'త' వరకు ఉన్న తృతీయ సంపుట నిర్మాణం చురుకుగా సాగుతోంది. 'థ' నుంచి 'న' వరకు ఉన్నది నాల్గో సంపుటంగానూ 'ప' నుంచి 'భ' వరకు ఉన్నది ఐదో సంపుటంగానూ 'మ' నుంచి 'ల' వరకు ఉన్నది ఆరో సంపుటంగానూ 'వ' నుంచి 'ష' వరకు ఉన్నది ఏడో సంపుటంగానూ 'స' నుంచి 'హ' వరకు ఉన్నది ఎనిమిదో సంపుటంగానూ ప్రకటించబడతాయి. ఎనిమిదో సంపుటానికి అనుబంధంగా, మరిచిపోయిన పదాలు ఇవ్వబడతాయి. కోశం అనవసరంగా ఇంకా పెద్దది ఔతుంది అనే భావంతోనూ నిర్ణీత కాలంలో ఇవ్వవలసిన అవసరాన్ని బట్టి అర్థవిపరిణామం చెందని సంస్కృత సమశబ్దాల్ని, వ్యక్తినామాల్ని, గ్రామనామాల్ని, ఇళ్ళ పేర్లను ఈ నిఘంటువులో ఇవ్వలేదు. ఎక్కడైన సరికాని అర్థాల్ని (పదాలకు) ఇవ్వటం జరిగితే వాటిని అనుబంధాల్లో సవరించుకోవాలని ముందుగానే నిర్ణయించడం జరిగింది. స్థాలీపులాకం సమీక్షకుల విమర్శల్ని పరామర్శిద్దాం. పూర్వ నిఘంటువులపై వచ్చిన విమర్శల్ని పరికించలేదంటూ శ్రీ వేంకటరావుగారు దోషాలుకాని వాటినికూడా దోషాలుగా పేర్కొన్నారు.

అనుగు మొగసాల. వి. రాజమందిర సింహద్వారానికి చేరి ఉప్పశాల. భార. ఉద్యో. 3–177. హరి. ఉ. 3–17; శృం.నై, 6–86. (తె. వ్యు. కో. పుట. 731.)

'చనుదెంచి సర్వజనములు
దమ గౌతూహల తరంగ తరళ తరవి లో
చనులై కను గొనంగ నగరి
యనుంగు మొగసాల గవని కవతీర్ణుండై'

హరి. ఉ. 3–17

అని హరివంశంలో ఎఱ్ఱాప్రెగడ ప్రాసస్థంగా 'అమంగు మొగసాల' శబ్దాన్ని ప్రయోగించగా దాన్ని అంగీకరిస్తూనే శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు 'అమగు మొగసాల' ఉపారోపం తప్పు అని ఏవిధంగా రాయగలిగారో ఊహాతీతంగా ఉంది. ఇక తిక్కనగారి భారతంలో 'అమంగు మొగసాల, ఏమంగు మొగసాల' అనే రెండు పాఠాలు ఉన్నాయి. రాయబారానికి బయలుదేరిన శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుని సభాభవనాన్ని ప్రవేశించడానికిముందు 'ఏమంగు మొగసాల'ను చేరవలసిన అవసరం ఏముంది? 'అమంగు మొగసాల' అన్న పాఠమే సందర్భోచితంగా ఉంది. రాజమందిర సింహద్వారానికి చేరిఉన్న శాలను ప్రవేశించి రథాన్ని కృష్ణుడు దిగినట్లుగా చెప్పటంలోనే ఔచిత్యం ఉంది. శృంగార నైషధంలో 'అమంగు మొగసాల గ్రథ కైశికావనిపుడు' అనే పాఠం కూడా ఉంది. ఇట్లా రెండు పాఠాలు ఉన్నచోట్ల మేము గ్రహించిన పాఠాన్ని కాదనటం మాకు భిన్నంగా ఉన్నదాన్ని గ్రహించటం శ్రీ వేంకటరావుగారి వ్యాసంలో సర్వత్ర గోచరిస్తోంది. కాగా హరివంశ ప్రయోగాన్నిబట్టి భారతంలో మేము గ్రహించిన పాఠంలోని ఔచిత్యాన్నిబట్టి సూర్యరాయాంధ్ర నిఘంటుకారులు పేర్కొన్న శృంగార నైషధ ప్రయోగంలో ఏమీ ప్రమాదంలేకపోవటాన్నిబట్టి 'అమగు మొగసాల' ఉపారోపం ఉపాదేయం.

పద్యం యమక బద్ధంగా ఉంది కాబట్టి 'అసింబోవు' అని కాక 'అసివోవు' అని ఉండాలని శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారిని అనుసరించి శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు వ్యాఖ్యానించారు. కాని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురించిన రామాభ్యుదయములో 'అసింబోవు టెట్లు నాయసింబోవు మెకముల' (రామాభ్యుదయము 2–24) అని ఉంది. యమకానికి గాని అర్థానికి గాని భంగం వాటిల్లలేదు.

ఆవు దూడ అనే అర్థంలో 'ఆఁబెయ్య' శబ్దాన్ని తెలుగు వ్యుత్పత్తికోశం (పుట. 140)లో ఇవ్వగా శ్రీ వేంకటరావుగారు 'ఆఁబెయ్య పాఠం అసాధువు' (పాఠ. 14) అని ఒక వాక్యంలో కారణం చూపకుండా మా పాఠాన్ని కొట్టివేశారు.

సూర్యరాయాంధ్ర నిఘంటువులో 'కుమ్ములాడు' కింద

'కొసర కాఁబోతు నాఁబోతు గ్రుమ్ములాడ
నడిమి యాఁబెయ్య గతి వచ్చె నాకు నిపుడు
కాశీ. 2-104

అని ఉండగా శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు 'ఆఁబెయ్య' పాఠం తప్పనీ 'లేఁబెయ్య' అనేది సరైన పాఠం అనీ పేర్కొన్నారు. 'ఆఁబెయ్య' శబ్దరూపమే లేదని వారు ఎక్కడా పేర్కొనలేదు. సందర్భాన్నిబట్టి కాశీఖండంలో శ్రీనాథుడు 'లేఁబెయ్య' అనే ప్రయోగించాడని వారి భావం. తిక్కన సోమయాజి తన భారతంలో

శ్రమమునకై యేను సకలాంబకములు
నెక్కుడు వెసనేయ నయ్యెడకు నొక్క
యాఁబెయ్య యుఱికి నా యజ్ఞానమున
నంప తాఁకునఁగూలుడు దానిఁగలుగు
భార. కర్ణ. 2–90

అని ప్రయోగించాడు. 'ఆఁబెయ్య'ను 'లేఁబెయ్య'గా మారిస్తే యతి భ్రష్టమవుతుంది. ఇంతకూ కాశీఖండ ప్రయోగాన్ని ఆఁబెయ్య శబ్దానికి మేము ఇవ్వనేలేదు. శ్రీ నిడుదవోలు వేంకటరావుగారి ఆక్షేపణకు అర్థం తెలియటంలేదు.

అర్థాలు రాయటంలో విపరీత వైదుష్యం కలదంటూ కొన్ని పదాలకు మేమిచ్చిన సరయిన అర్థాల్నికూడా సరైనవి కావని సమీక్షకులు తమ వాదాన్ని కొనసాగించారు.

అంకిలి శబ్దానికి 'తాలు మూలమందలి కీలు, దౌడకీలు' (పు. 15) అని అర్థం ఇవ్వబడగా, 'తాలువంటే దౌడకాదు' అని ఆక్షేపించారు. తాలువంటే దౌడకాదుగాని తాలుమూలం అంటే దౌడ అనే అర్థం కదా.

'అచ్చ తెలుఁగు' శబ్దానికి 'వి. స్వచ్ఛమైన తెలుగు' సంస్కృత సమేతరమైన తెనుగు అనే అర్థాల్ని (తె. వ్యు. కో. పు. 22) ఇవ్వగా 'అచ్చ తెలుఁగు స్వచ్ఛమైన తెలుగు?' అని విమర్శించారు. 'స్వచ్ఛమైన తెలుగు' అనేది వ్యుత్పత్త్యర్థం, ఇందులో ఆక్షేపణీయాంశం ఏమీలేదు.

'ఉప్పపిండి' అంటే 'ఉప్పువేసి వండిన పిండి' అని అర్థం ఇచ్చాం. 'ఉప్పేసి చేసిన పిళ్ళన్నీ ఉప్పపిళ్ళవుతాయా?' అని ప్రశ్న. 'ఉప్పపిండి శబ్దం పంకజం' వంటిది. బురదలో పుట్టినవన్నీ పద్మాలవుతాయా? అని ప్రశ్నిస్తే ఏమిలాభం. ఉప్పు ప్రధానంగా వేసి చేసిన పిండిని 'ఉప్పుపిండి' అని రూఢ్యర్థంగా లోక వ్యవహారంలో ఉంది. ఇందులో దోషం ఏమీలేదు.

'ఉప్పన' అనే ఆరోపంకింద ఇచ్చిన 'ఉప్పిండి' తీసుకుందాం. అని శ్రీ వేంకటరావుగారు తమ వాదాన్ని కొనసాగిస్తున్నారు. ఉప్పిండి అనే రెండు ఆరోపాలు ఉప్పు^{2} కింద ఇవ్వబడ్డాయనీ ఉప్పన కింద కాదనీ గమనించ ప్రార్థన. ఉప్పన అనేది ఉప్పు^{2} కింద ఇవ్వబడ్డ ఉపారోపాల్లో ఒకటి మాత్రమే ఉప్పు^{2} కింద ఉపారోపంగా ఇవ్వబడ్డ 'ఉప్పిండి యుపవాసము రూ. ఉప్పిడి యుపవాసము. చూ ఉప్పిండి; వి. శుష్కోపవాసం. కాశీ. 2–83.' అన్నదానిని ఆక్షేపించారు. శ్రీనాథుని కాశీఖండ పద్యంలో ప్రయుక్తమైన 'ఉప్పిండి యుపవాసము' అనే సమాసానికి 'శుష్కోపవాసం' (ఉప్పు లేని పిండిని తింటూ చేసే ఉపవాసం) అని అర్థం చెప్పటం శ్రీ వేంకటరావుగారికి సబబుగా లేదట. పద్యపాదాన్ని ఒక్కసారి పఠిస్తే మేమిచ్చిన అర్థమే సరైంది అని సహృదయ పాఠకులకు అవగతమౌతుంది.

'ఓర్పుమై నుప్పిండి యుపవాస ముండ నీ
మగవాని సరి బోల్ప దగదు విధవ'

[కాశీ 2–83]

ఉపవాసాన్ని రెండురకాలుగా చేస్తారు. కొందరు ఏమీ తినకుండా కేవలం తులసితీర్థం మాత్రం పుచ్చుకొని ఉపవాసంచేస్తారు. మరి కొందరు ఉప్పులేని పిండిపదార్థాన్ని మాత్రం తింటూ ఉపవాసమున్నా వితంతువును మగనాలితో సరిపోల్చటానికి వీలులేదు అని శ్రీనాథుని భావం. ఉప్పిండి యుపవాస మనేది 500 సంవత్సరాలకు పూర్వం లేదని ఎలా చెప్పగలరు? నేటికీ మా ప్రాంతం (పశ్చిమ గోదావరి జిల్లా)లో ఉప్పిడి ఉపవాసం అనే వ్యవహారం ఉంది. వృద్ధులు వ్రతాలలోను, ఏకాదశి శివరాత్రివంటి పర్వదినాలలోనూ ఉప్పలేకుండా ఉన్నపిండిని రాత్రిపూట కొంత తింటారు. ఉప్పు, కారం కామ కారకాలు కాబట్టి వాటిని విసర్జించటం అవపరమని వారి భావం. అందులో ఉప్పు లేకుండా ఉన్న పదార్థాన్ని భుజించటం అంటే ఇంద్రియ నిగ్రహాన్ని పాటించటమే. 'ఉప్పిడి ఉపవాసం ఉంటున్నాడు, ఉప్పిడి ఉంటున్నాను' అనే వ్యవహారిక రూపాలు నేడు ఉన్నాయంటే శ్రీనాథుని కాలానికి నిష్ఠలూ, నియమాలూ ఇతోధికంగా ఉండేవని భావించవచ్చు. ఉప్పులేని వంట కాస్ని తినటానికి ఓర్పు కావాలి కాని శ్రీ నిడుదవోలు వేంకటరావు గారు చెప్పినట్లు ఉప్పువేసి ఉడకబెట్టిన వంటకం అని అర్థం చెప్తే అట్టి పదార్థాన్ని తినటానికి ఓర్పు ఎందుకు? 'ఓర్పుమై' అనే శ్రీనాథ ప్రయోగం మేమిచ్చిన అర్థాన్ని సమర్థించటమే కాకుండా మా 'వ్యుత్పత్తి ఉత్పత్తి శక్తి'కి శ్రీరామ రక్షగా నిలుస్తోంది. శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు ఉదాహరించిన డి. ఇ. డి. ని ఉప్పు కింద 245 పుటలో ఉడకబెట్టు అని అర్థమిస్తూ 'భేషజం' లేకుండా మరికొన్ని సజాతీయ భాషా పదాలతోపాటు ఇచ్చాం. 'శ్రీ వేంకటరావుగారి వ్యాసం చదివిన వాళ్ళకు మేము డి. ఇ. డి. చూడలేదేమో అనే భ్రాంతి కల్గుతుంది. దాన్ని నివారించటానికి ఈ విధంగా విపులంగా వివరించవలసి వచ్చింది.

పదాలకు ప్రయోగాల్ని కాలానుగుణంగా ఇవ్వాలి అనేది సదుద్దేశం. ఇట్టి సత్ప్రయత్నాన్ని ప్రారంభించటం తెలుగు నిఘంటు చరిత్రలో అపూర్వం. ఈ పూనికలో కొన్ని దొసగులు ఉండవచ్చు ఆ తప్పుల్ని తొలగించుకొని ముందుకు పయనిస్తాం. ఏ కోశమూ కూడా సమగ్రం అని అనలేముకదా! అందులో వ్యావహారిక పదాల్ని కూడా స్వీకరించాలనే నియమం పెట్టుకొన్న తెలుగు వ్యుత్పత్తి కోశంలో కొన్ని పదాలు లేకపోవచ్చు. కాగా సహృదయులైన పండిత ప్రకాండుల సహాయ సంపత్తితో మా కోశం పరిపూర్ణం కాగలదని మా ఆకాంక్ష. కొన్ని పదాలకు గల మూలరూపాలు తెలుగు వ్యుత్పత్తికోశంలో తప్పుగా ఉన్నట్లు శ్రీ వేంకటరావుగారు ఆరోపించారు. 'అడి' కుదువ. అడి శబ్దాన్ని 'అధి–' ప్రా. అధి. శబ్ద సంబంధిగా నిష్పన్నం చేశారు. 'అడి'ని దేశ్యంగా మేము భావిస్తే తద్భవంగా వారు సంభావించారు. వైకృత పదస్వరూప నిరూపకులు కూడా 'అడి'ని దేశ్యంగానే భావించిన కారణంగనే తమసిద్ధాంత వ్యాసంలో గ్రహించలేదు.

సహృదయ విమర్శకుల సలహాలు మా తెలుగు వ్యుత్పత్తికోశ నిర్మాణానికి ఇతోధికంగా లభించగలవని ఆశిస్తున్నాము.

అనుయాత్ర

శ్రీ నాళేశ్వరం శంకర్

హృదయం ద్రవించనీ
కష్టాల అంచులు చూసిరావడానికి —
కళ్ళు కన్నీళ్ళు కార్చనీ
జీవసాగరాల లోతులు కనుక్కోవడానికి —
గుండె మూగపోతేపోనీ
బాధల సమాధులు తడమడానికి —

అసలు నేనెందుకనా ప్రశ్న...?
ఆర్తనాదాల అనుభవం కొఱకు
ఆశయం గమ్యం కొఱకు
పుట్టుక పయనం కొఱకు
నిలదీసి చెబుతున్నా
నిజంగా నీ కొఱకు !

మనసు స్వాధీనం కాకనే
స్పృశ్యా స్పృశ్య విచారం;
అల్పబుద్ధులకే యనల్పప్రీతి
కల్పితాచార సంపత్తిపై.

ఔన్నత్య పదసంచారి తానైనా
సున్నితమైన సూర్య కరస్పర్శ
కమలానికి కశ్మలానికి
సమంగానే సోకుతుంది.

ఉదాత్త బుద్ధులందఱూ ఈ
ఆదర్శాన్ని గ్రహించాలి;
తాము నిత్యం ఉపాసించే
దైవ లక్షణం సాధించాలి.

*　　　*　　　*

పట్టెడు మెదుకులు పెట్టి
వెట్టిచాకిరీ చేయిస్తారు;
హలాలు పట్టించి పొలాలు దున్నిస్తారు;
కొండల్ని పిండిచేయించి
గుళ్ళు గోపురాలు కట్టిస్తారు; కాని
గుళ్ళోకి రానీకుండా
గట్టి కట్టడి చేయిస్తారు.

నిరంతర సంసర్గం కారణంగా
గుణాన్నీ రూపాన్నీ అభిమానించి
ప్రేమ భావాన్ని ప్రకటిస్తే
సజీవ దహనానికి
సంకోచింపని జాతియిది.

*　　　*　　　*

కన్నకూతురు రెన్నేండ్లదిగినా
నిమ్మకు నీరెత్తినట్లు
మిన్నకుంటాడు తండ్రి;
తగిన సంబంధం తేలేడు;
తనంత తానుగా ప్రేమించి
ఏ హరిజనుడ్నో వివాహమాడితే
ఆత్మాభిమానం అడుగంటిందని
ఆత్మజ నంతమొందిస్తాడు !
అమ్మ పెట్టదు, అడుక్కు తిన్నీదు;
పెండ్లిచేయలేని అసమర్థుడు
అకృత్యాల కత్యంత సమర్థుడు,
అందు కందరి అండదండలు
అందుబాటౌతాయి.

ఎంత క్రౌర్యం ! ఎంత దౌష్ట్యం ! !
ఎంతటి అమానుషత్వం ! !
అంతరంగాల్ని అలమటింపజేసే
కఠిన శిలల్నీ కరిగించే
కరుణారస గాథలు వింటున్నాం.
ఏ భవభూతో ఇప్పుడుంటే
ప్రభవించేది కరుణారసం.

ఎందరో పరమహంసలు
ఎందరో వివేకానందులు
ఎందరో రామతీర్థులు
మహాత్మగాంధీలు
ఉన్నవ లక్ష్మీనారాయణులు
ఉద్భవించి ఉద్ఘోషించినా
పుత్తైతో పుట్టిన ఈ బుద్ధి
పుడలోగాని పోదా ?

[ఆకాశవాణి విజయవాడ సౌజన్యంతో]

శిల్పసుందరి

శ్రీ శనగన నరసింహస్వామి

మ్రోడువాఱిన మ్రాకులు మ్రుగ్గు చెఱుగు
ప్రాంగణంబులు కూలిన పర్ణశాల
లాఁటిపోయిన వహ్నిలీ యాశ్రమంబు
పాడువడినట్లు తోచు నెవ్వరిదొకాని !

2

కానరాదిట నొక లేడికూన కూడ
విహగ సంచయరుతులైన వినగరావు
సర్వభూత సదాభయ స్థానమైన
పుణ్య వాటిక యెటు రుద్రభూమియయ్యె ?

3

ఒక్కమాత్రైన మధుమాస ముత్సహించి
వచ్చి వెళ్ళిన జాడలే వలవవిచట
ఎల్లకాలము శిశిరమే యేలుకొనునొ
ఆశ్రమంబౌర ! నిదురించునట్లు తోచు.

4

క్రోధవశుడైన యేమౌని క్రూరకుటిల
కఠిన పాషాణ శాపవాక్యములు మాటి
కాత్మగలచునొ యీ శిథిలాశ్రమోర్వి
తరులతాదులతోడ చిత్రముగ వణకు

5

మునివర ! యిచ్చటన్ పదము మోపిన యంతనె అంతరంగమున్
ఘనతర దుఃఖ మేఘములు కమ్ముకొనెన్; గతకాలమందు నం
దన సమమౌచు పాంథనయనంబుల కామెతవెట్టు నిత్తపో
వనమున సైపరాని యొక వంచనకృత్యము సంఘటిల్లెనో !

6

'పాహిపాహీతి' దుఃఖాశ్రుభరితఫణితు
లేరివో వీనుగవదాకి మాఱుమ్రోగు
మానసంబెల్ల కరుణైక మగ్నమౌను
ఈ అకారణ బాంధవంబేమొ సామి !

7

దేవతాపతి ధాత్రికి దింపజాలు
అంద మీ రాతిబొమ్మలో నణగిపోయె
ఎంత పాపము చేసినానే మనస్సు
నాపజాలక జన్మజన్మాంతరసఖి !

8

నీ వెఱుంగుదువో లేదొ దేవరాజు
ప్రతిదినంబును నీ శిలాపాదయుగళి
లోచన సహస్ర దుఃఖాశ్రువీచి గడిగి
కల్ప సుమపూజనంబుల గారవించు.

9

ప్రియతమా ! యెట్టి పాషాణ హృదయుడగునొ
గౌతముడు నాదు ప్రాణముల్ గాచివిడిచె
నన్ను నీవలె శిలజేసి యున్నయెడల
వేచునే యిట్లనుక్షణ విరహవహ్ని !

శ్రీ బులుసు వేంకట రమణయ్య

మను చరిత్ర - మార్కండేయ పురాణములు కొన్ని విశేషాలు

1. చతుర్దశ మనువులలోనూ ద్యుతిమంతుడు ఒకడు. అతడు స్వరోచి కుమారుడు కావడంవల్ల స్వారోచిషుడనే పేరు కూడా వచ్చింది.

'స బాలో ద్యుతి మాన్నామ మహాబల పరాక్రమః,
స్వరోచిషః సుతో యస్మాత్ తస్మాత్ స్వారోచిషోఽభవత్.'

అనే మార్కండేయ పురాణంలోని శ్లోకం (అధ్యా 61. శ్లో. 30) పై విషయాన్ని తెలియజేస్తున్నది. మార్కండేయ పురాణాన్ననుసరించి తాను ప్రబంధాన్ని రచిస్తున్నానని చెప్పిన ఆంధ్ర కవితా పితామహుడు మను చరిత్రలో

''అట్లు జనియించి స్వారోచిషాఖ్య నతడు,
శాంతి దాంతి దయా సత్య శౌచ నిరతు
డై యకామత జిర తపం బాచరించె,
నచ్యుతుని గూర్చి...... .'' (ఆశ్వా. 6. పద్య. 101)

స్వారోచిషుడనిమాత్రమే చెప్పియున్నాడు. ద్యుతిమంతుడనే పేరును స్మరించనేలేదు. స్వారోచిష నామమే ప్రసిద్ధంగా ఉన్నందున పెద్దన దానినే గ్రహించి ఉండవచ్చును.

మనువు లందరి చరిత్రల్లోనూ స్వారోచిష మనువు చరిత్రే చక్కని సన్నివేశాలతో రసవంతంగా ఉండడంవల్ల పెద్దనామాత్యుడు దానినే గ్రహించి ఉండాలి. తక్కిన మనువుల చరిత్రలను తెలుగు కవులెవ్వరూ ప్రబంధాలుగా రచించినట్లు తెలియదు. ఒకవేళ రచించినా 'స్వారోచిష మను సంభ'వాని కున్నపేరు మరిదేనికీ లేకపోవడం వల్ల 'మను చరిత్ర' అనే పేరు దీనికే రూఢమైపోయింది.

2. ప్రవరుడు ఔషధ సిద్ధునికి ఆతిథ్యం ఇచ్చి, ఆయన విశ్రాంతి తీసుకున్న తర్వాత ఆయా చోట్లలోని విశేషాలను అడిగి తెలుసుకొని తనకున్నూ ఆయా స్థలాల్లోని విశేషాలను చూడవలెననే ఆశ ఉన్నట్లు తెలియజేశాడు. ఆ సిద్ధుడు ప్రవరునికి పాద లేపాన్ని ఇచ్చాడు. దాని ప్రభావంవల్లనే ప్రవరుడు హిమాలయానికి పోయి అక్కడి వింతలను, ప్రసిద్ధ స్థలాలను చూడగలిగాడు.

ఈ సందర్భంలో మను చరిత్రలో ఉన్నదిది —

ప్రవరుడా సిద్ధుణ్ణి ''నేను మీ శిష్యుని దీర్ఘయాత్ర వలనన్ ధన్మాత్ము జేయరే.'' అని ప్రార్థించాడు. ఆ సిద్ధుడు

'అనుటయు రసలింగము నిడు
తన వ్రటువ ప్రేప సజ్జ దంతపు బరణిన్
నినిచిన యొకమం దిది యది,
యని చెప్పక పూసె దత్పదాంబుజ యుగళిన్.'
(ఆ. 1. పద్య. 78)

మందు పేరు ఏమీ చెప్పకుండా సిద్ధుడు ప్రవరుని అరి పాదాలకు ఒక మందు పూశాడట. ఆయన మొదటనే, పాదలేప ప్రభావంవల్ల తనకు అతి స్వల్పకాలంలో దేశంఅంతా తిరిగి ముఖ్యమైన స్థలాలను అన్నిటినీ చూడడం సాధ్యపడిందని తెలిపియే ఉన్నాడు. దానివిబట్టే అతడు పూసిన మందు పాదలేపమని సులభంగానే గ్రహించవచ్చును. వేరే పేరు చెప్పనక్కరయేలేదు.

సిద్ధుడు ప్రవరుని పాదాలకు మందుపూసినట్లు పెద్దనగారు చెప్పడంవల్ల కొన్ని సందేహాలూ, విమర్శ ప్రతి విమర్శలు కొన్ని దశాబ్దాల కిందట సాహితీలోకాన్ని కలవరపరిచాయి. హితవకాలంలో వచ్చిన సిద్ధుడు అతిథి పూజల్ని అందుకొని భోజనంచేసి, విశ్రాంతి తీసుకున్న తర్వాత గదా, అతనితో దీర్ఘ సంభాషణ, పాదలేపప్రసక్తి వచ్చాయి అప్పటికి పగలు మూడు జాములకు పైగా అవుతుంది. అప్పడు పూసిన పాదలేపం సాయం స్నానాదికృత్యాలవల్ల కరిగిపోదా? పాద లేపం కరిగిపోకుండా ఉండవలెనని ప్రవరుడు సంధ్యా నియమాలను మానివేశాడా? మర్నాడు ఉదయం స్నాన సంధ్యాదులు నిర్వర్తించకుండానే హిమాలయానికి బయలుదేరాడా? ''ఇయ్యెడం, గల చోద్యంబులు రేపు గన్గొని యెదంగ కేమి నేడేగెదన్, నలినీ బాంధవ భానుతప్త రవికాంతస్యంది నీహారకం, దల చూత్కార పరంపరల్ పయిపయిన్ మధ్యాహ్నముం దెల్పెడిన్'' (మను—ఆశ్వా. 2 ప.) అనే దానినిబట్టి మిట్టమధ్యాహ్నం వరకూ అతడు హిమగిరి విశేషాలు చూచినట్లు స్పష్టంగా తెలుస్తున్నదిగదా! అందువల్ల పాదలేపం పూసిన రోజుకు మర్నాడు ప్రవరుడు హిమాచలానికి వెళ్లినట్లు చెప్పవలసి ఉన్నది సిద్ధుడు పాదలేపాన్ని ప్రవరుని పాదాలకు పూసినట్లున్నందున, కాలం కుదరక తికమకలు పడవలసి వస్తున్నది.

మార్కండేయ పురాణంలో సిద్ధుడు ప్రవరునికి పాదలేపం యిచ్చినట్లున్నది గాని, పాదాలకు పూసినట్లులేదు.

"సప్రాదాద్ బ్రాహ్మణశ్చాస్మై పాదలేప ముదారధీపి" [అధ్యా 56, శ్లో. 16) అని పాదలేపాన్ని ఇచ్చినట్లే ఉన్నది. మారన మార్కండేయ పురాణంలోకూడా

"చ...... .... నాకు భాద లే
పన పరమౌషధ్ధంబు ఘునిపాలక! యిచ్చి కృతార్థుజేయవే
నను నని వేడుకొన్న ఘని నాయకు డాతనికిచ్చె......"
[అశ్వా. 4. ప. 219]

అని పాదలేపాన్ని యిచ్చినట్లే చెప్పబడింది. పూసినట్లు లేదు. ఇస్తే చిక్కేలేదు. తనకు కావలసినప్పుడు ఉపయోగించుకోవచ్చు. ప్రవరుడు మరునాడో, మరొకనాడో ప్రాతఃకాలానుష్ఠానాలు నిర్వర్తించుకున్న తర్వాత దాన్ని పాదాలకు పూసుకుని హిమాలయానికి వెళ్లి ఉండవచ్చును. పెద్దనగారు తమ రచనా ధోరణిలో యీ కాల వ్యత్యాసాన్ని గమనించి ఉండకపోవచ్చును.

3. స్వరోచి భార్యయైన మనోరమ చెలికత్తెలు విభావరి, కళావతి అని మార్కండేయ పురాణంలో ఉన్నది. మనుచరిత్రలో 'విభావరి'కి బదులు 'విభావసి' అనే పేరు కానవస్తున్నది. పెద్దనగారికి లభించిన మూలప్రతిలో 'విభావసి" అని ఉండినట్లు దీనివల్ల తెలుస్తున్నది. మారన మార్కండేయ పురాణంలో 'విభావసి' అనియే ఉన్నది. ఆంధ్రకవితా పితామహుని కాలంనాటికే సంస్కృత మూలంలో పాఠాంతరాలు చేరినట్లు దీనినిబట్టి ఊహించవచ్చును. తన్ను నిందించి బెదరించిన ముని ఆ చెలికత్తె లిద్దరికీ క్షయరోగం వచ్చేటట్లు శపించాడని మనుచరిత్రలో ఉన్నది. కాని మార్కండేయ పురాణంలో ఒకతెకు కుష్ఠురోగం వచ్చునట్లు, మరొకతెకు క్షయ రోగం సంభవించునట్లు శపించాడని

"ఏతచ్ఛ్రుత్వా దదేశాపం తయో రప్యమిత ద్యుతిః,
ఏకస్యాః కుష్ఠమంగేష భావ్యన్యస్యా స్తథాక్షయః"
[అధ్యా, 58. శ్లో. 20, 21]

అనే శ్లోకభాగంవల్ల తెలుస్తున్నది.

4. మనోరమకు సఖియైన కళావతి వృత్తాంతం సంస్కృత మార్కండేయ పురాణంలో ఈ క్రిందివిధంగా ఉన్నది.

పారుడనే బ్రహ్మర్షి వేదవేదాంగవేత్త అరణ్యంలో తపస్సు చేసుకొంటూ ఉండగా పుంజికస్థల అనే అప్సరస ఆయన ఆశ్రమానికి వచ్చింది. అది మదనోద్రేకం కల్గించే వసంతరుతువు. అందకత్తె అయిన ఆ అప్సరసను చూడగానే మహామునికి మనశ్చాంచల్యం కలిగింది. ఆమెపై అనురాగం ఏర్పడింది. ఇద్దరూ కొంచెం కాలం సుఖంగా గడిపారు. వారికి ఒక స్త్రీ శిశువు కలిగింది. బిడ్డ పుట్టగానే పుంజికస్థల ఆ బిడ్డను జనశూన్యమైన ఆ అడవిలో విడిచిపెట్టి వెళ్లిపోయింది. ఆ ముని కూడా అక్కడినుంచి వెళ్లిపోయాడు. దిక్కులేని స్థితిలో ఉన్న ఆ శిశువు రాత్రులందు తనపై ప్రసరించిన చంద్రుని కిరణాలే ఆహారంగా ప్రాణాలు నిలుపుకొన్నది. కొద్ది రోజుల్లో అక్కడికి సుభామువనే గంధర్వుడు రావడం తటస్థించింది. అతడు కరుణతో ఆ బిడ్డను తీసుకొని వెళ్లి తండ్రిఫలెనే పెంచి పెద్దచేశాడు. ఆ బిడ్డ చంద్రుని కళలవల్ల జీవించి, పెరిగినందువ అతడు ఆ శిశువుకు కళావతి అని పేరు పెట్టాడు కళావతి అతడినే తండ్రిగా భావించింది. ఆమెకు యుక్తవయస్సు వచ్చిన పిదప దేవాది అనే గంధర్వ యువకుడు, ఆమెను తన కియ్యవలెనని కోరగా తండ్రి తిరస్కరించాడు. ఆ కోపంతో ఆ గంధర్వుడు శూలంతో పొడిచి అతణ్ణి చంపివేశాడు. అప్పుడు కళావతి విరక్తితో ఆత్మహత్యకు సిద్ధపడగా, పార్వతీదేవి ప్రత్యక్షమై దుఃఖించవద్దనీ, మహనీయుడైన స్వరోచి భర్త కాగలడనీ చెప్పి ఆ ప్రయత్నంమండి విరారించింది.

తర్వాత ఆమెను స్వరోచి వివాహమాడతాడు.

ఈ కథలో ప్రధానంగా గమనించవలసిన శ్లోకాలివి —

"ఆజగామాప్సరాభ్యాశం ప్రఖ్యాతా పుంజికస్థలా,
కామం వైక్లబ్యతాం నీతః స తయా మునిపుంగవః,
తత్సంయోగేఽహ ముత్పన్నా తస్యాం తత్ర మహావనే.
విహాయ స గతః సా చ మా మస్మిన్ విజనే వనే.
బాలా మేకాం మహీపృష్ఠే వ్యాఘ్రశ్వాపద సంకులే.
తతః కళాభిః సోమస్య వర్ధంతీ రహఃక్షయే
ఆప్యాయ మానాహరహో వృద్ధిం యాతాస్మి సత్తమ
తతః కళావతీత్యేత న్మమ నామ మహాత్మనా.
గృహీతాయాఃకృతం పిత్రా గంధర్వేణ సుభామునా.

కలగూరగంప

పరమాణు సిద్ధాంత ప్రవక్త కణాదుడు

భారతీయులు కొన్ని శతాబ్దాల క్రితమే పరమాణు సిద్ధాంత రహస్యాన్ని కనుగొన్నారని విశ్వసించేందుకు వైశేషిక దర్శనాచార్యుడైన కణాదుని పరమాణు సిద్ధాంతాన్ని పేర్కొనవచ్చును.

బుద్ధుని కంటె ఎనిమిది వందల సంవత్సరాలు ముందున్న కణాదుడు తన వైశేషికసూత్రాలలో పరమాణువులు అవిభాజ్యమైన కణములతో ఏర్పడినవన్నాడు.

పృథ్వీ, అప్, తేజో వాయువులను నాలుగు పంచభూతముల శాశ్వతమైన భాగాలే పరమాణువులు. పృథ్వి పరమాణువులోని స్పర్శ, రూప, రస, గంధములు, నీటిఅణువులలోని స్పర్శ, రూపాలు, వాయువులోని పరమాణువులలో స్పర్శ అనే గుణములు వున్నాయి. ఈ గుణాలన్ని విశేష అనగా భేద సూచకమైన ధర్మం కలిగి వున్నాయి. ఈ విశేషము వల్లనే కణాదుని దర్శనము 'వైశేషిక' మని పిలువబడింది.

పరిమాణము :

'జాల సూర్య మరీచి స్థం
యత్ సూక్ష్మం దృశ్యతే రజః।
ప్రథమం తత్ ప్రమాణానాం
త్రస రేణు రితి స్మృతిః॥

కిటికీల ద్వారా ప్రసరించు సూర్యరశ్మిలో కంటికి కనబడు నట్టి అత్యంత సూక్ష్మమైన ధూళికణాల పరిమాణంలో 'త్రస రేణం' అంటే ఆరు పరమాణువుల పరిమాణం అని చెప్పబడింది.

సూర్యరశ్మిలో కానవచ్చు అతిసూక్ష్మ కణము అంగుళములోని $\frac{1}{3496826}$వ భాగం. దీనిలో ఆరింట ఒక వంతు మాత్రమే పరమాణు పరిమాణం. అంటే ఘనపు టంగుళను $\times \pi \times 3.5$–12–62వ భాగం. ఆధునిక మాపనమునకు అనుగుణంగా వున్నదీ సూత్రము.

సంయోగక్రమము :

' ఈ పరమాణువులు క్రియాపూర్ణములై రేఖా గణితమందలి బిందు ప్రమాణం కల పరిధిలో వున్నది. సృష్టిలో యిట్టి పరమాణువులు సంయుక్తంగా మాత్రమే వుంటాయి. రెండు పరమాణువుల సంయోగముతో ద్వ్యణుక మూడు ద్వ్యణుకలతో త్ర్యణుక (త్రసరేణ) నాల్గు త్ర్యణుకల సంయోగంతో చతురణుక వుత్పత్తి యగుచున్నవి. పరమాణు సిద్ధాంత ప్రవక్తలలో మొదటి వాడైన కణాదుడు వస్తువుయొక్క మూలభూతఘటక (పరమాణువులు)ల నుండి సంయుక్త పదార్థ నిర్మాణమైనదని వివరించినాడు.

ఈ కణాద సిద్ధాంతాన్నే జైనులు, బౌద్ధులు అనుసరించి నారు.

క్రీ. శ. 50 నాటి ఉమాసాతి పరమాణువుల సంయోగము లేదా పరస్పర ఆకర్షణ కారణంగా అణు రచన జరిగిందన్నాడు.

జైన మత సిద్ధాంతం ప్రకారం కొన్ని వస్తువులు చేరి ఒక పదార్థమవుతుంది. ఒక పదార్థం పెక్కు భాగాలు కావచ్చును. ఈ పదార్థముయొక్క అతి సూక్ష్మ భాగాలే పరమాణువులు 'పుద్గల' అను ద్రవ్యము పరమాణు రచితమే. ప్రతి పరమాణువు ఆకాశములో ఒకబిందువంతటి స్థలాన్ని ఆక్రమించును. ఇట్టి పరమాణువులు అనంతంగా వున్నాయి.

రెండు లేదా అంతకుమించిన పరమాణువులు సంయోగమై 'స్కంధ' అను సంయుక్తములను నిరూపిస్తున్నది. వాటి సంయోగము వల్ల నానా విధములైన పదార్థములు లభిస్తున్నాయి పరమాణువులను మూల వస్తువుల సంయోగానికి కారణమైన శక్తియే రాసాయనిక సంయుక్త శక్తికీ కారణమని వారు భావించిరి.

శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

అమ్మ

1978 అక్టోబరు, 1979 మార్చి నెలల భారతులలో "అమ్మ"ను గూర్చిన మీమాంస కనుపించింది. శ్రీ బ్రహ్మానందము గారు "అంబ" నుంచీ "అమ్మ" పుట్టిందన్నారు. శ్రీ సర్దేశాయి తిరుమలరావుగారు, అందుకు సమ్మతించుతూనే, కొంత అర్థ విచారంచేస్తూ లక్ష్మీవాచక 'మా' శబ్దంనుంచీ "అమ్మ" పుట్టిందనిస్వాభిప్రాయం సూచించినారు. దాన్ని చదివినంక ఈ పంక్తులు వ్రాయవలెనని బుద్ధిపుట్టింది.

ప్రపంచంలో 'అమ్మ' అంత తీయని పదార్థం వేరొండు లేదు. పసిపిల్లలకు పాలిచ్చేది అమ్మ. పాలించేదీ అమ్మే. అందుకే అమ్మ అంటే అంత మధురమన్నారు.

సంతోషమధికమైతే, "అమ్మ !" అంటాము. దుఃఖ భారంలో "అమ్మా !" అంటాము. పిల్లలాకలైతే "అమ్మా !" అని యేడుస్తారు. అమ్మదగ్గరుండేటప్పుడు పసిపాపల దృష్టి వేరు వస్తువులపైనున్నా, అమ్మ దూరమైనప్పుడు వేరే వస్తువు లేవీ కాబట్టవు. అమ్మకోసరం నలుదిక్కులా చూస్తారు. ఏడుస్తారు. అమ్మ దొరికేంతవరకూ శాంతించరు. ఇదీ అమ్మలోని 'మాధుర్యం ఇక శబ్దార్థాలు విమర్శిస్తే, – శబ్దబ్రహ్మమంతా అమ్మలో అణగిందనిపిస్తుంది.

అక్షర సమామ్నాయానికి వదన కుహర ముత్పత్తి స్థానం. కంఠంనుండీ పెదవుల వరకూ ఆ యా స్థానాల్లో అక్షర సమా

మ్నాయమంతా ఉత్పన్నమౌతూవుంది. అందు మొదటిది కంఠం, కడపటిది పెదవి నోరు తెరిస్తే కంఠంనుంచీ పుట్టేది "అ". నోరుమూస్తే పెదవులనుండీ పుట్టేది "మ". ఈ రెండింటి నడుమనే అన్ని అక్షరాలూ ఇమిడివుండడంచేత, ఆద్యంత ప్రత్యాహారంచేత, "అమ్మ"లో శబ్దబ్రహ్మ మిమిడివుందన్నాము.

వేదాన్ని శబ్దబ్రహ్మమంటాము. "వేదస్తత్త్వం తపోబ్రహ్మ" అని, వేదమునకు బ్రహ్మమని పేరుంటుంది. అమరం. ఆ వేదానికాద్యంతాలలో ఉచ్చరించవలసింది ప్రణవం. అది "అ, ఉ, మ" ల సంపుటీకరణంతో ఏర్పడింది.

'అ' అంటే విష్ణువు. అవ రక్షణే అన్న ధాతువునుండి పుట్టిన "అః" విష్ణువును చెప్పుతుంది. **The first letter of the Nagari Alphabet.** అః. అవతి **or** అతతి **'N.of Vishnu'** అని, **"V. S. Apte"** "అకారార్థో విష్ణుర్జగదుదయ రక్షా ప్రళయ కృ న్మకారార్థో జీవః" అని పరాశరభట్టరు అష్టశ్లోకి.

అకారమువకు విష్ణువర్థమైతే "మ" కారము జీవుని తెల్పుతుంది. మన = జ్ఞానే, మను = అవబోధనే, అన్న ధాతువుల నుండి పుట్టిన "మా" జ్ఞానావబోధములు గల జీవుని తెల్పుతుంది. ఇట్టి చైతన్య జ్ఞానవంతుడైన జీవుడు "అ, ఉ" అకార వాచ్యుడైన విష్ణువునకే చెందినవాడు. అని ప్రణవార్థం. ఇది "అమ" ల కర్థం. అంతేగాక అ విష్ణువు, మ "లక్ష్మి" అనే ఆదిమ దంపతి వాచకము "అమ".

"భావారూ ధా భగవతి! యువాం దైవతం దంపతీ నః" "అమ్మా తల్లీ! మీరిద్దరూచేరి మాకు దైవము" అని శ్రీస్తుతిలో శ్రీ వేదాంత దేశికులు ఇట్లు పసిపాప మొదల్కొని వరమపదా కాంక్షులైన పరమైకాంతుల వరకూ అనుపద స్మరణీయము "అమ్మ".

"అంబ మాతా" అని అమరం. మాతార్థకమైన 'అంబే' అమ్మయిందన్నారు. ఐతే, శ్రీ తిరుమలరావుగారు ఇందిరా లోక మాతా 'మా' అని లక్ష్మీవాచకమైనది "మా" దానికి ద్రావిడ భాషలో హలాదులకు ముందు ఊతగ చేరే అకారంతో 'అమా' ఐ అదే "అమ్మా" కావచ్చునన్నారు.

అరవములో రేఫాది పదాలు పలికేటప్పుడు ఉచ్చారణ సౌకర్యార్థము అచ్చులు చేర్చడం పరిపాటి. "రామన్" న్ను "ఇరామన్" అంటారు.

"ఆమా అ తియుం పిరానే అణియరంగత్తేకి డన్దాయ్" అనుచో "రంగత్తే" అనుటకు "అరంగత్తే" అని శ్రీ పెరియాళ్వారుల పూచ్చూట్టల్. అటులనె "లంక" అనుటకు "ఇలంగై" అని "శినత్తినాల్ తెన్నిలంగై క్కోమానై చ్చెట్ట". కోపంతో దక్షిణ లంకకు అధిపతియైనవానిని సంహరించిన, అని తిరుప్పావు. వీనిలో, "అ, ఈ" ముందచేర్చడం వుంది. అటులనే 'మా"కు అ చేర్చి "అమా" కావచ్చునన్నారు తిరుమలరావు గారు. కాని మకారానికి పూర్వము అచ్చుల చేర్చడం ద్రావిడంలో లేదు. 'మాలే మణి వణ్ణా మార్గళి నీరాడువార్" అని తిరుప్పావు. "ఇది మాలే మార్గజ్ఞా" అన్న ద్రావిడదేశ్య పదాలు మకారాదులు. వానికి పూర్వం "అ" లేక "ఈ" చేర్చడం లేదు. "మణి" అన్న తత్సమం గూడా అకారం లేకుండానే వాడబడుతూ వుంది. అందు నుంచీ "మా" "అమ్మా" అయ్యే అవకాశం లేదు. అట్లనే "అమా", "అమ్మా" కాదు.

సంయుక్తాక్షరాలను ముఖ సుఖోచ్చారణ కోసరం, వర్ణ లోపాగమాలతో శిథిలంచేయడం సంప్రదాయం. శ్రీ, సిరి కావడం: అగ్ని, అగ్గి కావడం ఇందువల్లనే. ఆ విధంగానే అక్కట 'అ కట' అయ్యింది జడ్డకు లోపం వచ్చి. అట్లే "అమ్మ" "అమ" అయ్యే అవకాశముంది గాని, "అమ" "అమ్మ" అయ్యే యోగం లేదు.

అందునుంచీ, "మ" "అమ" అటు పిమ్మట "అమ్మ" కావచ్చుననటం క్లిష్టకల్పనం గాదు. కాన, "అంబా" "అమ్మా, అమ" కావడమే యుక్తం.

శ్రీ కుంటిమద్ది శేషశర్మ

నందినిగారి మేలుకొలుపుల కలవరింతలు

ఫిబ్రవరి భారతి 79 కలగూరగంపలో నన్ను మేలుకో మంటూ నందిని సిధారెడ్డిగారు రాసిన లేఖ చదివాను. నందినిగారి ఆలోచనా శూన్యమైన ఆవేశాన్ని దర్శించాను.

నాపేరును 'అంకె' గా రాసుకుంటే అందులో ప్రధానంగా పిరికితనం కనిపించిందట వారికి. శుభం ! ఆదిలోనే హంసపాదులా వ్యక్తిగత జీవితాల్లోకి చొచ్చుకపోయే ప్రయత్నము. అందుకే దీనికి జవాబీయకుండానే వారి వ్యక్తిగతంలోకి వెళ్ళి ఎదిరి ప్రశ్నించాల్సి వస్తుంది. వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి కదా ! (తప్పైనా తప్పడం లేదు వారి వ్యక్తిగతంలోకి వెళ్ళడం). నందినిగారూ ! మీరు, మీ గురుతుల్యులు, మీ మిత్రులు వగైరాలు కొందరు ఏ పిరికి భూతం ఆవహించి మారుపేర్లతో (సంచికకో పేరుతో) "దాఢి" బుల్లెటిన తీశారు? ఏ పిరికితనం ఆధిష్ఠించి ఎస్. ఆర్. నందినిగా (ఆంధ్రభూమి దినపత్రిక) రాసుకోవాల్సి వచ్చింది? అదీ ఇదీ అంతెందుకూ, మీ పేరులో మార్పులు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎందుకేర్పడింది ? ఇంటిపేరు మార్చుకోవల్సిన ఆగత్యమేర్పడింది? మీ జన్మబుల్లోంచే ఏదో ఒకటి నా పేరు మార్పుకు కారణం కావచ్చుగా? చెప్పేడివి ధర్మశాస్త్రాలు పోచ్చేడివి దొమ్మరి గుడిసెలంటే ఇదేనేమో ?

పరిశీలన కవిత్వ దృష్టితో ఉంటే బాగుండేదని నేనంటే, అర్థంచేసుకోలేని తనంలో (కవిత్వ దృష్టి అంటే ఏమిటో తెలియక) తికమకలో రేగిన తిక్కతో అది ఒక అల్ప సూచనగా,

నాగుడ్డెద్దు తత్వానికి ఉదాహరణగా గోచరించిందా మీకు? కవిత్వ దృష్టి అనగానే నందినిగార్కి పిచ్చెత్తినంత పనైనట్లుంది. పాపం! కవిత్వపు ధ్యాసలేకుండానే కవితా సూర్యుళ్ళలోకి భావ ప్రయోజకత్వాన్నీ, కవిత్వ చిత్రీకరణను పరిశీలన గావించారు. అదీ మీరు గిరిగీసుకొని కూర్చున్న వ్యక్తుల గుండాన్ని సమాజంగా భావించి పరిశీలన గావించారా? (సమాజముతో సంబంధము లేకుండా కవిత్వము మనగలిగిందెప్పుడంట?) అది దెబ్బకు రెండు పిట్టలు అనే ధోరణిలో ఉండడంలో ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. కానీ దాన్ని విప్పి చెప్పి ఒకర్ని పొగడాలి, మరొకర్ని తెగ నాడాలి (మధ్యలో మీ పేరు నానాలి) అనడంలో మాత్రం నాదృష్టి దోషాంతరీకరణకు సింబల్‌గా దర్శనమిచ్చిందా? కుందేలుకు మూడే కాళ్ళనే మీ ధోరణికి ఎవరేం చేస్తారు? ఎంతకని చెప్తారు? అంధునికి త్రోవచూపించగలము కానీ, కుక్కతోకకు రాయిగట్టి దానిని చక్కబరచగలమా? కళ్ళు కనిపించీ నిండు అంధులుగా ప్రవర్తించే వాళ్ళకు త్రోవచూపగలమా?

నందినిగారూ! నిండుకున్న విజ్ఞాన ఖనిలా మసలడం మీకే చేతనవుతుందనుకుంటా? పరిశీలకుని అభిప్రాయాలు లేకుండా పరిశీలనారీతి ఉంటుంది అని ఏ చచ్చుదద్దమ్మైనా అనగలడా? లేదని మీకూ, నాకూ, అందరికీ తెలిసిన విషయమే. కానీ ఒక పదార్థాన్ని అనుభవించి అది పుల్లగా ఉంది, చప్పగా ఉంది, ఉప్పగా ఉంది, తియ్యగాఉంది అనగానే అంతటితో సరిపోదు పరిశీలకుని పని. అలాచెప్పడమే మీరు అణుమాత్రంగా వివరించడముగా భావిస్తే, ఆ మాత్రము పనికి, పాఠకునికి పరిశీలకుడు కూడా అనవసరమని చెప్పక తప్పదు. దేన్నీ బుద్ధిగా అర్థంచేసుకోలేక, చేసుకున్నా చేసిన తప్పును పరిదిద్దుకునే ఇష్టంలేక మరో తప్పును చేయడం మీలాంటి వారికి అలవాటనుకుంటా? పరిశీలకుని అభిప్రాయాలుండకూడదని నేననవే లేదసలు. (కావాలనుకుంటే మరోమారు నవంబర్ 78 భారతి పే. 69 దర్శించండి) నేనన్నట్లుగా మీరు భ్రమపడ్డారనుకుంటా? పరిశీలకుని అభిప్రాయాలతో పాటు, కవితలోని భావాల్ని, భావ ప్రయోజకతనూ, కవిత్వ చిత్రీకరణలోని లోటుపాట్లను, గొప్పదనాన్ని విప్పి చెప్పడం జరుగలేదనే మరోమారు తెలియపరుస్తున్నాను. అది మీ లోపంగా మరోమారు గుర్తుచేస్తున్నాను.

సమాజంలోని కాన్‌సెప్ట్‌ని వాడుకోవడమే దేవుడు సింబల్ వాడుకోవడమయితే, అది నా అవగాహనా లోపమయితే సరే! ఒక కవితా సూర్యుని గురించి మీకు పేచీలేదు. మరో సూర్యుని గురించే పేచీ. ఎందుకంటారా? శేషేంద్రను దించేసి శివారెడ్డిని ఎత్తుకోవడమే మీ దృక్పథము కనుక. ఇరువురూ ప్రజాధ్యేయంలో పయనిస్తున్న వారని తెలియపరచినందుకైనా ఇద్దరినీ సమర్థించాలి కాని, ఒకర్ని వదిలేయడం మీకే చెల్లింది అయినా "సూర్యుడు—నాటి సాహిత్యంలో దేవత నేటి కవితలో విప్లవశక్తి" (చూ. ఆంధ్రభూమి దినపత్రిక 21–1–79) వ్యాసంలో మీరే శ్రీశ్రీని ఇంకా పురాణ ప్రతీకల్లోంచి బయటపడలేదనీ, వేదకాలపు భావన ఆసరాగా తీసుకొని అందులోంచి బయటపడలేకపోయారనీ అన్నది మరచిపోయారా? ఈ మానవుని సెంటిమెంట్లలో అవి భాగాలు కావా? అవికూడా నాటి సమకాలీన సమాజపు కాన్‌సెప్ట్స్ కావా? ఈ మీ దృష్టిని ఏమనాలి? బేసిక్ నాలెడ్జిలేని కుర్రతనపు చేష్టలుగా భావించాలా? ఇది మీ అభేద్యమైన జ్ఞానంగా పరిగణించాలి కాబోలు? దీనిని మూడడుగులు వెనక్కేసి రెండడుగులు ముందరికేయడ మంటారా?

నందినిగారు ప్రజలంటే ఎవరో తెలియాలంటే రంగనాయకమ్మ పత్రిక చదవమని, దేశ జనాభాలో వారి శాతమెంతో కావాలంటే జనాభా లెక్కల సేకరణ శాఖ వారిని విచారించ మంటున్నారు. వాళ్ళకు నిర్వచనం శూన్యమా? లేదూ కప్పదాటువేసే పద్ధతా ఇది? కామెర్ల రోగి లక్షణాలంటే ఇవేనేమో? దేశంలో తమ శాతాన్నే జనాభా శాతంగా లెక్కించమని బూర్జువాలు కూడా నివదిస్తారు జాగ్రత్త! వారికేం జవాబు చెబుతారు. అయోమయంలోంచి తేరుకోవడం మంచిది.

నలుగురు కవుల్లో నానడానికే నేను కలగూరగంపని గుత్తకు తీసుకున్నానన్నారు. (కలగూరగంప గుత్తకిస్తున్నారా? శుభం) అదే నాపని అయితే పేరు మార్చుకోవలసిన అవసరం నాకేముంది? ఈ మాత్రపు మీ మేధాశక్తికి నా జోహార్లులెండి. ఇందిరాగాంధీ కంటే తెలివైన వాళ్ళమని భావించే మీరు ఆమె హస్తంలా కూడా జనంలోకి చొచ్చుకపోలేక పోతున్నారంటే కారణం, ఆమంత తెలివైన పనులు మీరు చేయలేరన్నట్లేగా? లేవలేనమ్మలైనా వెక్కిరింతలు మాననట్లుంది మీ పని.

ఒక సంపుటిలో వివిధ కవితా ఖండికల భాగాల్ని పరిశీలిస్తే భావవైరుధ్యాలు పొడసూపడం సహజమని నే చెప్పడం జరిగింది. (చూ. నవంబర్ 78 భారతి పే. 70) అయినా ఒప్పుకోవడం మీ పద్ధతి కాదు కావున సింబాలిజమ్‌లోకి లాక్కెళ్ళారు. కానీ శివారెడ్డి గారే రక్తం సూర్యుడులోనే "సత్యం" కవితలో

"ఈ పొద్దుటి పూట
విషాదం చాయకింద నేను"

అనగలిగారు. "నువ్ దేన్నైనా ప్రేమించు దుఃఖాన్ని మాత్రం కాదు" అన్నవారి వాక్యాల్ని పరిశీలిస్తే పై రెంటిలో గల భావ వైరుధ్యాల్ని పాఠకులు సులభంగా గ్రహించగలరనుకుంటా. రెంటి మధ్య అభేద్యాన్ని మొలిపించి, కావాలనే భావవైరుధ్యాల్ని అంటగట్టానంటారా, ఇక్కడ కూడా? మరోమారు రక్తం సూర్యుడు బుద్ధిగా చదివితే నా అవగాహనను ఎద్దేవా చేయలేరేమో?

వచన కవిత్వం భావానికి అడ్డుపడదు, అనుభూతికి అంక్ష విధించదు కాబట్టి వేగుంట మోహనప్రసాద్‌లా మీ గుంటనూ తయారుచేసుకొని మీ లోకంలో మీరు విహరించండి? అదే మున్ముందుకు వెళ్ళమని భావిస్తే పరుగెత్తండి అతి వేగంగా. ఎవరొద్దన్నారు? ప్రజల్లోకి ప్రవహించలేని ప్రతీకల్ని, అనూ

భూతుల్ని రుద్దడమే కళా విలువల్ని పోషించడమని నందినిగారు భావిస్తే, వారి ప్రజాభ్యుదయపు పయనంగా కలలుకంటే వారి వేడి పండు భ్రమను ఎవరేం చేయగలరు ?

పద్యాలే ప్రజల్లో చొచ్చుకపోతాయని ప్రముఖ విరసం సభ్యుడి ఉవాచ అన్నారు. పేరు చెప్పడానికి జడుసుకున్నారా నందినిగారూ ?

మావో అభిప్రాయాన్ని చెప్పడానికి మావోను నవచైనా నిర్మాతగా అభివర్ణించిన మీరే కొడవటిగంటి కుటుంబరావు, రాచమల్లు రాంచంద్రారెడ్డిగార్ల పూర్తి పేర్లైనా రాయలేక కొ॰ కు., రా.రా. అనడం మీ పరిజ్ఞానం గొప్పదనమా ? ప్రజానీకంలోకి చొచ్చుకపోవడానికి లెనిన్ ఎంతటి కృషిచేశాడో, మావో ఎన్ని అష్టకష్టాలు పడ్డాడో నందినిగారు గ్రహించగలరా ? ప్రజానీకంలోనికి చొచ్చుకపోలేని దద్దమ్మలై కూర్చున్నచోటనే సుఖాలకై అర్రులు చాస్తూ, తమదే ప్రజాకవిత్వమని చాటుకునే వాళ్ళు తెలుగుదేశంలో కోకొల్లలు పుట్టగొడుగులు లెండి.

శేశేంద్ర ఎవరో ? శివారెడ్డి ఎవరో ? ఎక్కడ నివసిస్తున్నారో, ఎవరితో పాలుపంచుకుంటున్నారో, ఎవరిని ఉద్ధరిస్తున్నారో తెలిసే కళ్ళుమూసుక కూర్చున్న అమాయకులైన నందినిగారూ ! స్టేజీలమీద దొర్లే వాగుడు తత్వం మాటల్నుంచీ, పేజీలమీద మెరిసే వాక్యాలమంచీ ఎవరు తొందరగా మేల్కోవాలో (ఎవరికివి అందుబాటులో నున్నవి మీకా ? నాకా ?) మీ హృదయాంతరాల్ని ఓమారు తట్టిలేపి చూసుకోండి ? (పరాన్నజీవిలా బతికి, పరాన్నజీవిలా రాయడం మాత్రం చేయకండి ?) మీరు మేలుకొన్న తర్వాత మేలుకొలుపులు పాడితే సంతోషించేవాళ్ళలో నేను మొట్టమొదటివాడ్ని లెండి.

ఆనాడు వేమన పద్యాలు మారుమూల పల్లెల ప్రజానీకంలోనికి ప్రవహించడానికి ఏ సాధనాలుపయోగించాయి. అంతకంటే ఎన్నోరెట్లుగా ప్రచారసాధనాలున్నా నందినిగారన్నటువంటి ప్రజాకవులు, ప్రజల దరిదాపుల్లోకి కూడా పోలేక పోతున్నారంటే కారణాలేమిటి ? స్వార్థం పేరుకపోయిన వారి ఊసరవెల్లి ఆలోచనా తత్వాలే, ఖారి చేతగానితనమే దీనికి కారణమంటే ఒప్పకోగలరా ? లేదు. ఆ పని మీకు చేతగాదులెండి ?

నందినిగారూ ! బహువచన ఏకవచనాల మధ్య ఉరకలేసిన ఆవేశాన్ని అదుపులో ఉంచుకొని ఆలోచనలకు పదును పెట్టుకోవడం ఎవరికైనా ఆరోగ్యప్రదం.

మేధావి వర్గం చేతులకు గాజులేసుకొని ఆడంగి వెధవల్లా ప్రవర్తించడమే దేశ పతనానికి మూల కారణం. మేధావి వర్గంలో చేరేవాళ్ళే కవులు కావున కవులు ఒనర్చే నపుంసక తత్వపు పనులూ దేశపతనానికి కారణమే దీనికి రాజకీయాల పులుముడు అనవసరమే. ఇజాల గారడీలు చేయడము, జనాన్ని అయోమయంలో ముంచెత్తడం, జనాన్ని కవిత్వానికి దూరం చేయడం దేశపురోభివృద్ధికే దోహదం చేస్తాయని మీరు భావిస్తే, భళీ ! ఇంకేం —

—శ్రీ కె. అంజయ్య

నారాయణబాబు కవిత

కారణాలు ఏవయితేనేం, 1970 లో శ్రీరంగం నారాయణబాబు కవితలు 'రుధిరజ్యోతి' పేర పుస్తక రూపంలో తీసుకొచ్చే ప్రయత్నంలో వున్నారు ఆరుద్రగారు. అప్పట్లో నాకు ఉత్తరం రాయగా నేను సేకరించిన మేరకు నారాయణబాబు కవితలు ఆరుద్రకు పంపాను. 72 లో వచ్చిన తొలిముద్రణలోగావి, ఇటీవల వచ్చిన మలి ముద్రణలోగాని చేరని నారాయణబాబు కవిత (నేను 1970 లో ఆరుద్రకు పంపినదే) ఇందుతో పూర్తిగా ఇక్కడ ఇస్తున్నాను. నవోదయవారయినా శ్రద్ధవహించి రుధిర జ్యోతి మూడవ ముద్రణ వేసేటప్పుడయినా దీనిని చేరుస్తారని నమ్ముతున్నాను.

ధ ర్మ క్షే త్ర ము

— శ్రీరంగం నారాయణబాబు

నారాయణుడే	''ఓం హ్రీం!''
నరునకు	అన్నాయి.
సారథి అయినాడు	కదనభూమి
పుడమిని పాడిస్తూ	కల్లోలములో
తారల నాడిస్తూ	మార్గణాది
నారాయణ చక్రము	మారణాస్త్ర హత
నదిలో నాదములాగను	వికలాంగ వీరుల
''ఓం, ఓం'' అన్నాది	వీరాలాపములూ
రణరంగములో	విగత ప్రాణులౌ
ప్రణవ గానము	విభులపైబడి
గాంభీర్యముగా	వెర్రెత్తిన
గర్జన చేస్తూ	యువిదల
పాంచజన్యము	యుద్ధాంతర
''హరోం, హరోం !''	హృదయ దళన
అన్నాది.	రోదనార్తులు
గాండీవ ధనుష్టం	విహాయసానికి మొత్తముగా
కారము	''దబదరో, దబదబోం !
ఝూంకారముతో	హాతోం, హాతోం
''హ్రాం, హ్రాం''	సోహం, సోహం''

అన్నాది. | గోవర్ధనమెత్తి
ఏరవిముక్త విష, నిశిత | గో, గోపిక గణమును
నారాచములు | గాచిన
వారిని వీడి | నారాయణుడే వరునకు
రోలంబ నినాదములా | సారథి అయినాడు.

ఇది భారతి (వృష, జ్యేష్ఠ) 1941 జూన్ సంచికలో అచ్చయింది. నారాయణబాబు కవితలు కొన్ని వేర్వేరు శీర్షికలతో, రూపాలతో వేర్వేరు పత్రికలలో పడటం జరిగింది. ఇది కూడా మరేదయినా పేరుతో మరేదయినా పత్రికలో వచ్చిందేమో కూడా చూడవలసి వుంది.

— శ్రీ మానేపల్లి సత్యనారాయణ

అశ్వధాటీయా? లేక మత్తేభమా?

1979 ఏప్రిలు నెల 'భారతి' కలగూర గంపలోని శ్రీ ముత్యంపేట సాంభారాధ్యా శాస్త్రిగారి లేఖను పురస్కరించుకొని ఈ దిగువ విషయములను సహృదయుల ఎదుట యిడుచున్నాను. చిత్తగించగలరు.

౨౨వ ఛందములో ఉద్భవించిన త, భ, య, జ, స, ర, న, గ గణముల తోడిది మత్తేభమే. (వివరములకు చూడు — 'మందార మరన్దవ్' ౧౯—౧౮.)

౨౦వ ఛందములో పుట్టిన స, భ, ర, న, మ, య, లగ గణముల తోడిది మత్తేభ విక్రీడితము. (వివరములకు చూడు — ఛన్దోను శాసనవ్ (హేమచన్ద్ర) ౨—౩౩౬; ఛన్దోను శాసనవ్ (జయకీర్తి ౨ - ౨౩౩; వృత్త రత్నాకరవ్ (కేదారభట్ట) ౩—౯౪—౪.)

ఇక అశ్వధాటీ వృత్తము గురించి. భరతముని "నాట్య శాస్త్రము" లోను, అజ్ఞాత — పూర్వ జైన కవి ప్రణీత "రత్న మంజూష" లోను, గంగాదాస భట్టుని "ఛన్దో మంజరి" లోను, వేంగళుని "ఛన్ద శాస్త్రము" లోను, పూర్వోక్త ఛన్దో గ్రన్థము లందును — అశ్వధాటీ వృత్తనామము పేర్కొనబడ లేదు. "అశ్వ లలిత" లేక "హయలీల గతి" అని న, జ, భ, జ, భ, జ, జ, లగ గణములతో వృత్త జాతి సముచ్చయంలోను, హేమచన్ద్రాచార్యుని ఛన్దోను శాసనంలోను పేర్కొనబడినది. భరతముని 'న, జ, భ, జ, భ, జ, భ, గ — గణములతోడి ఒక "అశ్వ లలితము"ను ఉటంకించినాడు.

ఐతే ఒకే వృత్తమునకు భిన్న నామములు చెప్పుట ఛన్దో గ్రన్థములందు కన్పట్టుచున్నది.

న, జ, భ, జ, జ, జ, ర- గణములతోడి వృత్తము 'చంపక మాలికా' నామముతో ప్రసిద్ధమై ఉండగా, జయకీర్తి 'చిత్రలత' అనినాడు. హేమచన్ద్రుడు 'రుచిర' అని పేర్కొనినాడు. వృత్త రత్నాకర కారుడు 'సిద్ధి' అన్నాడు. ఛన్దో మంజరీ కర్త 'సరసి' అని పేరిడినాడు

కాని — స, భ, ర, న, మ, య, లగ — గణముల తోడిది "మత్తేభ విక్రీడితము" అని స్పష్టమగుచున్నది. దీనికి యితర నామమును ఎవరును జోడించలేదు అటులనే త, భ, య, జ, స, ర, న, లగ — తోడిది మత్తేభము. ఇతర నామము దీనికి ఉన్నటుల సాడ లేదు. అందుచేత "అశ్వధాటి" వృత్తము అని ఛన్దోగ్రన్థ కర్తలు పిలువలేదని పిండితార్థము.

ఆకర పుస్తకములు

౧. నాట్య శాస్త్రము — (ఆన్ధ్రీకరణ)
శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావు
భాగ్యనగరం — ౧౯౫౯.

౨. జయదామన
సం॥ ఆచార్య హరి వేలంకర్
బొంబాయి — ౧౯౪౯.

౩. ఛన్దోను శాసనవ్
హేమచన్ద్ర కృతం
సం॥ ఆచార్య హరి వేలంకర్
బొంబాయి — ౧౯౬౧.

శ్రీ సాయిబాబా

తెలుగు సామెత - సంస్కృతీకరణ

మార్చి (1979) నెల 'భారతి' లో "భ్రాత్ర భేదః" అనే గ్రంథాన్ని విమర్శిస్తూ "కోళ్లను తిన్నవారు పోయి గొర్రెలను తినే వారు వచ్చా"రనే సామెతను చూపగా, ఆ సామెత తప్పని బండి నాగరాజగారు 'మే' భారతి లో తెలిపారు. తెలుగు సామెతలు—ఒకే అభిప్రాయం గలవి ఎన్నో ఉన్నాయి. "గొర్రెలను తినేవారు పోయి బర్రెలను తినేవారు వచ్చా"రనే సామెత వంటిదే యిది. కొన్ని ప్రాంతాల్లో నేను చెప్పిన సామెత ప్రసిద్ధంగా ఉన్నది. నేను కల్పించినది కాదు అది తప్పు ఎలా అయిందో నాకు తెలియడం లేదు.

వారు చెప్పిన "గొర్రెలు తిన్నవారు పోయి బర్రెలు తిన్నవారు వచ్చా"రనే దానికి "అజాశనాః పరం యాతా ఆ యాతా మహిష శనాః" అనేది సరియైన సంస్కృతీకరణ అని నాగరాజుగా రంటున్నారు. 'అజ' శబ్దానికి నిఘంటువులలో గొర్రె అని అర్థంవున్నా అది ప్రసిద్ధం కాదు. మేక అనే అర్థమే ప్రసిద్ధంగా ఉన్నది. "మేకలు గొర్రెలు" అని చెప్పేటప్పుడు "అజాతి" అని చెప్పడం సుప్రసిద్ధం.

సామెతల్లో వర్ణపునరుక్తి – పదాద్యక్షరానికి గాని, ప్రాస రూపంగా గానీ ఉండడం అందరూ ఎరిగినదే! సామెతల్లో అది ముఖ్యంగా పాటింపబడుతుంది. నాగరాజుగారు చెప్పిన సామెతను సంస్కృతీకరించినప్పుడు –

''గతా మేషాశినాః సంప్రత్యాగతా మహిషాశనాః'' అని చెప్పడం సముచితమనీ, సులభమనీ, ప్రయత్నిస్తే కుదరకపోదనీ మనవి చేస్తున్నాను.

"అంగీరస"

లేఖలు

''దిక్కులేనోడు''

మార్చి 1979 భారతిలో శ్రీ కొలకలూరి గారి ''దిక్కులేనోడు'' అను రచన చదివితిని. ఇతివృత్తమిది : కోడిని దొంగిలించినాడను అభియోగముతో, కోటేసు అను హరిజన యువకుని. ఏకో నారాయణ, సాంబడు, బెమ్మాం అనే ముగ్గురు (వీరి పేర్లు విష్ణువు, శివుడు, బ్రహ్మ అనే పేర్లకు ప్రతీకలని నా అనుమానము–అది అట్లుండె), చెట్టుకు కట్టి, కొట్టి వాడు తప్పునొప్పుకొనక పోగా కిరసనాయిలు పోసి కాల్చి వేయుదురు. నాఉద్దేశము రచనా విమర్శ కాదు. రచనకు ఆదిలోనే రచయిత ''కథ, సన్నివేశం, పాత్రలు కల్పితాలు, నిరాధారాలు'' అనే ప్రకటనలోని ఔచిత్యం, సామంజస్యములు చర్చించుటయే.

దాదాపు 10–11 ఏండ్ల క్రితము కృష్ణాజిల్లా కంచిక చెర్లలో కోటేసు అను హరిజన బాలకుని, ఏదో దొంగిలించినాడను నెపముతో, మోతుబరులైన భూస్వాములు చెట్టుకు కట్టి, కొట్టి, తుదకు కిరసనాయిలుపోసి కాల్చి చంపిన వాస్తవికోదంతము దేశమును ప్రచలితము చేసిన సంగతి వార్తాపత్రికలు చదువువారందరికిని తెలిసిన విషయము. శ్రీ కొలకలూరి వారికి తెలియదా? వార్తా పత్రికలు చదువక పోయువసరే. దిగంబర కవుల సంకలనము [1971 ఆంధ్రప్రదేశ్ డిస్ట్రిబ్యూటరు సంచిక] చివరన కంచిక చెర్ల కోటేసుకే అంకితమీబడినది. దీనినైనను శ్రీ కొలకలూరిగారు చూచి యుందురను కొందును. ముఖ్యపాత్రపేరు (కోటేసు), కులం [హరిజన], వయసు (యువకుడు), కథా సన్నివేశము [దొంగిలించుట అనే ఆరోపణ, చెట్టుకు కట్టి కొట్టుట], పర్యవసానము (కిరసనాయిలు పోసి కాల్చిచంపుట)లలో తాదాత్మ్యము స్పష్టముగా ఉండుచుండగా, ''కథ, సన్నివేశం, పాత్రలు కల్పితాలు నిరాధారాలు'' అని శ్రీ కొలకలూరిగారు ఎటుల ప్రకటింపగల్గు చున్నారు? సృజనాత్మకత సంతరించుకొనుటకే అయిన, ఇది సరైన త్రోవకాదు. సృజనకంటె సూనృతము గరీయసి. కథ, సన్నివేశము, పాత్రలు నిజమైనవి, ఆధారముకల్గినవి అయినను రచనకేమిలోటుండును? ''కేవలకల్పనా కథలు'' అధమజాతిలో చేర్చెను కదా రామరాజభూషణుడు! లేనిది ఉన్నదనుటవలె, ఉన్న దానిని లేదు అనుట కూడ అసద్వాక్కు అగును. రచయితకు సత్యమొక్కటే ఆధారము కావలెను. ''నానృతం''.

శ్రీ సర్దేశాయి తిరుమలరావు

మే నెల 'భారతి'లో కీ. శే. గోపాలకృష్ణమూర్తి అని చూడగానే నేత్రాలప్రయత్నంగా జలార్ద్రము లయినాయి. పదిహేనేళ్ల క్రితం వారికీ నాకూ మధ్య జరిగిన లేఖా పరిచయ సంబంధ బాంధవ్యమే నాకీ శోకానికి మూలం.

ఆధునికాంధ్ర కవిత్వాన్ని నిష్పక్షికంగా విమర్శించిన వారి పేర్లు పేర్కొనమంటే తడుముకోకుండా ఓం ప్రథమంగా డా. శ్రీపాద గోపాల కృష్ణమూర్తిగారిని చెపుతాను.

ఏ కవిలో అయినా మంచి చెడ్డల్ని ఎత్తిచూపడం ఆయనలో ఒక ప్రత్యేకత. అభిమానాలకూ, ఆవేశాలకూ అందులో తావే లేదు. ఉపాధ్యాయుడు విద్యార్థికి బోధించే రీతిలో నడుస్తుంది ఆయన రచనల్లో శైలి.

అర్ధ శతాబ్దపు ఆంధ్ర కవిత్వాన్ని గూర్చిన వ్యాసాలు గ్రంథ రూపంలో వస్తే నేనెంతో సంతోషిస్తాను. వారిపట్ల నా సానుభూతిని వ్యక్తం చేయడానికి నేనీ చిన్ని ఉత్తరం వ్రాశాను.

– ఉ మ్మి టి



గ్రంథ విమర్శలు

అరుణకిరణాలు

[పాణి, క్రౌన్–32 పేజీలు; వెల–రు2/-; ప్రతులకు:– జె. సంజీవరావు; ఆత్మకూరు, నెల్లూరుజిల్లా 524322.]

ఈ యువకవి బాగుపడే లక్షణాలు కలిగి ఉన్నాడు; మంచి మనసుతో తప్పులు చూపి సవరించుకోమన్న వ్రాతలు అచ్చు వేసు కోవాలంటే, ఎంతో సంయమనం కావాల. కొందరు కవిబ్రువులు మంచి చెప్పినా చీదరించుకొని, తిట్టితిట్టించుకొంటున్నారు.

ఇవి ముక్తకాలు–అంటే దేనికి అదిగా ఉన్న సూక్తులు. వయసుకుమించిన లోకామ భవంతో చెప్పినవి చాలా ఉన్నవి. ఇవి కాలగతి తలపోతలు. రచన సొంపును అలవరచుకొంటున్నది. భావానికి తగిన నుడికారంకుదుట పడుతున్నది. పాతవాటినంతా అసహ్యించుకొనే ఒకరు, పెద్దపీఠికమ వ్రాస్తూ, ఈకవి సాంప్రదాయిక వాదాన్నినవ్యతమ అంగీకరిస్తున్నాడు. 'ఉద్యోగం వస్తే ఒక యిల్లే బ్రతుకుతుంది, ఏటి కాలువవస్తే ఒక ఊరే బ్రతుకుతుంది' అని సర్వజన సుఖాన్ని కాంక్షిస్తున్నాడు. ఊహలు లేకుంటే కవిలో చైతన్యం ఉంటుందా ? అని మంచి మాట అన్నాడు–జైలుకెళ్లిన ప్రతివాడూ పాపాత్ముడుగాడు, గద్దెకెక్కిన ప్రతివాడుపుణ్యాత్ముడు గాడు–నిజమెరిగిన సూక్తి–పువ్వుత్రుంచితే బాగుండదు, పువ్వు కొమ్మపైననే బాగుంటుంది. సహజ సౌందర్యం తెలుసుకోగలిగిన భావం–రేయైనా పగలైనా కాలం నడుచుటకే; మంచి నిర్వచనం– ఆత్మను చూడలేని వాడు పరమాత్మనేమిచూడగలడు ? అంతర్ముఖమైన భావన.

ఇట్లా చాలా ముక్తకాలు బాగున్నవి. పోనుపోను నుడికారం చేవదేలితే రచనకు ప్రాణం వస్తుంది. అక్కడక్కడా బాల్య చాపల్యం తొంగిచూస్తున్నది. (సినీ తారలు)

అమరస్మృతులు

[ఖండ కావ్యము, రసప్రియ కేశవాచార్య. డెమ్మి – 80 పేజీలు; వెల–రు.7; ప్రతులకు: – రవిబాబు, కేరాఫ్ – కె. హెచ్. నరసయ్య, న్యూస్ ఏజెంట్; కప్పాబజారు, ఖమ్మం.]

బహు భాషాపాండిత్యము వివిధ శాస్త్రజ్ఞానము లలితకళాభిరుచిమేళవించిన కవితాధార ఇది. పాండిత్యానికి తగినట్లు వివిధ విషయాలను భావించి రసార్ద్రహృదయంతో వ్రాయగలిగిన కుశలత గలదు ఈ రచయితకు. వృత్తం–గేయం–రెంటినీ రెండుచేతులా నడుపగలడు.

ఆర్య సంప్రదాయం పట్ల మొగ్గుచూపినా వెగటు పుట్టించని వ్రాతలివి. గురుభక్తి ఋణాన్ని అంకితంతో తీర్చుకొన్నాడు. దేశాభిమానంతో జాగృతి శంఖారావం చేసి, మధురప్రేమతో పులకింపచేయగలడు. కొంత పచ్చిశృంగారం చూపినా (రోషాగ్నిధార) మేరలు మీరదు. గణాంకశాఖలో ఉద్యోగం కాబట్టి – శ్రీ గణాంక శశాంకచంద్రికలుగురియ; నవ్యప్రణాళిక లనెడి కలువలు విరియ, ప్రగతి పథకములను చకోరములు మురియ, కాటకమ్మను కాటు రాకాసి వెలయు–అని పాడి అంకెలకు ప్రాణం పోస్తున్నాడు. అక్కడక్కడా చప్పిడి పద బంధాలున్నవి.

మహమ్మదీయులనక, మాలలనక నాడె, సిద్ధ కక్కయ్యలను జేరదీసి, కులమతంబుల నెడుగోడల బడగొట్టి, జాతి సమత గూర్చి చాటినావు – అని పోతులూరు వీర బ్రహ్మం యోగికి మంచి వెలమదింపువేసినాడు.

పన్నీరులో కన్నీరు

[గేయ కావ్యం – నూమిళ్లపల్లి కృష్ణమూర్తి. డెమ్మి – 80 పేజీలు; ధర – రు. 3/–; ప్రతులకు ; ఎం. కృష్ణమూర్తి, ఎన్.ఎన్.వి.హైస్కూల్,శివాజినగర్, నిజామాబాదు–503001]

నేటి ప్రపంచ దుస్థితికి సంఘ కాలుష్యానికి మానవతా హైన్యానికి బాధపడి కవితలల్లిన భావోద్రేకి – ఈ కవి. కాబట్టి కన్నీరు పన్నీరు కలిపి పారించి భిన్న దృక్పథాలకు సమన్వయ్యం చేకూర్చి ప్రపంచాన్ని బాగుచేయమంటాడు. సంఘంలో ఉండే టక్కుటమారాన్ని బాగా దుయ్యబట్టినాడు. సాంఘికంగా వెనుకబడినవారిపైన శ్రామికులపైన సహానుభూతితో బాగుపడే దారులు వెదకమంటాడు.

"తెగువ జూపిన మగువ" – కట్నానికి తాళిగట్టే లుబ్ధవరుని ధిక్కరించి "కూటికి లేకపోయినా గుణమున్న" పేద మిత్రున్ని, అదే పెండ్లి పందిరిలో వరించిన ధీర వధువు కథ రక్తితో చెప్పబడినది. రైతుకు కష్టానికి తగిన ప్రతిఫలం దక్కటం లేదని వగస్తాడు. ప్రజాస్వామ్యం యొక్క కృత్రిమ స్వార్థ స్వరూపాన్ని ధర్మకోపంతో విమర్శిస్తాడు.

ఇందలి ఖండికలు ఎక్కువ వంతు, ఇట్టి విమర్శన ఎత్తిపొడుపు ఎగతాళితో, నేటి ప్రపంచ గతిని బయట్లబెట్టి నీతిని చెప్పగలుగుతున్నవి. "ఒక ఊహ" – లో ప్రపంచానికంతా ఒక సమాఖ్య ఉంటే బాగుపడుతుందని ఆశపడుతాడు. కాని, మొదటి నానారాజ్యసమితి, ఇప్పటి ఐక్యరాజ్యసమితి, యూరపు పార్లమెంటు ఈ శుభకాంక్షలతోనే పుట్టినా, మానవ స్వభావ వకతవల్ల పనికి రాకుండాపోతున్నవి. ఈ ఆశ పేరాసగానే నిలిచిపొయ్యేటట్లున్నది.

లోకంపోకడను విమర్శించి, నైతిక విలువలు దిగజారిపోయిన దానికి వగచి పరిష్కారమార్గం చూపగలిగిన యోచనాపరుడు –

ఈ కవి. తాజ్‌మహల్ కట్టించిన షాజహాన్ గొప్ప గాదు, కట్టిన కూలీలు గొప్ప అన్నభావం బాగున్నది. కూలీలు బదులు శిల్పులని ఉంటే దాని సౌందర్యానికి తగిఉంటుందనుకొంటా. చెప్పిన విషయాలు చాలా మామూలువే అయినా, ఈయన చెప్పిన రీతిలో ప్రాణమున్నది. ఇదేకదా కవిత్వాన్ని శిల్పించేసేది. భాషలో ఇంక కొంత బిగువు ఏర్పడితే రచన రాణిస్తుంది.

గుండె దండోరా

[గీతాలు – కె. హనుమంతరెడ్డి, డెమ్మి – 60 పొరటలు; వెల రు. 2/–; ప్రతులకు: "విమోచవ"7/ ఎ, ఓల్డు ఎం.ఎల్.ఎ. క్వార్టర్స్. హైదరాబాదు-500 178]

ఈ కవి అనుభవించే హృదయావేదన, వెలువరించే ఉద్వేగ భావాలు, నడిపించే భాషా లైక్షణ్యం – గుండె దండోరా అనే శీర్షికకు ఒప్పియున్నవి. ఒక విప్లవవాది అమభవించే వేడి భావాలు, నెత్తురుగావును కోరుతూ ఎలుగెత్తి ఉద్రేకపరుస్తున్నవి. అందులో– ఊపించే గేయం, గ్రామీణ జీవ భాషలో కవిత్వానికి చేవ కల్పిస్తున్నది. ఈ కవి భావాలకు ఆదర్శాలకు విముఖులైనవారు గూడ రచనలు అంగీకరించక తప్పదు.

విప్లవ వీరుల కెత్తిన వివాళి హృదయ స్పందన కారిగా ఉన్నది; ఇవి కవితా దృష్టితో అన్నమాటలు, కాని వీరి దౌర్జన్య పద్ధతిని అంగీకరించలేకున్నాము. కొందరు మానవుల శ్రేయానికిగా మరికొందరిని ఎందుకు ద్వేషించాలవో తెలియకున్నది. ద్వేషానికి బదులు అనురాగాన్ని పెంచుకొంటే వీరివాదం శ్రేయోదాయకం కాగలదు.

దోపిడి వర్గాలు–సైన్యం పోలీసు కోర్టు జెయిళ్ళు సృష్టించాయి–అంటాడు. కావి, ఈ వ్యవస్థలు కమ్యూనిస్టు దేశాలలో విలయతాండవం చేస్తున్న వంటున్నారే ! ఒక కమ్యూనిస్టు దేశం ఇంకొక కమ్యూనిష్టు దేశాన్ని ఆక్రమించుకోవడం విశ్వప్రజాశ్రేయానికేనా ? ఈ రచయిత చైనావాది. ఈ అభిప్రాయాలు ఎట్లా ఉన్నా ఈ కవితలో విప్లవాగ్ని రగుల్కొంటున్నదనాల. రచనలో ఊపు ఉన్నది.

నీ కొరకు మా పాట కన్నీటి వూట ; మీ గొంతులే వంతెనగా వరిచినారు. వీరులారా ; భారత చైనా మైత్రివి ఉన్నతముగ నిలుపుదాం (నేటి ప్రభుత్వ విధానంగా ఉన్నది) ; కత్తులైనా నూరుదాం మిత్రివైనా తరుముదాం; సెమట విలువ ఎన్ని పైసలురా ఓకూలన్నా ; నారువోసి నీరువోసి నారుమళ్లను పెంచివావా ? మొదలైనవి చిక్కటి నుడికారాలు.

సోమసుందర్ కవితలు

రాలిన ముత్యాలు :

[112 పొరటలు; ధర : రూ. 4/– ప్రతులకు – కళాకేళి ప్రచురణలు–పిఠాపురం–533450.]

ఇంగ్లీషు రచయిత మెకాలె–నాగరకత ఎదిగేకొంది కవితా శిల్పం క్షీణిస్తుంది అన్నాడు గాని, శ్రీ సోమసుందర్ ముప్పయి ఏండ్లకుపైగా వ్రాస్తున్నా, నాగరకత లోకజ్ఞానం ఎదుగుతున్నా కవితాగుణం తరుగక పెరుగుతూనే ఉన్నది. ఈయన శైలిలో భాషాప్రౌఢి పదవిన్యాసము విరిసిన పువ్వులై ఉన్నవి· "ఎప్పుడో ఏ నిశిరాతిరి గుండె తలుపు తెరచి వచ్చు ఒక కవితా భావరేఖయు నుషోరేఖలలో"–అంటే తమంత తాము పుట్టినవి కాబట్టి రమణీయార్థ ప్రతిపాదకాలు. ఇవి చాటువులు – శతక పద్యాలవలె దేనికది ప్రత్యేకం. (Stray thoughts) విశ్వకవి రవీంద్రుని Fire flys (జ్యోతిరింగణాలు) ఈ కోటిలోనివే. పదాలు కుప్పలుగా పేర్చి, "నడుము విరచిన వచనానికి అంత్యప్రాసలు చేర్చి ఉత్తమ కవిత్వమనుకొనేవారి" నడుము విరుగగొట్టినాడు. ఉత్తమ జాతి అశ్వానికి ఉత్తమ కవిత్వానికి గతి యతి ప్రాణలక్షణమంటాడు. యతివిగూడ నేను చేరుస్తున్నా.

శ్రీ సోమసుందర్ ఆంగ్ల ఆంధ్ర సంస్కృత వాఙ్మయాల లోతు పరపు బాగా దిగి చూచినవాడు. వ్రాతలో సంస్కృతాంధ్రాలు కారెలు దిరిగిన రెండు వృషభ రాజాలవలె నడుస్తున్నవి.

ఉదారభావం గలిగిన ఈ నాగరకుడు మూఢాచారాలపై వేమనవలె విరుసుకోవి పడుతాడు. పాతను తెగనాడక "పూర్వకావ్య మహారణ్యాలలో చేవగలిగిన వృక్షాలు బోలెడు" అని గుణపక్షపాతి అవుతున్నాడు. రాలిన ముత్యాలలో కొన్ని ఏరి సరం గూర్చి సమర్పిస్తా :–

—నీలో ఎంత ఉష్ణం పెరిగినా, విన్నది చలిమండి కాపాడ లేదు; ఈ సుందర జీవితావ నారక దుర్వాంఛలేల; చంద్రుడు వట్టి మట్టి దిబ్బని తెలిసినా గ్రహణంనాడు విడుపుస్నానం చేయిస్తుంది–సంప్రదాయం; శ్రావణ సంధ్యా పులకిత క్షితిజరేఖ ముఖ శోభకు కాంతారాంతరాలనింపి మయూరాలు నర్తించును.

ఇంద్రు వెన్నెల పడవలు అనేది రెండో భాగం; అందుండి కొన్ని ముక్తకాలు :— కార్పణ్యం కీకరారణ్యం వంటిది, కారణంతో దానికి నిమిత్తంలేదు, ఇంజను చెడిన ఓడను చూచి నవ్వ నారంభించినవి-నత్తగుల్లలు (సున్నితమైన వక్రోక్తి)·

మా ఊరు మారింది :

[120 పేజీలు; వెల రూ. 4/–; కళాకేళి పబ్లికేషన్సు-పిఠాపురం–533450.]

సోమసుందరంగారి పాండిత్య పాటవము, రచనా విలసనము, భావసౌరభ్యాన్ని గూర్చి పైన చెప్పుకొని ఉన్నాము. ఇక్కడ ఈ వ్రాతను గూర్చే ప్రస్తావించుకొందాం. భాషకు బటువు తీపు ఎక్కినవి.

అభిజనమంటే అభిమానం పొంగని వారుంటారా? ఈయన ఒక జమీందారీ వ్యవస్థ శిథిలావశేషాలనుండి ఆవిర్భవించిన తేజాన్ని

వివిధ పార్శ్వ దృష్టులతో వర్ణిస్తున్నాడు. ఈ గ్రంథనామంతో ఒక గ్రామాన్ని ఆవరించే వాతావరణాన్ని ఋతుధర్మాలను వెన్నెల చీకట్లను ఉభయ సంధ్యలను కవితావేశ చకితమానసుడై వర్ణిస్తున్నాడు. గ్రామానికి వచ్చిన మార్పులు చరిత్రాంశాలనిపించు కొంటున్నవి. ఇది సరికొత్త పోకడ. ప్రతిఖండికా ప్రారంభపు ఎత్తుగడ ఒయ్యారంతో నడుస్తున్నది

కవికి గ్రామీణ ప్రకృతి విలాసము, దృశ్యాలు ప్రీతిపాత్రాలు పట్టణ కృత్రిమ వాతావరణాన్నే రుచిచూచినవారి మనసులకు ఈ వర్ణనలు వచ్చదనాన్ని కలిగిస్తున్నవి. ఊరి కొలనులకు ఏటికి మానుషత్వ మారోపించి నీతులు చెప్పినాడు.

దేవాలయ ధ్వజస్తంభపు "చిరుగంటల నాలుకలు ఊరంతటిని మేలుకొల్పి వెలుతురు వేళ్లాపుతూ పిలిచే కుందనపు దీపికలు" అని ఉత్ప్రేక్షిస్తున్నాడు: "నిశాంతం రెక్కదులిపి మేలుకొని లతాంతాలలో నిద్రిస్తున్న మలయా నిలాన్ని నింపాదిగా తట్టి లేపినపుడు, అని ఒక మసృణ భావాన్ని తెలిపినాడు; సరీసృపాలు (పాములు) విహంగాలు రెండూ అండజాలే అయినా ఆగర్భశత్రువులై మృత్యుఛాయలో విశ్రమిస్తాయి-అని వేదాంత ఛాయల బరపుతున్నాడు. సూర్యోదయ వర్ణనలో ఈ లిరికల్ ఎలిమెంట్ చూడండి—నునులేత చివుళ్ళతోనూ మెత్తని గరికపోచలకంటుకొన్న చల్లని మంచుబిందువులతోను రక్తసిక్తమైన తన ముఖాన్ని తుడుచుకొంటాడు. (నవోదిత సూర్యుడు); అపరాహ్ణం ఉందే అది మా వూరికి వచ్చేసరికి—ఇది చెప్పే పోకడలో ఒక చెణుకు. జీవనం జనన మరణాలమధ్య చైతన్య విలసనంగా సాగే మృదుల మనోరథం కర్తవ్యోన్మేష నవపథం - అన్నది జీవితానికి ఆధ్యాత్మిక వ్యాఖ్యానం. "కలికితురాయి ధరిస్తున్న కొలను" (తలంత్తిన తామరలు) అన్నది చక్కటి చిత్రీకరణం.

ఇట్లా నుడికారాలు దోసిళ్లతో ఎత్తవచ్చు!

రెండోభాగం తురాయిపూలు—భిన్నభావోద్వేగాలవి. రాయవేలూరు ఆసుపత్రి రాగిచెట్టు, తన నీడలో చేరినవారి చిత్తాన్ని లోకవృత్తాన్ని చెపుతున్నది బెంగళూరు వర్ణన ఆ పట్టణ వాతావరణ పేశలతవలెనే, భాష భావ సౌభాగ్యం కలిగిఉన్నది. "పుడమి ఒడిలోని కడలి" అన్న పదబంధంగా మంచిగా ఉన్నది.

శ్రీ మరుపూరు కోదండరామరెడ్డి

లకుమ : నవల

[హిందీమూలం : బాలశౌరిరెడ్డి, తెలుగు అనువాదం: రాజగోపాలనాయుడు, మూల్యం : రు. 6–50లు]

లకుమ ఒక చారిత్రక నవల. రెడ్డిరాజుల చరిత్రలో క్రీ. శ. 1386 నుండి 1402 వరకు కొండవీడును ఏలిన కుమారగిరి రెడ్డి రసిక జీవితం ఈ నవల ఇతివృత్తం. లకుమ దేవదాసి. ఆమె తోటి కుమారగిరిరెడ్డి సాగించిన రస్సైక జీవితాన్ని తెలుగులో డా॥ సి. నారాయణరెడ్డిగారు 'కర్పూర వసంతరాయలు' అను పేరిట మ్మాత్రాచ్ఛందంలో కావ్యాన్ని నిర్మించారు.

ద్వారపరెడ్డి అను సేనాపతి తన ప్రయాణంలో లకుమ నాట్యాన్ని చూసి ముగ్ధుడై తన ప్రభువైన కుమారగిరిరెడ్డికి కానుకగ సమర్పించాలనే కోరికతో ఆమెను తీసుకుపోయి కుమారగిరి రెడ్డికి అర్పిస్తాడు. ఆ పరిచయంతో కుమారగిరిరెడ్డి ఆమె నాట్యానికి పరవశించి ఆమెను రాజనర్తకిగా నియమిస్తాడు. కుమారగిరి రెడ్డి ఎంతటి పరాక్రమవంతుడో అంతటి సరసుడు రస్సైకజీవి.

లకుమ నాట్యముద్రలతో ఒక నాట్యశాస్త్రాన్ని నిర్మించాలనే కోరికతో లకుమభవనంలోనే కాలాన్ని వ్యయిస్తాడు కుమారగిరి రెడ్డి. రాజ్యపాలనను సంపూర్ణంగా తన బావమరది కాటయ వేమా రెడ్డికి అప్పగించి తాను లకుమ ప్రపంచంలో జీవిస్తాడు. మహారాణి మల్లాంబికకు రాజ్యాన్ని రక్షించడం సమస్య అయినా కాకపోయినా రాజుపై ప్రజలకుగల అల్పదృష్టి ఆమెకు ఒక సమస్యగా పరిణమించింది. ఆమె లకుమను ఏకాంతంలో కలుసుకుని కుమారగిరిరెడ్డి జీవితంలోంచి తప్పుకొనమని చెబుతుంది. ఫలితంగా లకుమ కుమారగిరిరెడ్డి ఎదుట చివరిసారిగా నాట్యం చేస్తూ బాకుతో పొడుచుకుని చచ్చిపోతుంది.

ఈ చారిత్రిక నవలను అనువదించడంలో రాజగోపాల నాయుడుగారు చక్కటి శైలి నుపయోగించారు. అనువాదంగాకాక ఒక స్వతంత్ర నవలగా కథాగమనాన్ని నడిపించారు. అనాటి చరిత్రను కళ్ళకు కట్టినట్లుగా చిత్రించడంలో రచయిత సఫలీకృతులయ్యారు.

గందరగోళం : నవల

[కలువకొలను సదానంద, మూల్యం రు. 6–50లు, ప్రతులకు విశ్వప్రభ పబ్లికేషన్సు, నేండ్రగుంట—చిత్తూరు జిల్లా.]

కలువకొలను సదానంద చేయితిరిగిన రచయితగా ఆంధ్ర పాఠకలోకానికి సుపరిచితులు వారి కలంనుండి వెలువడిన 'గందరగోళం' నిజంగా నేటి సమాజానికి సంబంధించిన గందరగోళమే. ఇతర భాషల్లోని రచయితలతోనో, ఇతర దేశాల్లోని రచయితలతోనో పోల్చి తెలుగులో అంత చెప్పుకోతగ్గ రచయితలు లేరు అని చెప్పుకోవడం మనకు పరిపాటి అయింది ఒక జేమ్సుజాయిస్ లాంటి రచయితో, ఒక వర్జీనియా ఉల్ఫ్ వంటి రచయిత్రో మనకు లేరే అనివాపోయేవాళ్ళూ ఉన్నారు. మనని మనం గౌరవించుకొనలేని స్థితిలో పొరుగింటి పుల్లకూర రుచిగానే ఉంటుంది.

చైతన్య స్రవంతి శిల్పాన్ని సంపూర్ణంగా అనుసరించకపోయినా ఆ ఛాయలు కొన్ని ఈ నవలలో మనకు కనబడతాయి. నవల ఇతివృత్తం ఒక ఉపాధ్యాయుని కుటుంబం; అతనిచుట్టూ ఉన్న సమాజం గిరిధారి మాష్టారికి బాలయోగి, చక్రపాణి కొడుకులు. కుమారి, ఆశాప్రియ కూతుళ్ళు. గిరిధారి తన జీతంతో సంసారాన్ని సక్రమంగా నడపలేడు ఎవరి ఆశల్నీ తీర్చలేని అసమర్థుడు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తే ఒక్కొక్క ఆపరేషనుకు ఐదు రూపాయలు కమీషను లభిస్తుంది. ఆ కమీషను వ్యాపారం చేసే సామాన్య బడిపంతులు గిరిధారి అతని జీవితం చుట్టూ అఖిలాలీలు, శేషఫణులు, బసవరాజులు వేనకువేలు. వీళ్ళు మానాన్ని గౌరవాన్ని డబ్బుతో కొనుక్కోగలరు. సామాన్యుడి జీవితంతో జూదమాడగలరు. వాడి రక్తాన్ని బ్రాందిగ, విస్కీగ, తాగెయ్యగలరు. ఈ వ్యవస్థ ప్రసాదించిన హక్కుల్నివాళ్ళు సంపూర్ణంగా అనుభవించగలరు. అట్లా అనుభవించడం చేతగానివాడు పిచ్చిదొర అయిపోతాడు. వాడి భార్య 'మధురం' లాగా వ్యభిచారిణి అవుతుంది.

ఈ నవలలో కనుపించే శయన సుందరులు ఈ సమాజంలో లెక్కకుమించి ఉన్నారు. వ్యవస్థ యొక్క దౌర్జన్యానికి మానాన్ని కోల్పోయి, ప్రాణాన్ని బలి ఇచ్చిన గిరిధారి మాష్టారి 'కుమారి' లాంటి కూతుళ్ళెందరో ? సమాజ గమనాన్ని మార్చవలసిన 'దేవముని' లాంటి కవులు కలిగిన వారి పాదాల ముందు స్వప్రయోజనాల కోసం మోకరిల్లడం ఈ సమాజానికి కొత్తది కాదు. కోరికలు తీరక, తీర్చుకునే ధైర్యం లేక అటు జీవనానికి, ఇటు మరణానికి మధ్య బ్రతుకుతున్న 'ఆశాప్రియ' లాంటి యువతులకు మన సమాజంలో కొరతలేదు. దెబ్బకుదెబ్బతీయాలనే ప్రయత్నంలో తనే మార్గంలో పయనిస్తున్నాడో తనకే తెలియని 'చక్రపాణి' లాంటి యువకులు నిత్యం మనకు కనబడుతూనే ఉంటారు. ఇలాంటి సమాజ లక్షణాన్ని రచయిత "పీడించడం, పీడను సహించడం—రెండూ మనిషి స్వభావాలే. బలవంతుడు బలహీనుణ్ణి మనిషిగా బ్రతకనివ్వడం లేదు. అది వాడి అజ్ఞానం. తెగబడితే తాను బలవంతుడేనని బలహీనుడు తెలుసుకోలేకపోతున్నాడు. అది వాడి అజ్ఞానం. మనిషి మనిషిగా గుర్తించబడాలంటే ఎవడికివాడు ఏకాకిగా ఎగబడితే లాభం లేదు. అందుకు కావలసింది ఐకమత్యం. అది బలవంతుల్లో ఉంది. బలహీనుల్లో లేదు. ఐకమత్యంతో బలహీనుల్ని బానిసలుగా చేసుకోవడం మహాఅజ్ఞానం; ఈఅజ్ఞానమే దేశాన్ని పాలిస్తోంది" అని చెబుతున్నారు రచయిత. "అడవుల్లో, ఆకుల్లో, కొండల్లో, కోనల్లో దాక్కున్న కాకుల గొంతుకల తుపాకుల తుప్పు వొదిలించుకుని, తూటాలు దట్టించుకోవాలి. ప్రపంచానికంతా ఒకే దీపమై తూరుపు కొండ మీద వెలుగుండు ఉదయించాలి" అంటున్న రచయిత మాటలు ఈనాటి సమాజ బీభత్సానికి పరిష్కార మార్గాన్ని సూచిస్తున్నాయి.

గాలి రథం

[కథా సంపుటి, ఆర్. వసుంధరాదేవి, మూల్యం : రు. 6–00లు, విశ్వప్రభ పబ్లికేషన్సు, నేండ్రగుంట—చిత్తూరుజిల్లా.]

ఇది తొమ్మిది కథల సంకలనం. శ్రీమతి వసుంధరాదేవి రచనా పరంగా ఒక ప్రత్యేక వ్యక్తిత్వం కలిగిన రచయిత్రి. జీవితాన్ని సూక్ష్మాంశ పరిశీలన చెయ్యడంలోనేమి, సమాజ జీవితాన్ని యథాతథంగా చిత్రించడంలో నేమి మంచి నేర్పు గలిగిన రచయిత్రి వసుంధరాదేవి.

'పెండికటి కవుల' కథ మృత్యువును గురించిన ఆలోచనలతో సాగే కథ. విజయలక్ష్మికి తాను భూమిమీద లేకపోతే అనే ఆలోచన అనుక్షణం వెంటాడేది. ఈ ఆలోచనతోనే లేని జబ్బును తెచ్చుకున్నది చివరకు జీవితం, ప్రపంచం అంతా తోలుబొమ్మలాట అనే సత్యాన్ని గ్రహించడంతో ఆమె సుఖంగా గాలి పీల్చ గలిగింది. 'బ్రిడ్జి కింద' కథలో చలపతి ఒక తిరుగుబాటు తత్వానికి ప్రతీక. పోతప్ప నీతిగా బ్రతుకుదామనుకొని తానాశించిన నీతితనకు కనబడక పతనావస్థకు చేరుకొన్న మనిషి. "డబ్బే దేవుడు. అది ఎవరి దగ్గరుంటే వాళ్ళు గొప్పవాళ్ళు. మనిషి, మంచితనం, నీతి, నిజాయితీ—యివన్నీ లేవు. డబ్బు సంపాదించాలి. ఇంకా ఇంకా సంపాదించాలి. అదే ఈ కొత్త సమాజపు లక్షణం; లక్ష్యం"అని చలపతి ఆధునిక సమాజపు లక్షణాన్ని వివరిస్తాడు. కష్టపడేవాడికి చివరకు మిగిలేది అయోమయమని ఋజువుచేసే కథ. 'ఇంతేలే పేదల ఆశలు' కథ కూడ పేదవారు ఎంత శ్రమించి బాగుపడాలన్నా అవకాశంలేని పరిస్థితులను వివరించే కథ. 'పండగ' కథ ఒక మధ్యతరగతి స్త్రీ మానసిక స్థితిని, ఐశ్వర్యంలో ఉన్నవారి అహంకారాన్ని దెబ్బతీయాలనే తపనను తెలియజేస్తుంది. తను చేయని నేరానికి సిగ్గుపడి ఆత్మహత్య చేసుకొన్న వ్యక్తి కథ తోలుబొమ్మలు అన్యాయం న్యాయాన్ని ఏ విధంగా చేరుస్తుందో చూపించే కథ 'చెరుల దగ్గర' కథ. వ్యక్తిత్వానికి, వ్యక్తిత్వ హీనత్వానికి గల భేదాన్ని విశదం చేసే కథ పిచ్చిగీతలు. ఒక మాతృమూర్తి యొక్క వేదన తీవ్ర స్థాయిలో వినిపించే కథ 'బదిలీ'.

మొత్తం మీద ఈ కథలన్నీ ఆలోచింపచేసే కథలు. కొన్ని మనస్తత్వ ప్రధానమైనవి. మరికొన్ని సాంఘిక జీవితానికి సంబంధించినవి. ఇంతేలే పేదల ఆశలు కథలోగాని, బ్రిడ్జి క్రింద కథలోగాని రచయిత్రి చిత్రించిన సామాజిక స్థితికి పరిష్కారం ఆలోచించవలసిన బాధ్యత పాఠకునికే వదలబడింది. మిగిలిన కథలన్నీ అనుభవానికి, అనుభూతికి సంబంధించినవి; చదివి ఆలోచించ తగ్గవి.

శ్రీ టి ఎల్. కాంతారావు

"ప్రాఙ్నన్నయ యుగము - సాంఘిక జీవనము" (పరిశోధిత వ్యాసము)

[ప్రాఙ్నన్నయయుగము—సాంఘిక జీవనము (క్రీ. శ. 1000 వరకు) పరిశోధితవ్యాసము. కర్త : శ్రీనండూరి వేంకట సత్య రామారావు, వెలరూపాయన్నర, ప్రతులకు : శ్రీ నండూరి మాణిక్యాలరావు, కృష్ణాయపాలెం, వయా తాడేపల్లిగూడెం (ప.గో జి.)]

సుమారు 23 పేజీలతో క్రౌన్ సైజులో వెలిసిన మహా 'పరిశోధిత వ్యాస' మిది. దీనికి 2 పుటల 'మంగళాశాసనమ్' 2 పుటల తొలిపలుకు, మరో 2 పుటల వ్యాసరచయిత రాసుకొన్న 'నామాట' మొత్తం 6 పుటల తంతుతో అచ్చయింది. ఈ 'బృహత్ గ్రంథ ముద్రణ'కు కూడా ఆర్థిక సహాయం కావలసి వచ్చింది అందుకు ప్రభుత్వం వారి లెక్కల లాగ సగం గ్రంథకర్త భరించ కొంటే శేషం తాడేపల్లిగూడెం తెలుగు సాహితీ సమాఖ్య వార భరించారు.

గ్రంథాన్ని పరిచయం చేస్తూ "నన్నయగారికి ముందున్న శాసనాలను పరిశీలించి సముచితంగా విశ్లేషించి వేయి సంవత్సరా తెలుగు వారి సాంఘిక జీవన విధానాన్ని (వ్యాసకర్త) మ ముందుంచే"రని, వారి శ్రద్ధ పరిశీలనా సామర్థ్యం, పాండిత్య ఈ కృషిలో ప్రత్యక్షరంలోను ప్రత్యక్ష మవుతున్నాయని త్వరలో వారికి శ్రియఃపతి పిహెచ్.డి. పట్టం పొందేటట్లు చేయాల తొలిపలుకులో శ్రీమాన్ టి.రామానుజాచార్యులవారు సాయించారు

పాపం శ్రియఃపతి ఎన్నిటికని సహాయపడతారో తెలియదు ఇక ఆచార్యుల వారి స్నేహపూరిత ప్రశంసావాక్యాలు హర్షించదగిన కాని పుస్తకం మాత్రం పరిశోధన వ్యాసం కాదు. కేవలం డి కళాశాల విద్యార్థుల పత్రిక స్థాయికి తప్పక అందుకోదగ్గ వ్యాస అని మాత్రం చెప్పకోక తప్పదు.

డా. బూదరాజు రాధాకృష్ణగారు విశేషించి పరిశ్రమ చే ప్రాచీనాంధ్ర శాసనాలనే ప్రామాణికమైన గ్రంథాన్ని సమకూర్చారు. అది ఈ పరిశోధిత వ్యాసకర్తకు వడ్డించిన విస్తరి. వ్యాస రచయి తన వ్యాసంలో శాసనాలలోని పదాల కిచ్చిన ఏ అర్థం అయి సొంతం కాదు. అది రాధాకృష్ణగారు ఆ గ్రంథానికి చివరిలో సమకూర్చిన 'ఇండెక్స్ వెర్బోరియమ్'లోనివి. ఈ గ్రంథా వ్యాసకర్త వారు కొన్నట్లు తెల్పినా ఈ అర్థాలు 90 పాళ రాధాకృష్ణగారిచ్చినవే అనే విషయం చెప్పరు ప్రాచీన శాసనా లోని పదాలకు అర్థాలు వ్రాయటం ఎంతకష్టమో పరిశోధకుల తెలుసు. ఎంత తేలికో ప్రస్తుత పరిశోధిత వ్యాస కర్తల తెలుసు.

ఇక ఈ చిన్నపుస్తకంలోని కొన్ని వైపరీత్యాలు.

1. "దాన శాసనములు, స్మారక శాసనములకు తోడు శి స్తంభములను ప్రతిష్ఠించుట కూడ కలదు." (పుట 2) అ చెబుతూ కొరవి శాసనం పేర్కొన్నారు. శిలాస్తంభాలను ప్రతిష్ఠించటం ఆనాడేమిటి అశోకుని కాలంనాటినుంచీ ఉన్నాయి. ధ్వ స్తంభాలు, జయస్తంభాలు, కీర్తిస్తంభాలు అని శాసనస్తంభాల రకాలు. ఈ మూడిటికీ చెందదు కొరవి శిలాస్తంభం. ఇది కేవల వీరభద్రాలయంలో కొరవి కిచ్చిన స్థితి (దానం) ఒక స్తంభం మీ చెక్కబడింది. 'ప్రతిష్ఠించి' అంటే నిలబెట్టి అనే అర్థం ఇ పేర్కొనదగిన విషయంకాదు. విశేషమూ లేదు.

2. "శైవమున వీరశైవమొక భేదము. ఈ వీరశైవ గురువులను గొరవలందురు" (పుట) 7వ శతాబ్దిలో వీరశైవం ఉందా? ఈ వాక్యం శైవమతాన్ని గూర్చి తెలిసిన వాళ్ళెవరూ రాయరు. ఆనాటి గొరగలు (కన్నడంలో గురుక్కళే) కాలాముఖ పాశుపత శైవులలో యోగాచార్యులు. "నాటి శైవులందరూ మాహేశ్వర పక్షపాతులు" అంటూ ధర్మవరం శిలాశాసనంలో ప్రయోగం చూపారు. అది కడెయరాజు కొడుకు బెజయరాజునకు చెందింది. కాని శైవులందరికీ చెందిందికాదు. మాహేశ్వర పక్షపాతి అయినంతమాత్రాన ఒకవ్యక్తి శైవుడుకాడు.

3. "దోసంబునకు వాని జీవితంబ దణ్డవు పరియారబ" అంటే జీతం తగ్గించటంకాదు. జీతం పూర్తిగా అపరాధనుంకం కింద జమకట్టడం అని అర్థం.

హరిభటు వరాహపురాణము

[వరాహ పురాణము—హరిభట్టు (సంశోధిత ముద్రణము) సంపాదనము డా. దేవళ్ళ చిన్నికృష్ణయ్య, వెల : రూ. 22. ప్రతులకు : కుమారి మల్లిక. డి–1, ఇ. డబ్లు. ఎస్. ప్లాట్సు, 11 మెయిన్‌రోడ్, అన్నానగర్, మద్రాసు—40.]

ప్రాచీన గ్రంథపరిష్కరణ (Textual Criticism) నేడు ఒక శాస్త్రంగా రూపొందినా మన రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు ఇంకా ఈ విభాగాన్ని గౌరవించలేదు. ఈ శాస్త్రంపైన సూక్తాంకర్, కాత్రే, డి. నరసింహాచారి మొదలైన విద్వాంసులు పరిశ్రమ చేసి గ్రంథాలు ప్రకటించారు. అయినా మన పండితులు నిన్నమొన్నటివరకు తమబుద్ధికి తోచినట్లు అముద్రిత గ్రంథాలను పరిష్కరిస్తూ వచ్చారు. పార పరిశోధన శ్రమ సాధ్యమైన పని. సంస్కృతాంధ్రాల్లో నిష్ణాతులయినవారు కాని ఇతరులు దీని జోలికి పోరు ఆ విద్య నేడు అంతరిస్తున్న దశలో ఉంది.

డా. దేవళ్ళ చిన్నికృష్ణయ్యగారు ప్రాచీన పండితుల కోవలోనివారు. సంస్కృతాంధ్రాంగ్ల భాషలలో నిష్ణాతులు. పైగా సంప్రదాయంమీద అభిమానం కలవారు. గ్రంథ పరిష్కరణక్లేశాన్ని గుర్తెరిగి ఈ వరాహపురాణ పరిష్కరణకు సిద్ధమయినారు.

సాధారణంగా అముద్రిత గ్రంథాలను పరిష్కరించడం కొరవితో తల గోకుకొనడం వంటిది. అందులో పిహెచ్. డి పట్టం కోసం సులభసాధ్యమైన విషయాన్ని ఎవరైనా గ్రహిస్తారు కాని ఈ శ్రమ సాధ్యమైన దావనస్తుపు పనికి దిగరు. డా. చిన్నికృష్ణయ్యగారీపనికి సాహసించారంటే ఎంత గుండెధైర్యం.

అష్టఘంటావధాన పరమేశ్వర హరిభట్టు కృత వరాహపురాణం రోమశ మార్కండేయ సంభాషణాత్మకం. అవతార ప్రయోజనాదికం. దీనికి విరుద్ధ రచన జంటకవుల వారాహం. వేంకటాచల మాహాత్మ్య కథా గర్భితమైన వరాహపురాణం తీరు మరోవారి. మొత్తం మీద తెలుగులో సాధికారిక వరాహ పురాణాను వాదం రాలేదనే చెప్పాలి. వీటన్నిటికీ మూల గ్రంథం ఇంకా కరతలామలకం కాలేదు ఉన్నవాటిలో హరిభట్టు కృతే కాస్త మూలానికి దగ్గరగను అవతార ప్రాశస్త్యాన్ని నిరూపించేదిగాను ఉందని అంటారు పరిష్కర్తలు.

అసలు అవతారాల చరిత్రే ఒక గొప్ప పరిశోధనాంశం. కాని ఆ మహాగవేషణకు ఒక్క తెలుగు పురాణాలు చాలవు. అష్టాదశ, ఉప పురాణాలతో బాటు విభావాలు, వ్యూహాలు తెల్పే పాంచరాత్ర శాస్త్రజ్ఞానం విగ్రహ పరిశీలన కావాలి ఆది, యజ్ఞ, ప్రళయ వరాహ మూర్తులను గూర్చి, వరాహనృసింహ రూపాన్ని గూర్చి పరిశోధించవలసి ఉంటుంది. దీనికి వైఖానసాగమం కొంత తోడ్పడవచ్చు. బుద్ధావతార సమస్య సమస్యగానే ఉంది.

పరిశోధిత వరాహపురాణానికి పరిష్కర్తలు కూర్చిన పీఠికా విభాగం హరిభట్టు కృతికి, మెరుగుపెట్టినట్లుంది. ముఖ్యంగా 'గ్రంథావిష్కరణ పద్ధతి' ఇతరులకు ఒరవడి కాగలదు.

సాహితీ తీర్థంకరులు శ్రీధరులు, లాక్షణిక చక్రవర్తి రావూరి దొరస్వామి శర్మగారు, లేఖ పారకోత్తములు మధుసూదన, జ్యోతిర్మయి సహకరించిన ఈ వరాహపురాణ పరిష్కరణలో సరసులైన వారు నెరసు లేరరు.

డా. చిన్ని కృష్ణయ్యగారు హరిభట్టు ఇతర కృతులను కూడా సంశోధిత ముద్రణాలుగా పరిష్కరించి అందజేయాలని కోరుతున్నాము.

శ్రీ వేంకటరావు

Sankara's concept of God

(ఆంగ్లము)

[రచయిత : పి. కృష్ణమోహన్, ప్రచురణ : నేలనూతల పబ్లిషర్సు, మూలపేట, నెల్లూరు—524003; పేజీలు 131; వెల రూ. 15–00.]

ఇది ఆరు అధ్యాయములుగల ఆంగ్లగ్రంథము. 1. ఉపోద్ఘాతము, 2. శంకరుని జీవిత చరిత్ర, శాంకర సిద్ధాంతమునకు మూలము, 3. ఉపనిషత్తులలోని ముఖ్యసిద్ధాంతములు, 4. దేవుని గూర్చి శంకరుని సిద్ధాంతము, 5. శంకరుడు—స్పినోజా, 6. ఉపసంహారము. అను శీర్షికల క్రింద అధ్యాయములు విభజించబడినవి.

మొదటి రెండధ్యాయములలోను రచయిత శంకరుడు జన్మించు నాటికి భారతదేశములో నుపలబ్ధమగుచున్న మత పరిస్థితిని ముఖ్యముగ బౌద్ధమత వ్యాప్తిని గూర్చి తెలుపుచు శంకరుడు తన యద్వైత సిద్ధాంతమును ప్రచార మొనర్చుటకుగల అవసరము, అనుకూల పరిస్థితులను గూర్చి వివరించిరి. వీరి గ్రంథము పాశ్చాత్యులు వారి అనుయాయులు శాంకర వేదాంతముపై రచించిన విమర్శనాత్మక రచనల నాధారముగ గైకొని వ్రాయబడినది. వేదాంత శాస్త్రములోని పూర్వపక్ష—సిద్ధాంతములతో గ్రంథమును

నింపి చదువరులను ఆయాసపెట్టకుండ మాటిగా వక్తవ్యాంశమును ప్రతిపాదించిరి. శాంకర సిద్ధాంతముపై నిదివరకున్న ముఖ్య ఆంగ్ల విమర్శక గ్రంథములపై నిదియొక విమర్శక గ్రంథమైనను మిక్కిలి ఆసక్తికరముగను, సుగ్రాహ్యముగను నుండును. శంకరుడే తన శాస్త్రీయ పూర్వపక్ష – సిద్ధాంతములు సామాన్యులకు సుగ్రాహ్యములు గావని తలంచి తన సిద్ధాంతమును, ఆచరణ విధానమును ప్రకరణ గ్రంథములద్వారా సులభగ్రాహ్య మొనర్చెను. శంకరుని దేశకాలాదులను గూర్చి చెప్ప సందర్భమున ఈ రచయిత పాశ్చాత్యులు వారి అనుయాయులు చేసిన నిర్ణయములను భారతీయ వ్యాఖ్యాతల కాలానుగుణముగ కొంత చర్చించి తుదకు క్రీ. శ 820 నాటికి శంకరుడు సిద్ధిబొంది యుండునను వాదమునే పాక్షికముగ నంగీకరించిరి. అందుపై విశేషించి యీ రచయిత చర్చించలేదు. తమ గ్రంథోద్దేశమున కది ప్రధానాంశము గాకపోవచ్చును.

మూడవ అధ్యాయములో ఈ గ్రంథకర్త శంకరుని అద్వైత సిద్ధాంతమునకు మూలప్రమాణములైన ఉపనిషద్వాక్యములను సూచించుచు ఆత్మనుగూర్చి బ్రహ్మనుగూర్చి చక్కని వివరణము గావించిరి. వ్యక్తిగతమగు జీవాత్మ ప్రత్యేకించి గోచరించుచున్నను అది పరమాత్మాంశము లేక బ్రహ్మము తప్ప వేరుకాదని ఛాందోగ్యములోని ''తేషాంఖల్వేషాం భూతానాం త్రీణ్యేవబీజానిభవన్తి అణ్డజం, జీవజం, ఉద్భిజ్జ మితి। సేయం దేవతైక్షత హన్తాహమి మాస్తిస్రో దేవతా అనేన జీవేన ఆత్మనానుప్రవిశ్య నామరూపే వ్యాకర వాణీతి॥ (1) అను వాక్యానుగుణముగా పరమాత్మ ఉష్ణ, జల, ఆహార రూపములగు శక్తులతో గూడిన జీవరూపమున ప్రవేశించి నామ రూపములుధరించుచు బాహ్యముగ గోచరించుచున్నదేకాని వేరుకాదను విషయమును చక్కగా నిరూపించిరి. సుఖ దుఃఖాద్యనుభవములను గోచరింపజేయునది పరమాత్మయొక్క ఛాయా రూపమగు జీవాత్మ యొక్క బుద్ధి విశేషము మాత్రమే. ఇంక బ్రహ్మను గూర్చి చెప్పుచు ఛాందోగ్యమునుండియే యీ వాక్యమును చూపిరి. ''సర్వం ఖల్విదం బ్రహ్మ। తజ్జలానితి శాన్త ఉపాసీత।'' దీనికి శంకరుని భాష్యవాక్యమును గూడ జూపిరి. ''తజ్జలానితి। తస్మాద్బ్రహ్మణో జాతం తేజోఽబన్నాది క్రమేణ సర్వం। అతస్తజ్జం। తథాతేనైవ జనన క్రమేణ ప్రతిలోమ తయా తస్మిన్నేవ బ్రహ్మణి లీయతే తదాత్మతయా శ్లిష్యత ఇతి తల్లన్।'' (2) పై నుదహరించిన మొదటి వాక్యమునుబట్టియే పరమాత్మ తేజస్సు, జలము, అన్నము అను శక్తులలో వ్యక్తమగుచున్నదో అదియే బ్రహ్మజాతములగు ఆ శక్తులలో ఆ జనన క్రమములోనే తిరిగి బ్రహ్మమునందు లీన మగుచున్నది (పరమాత్మ) అని యీ రెండవ వాక్యములో వివరించ బడెను. దీనినిబట్టి నామరూపములలో వ్యక్తమగుచున్నట్టి యీ నిఖిల ప్రపంచము పరమాత్మయనియు అది బ్రహ్మమునకు భిన్నము కాదనియు సప్రమాణముగ నీ గ్రంథకర్త నిరూపించిరి.

నాలుగవ ప్రకరణములో శంకరుని మతములో అనగా అద్వైతమతము ననుసరించి భగవత్తత్త్వము వివరించబడెను.

అద్వైతములో బ్రహ్మము, ఆత్మ, జీవాత్మ ఒకటియే. బ్రహ్మ సత్, చిత్, ఆనంద స్వరూపము, నిత్యము, అవికార్యము. కాని ద్రవ్యాత్మక ప్రపంచము, మనస్సు సత్యములుగ గోచరించుటమాయ. అదియే మిథ్య. శంకరుడు ఇతర వేదాంతులతో భేదించునది ముఖ్యముగ నీ యంశములోనే, జ్ఞాతృజ్ఞేయ భావమున్నంతవరకు ప్రపంచము పృథక్త్వేన గోచరించును. అట్టి భావము బ్రహ్మజనితమగు మాయాహేతుకము. కనుక జీవుడు తను బహ్మనుండి భేదభావమును కలిగియుండునంతవరకు ప్రపంచమును సత్యముగ భావించును. దీనినే వ్యావహారిక సత్యమందురు. గాఢసుషుప్తియందు జీవుడు బ్రహ్మైక్యము పొందుటవలన జ్ఞాతృజ్ఞేయభావముండదు. కనుక వ్యావహారిక జ్ఞానముండదు. దానితో బాటు తాను బ్రహ్మనను జ్ఞానముకూడ కలుగదు. అట్టి బ్రహ్మజ్ఞానము తురీయావస్థలో మాత్రమే గోచరమగునని శంకరుని మతము. సచ్చిదానందమయమగు బ్రహ్మైక్యము ఆ స్థితియందే లభ్యమగును. ఈ నడుమ గలుగు భావములన్నియు సగుణ బ్రహ్మను గోచరింపజేయును. అంటే మాయోపవిష్టుడగు పరబ్రహ్మ ఈశ్వరుడను పేరుతో భాసిల్లుటను సగుణబ్రహ్మమందురు. అందుచేతనే బ్రహ్మను అణువు, బృహత్; నిర్గుణుడు-సగుణుడు అని వివేచన చేయుదురు. ఇచట మాయనుగూర్చి ఈ గ్రంథకర్త చక్కని వివరణముజేసి తన్మూలకముగ నీ ప్రాతిభాసిక ప్రపంచము రజ్జువునందు సర్పమువలె నే విధముగ బ్రహ్మనుండి వివర్తము నొందెనో మిక్కిలి సుగ్రాహ్యముగ ప్రతిపాదించిరి. సగుణబ్రహ్మయే మాయవలన ఈశ్వరుడగను, ప్రపంచముగను, జీవుడుగను గోచరించునని భావమును విశదీకరించిరి.

అయిదవ ప్రకరణములో శాంకర సిద్ధాంతము వేరొక పాశ్చాత్య సిద్ధాంతముతో తులనాత్మకముగ పోల్చబడెను. వేదాంత శాస్త్రము, ముఖ్యముగ అద్వైతమునకు సంబంధించిన మాయ, మిథ్య, ఈశ్వరుడు, బ్రహ్మ, అవిద్య యిత్యాది సాంకేతిక పదములు సామాన్యులకు సులభముగ మనస్సునకు అందవు. వాటిని మతాంతరములలోనుండు అట్టి భావములతో పోల్చి చెప్పినపుడు విషయము సుగ్రాహ్యముగుచుండును. ఈ గ్రంథములో ఆ ప్రయత్నము ఈ ప్రకరణమునందు గానవచ్చును. క్రీ. శ. 17వ శతాబ్దిలో స్పినోజాయను నొక జ్యూజాతికి చెందిన విద్వాంసుడు 'The book of the God' అను గ్రంథమును రచించెను. దానిలో శంకర సిద్ధాంతములను బోలిన సిద్ధాంతములు కొన్ని కనుపించును. శంకరుడు "బ్రహ్మసర్వవ్యాపకము. మాయవలన ప్రపంచమున వైవిధ్యము కనుపించును. అది అవిద్యా మూలకము. అవిద్య నశించిన యెడల మాయ నివృత్తమగును. సర్వత్ర బ్రహ్మయే గోచరించును" అని చెప్పెను. దీనికి పోలియుండునట్లు స్పినోజా "దేవుడు సర్వాంతర్యామి, సర్వప్రపంచము భగవంతునిలో నున్నది. దేవుడులేని ప్రపంచభాగములేదు" అని చెప్పెను. శంకరుడు "బ్రహ్మ యితర ప్రేరితము గాదు. స్వయంప్రేరకము. ఒక విషయమునందు రాగము, ఒకచో ద్వేషములేని తటస్థ ప్రకృతి బ్రహ్మము. అది సచ్చిదానందమయము" అని చెప్పెను. (భక్తానాం అసురాణాం అన్యేషాంవా ఫలం సదృశం। తస్మాన్నకోపి శత్రుర్నోమిత్రం వాప్యుదాసీనః। నృహరిః పన్మార్గస్థః సఫలః శాఖీవ యాదునాథః॥) భగవంతుడు శత్రు మిత్ర భావము లేనివాడేకాక ఉదాసీనుడు కూడ కాదట. మార్గమునందుండు సఫలమగు వృక్షమువంటి వాడని ప్రబోధ సుధాకరములో జెప్పెను. ఇదేభావాన్ని స్పినోజా "భగవంతు డెవ్వరిని ప్రేమించడు, ద్వేషించడు. ఆయన రాగద్వేషములతో చలించువాడు కాదు అతడు సర్వస్వతంత్రుడు. సర్వ ప్రపంచమునకు అధిష్ఠాత, కారకుడు, ప్రేరకుడు" అని చెప్పెను. శంకరుని మాయావాదమునకు సన్నిహితముగా స్పినోజా దేవునిగూర్చి natura naturans అని చెప్పెను. దృశ్యవస్తుజాలమంత నామరూప మాత్రమే ననెను. ప్రస్తుత రచయితలు పాశ్చాత్య వేదాంతుల ననేక విధములుగా పోల్చినను తుదకు స్పినోజా ప్రపంచముయొక్క పరమావధిని చెప్పకోలేకపోయెనని శంకరు డత్యద్భుతముగ దాని పరమావధిని అద్వైతములో నిమిడ్చెనని చక్కగా నిరూపించిరి. ఈ సందర్భమున వారు చెప్పిన వాక్యమును స్మరించవలెను. "Sankara was brilliant in this synthesia, but Spinoza leaves the finite world without explanation. Therefore, Spinoza's Absolute has been characterised by Hegel as a lion's den to which all tracks lead but out of which none emerge."

ఇచట గమనించవలసిన ముఖ్యవిషయమొకటి గలదు. నిరీశ్వరవాదులగు బౌద్ధుల శూన్యసిద్ధాంతమునే సేశ్వరుడైన స్పినోజా కూడ కొంతమటుకు చేరుకొన్నాడనిపిస్తుంది. శంకర మతమును చక్కగా తెలుసుకొనుటకు ఇట్టి తులనాత్మక పరిశోధన మిక్కిలి సహకరించును.

ఈ గ్రంథములో ఆరవ ప్రకరణము అతిముఖ్యము. శంకరుని గూర్చి ఉత్పన్నమగు కొన్ని విమర్శనాత్మక ప్రశ్నలకు వీరు మిక్కిలి సమంజసమైన సమాధానము లొసగిరి. శంకరుడు ఈశ్వరుని, బ్రహ్మను విశేషించి చెప్పెను ఇందు ఈశ్వరవాదము భగవద్గీతలోని సిద్ధాంతమును బోలియుండును. బ్రహ్మవాదము బౌద్ధుల శూన్యవాదమునుబోలి యుండును. అట్టితరి శంకరుడు సేశ్వరవాదమగు భగవద్గీతనే యేల పూర్తిగా ప్రమాణముగ స్వీకరించకూడదు? లేక నిరీశ్వర వాదమైన బౌద్ధమునే యేల స్వీకరించకూడదు? మాధ్యమిక బౌద్ధుల శూన్యము నిజముగ అద్వైతుల నీతి, నీతి యనబడు నిర్గుణబ్రహ్మను తెలుపగలదా? హీనయాన, మహాయాన బౌద్ధుల మధ్యనుండు ఈ షద్భేదమువంటిదేనా శంకరుని నిర్గుణ బ్రహ్మవాదము కూడ? ఉపనిషత్తులయందు జెప్పబడిన విషయమును క్రొత్తగా నిరూపించుటలో నెంతవరకు ప్రామాణ్యాత ననుసరించెను? ఇత్యాది ముఖ్యములగు సందేహములను పూర్వపక్షములుగ తీసుకొని యీ రచయిత తగు సమాధానము లొసగిరి. శంకరుడు ప్రచ్ఛన్న బౌద్ధుడనుచు, విశిష్టాద్వైతులు, ద్వైతులు లేవదీసిన మృషప్రచారము కూడ సహేతుకముగ నీ గ్రంథములో నిరసింపబడెను.

మొత్తముమీద గ్రంథమంతయు మంచి విమర్శక గ్రంథమనుటలో సంశయములేదు. సామాన్య వేదాంతపరిశోధకులకేగాక వేదాంత జిజ్ఞాసువులకు కూడ నీ చిన్న పుస్తకము అతి సులభమగు భాషలో విషయమును మిక్కిలి సుబోధక మొనర్చుచున్నది.

శ్రీ పరబ్రహ్మశాస్త్రి

“భారతీయ తత్వశాస్త్రం”

[సులభ పరిచయం, రచన : దేవీ ప్రసాద్ చట్టోపాధ్యాయ, అనువాదం : డాక్టరు గూడ సుందరరామయ్య, పుటలు : 185, వెల : రూ. 8–00 ప్రచురణ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.]

భారతీయ తత్వశాస్త్రాన్ని మార్క్సిస్టు సిద్ధాంతదృష్ట్యా వ్యాఖ్యానిస్తున్న తత్వవేత్తలలో శ్రీ దేవీ ప్రసాద్ చట్టోపాధ్యాయ అగ్రగణ్యులు. ఆయన గ్రంథాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయ అధ్యాపకులు తెలుగు చేశారు.

ఈ గ్రంథానికి సోషలిస్టు జర్మన్ రాజ్యమైన ప్రజాతంత్ర రిపబ్లిక్‌కు సంబంధించిన శ్రీ వాల్టర్ రూబెన్ ''తొలి పలుకు'' వ్రాశారు. రూబెన్ స్పష్టంగా వ్రాశాడు : ''భారతదేశం తన సాంప్రదాయం నుండి తన తత్వశాస్త్రాన్ని నేడు రూపొందించుకోవలసి ఉంది. వర్గాలున్నంత వరకు, వర్గపోరాటం భారతదేశంలో కొనసాగినంత వరకు, రెండు ప్రధాన తాత్విక ధోరణులైన, భౌతికవాదం భావవాదం సంఘర్షిస్తూనే ఉంటాయి. వేదాంతాన్ని పునర్నిర్వచనం చేస్తూ భావవాదులు తృప్తి పడతారు. భౌతికవాదులు దేవీ ప్రసాద్ చట్టోపాధ్యాయ లాగా ముందుకు సాగుతారు. వర్గ పోరాటంలో విజయం పొందటానికి అత్యవసరమైన భారతీయ గతితార్కిక భౌతికవాదాన్ని (Indian dilectical materialism) నిర్మిస్తారు......''

దేవీ ప్రసాద్ చట్టోపాధ్యాయ ఎలా ముందుకు సాగుతారు ?

ఆయనే తన ''పీఠిక''లో వివరించారు: ''.. ...మన తాత్విక సాంప్రదాయంలో విలువైన దానిని కాపాడుకోవటం ఎంత అవసరమో, నిర్జీవమైన దానిని త్యజించటం అంతే అవసరం. ఏమంటే గతానికి చెందిన తాత్విక భావాలు, కేవలం చారిత్రక అవశేషాలు మాత్రమే కాదు ఈ భావాలు మన పురోగతికి తోడ్పడవచ్చు లేక అడ్డుకోవచ్చు. కనుక మన ప్రాచీన భావసంపదలో, మన ప్రస్తుత పురోగతికి ఆటంకమైన వాటిని విమర్శనాత్మకంగా విమర్శించాలి. మన పురోగతికి ఇప్పటికి తోడ్పడే భావాలను మాత్రం ప్రత్యేకించి నొక్కి చెప్పాలి'' నిజమే, దీనిని ఎవరూ కాదనరు.

''ఈ దృష్ట్యా జాతీయ స్వాతంత్ర్య పోరాట కాలం కంటె, కొంత గణనీయమైన మార్పు జరిగిందని గుర్తుపెట్టుకోవటం ఉపయోగకరంగా ఉంటుంది. ఆనాడు ప్రాచీనతను కొంత గుడ్డిగా ఆరాధించటం కూడా, దేశభక్తిలో భాగంగా ఉండేది. తిలక్ వంటి వారి రచనలలో సాంప్రదాయక తత్వశాస్త్రాన్ని ఆవేశపూరితంగా సమర్థించడం మనకు కొంత ఉత్సాహాన్నిచ్చింది. ఆ తత్వశాస్త్రంలో నిజంగా అంతసారం ఉన్నదా, లేదా అనేది వేరే విషయం ......'' నిజంగా తిలక్ అలాంటి వ్యక్తా ?

సంస్కృతంలోనూ, గణితంలోనూ తనకు గల అసమాన పాండిత్యం కారణంగా ''ఓరియన్, స్టడీస్ ఇన్ ది యాంటిక్విటీ ఆఫ్ వేదాస్'' తరువాత ''వేదాస్, ది ఆర్కిటిక్ హోమ్ ఆఫ్ ది వేదాస్'' రచించాడు. అందులో తనకు నాటి వరకూ లభ్యమైన ఖగోళశాస్త్ర, భూగర్భశాస్త్ర సాక్ష్యాలాధారంగా, వైదికార్యుల పూర్వులు బహుశా ఆశియా ఖండంలోని ఉత్తర ధృవ ప్రాంత నివాసస్థులై యుండవచ్చనే నిర్ణయాన్ని ప్రతిపాదించాడు. తన ప్రథమ గ్రంథంలో ఋగ్వేదం క్రీ. పూ. 4500 ప్రాంతంలోనిదని, అదీ ఖగోళశాస్త్ర గణితం రీత్యా, నిర్ణయించాడు. ఈ మహానుభావుడు మనకూ, మన దేశానికీ గౌరవాన్నాపాదించేందుకని భారత దేశమే ఆర్యుల జన్మస్థాన మనలేదు. అలా అని నిభాయించుకోగల పాండిత్యము, విజ్ఞానమూ ఆయనకు లేకపోలేదు. అయినా ఆయన మన సాంప్రదాయక తత్వశాస్త్రాన్ని ఆవేశపూరితంగా సమర్థించిన వ్యక్తేనా ? బహుశా ''గీతా రహస్యం''లో గీతను తెగనాడి నట్లయితే ఆయన ఈనాటి మార్క్సిస్టు రచయితలకు ఆరాధ్య పురుషుడై ఉండేవాడనుకుంటాను. ఇది ఆయనలోని లోపమే.

''మధ్య యుగాలలోని సంఘటితమైన చర్యకి సరైన ప్రతిరూపం భారతదేశంలో లేనిమాట నిజమే. ఐనప్పటికీ, మొత్తం బౌద్ధిక జీవితంపై మతశాస్త్రం ఆధిక్యత ఉండనే ఉన్నది. అంతే కాదు, కొన్ని సాంప్రదాయ తాత్విక ధోరణులను ప్రతిపాదించినవారు, ముఖ్యంగా భావవాద ధోరణులకు చెందినవారు, మతశాస్త్రాన్ని బాహాటంగా సమర్థించారు. కనుకనే, మధ్య యుగాలలో భారతదేశంలోని తిరుగుబాట్లు అనివార్యంగా మత తిరుగుబాట్ల రూపంలో సాగిన ప్రజోద్యమాలు. నిజానికి ఆధునిక సంస్కర్తలైన రామ్మోహన్, విద్యాసాగర్, వివేకానంద, ఠాగూర్, గాంధీల విషయంలో కూడా మతాచ్ఛాదన కొనసాగుతూనే ఉంది. వీరందరూ నిర్జీవమైన భారతీయ తాత్విక స్రవంతిలో నూతన జీవశక్తిని పూరించారనటంలో అతిశయోక్తి లేదు. నవ్య న్యాయ ధోరణి కూడా పండిత లోకంలో

ఇట్టి జీవశక్తి కలిగించింది. మధ్య యుగాలలోనూ, ఆధునికయుగంలోనూ కొనసాగిన ఈ మహోద్యమాలను పరిగణనలోనికి తీసుకోకపోతే, భారతీయ తత్వశాస్త్ర సమీక్ష తప్పనిసరిగా అసంపూర్తిగా ఉండిపోతుంది. ఈ ఉద్యమాలన్నీ సాంప్రదాయక తాత్వికధోరణుల వెలుపల కొనసాగాయి ఈ అంశాన్ని నేను పూర్తిగా గుర్తించినప్పటికీ, ఈ గ్రంధంలో వాటిని ప్రస్తావించటానికి యత్నించలేదు. అలా చేయాలంటే, మధ్యయుగాల, ఆధునిక యుగాల సామాజిక, ఆర్థికచరిత్రను చర్చించాలి. అదిచాలా వివాదాస్పద అంశం. అందుకు ప్రత్యేకమైన అధ్యయనం అవసరం. ఇదొక్కటే నా సమాధానం.'' (గుర్తింపు నాది.)

ఈ లోపాన్ని ఒప్పుకుంటూ రచించినా, అది తత్వశాస్త్రానికి సులభ పరిచయమవుతుందా లేక తత్వశాస్త్రాన్ని మార్క్సిస్టు మూసలోకి కుదించే ప్రయత్నమవుతుందా? దీనిని ఏమనాలి ?

''పీఠిక'' నుంచే మరోమాట : ''భావవాద వ్యతిరేక ధోరణులన్నింటిలోని ఆరోగ్యకర అంశాలను గుదిగుచ్చటం ద్వారా, ఒక శాస్త్రీయమైన, సమగ్రమైన దృక్కోణం ఏర్పడుతుందని చెప్పటం నా ఉద్దేశ్యం కాదు. అసలలా గుదిగుచ్చాలనే భావమే క్రమమైనది కాదు. భావవాదులు, తమలో తమకెన్ని శాఖా భేదాలున్నా, ఏకీకృత తాత్విక సాంప్రదాయాన్నొక దానిని సృష్టించగలిగారు. కాగా వీరిపట్ల వ్యతిరేకత వేర్వేరుచోట్ల, పరస్పర విరుద్ధ కారణాల నుండి వ్యక్తమైంది. కనుక వీటన్నిటిని గుదిగుచ్చటానికి చేసే ప్రయత్నంలో ఎట్టి క్రమబద్ధత రూపొందజాలదు. రెండవ విషయమేమిటంటే, ఈ భావవాద వ్యతిరేక ధోరణులు భావవాద ధోరణులవలెనే చారిత్రకంగా నిర్ణయింప బడ్డాయి. అనగా ప్రాచీన మధ్యయుగాల, సామాజిక ఆర్థిక పరిస్థితులలో వాటి పునాదులున్నాయి. కనుక యివి తప్పనిసరిగా విలక్షణమైన పరిమితులను కలిగి ఉన్నవి. శాస్త్రీయంగా సంతృప్తికరమైన తత్వశాస్త్రాన్ని సృష్టించటానికి తగిన శాస్త్ర, సాంకేతిక పురోగతి మన దేశంలో లేదు. అయినప్పటికి, భావవాద వ్యతిరేక ధోరణులను సమీక్షించి తిరిగి నొక్కి చెప్పటంలో ప్రయోజనం లేకపోలేదు. భావవాద సాంప్రదాయానికిగల కుహనా ప్రతిష్ఠకు సంబంధించిన భ్రమలు తద్వారాతొలగిపోతాయి. శాస్త్రీయంగా, సంతృప్తికరమైన దశలో తత్వశాస్త్రం పురోగమించాలంటే, ఇలాంటి భ్రమలుతొలగిపోవటం అత్యవసరం...''

భావవాద వ్యతిరేకతలో క్రమంలేదు.

వాటిని కూర్చే ప్రయత్నమే వ్యర్థం.

క్రీ. పూ. 3000 లేదా 4000ల నాటి చరిత్ర, తత్వశాస్త్రం (వేదాలలోనిది తత్వశాస్త్ర బీజాలని అంగీకరించి, వాటిని కూడా ఈ గ్రంధంలో తడమటం జరిగింది సుమా!) తృప్తికరమైంది కాదు, మన పురోగతికి అవసరమైన అవకాశాలే మృగ్యం.

అయినా నేను ప్రయత్నిస్తున్నాను.

మరి ఎందుకీ ప్రయత్నం ?

కాబట్టే దీనిని 'తత్వశాస్త్ర పరిచయం – మార్క్సిష్టు దృక్కోణం నుంచి'' అని పిలవవచ్చు. అలా అయితే మట్టుకు ఇది అద్భుత గ్రంథమే. అలా కాకుండా తత్వశాస్త్ర సమగ్ర పరిచయం కోసం తహ తహ లాడితే నిరాశ ఎదురవుతుంది.

* * *

వాల్టర్ రూబెన్ చెప్పినట్లు, మార్క్సిజమే నేటి వరకూ ప్రపంచంలో జనించిన అత్యుత్తమ శాస్త్రీయ సిద్ధాంతమనుకుంటే, అదీ వేదాలతో సమానమైంది. వేదాలనుండే అద్వైతం, విశిష్టాద్వైతం,'ద్వైతం ఎలారూపొందాయో అలాగే నేడు మావోయిజం, యూరో కమ్యూనిజం వగైరా వగైరా రూపొందాయి, ఇంకెన్ని రూపొందబోతాయో! కాకపోతే ఆవేశం, రక్తపాతం, తలలు తెగటం లేదు. అది లేందే ఆదర్శంపట్ల భక్తి గౌరవాలున్నట్లు కాదంటారేమో నాకు తెలియదు.

ఎటువంటి ఘోరాలు చేసినా, ఎన్ని తప్పిదాలుచేసినా స్టాలిన్ అధునాతన రష్యా నిర్మాత కాని ఆయన శతజయంతి సంవత్సరంలో రష్యాలో ఎవ్వరూ ఆయన పేరు తలవకపోతుంటే, మన దేశంలో ఆయనను తలుచుకుంటున్నాము.

ఇలాంటి **contradictions** ను **resolve** చేసుకోలేని మార్క్సిజాన్ని శాస్త్రీయ సిద్ధాంతమంటూ, దాన్నే కొలబద్దగా భారతీయ తత్వశాస్త్రాన్ని పరిశీలించి, ఈ తత్వశాస్త్రం విఫలమయిందని ప్రకటించటం సాహసమేమో ననిపిస్తుంది.

పైగా **Dialectical Materialism**లో **Indian, Russian, Chinese** ఇంకా ఇంకా వెరైటీ లుంటాయా ?

భౌతికవాదానికి భారతీయ తత్వశాస్త్రంలోగల ప్రాతిపదికను ప్రతిబింబించటానికి చేసిన గణనీయమైన ప్రయత్నమే ఈగ్రంధం. అనువాదానికి సులభసాధ్యం కాని ఈ గ్రంధాన్ని, దాదాపు సులభ శైలిలోకి అనువదించిన డాక్టరు. సుందరరామయ్యగారు అభినందనీయులు.

శ్రీ కాకుమాను తారానాథ్

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 75226